UNIVERSAL LIBRARY
OU_204094
UNIVERSAL LIBRARY

T923.5
S95V

T1427

OSMANIA UNIVERSITY LIBRARY

[illegible] 1918.

10 NOV [illegible] 30

Osmania University Library

Accession No. 1142

1918

This book should be returned ...
... ast marked below.

బొబ్బిలియుద్ధము

వీరరౌద్రభీభత్సభయానక రసములకు ఆటపట్టయిన బొబ్బిలియుద్ధకథ ఆంధ్రదేశీయులకు ఆబాలగోపాలముగఁ దెలియనిది గాదు. ఇదియే ఆంధ్రవీరుల సమధికప్రతాపమునకు అంత్యప్రదర్శనము. ఇది బ్రహ్మశ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రులవారిచే మనోహరమగు శైలిలో వ్రాయఁబడుచున్నది. మిథునానురాగము, వీరపూజ, శ్మశానవాటిక మున్నగు గొప్పగ్రంథములను వ్రాసి వన్నెకెక్కిన శ్రీశాస్త్రులవారి రచనాసామర్థ్యము ఆంధ్రుల కెల్లరకును విదితమే. ఇందు బొబ్బిలి, విజయనగరము వీరుల చిత్రపటములు సంపాదింపఁబడుచున్నవి.

కళాభివర్ధనీ గ్రంథనిలయము

రాయవరము - గోదావరిజిల్లా

శ్మశానవాటిక

ఇదియొక నవల. పావనభారతీయ కుటుంబముల యందలి వ్యక్తుల పరస్పరప్రేమ, మర్యాద మున్నగునవి యిందు చక్కఁగ ప్రదర్శింపఁబడినవి. ఇందలి పాత్ర నిర్మాణమును, కథాసంవిధానమును, వర్ణనాసరళియు, కవితామాధుర్యమును, సుకుమార భావప్రదర్శనమును జూచి అనేకపండితులును, రసికప్రభువులును మహానంద భరితులై కొనియాడినారు. ఆంధ్రదేశమున విఖ్యాతులగు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రులవారిచే ఇది రచింపఁబడినది. వెల 1—0—0.

మిథునానురాగము

అద్వితీయ మగు నొక గొప్ప నవల. బిగికౌఁగిలింతలో మందహాసము గావించుచు ప్రాణములను బాసిన క్రొత్తదంపతుల పవిత్ర జీవితములు ఇందు వర్ణింపఁబడినవి. నవలలు చదువు ఆంధ్రదేశీయ స్త్రీపురుషులలో ఈ గ్రంథమును జదువనివారు లేరు. యథార్థవాదులగు గొప్ప విద్వాంసులు అనేకులు "ప్రణయభరాలసు లగు నూత్న దంపతులు చదివి తీరవలసిన గ్రంథము" అని దీనిని చాలఘనముగా పొగడియున్నారు. ప్రణయమాధుర్యమును, దాంపత్యానందమును, సంసారసౌఖ్యమును అనుభవింపఁగోరు దంపతులు ఈ గ్రంథమును జదివినచో సఫల మనోరథులు కాఁగలరు. వెల 0—12—0

కలాభివర్ధని గ్రంథనిలయము

రాయవరము - గోదావరిజిల్లా

కలాభివర్ధనీ గ్రంథనిలయము

వీరపూజ

ప్రథమభాగము భారతశౌర్యము

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రణీతము

సర్వస్వామ్య సంకలితము

రెండవకూర్పు

కలాభివర్ధనీ గ్రంథనిలయము

రాయవరము - గోదావరిజిల్లా

చెన్నపట్టణము
ఆంధ్రపత్రికా ముద్రాక్షరశాలయందు
ముద్రితము

పోషకులు

మ-రా-శ్రీ దామెర పార్థసారథి వేంకటరావుగారు

వీరవరము

,, సబ్బెళ్ల పద్దయ్యరెడ్డిగారు

కొంకుదురు

,, వాసిరెడ్డి వెట్టెమ్యగారు

చేబ్రోలు

,, వావిళ్ల వేంకటేశ్వరులుగారు

మదరాసు

,, గోములూరి శివరామయ్యగారు బి.ఏ.బి.ఎల్

ప్లీడరు, నెల్లూరు

,, పొణకా శేషారెడ్డిగారు

పోట్లపూడి

,, చిక్కవరపు రామరెడ్డిగారు

పాట్టెపాళెము

,, పొణకా పిరారెడ్డిగారు

అల్లూరు

,, మల్లిడి సత్యనారాయణరెడ్డిగారు

కుతుకులూరు

,, ద్వారంపూడి రామరెడ్డిగారు

అనపర్తి

ఇదివఱకు వెలువడిన గ్రంధములు

వీరపూజ	(చరిత్ర)	౧	౦	౦
శ్మశానవాటిక	(నవల)	౧	౦	౦
మిథునానురాగము	(నవల)	౦	౧౨	౦
రామదేవవిజయము	(నాటకము)	౦	౬	౦
సాహసిక రాజపుత్రము	(,,)	౦	౬	౦
శృంఖల	(విమర్శగ్రంధము)	౦	౬	౦

అచ్చుకానున్న గ్రంధములు

వారకాంత

బొబ్బిలియుద్ధము

అబాధబాలిక

కడపటిముద్దు

పూలదండ

కళాభివర్ధనీ గ్రంధనిలయము

రాయవరము గోదావరిజిల్లా

బాలురే వీరులు

మనపిల్లలు చదువుకొనుటకు సులభమైన చరిత్ర కథలు ఇదివఱకు తెలుగులో లేవు. పిల్లలు దేశాభిమానులు కావలయునన్న వారు, ముందు చరిత్రకథలు చదువవలెను. ప్రకృతము మేము ఈకథలు ప్రకటించినాము.

విజయనగర రాజులకథలు	౦	౩	౦
చిత్తూరు రాజులకథలు	౦	౪	౦
దిల్లీ చక్రవర్తులకథలు	౦	౪	౦
గోల్కొండ నవాబులకథలు	౦	౨	౦

కలాభివర్ధనీ గ్రంథనిలయము

రాయవరము గోదావరిజిల్లా

విషయసూచిక

౧. చంద్రగుప్తుఁడు. ౧

జననము క్రీ. పూ. ౩౫౦. అలెగ్జాండరును కాచుట ౩౨౭–౩౨౫. పంజాబునుండి గ్రీకులను వెడలఁగొట్టుట ౩౨౩ అక్టోబరు ౩౨౨. రాజ్యాక్రమణము ౩౨౨–౩౨౧. సెల్యూకసు భారతదేశము మీఁదికి దండెత్తి వచ్చుట ౩౦౫–౩౦౪. సెల్యూకసు పరాభవము, చంద్రగుప్తునితో సంధి ౩౦౩. నిధనము ౨౯౮–౨౯౭.

౨. పృథివీరాజు. ౫౨

ఈతని జననకాలమును రాజ్యారోహణకాలమును తెలియవు. నిధనము క్రీ. శ. ౧౧౯౩.

౩. భీమసింహుఁడు. ౧౧౨

ఈతని జననకాలము తెలియదు. ఈతని యన్నకొడుకు రాణా లక్ష్మణసింహుఁడు క్రీ.శ ౧౨౩౫లో రాజ్యారూఢుఁడయ్యెను. రాజపుత్రుల కల్లాయుద్దీనునితోడి రెండవ యుద్ధము క్రీ. శ. ౧౩౦౩లో జరిగెను. ఈయుద్ధమునందే చిత్తూరునందలి రాజపుత్రులును స్త్రీలు నొక్కమాఱుగ మడిసిరి.

౪. హామీరసింహుఁడు. ౧౪౦

ఈతని జననకాలము తెలియదు. యుక్తివలన నీతఁడు చిత్తూరు స్వాధీనము చేసికొనిన సంవత్సరము క్రీ. శ. ౧౩౧౩. స్వర్గారోహణము ౧౩౬౫.

౫. సంగరాణా. ౧౫౫

ఈతని జననకాలము తెలియదు. రాజ్యారోహణము క్రీ. శ. ౧౫౦౯. బాబరుచే నంపఁబడిన ౧౫ కందల యాశ్వికబలము నీతనిని క్రీ. శ. ౧౫౨౭-వ సంవత్సరము శ్రావణమాసమునఁ దాఁకెను. సిక్రీ యుద్ధము క్రీ. శ. ౧౫౨౭-వ సంవత్సరము మార్చి ౧౬ తేదీని జరిగెను. సంగుఁడు క్రీ. శ. ౧౫౩౦ లో గతించెను.

౬. ప్రతాపసింహుఁడు. ౧౬౩

ఈతని జననకాలము తెలియదు. క్రీ. శ. ౧౫౭౨ లో రాజ్యారూఢుఁడయ్యెను. హాల్దీఘాట్టనుచోట జరిగిన యుద్ధము క్రీ. శ. ౧౫౭౬-వ సంవత్సరము శ్రావణమాసము. క్రీ. శ. ౧౫౯౭ లో నీతఁడస్తమించెను.

రెండవ కూర్పు పీఠిక

ఒక సంవత్సరము క్రిందట దీనిని రెండవమారు ముద్రింపవలసిన యవసరము తటస్థించెను; గాని కార్యాంతరమువలన వీలు అయినది కాదు. దీనిని మద్రాసు విశ్వవిద్యాలయమువారు ఇంటర్మీడియేటు పరీక్షకు పాఠ్యగ్రంథముగా నేర్పఱచి గౌరవించినారు. వారికిఁ గృతజ్ఞుఁడను. మా గ్రంథ నిలయమునకు క్రొత్తగా పోషకులుగాఁ జేరి మాకు చేయూత నొసంగిన అనపర్తి నివాసులు, శ్రీయుత ద్వారంపూడి రామిరెడ్డిగారికి కళాభివర్ధని గ్రంథ నిలయము పక్షమునఁ గృతజ్ఞతను విన్నవించుచున్నాను.

కాళయుక్తి జ్యేష్ఠపూర్ణిమ మహేంద్రవాడ నందనవనము	ఇట్లు గ్రంథకర్త

పీఠిక

హిందూదేశ కథాసంగ్రహపు ప్రథమ ద్వితీయభాగము లగు హిందూమహాయుగమును, మహమ్మదీయమహాయుగమును, చంద్రగుప్తచక్రవర్తియను చిన్ని చరిత్రగ్రంథమును, సంస్కృతము నందలి ముద్రారాక్షస మను నాటకము నాధారము గావించుకొని నే నీ గ్రంథమును వ్రాసితిని. కావున నా గ్రంథకర్తలకు నేను కృతజ్ఞుఁడను.

ఈ గ్రంథమును దమ ముద్రాక్షరశాలలో ముద్రించి యుపోద్ఘాతము గూడ వ్రాసి దీనికి వన్నె దెచ్చిన యాంధ్రపత్రికాధిపతు లగు బ్రహ్మశ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు గారికిని, ఈ గ్రంథమును విని నాయెడల నెంతో యాదరము చూపి ప్రోత్సహించిన నామిత్రులు శ్రీయుతులు సబ్బెళ్ల పద్దయ్యరెడ్డిగారికిని, దామెర పార్థసారథి వేంకటరావుగారికిని, ఇందలి చిత్రపటముల నొసంగిన విజ్ఞానచంద్రికా గ్రంథమండలి వారికిని కృతజ్ఞుఁడను.

ఈ గ్రంథము నాయాంధ్రసోదరుల కుపయోగపడు నేని అచిరకాలమున దీని తరువాతి భాగములుగూడఁ బ్రకటింపఁగలను.

చెన్నపట్టణము	ఇట్లు
రాక్షసవత్సరాశ్వయుజబహు. ౯	విన్నవించు
౧ స్థిరవారము	విబుధవిధేయుఁడు
(౨౩-౧౦-౧౯౧౫)	శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

ప్రస్తావన

వీరపూజ మానవులకు జాతీయధర్మములలో నుత్తమధర్మము. వీరులు లోకపరిణామప్రాప్తికై యవతరించెడి మహానుభావులు. వీరులసంకల్పము లుదారములు; భావములు విశాలములు; ఆదర్శములు పవిత్రములు; భక్తి యవిభక్తము; ఆచరణములు ధర్మసంస్థాపనానుకూలములు. వీరులు దేవాంశసంభూతులు. వీరుల చరిత్ర మున్నతమైన కైలాసశిఖరమువలె గంభీరము; దివ్యమైన గంగాజలమురీతి పాపక్షయకరము; మహోత్తరంబైన దీపప్రభవలె భాసమానము; ఉద్యానోద్ధూతంబైన మలయానిలంబు పగిది సువాసనా సంకలితము. వీరుల జననమన్ని దేశములందును సర్వకాలములందును సాధ్యము. వీరసంభవమునకు దేశము కాలము పాత్రలు ప్రతిబంధకములు గావు. వీరోదయమునకు ప్రాక్పాశ్చాత్యదేశభేదము గాని భూతవర్తమానకాలభేదము గాని కులీన సామాన్య కుటుంబభేదము గాని యాటంకములు గావు.

ప్రపంచవిజయమున కుపక్రమించిన యలగ్జాండరు మహామహుఁడు వీరాగ్రేసరుఁడు. బౌద్ధయుగమునందు మహాసామ్రాజ్యమును స్థాపించిన చంద్రగుప్తుఁడు వీరనాయకుఁడు. మహమ్మదీయ ప్రతాపాగ్ని నార్పుట కాత్మసమర్పణము చేసిన పృథ్వీరాజు వీరశిఖామణి. పాశ్చాత్యరణరంగములందు శౌర్యప్రతాపములను ప్రదర్శించుచున్న భారతయోధులు వీరసింహులు. క్షత్రియకులసంజాతుండైన భీష్ముఁడు వీరశ్రేష్ఠుఁడు. సూతకులజుండైన నెపోలియను వీరసామ్రాజ్యమునకుఁ బట్టభద్రుఁడు.

వీరధర్మప్రకర్షణంబునకు దేశ కాల పాత్రములవలె రసభాగ భేదము వృత్తిభేదము వైరుధ్యములు గావు. వీరధర్మప్రతిపాదనమునకు విజ్ఞానగుణశీలములు సాధనములు. భావప్రపంచవిహారులైన మహాకవులు, కళాభిజ్ఞులైన యంత్రనిర్మాతలు, విజ్ఞానసంపన్నులైన శాస్త్రజ్ఞులు, భావోద్దీపకులైన గాయకశ్రేష్ఠులు, తత్త్వజ్ఞులైన మతస్థాపకులు, యుద్ధవిశారదులైన శూరులు వీరగుణసంపన్నులు. లోకకల్యాణమునకై యుగధర్మానుకూలముగ వీరధర్మములను మారుట సృష్టివైచిత్ర్యము. లోకాభ్యుదయమున కొకయుగమునందు రాజసము వేఱొకయుగమునందు సాత్త్వికము ప్రబలుట భగవన్నిర్ణయము. యుగప్రభావము ననుసరించి వీరులను రాజసభావ మావహించినపుడు సంగ్రామకోలాహలంబును సాత్త్వికభావ మావహించినపుడు జిజ్ఞాసాభిలాషయును ప్రబలుట లోకచరిత్రవలన విశదమగుచున్నది. భరతవర్షమునం దనేకపర్యాయములు యుగధర్మములు మారినవి. శూరులైన అజాతశత్రుఁడు, చంద్రగుప్తుఁడు, సముద్రగుప్తుఁడు, శాతవాహనుఁడు, శ్రీహర్షుఁడు, పృథివీరాజు, శ్రీకృష్ణదేవరాయలు, శివాజీమహారాజు సామ్రాజ్యములను నిర్మించి పూజార్హులైరి. బుద్ధదేవుఁడు, శంకరుఁడు, రామానుజుఁడు, చైతన్యుఁడు సాత్త్వికసామ్రాజ్యమును స్థాపించి ఆరాధనయోగ్యులైరి.

రాజస సామ్రాజ్యస్థాపకులైన చంద్రగుప్త పృథ్వీరాజాది వీరశ్రేష్ఠుల చరిత్రము లీగ్రంథము నందు వర్ణింపఁబడినవి. మహాపురుషుల జీవితచరిత్రకథనమునందు కవికల్పనలకు విశేషమైన యవకాశము లేదు. చరిత్ర పురుషులజీవితచరిత్రములు చిత్రకల్పనా రాహిత్యములై సచ్చరితశీలాభివర్ణనంబులైన పాఠకులకు భ్రమసంజనకంబులు గాక సత్యప్రకాశకంబులై యనుష్ఠాన యోగ్యంబులుగ నుండఁగలవు.

చంద్రగుప్త పృథ్వీరాజ ప్రతాపసింహాదులు చరిత్రపురుషులు. ఆ మహాపురుషుల చరిత్రకథనమును జరిత్రాత్మకమై యొప్పియుండుట సమంజసము.

ఈ గ్రంథమునందు చంద్రగుప్త చరిత్రము, పృథ్వీరాజ చరిత్రము, భీమసింహ చరిత్రము, హమీరసింహ చరిత్రము, సంగరాణా చరిత్రము, ప్రతాపసింహచరిత్రము వీరరసము వెల్లువయై పొంగునట్లు రమ్యముగ వర్ణింపఁబడినవి. చంద్రగుప్తుఁడు మురాతనయుఁడు. యుద్ధతంత్రజ్ఞుఁడు. వ్యవసాయపరాయణుఁడు. అప్రతిహతంబైన స్వీయపౌరుషాశ్రయంబునను ప్రజ్ఞానిధియైన చాణక్యుని సహాయమునను మహత్తరంబైన మౌర్యసామ్రాజ్యమును సుస్థిరముగ స్థాపించిన మహావీరుఁడు.

పృథ్వీరాజు చాహుమానవంశజుఁడు. విశాలదేవుని పౌత్రుఁడు. మహమ్మదుగోరితో పదుమూఁడుసారులు పోరాడి వానిని పెక్కుసారులోడించిన ధీరోత్తముఁడు. పృథ్వీరాజు ౧౧౯౨ నందు తిలావరి సమీపమున పరాజితుండైనపిదప దిల్లీశ్వరత్వము పరరాజుల పరమైనది. పృథ్వీరాజచరిత్రము సంయుక్తపరిణయమువలన హృదయరంజకమై వీరదాంపత్యమునకుఁ దార్కాణమైనది.

లక్ష్మణసింహుఁడు మేవాడు సంస్థానమున కేలిక. భీమసింహుఁడు లక్ష్మణసింహుని పినతండ్రి. మోహనాంగియైన పద్మిని భీమసింహుని సతీతిలకము. అల్లాయుద్దీనుఖిల్జి కామాంధుఁడు. పద్మిని నపహరించుటకై చిత్తూరుకోటను ముట్టడించి పాడుచేసెను. దుర్గసంరక్షణ మలవిగానపుడు స్త్రీలగ్నికుండంబులందును పురుషులు రణరంగములందును మానసంరక్షణమునకై మేనుల బలియిచ్చిరి.

మేవాడువంశజులైన హమీరసింహుఁడు సంగరాణాయును

పౌరుషసంపన్నులు. చిత్తూరుకోటను స్థిరముగ కలిపియుంచుకొనుటకై యనేకప్రయత్నములను జేసి విఫలమనోరథులైరి.

మేవాడు రాజ్యమునకు ౧౫౭౨–౯౭ వరకు ప్రతాపసింహుఁడేలికగనుండెను. ప్రతాపసింహుఁడు నిద్రాహారములను, భాగ్యభోగ్యములను, విసుగు విరామములను పరిత్యజించి యిరువదియైదేండ్లక్బరు చక్రవర్తియొక్క మహాసైన్యములతో పోరాడిన మహాశూరుఁడు.

దైవము ప్రాతికూల్యము వహించినప్పుడు పురుషప్రయత్నములు నిర్వీర్యములగుట సహజము. రాజసము సంగరహితంబైనప్పుడు సంగ్రామములు ధర్మసంస్థాపనానుకూలములై పరిణమించుటయును, రాజసము సంగభరితంబైనప్పుడు సంగ్రామములు కులాభిమానముగను జాతీయదురభిమానముగను పరిణమించుటయును సహజము. రాజపుత్రవీరుల యంతఃకలహములందును ఆత్మవినాశమునందునువలె వర్తమానమహాసంగ్రామమునందును ఈధర్మము వ్యక్తము. ఆసియాఖండమునందు శాంతియుగముపోయి తిరిగి వీరయుగము స్థాపితమగు యనుటకు సూచనలుగలవు. వీరయుగమునందు వీరావేశము, క్షాత్రోద్రేకము గలుగుట సహజము. యుగసంధియందు యూరపుఖండమువలె ఆసియాఖండము విపత్పరంపరలపాల్పడి వినాశము నొందకుండుట క్షేమకరము.

వీరపూజ భారతీయుల కితరజాతులకువలె సాంఘికధర్మము గాక మతధర్మము. భారతీయులకు పితృదేవతారాధనము వీరారాధనము నియతకర్మలు. నియతకర్మలు కామితార్థములను పడయుటకు సాధనములు. వీరులు కర్మపరతంత్రులు, భావప్రకాశకులు. వీరులు నాయకులు, ధర్మనిరతులు, విజ్ఞానధనులు, జాతీయోద్ధారకులు.

జాతీయాత్మకు వీరహృదయములు క్షేత్రములు. వీరహృదయభావము పండుగలందును, క్షేత్రములందును, తీర్థములందును, గ్రంథములందును వ్యక్తీకృతమగుచున్నది. వీరులు జాతికి నాయకులు, పోషకులు, మూలకారకులు. శ్రీరామకృష్ణులు, వీర్యము ప్రతాపము ధర్మములవలన నారాధనయోగ్యులైరి. వీరపూజ సహజధర్మమైనను సామాన్యులకు దురారాధ్యము.

పూజకు శ్రవణము, మననము, ధ్యానము, సంకీర్తనము, సమర్పణము సాధనములు. వీరపూజకు వీరులచరిత్రమును చదువుట, చరిత్రల తత్త్వమును గ్రహించుట, తత్త్వార్థము ననుభవమునకు దెచ్చుకొనుట, తన్మయత్వమును బొందుట మార్గములు. తన్మయంబైన వీరపూజయందు వీరసత్త్వము సర్వత్ర సందర్శనీయంబై ప్రత్యక్షముగ నుండును. వీరసత్త్వము ప్రత్యక్షమైనపుడు కథలు కావ్యములగును. ప్రాకృతపురుషులు ప్రతిభావంతులగుదురు. కుగ్రామంబులు పుణ్యక్షేత్రంబులగును. సామాన్యదినంబులు పండుగ దినంబులగును. ఆంధ్రలోకము వీరపూజాదర్శమును గ్రహించి మాతృదేశమునందలి గాథలందును, స్థలములందును నిక్షిప్తంబైన వీరభావమును వ్యక్తీకరించుచు దేశమును, జాతిని, భాషను నుద్ధరించుటకు వీరపూజా నిమగ్నమగుంగాత!

మద్రాసు   ఇట్లు
౪-౧౨-౧౯౧౭   కాశీనాథుని నాగేశ్వరరావు

శ్రీరస్తు

వీర పూజ

ప్రథమ భాగము

చంద్రగుప్తుఁడు

మహాపద్మనందుఁడు మగధసింహాసనము నధిష్ఠించి ప్రజాపాలనము గావించుచుండెను. రాజకార్యధురంధరుఁ డని ప్రఖ్యాతివహించిన రాక్షసుఁ డను నతఁడు నందునకు ముఖ్యమంత్రియై రాజకార్యముల నతినిపుణతతో నిర్వర్తించుచుండెను. బొక్కసమున ధనము కోట్లకొలఁదిగఁ గుప్పలు వడి మూల్గుచుండెను. చతురంగబల మసంఖ్యాకమై పరాభవదూరమై యుండెను. ప్రభుత్వ మెచ్చటను దిరుగుఁ బాటులు లేక శాంతమై నిరంకుశమై యుండెను. ప్రజ లెల్లరును కృషివాణిజ్యాది స్వకర్మనిరతులై హాయిగఁ గాలము గడపుచుండిరి.

కాని కొంత కాలము జరుగునప్పటికి దేశము నం దీ స్వస్థత నిలిచినది గాదు. విధివశంబునఁ బద్మనందుని మతి సంచలించెను. ప్రభుత్వము మేర మీఱి పోఁ జొచ్చెను. ప్రజాసౌఖ్యము నెడల రాజునకు వైముఖ్యము పొడసూపెను. సన్నసన్నముగఁ బ్రజలలో నసంతృప్తి తలయెత్తెను. కాని కొంతకాలమువఱకు నది బహిరంగము గాలేదు. ఈ యాంతరంగికస్థితి వలన నది లెస్సగఁ బ్రవృద్ధం

బయ్యెను. ప్రజ లూరకుండుటఁ జూచి రాజు మఱింత చెలరేఁగెను. సూర్యమండలము తిరోహితం బగు నంత దనుక నాకసమున నీల మేఘములు క్రమ్ముకొను నని స్వవ్యాపారనిమగ్నులగు ప్రజల కెట్లు తెలియదో యట్లే యది ప్రజ లటనటఁ జేరి గుసగుసలువోఁ దొడఁగు నంత దనుక రాజచారుల శ్రవణపథము నధిగమింప లేదు.

తుద కెప్పు డది బహిర్గత మయ్యెనో యప్పుడు సంపూర్ణముగ రాజద్వేషానలావతారమును దాల్చి యుండెను. అమాత్యాదులు దాని వారని చెప్ప వడిరి. రాజు విని మహోగ్రముగ మండిపడెను. అతనికిఁ బ్రజల నందఱ నొక్కపెట్టున సంహరించి వేయవలయు నను నంతటి కోపము వచ్చెను. కోపగ్రహావేశమువలనఁ బ్రాపంచికజ్ఞాన భ్రష్టుఁడై నందుఁడు ప్రజలయందలి రాజద్వేషానలమును జల్లార్చ దండోపాయము నవలంబించెను. ఇది యంతయుఁ జూచి రాజనీతి ధురంధరుఁ డగు మహామంత్రి రాక్షసుఁడు రాజుబుద్ధి మఱలింప ననేకవిధములఁ బ్రయత్నించెను ; గాని సఫలప్రయత్నుఁడు గాఁడయ్యె.

అంతకంతకుఁ బ్రజలలో గుసగుసలు మెండయ్యెను. శాసన ధిక్కారమారంభ మయ్యెను. కాలక్రమమునఁ బ్రజల యెడల రాజునకును, రాజునెడలఁ బ్రజలకును నసూయ పెరిఁగి పోఁజొచ్చెను. మంత్రి, రాజు మనస్సును మఱలించుటకుఁ జేసిన ప్రయత్నములు విఫలము లగుటయుఁ బ్రజలలో నశాంతి హెచ్చయి పోవుచుండుటయుఁ దిలకించి నిర్విణ్ణుఁ డయ్యెను.

దంపతులలో నంతఃకలహములు పుట్టకయే యుండవలెను. పుట్టినచో నవి క్రమక్రమముగ వృద్ధి పొందునే గాని యంతరింపవు. దైవయోగమువలన వాని కవి యంతరింపఁబడెనే గాని వేఱొక రట్లు

చేయఁ బ్రయత్నించుటవలనఁ బ్రయోజనము కలుగఁ బోదు. అట్టి
ప్రయత్నములవలన నొకొక్కప్పు డది వృద్ధి పొందుట కూడ
సంభవింపవచ్చును. అట్లుగాక యే కారణమువలననైన నా కలహ
ములు శాంతివహించినను నా శాంతి తాత్కాలికము గాని సార్వ
కాలికము గాఁజాలదు. ప్రజాప్రభువులయెడలఁ గూడ నీన్యాయ్యమే
వెల్లుచున్నది.

రాక్షసునిపై నిప్పు డెంతయో భారము పడినది. ఈ సందర్భ
మునఁ జాల మెలఁకువతోఁ బ్రవర్తింపకున్నఁ గార్యము చెడును.
మగధరాజ్య మంతయు విచ్ఛిన్నమై పోవును. రాజు పట్టిన పట్టు
విడువకుండెను. ప్రజలలో శాంతి నెలకొనినఁగాని ప్రభువు శాంతిం
పఁడు. తన ప్రయత్నము వలనఁ బ్రభు వపరాధి యని యెంతమా
త్రము ప్రకటితమైనను బ్రజలు రాజును లోఁకువ చేసి మఱింత బిఱ్ఱ
బిగిసెదరు. పాపము రాక్షసుఁ డిట్టి చిక్కు లేవియుఁ ఘటిల్లింపకుండ
నుండునట్లతిజాగరూకతతోడనే ప్రవర్తించుచుండెను. కాని ప్రభు
వనపరాధి యని నిర్ధారించుట యెట్లు? ప్రథమాపరాధము ప్రజలదే
యని యెట్లు నిరూపింపఁ గలఁడు? ఏమియుఁ బ్రయోజనము
కానుపింప దయ్యెను. విధిప్రాతికూల్యము వలన రాక్షసుని ప్రయ
త్నము లన్నియు భగ్నములై పోయెను.

చాణక్యప్రభృతు లగు నప్పటి రాజ్యతంత్రజ్ఞుల యభిప్రాయ
మున రాజనీతిప్రవృత్తి యిట్టి దని నిర్వచించుటకు వలను పడదు.
అది సర్వతోముఖము. దానికి న్యాయాన్యాయము లనియుఁ, గ్రౌర్య
సౌమ్యములనియుఁ, గ్రమాక్రమములనియు భేదము లేదు. ఎట్లు
ప్రవర్తించినను సరియే పరవినాశము నాత్మోదయమును గాంచుట
యే దాని ప్రధానప్రయోజనము. “ చతురంగబల సమృద్ధిని గలిగి

యుండవలెను. శత్రువులను సంగరరంగమున సంహరించి విజయమును గాంచవలయు" నని దాని సామాన్యవిధి. "సమయాసమయములను జక్కఁగ గుఱుతెఱింగి సామదానభేదదండములలో నప్పటికిఁ దగు నుపాయము నవలంబింపు" మని దాని విశేషవిధి. న్యాయాన్యాయము లీ విశేషవిధి ముందుఁ జెల్లాచెదరై పోవును. ధర్మజ్ఞులు రాజనీతిని ధర్మముతో ననుసంధింపవలె నందురు. రాజ్యతంత్రజ్ఞులు దీనినిఁ గేవలము వలదనరు; గాని సమయము తప్పవచ్చినపుడు మాత్రము కేవలము రాజనీతినే యవలంబింతురు. ధర్మపరావతారుఁ డయ్యు శ్రీరామచంద్రుఁడు వాలిసంహారకాలమునఁ గేవలము రాజనీతి నాశ్రయించెను. శ్రీరాముఁ డొక్కఁడే దీనికిఁ దార్కాణ గాదు. విధాత సృష్టి సేయఁ బ్రారంభించిన నాఁటి తొలి నియమము మొదలుకొని యీక్షణము దనుకఁ బ్రపంచవృత్తి యంతియు దీనినే దృఢపఱచుచున్నది. ఈ చర్చ వలన మనకుఁ గలిగిన పరమ ప్రయోజనము రాజనీతిధురంధరుఁ డగు సమయజ్ఞుఁ డగు కార్యవాది యని యర్థ మను విజ్ఞానము.

పద్మనందుఁడు స్వార్థపరుఁడు; గాని యాతనికిఁ జక్కని సమయజ్ఞానము లేదు. ఖడ్గవాది; మఱియు నాతఁడు రాజ్యతంత్రము నెఱుఁగును; గాని ప్రతిరోధకులను జక్కఁగ నెఱుఁగని తీవ్రచిత్తుఁడు. అగుటవలననే యాతఁడు తన యవిచారప్రవర్తనచే నసంతృప్తులై యున్న ప్రజల మీఁదల దండోపాయము నవలంబించెను. రాజదండనమువలనఁ దల్లడంపడు ప్రజలమీఁదల రాక్షసుని సామోపాయ మేమి పనికి వచ్చును?

ఇట్లు కొన్ని దినములు గడచునప్పటికి మహారాజు దండోపాయము నవలంబించుటయు, మహామాత్యుఁడు మాయఁ జేసి

యాడింపఁ జూచుటయుఁ జూచి ప్రజలు రాజసభలో నాంతరంగిక వ్యవస్థ చక్కఁగ లే దని యూహించి మఱింత విజృంభింప సాగిరి. అంతకంతకు మహారాజున కుసూ కతిశయింపఁ జొచ్చెను. రాక్షసుని హృదయావేదన మఱింత కా సాగెను. ఇతరోద్యోగు లెల్లరును జాలఁ దమాతపడ సాగిరి. రాష్ట్రమునందలి యనధికారు లగు రాజనీతిధురంధరు లపాయమును శంకింపఁ దొడఁగిరి.

ఈ ప్రజాద్వేష ముప్పతిల్లుటకుఁ గేవలము పద్మనందుఁడే హేతుభూతుఁ డని చెప్పుటకు వీలు లేదు. రాజ్యతంత్రమునం దసమర్థులై, యౌవనమదంబున నున్నను మిన్నను గానక సంచరించు నాతని యనమంత్రులు కుమారులును దండ్రి కీ విషయమునఁ గొంతవఱకుఁ దోడ్పడిరి; గాని సర్వాధికారము పద్మనందుని యందే యుండుటవలన దోష మంతయు నాతనిదిగనే పరిగణింపఁ బడెను. దోషు లైనప్పటికి ననభిషిక్తులగుట నందపుత్రులు ప్రోత్సాహకాపవాదమునకు మాత్రము పాల్పడిరి.

ఏది యెట్లయిన నేమి? ప్రజల బాధల కంతము గాన్పింప దయ్యెను. దినములు గడచిపోయిన కొలఁది నవి యంతకంతకుఁ బెరిఁగిపోవు సందర్భములే ఘటిల్లించుచు వచ్చెను. ఆ బాధలవలన ననేకులు నలమల మాడిపోయిరి. లోకోత్తర మగు నీ చల్లని బ్రిటిషు పరిపాలనమున నపూర్వసుఖములను బడయుచు హాయిగఁ గాలము గడపుచున్న మనకు, దుష్పరిపాలనము వలనఁ బ్రజలకు సంభవించు కష్టము లెంత దుస్సహములై యుండునో యేమి తెలియును? తుదకుఁ బ్రజలు, విశేషించి పాటలీపుత్ర పౌరులు, రాజు నెడల ద్రోహమును దలంచిరి. పద్మనందుని సింహాసనభ్రష్టునిఁ గావించుట కుపాయములు పన్నఁ జొచ్చిరి

కాని యనంతసేనాసంపన్నుఁ డగు మహీపతిని వా రేమి సేయఁ గలరు? వారు చెప్పినట్లు చేయఁ గలరు; గాని స్వయముగ వ్యవహారము నడుపఁజాలరు. వారి కప్పు డొక నాయకుఁడు కావలసి వచ్చెను. నాయకుఁ డెక్కడ నున్నాఁడు?

"అందఱు ప్రజలలో నాయకత్వము వహింపఁ దగు వాఁ డొక్కఁడును లేఁడా?" యని ప్రశ్నించుట కవకాశము లేదు. రాజ నియుక్తులైనచో బుద్ధిబాహాబలంబులఁ బరబలంబులఁ జెల్లాచెదరు గావింపఁ గల పోటుబంట్లం దనేకులు గలరు. వారు తిరుగుబాటు నడుపఁ జాలరా? వారంతటి యాత్మవిశ్వాసము లేని వారా? కారు. తిరుగుఁబాటు నడుపఁజాలగనుట భారతీయులకు లజ్జాకారణము గాదు. భారతీయులు పృథ్వీపతికి విష్ణ్వంశ నాపాదింతురు. అక్కతన వారు ప్రభువు నెదిరించి కత్తి కట్టఁ జాలరు. దానికిఁ గారణము గౌరవభావమే గాని పౌరుషాభావము గాదు. భారతవర్షేతర దేశచరిత్రములం దిలకింపుఁడు. సాధారణముగఁ బుట్ట కొక్క విప్లవచరిత్ర ముండు ననుట సాహసము గాని యతిశయోక్తి గాని కాఁ జాలదు. ఎన్నియో వేల యేండ్లకుఁ బూర్వము మొదలు నేఁటిదనుక జరిగిన భారతదేశచరిత్రమున నొకటిరెంటికంటె నెక్కుడు తిరుగుఁబాటులు గాన్పింపవు. అవి యైనను భారతీయేతరులు గావించినట్టివి గావు. భారతీయేతరులు గావించిన విప్లవములు వీలయి నప్పుడెల్ల మాటిమాటికి నేదో వంక మీఁదఁ ప్రసక్తములై ప్రభువుల సర్వాధికారములను దొలంగించి ప్రజాప్రభుత్వమును స్థాపించుట కేర్పడినవి. భారతీయులు గావించినవో; విధ్వస్తములై పోవు దేవాలయములను నిలుపుట కేర్పడినవి. గోబ్రాహ్మణులను సంరక్షించుటకును, రమణీమణుల మానమును గాపాడుటకును ప్రారంభింపఁ బడినవి. స్వమత

గౌరవము భ్రష్టమైపోవుచున్న దను నిశ్చయమువలననో, భ్రాంతి వలననో దానిని గాపాడుకొనుటకొఱ కేర్పడిన దనినచో యుక్త మగును. క్రొత్తగ సంభవించిన కష్టములను దొలంగించుకొనుటకే భారతీయులు తొల్లి విప్లవములను గావించి యుండిరి గాని లేని సౌఖ్యములు తెచ్చిపెట్టుకొనుటకొఱకుఁ గాదు. రక్తపాతమును గావించుటయు, దేశము నల్లకల్లోలముఁ జేయుటయు సాత్వికగుణప్రధానులగు భారతీయులకుఁ గిట్టవు. గంగా గోదావరి కృష్ణవేణ్యాది పావన తరంగిణీజలములయందుఁ గ్రౌర్యము నుదయింపఁ జేయు గుణము లేదు. అట్టితన భారతీయులలోఁ దిరుగుబాటు చేయువారలకు నాయకుఁడు దొరకుట కష్టము.

ఇంతవఱకుఁ దమ దివ్యతేజస్సుచేత మగధదేశమును బ్రకాశవంతము సేయు మహాత్ము లందఱును బద్మనందునకు బాకులై యున్నారు. ఇఁక బాలభానునివలె నిప్పుడిప్పుడే నవీనతేజమును బ్రకటనము సేయు నూనూఁగు మీసాల వారిని వెదకవలెను. ప్రాయము వచ్చిన పిదప దేశము నుద్ధరించు మహాత్ముల తేజము బాల్యమున నౌగ్ధ్యప్రతిసీరచేఁ దిరోహితమై యుండును. అట్టితన సామాన్యులా బాలుఁడు మహాపురుషుఁ డగు నని భావింపఁ జాలరు. వాని కుశాగ్రబుద్ధినిఁ జుఱుకుఁదనము నారసి తెలివి గలవాఁ డగు నని మాత్ర మూహింతురు. అతఁడు విద్యాభ్యాసమునందు, నాటపాటలయందుఁ బ్రవర్తనము నందును దోడి బాలురతో సామ్యమును వహించి యుండెడు. ఆ బాల్యప్రాయమునఁ గూడ వాని భావనలత్యుదారములును, చేఁత లత్యద్భుతములును, మాటలు గంభీరములును, హృదయము విశాలమును, చూడ్కులు పరేంగితజ్ఞానధురీణములును, ప్రారంభములు మహోన్నతములునై యుండును. అతని చిత్తవృత్తి

మొదటి నుండియు నితరులను బోషింపఁ గోరునే గాని తా నొరుల పోషణమును వాంఛింపదు. మహాపురుషునకు బాల్యమున సంభవించు నిక్కట్టులకును, నిరుత్సాహములకును, విఘ్నములకును, సోత్ప్రాసములకును లెక్క యుండదు. కాని వాని నన్నిటి నాతఁడు లెక్క లేనివిగనే భావించి చిత్తవైకల్యమునకుఁ బాల్పడక తన నిశ్చిత మార్గమునందే యుండును. అవి యన్నియు నాతని మనోదార్ఢ్యమును, దృఢదీక్షను వృద్ధిచేయుటకుఁ దటస్థించునవి గాని వేఱు గాదు. ఈ రహస్యము నెఱుంగని మందబుద్ధు లాపత్కాలమున నాతనినిఁ బరిహసింతురు. అతని మాటలు శత్రువులకు హృదయభేదకములై, మిత్రుల కానందసంధాయకములై యుండును. అతఁడు యౌవనము ప్రాపించు నప్పటి కొఱనుండి తీసిన బాఁకువోలెఁ బ్రకాశించుచుండును. ఈ కల్లోలసమయమున మాగధులకు హృదయావేదనఁ బాపి సుఖస్థితి గలుగఁజేయఁ గల తేజస్వి యొండైనఁ గలఁడా! కలఁడు. పద్మనందుని యాంతరంగికమర్మము లెల్ల నెఱింగి యాతని ప్రక్కలోని బల్లెమై మెలంగుచు రాజభవనమందే గలఁడు. ఎవఁడాతఁడు? రాజనీతి ధురంధరుఁడు, నిస్తుల బాహుబల సంపన్నుఁడు, మహావక్త, గంభీరదర్శనుఁడు, శూరుఁడు, ధీరుఁడు, పట్టుదల గల వాఁడు, విపత్తులయందు వెనుదీయకుండు వాఁడు, పరభయంకరుఁడు, కృత మెఱుఁగు వాఁడు, దాత, ప్రయోగనిపుణుఁడు, నగు చంద్రగుప్తుఁ డను యువకుఁడు.

చంద్రగుప్తుఁడు మురాకుమారుఁడు. ముర శూద్రస్త్రీ. మఱియుఁ బద్మనందుని యుంపుడుకత్తె. పద్మనందునకుఁ బట్టమహిషి యగు నిశాదేవియం దెనమండ్రు పుత్రులు గలిగిరి. కాని యాతఁడు మురపైఁ గల యనురాగము పెంపున నామె యామోదమును బడయఁ గోరి

పట్టమహిషి కన్న కుమారులకంటెఁ జంద్రగుప్తు నధికప్రేమతోఁ జూచుచుండెను. చంద్రగుప్తునిజననసమయమున నచటనున్న సిద్ధాంతు లాతఁడు సార్వభౌముఁడు కాఁగలఁడని గ్రహించి యాశ్చర్యపడి యా విషయమును బ్రకటన గావింపక యూరకుండిరి. అయిన నాతని విశాలలలాటఫలకము మీఁదను, నాకర్ణాంతనయనయుగళముమీఁదను, తరళకటాక్షములయందు, నధిజ్యశరాసనములఁ బోలు కనుబొమలమీఁదను దాండవము గావించు దివ్యతేజోరూపమున నది సువ్యక్తమగుచునే యుండెను. దాని నారసి తత్త్వజ్ఞులు కడు నబ్బురంపడుచునే యుండిరి. కాని యిట్టి తేజము నందుని యౌరసపుత్రులయందుఁ గాన్పింపమిం జేసి, వారు, నందుని యనంతరము మగధరాజ్యలక్ష్మి చంద్రగుప్తుని విశాలవక్షఃపీఠమునందే విశ్రమించునా యని యాలోచింప సాగిరి.

అట్టి మహాతేజస్సంపన్నుం డగుటవలనఁ జంద్రగుప్తుఁడు రాజానుగ్రహమును వ్యర్థము సేయక పయింబడి దానిని వృద్ధి చేసెను. రాకుమారులతోఁ గూడ నాతఁడు విద్యాభ్యాసార్థము గురునికటమున కంపఁబడినప్పటినుండియు వారి కంటె నెక్కుడు తెలివితేటలు కనఁబఱుచు చుండెను. అది చూచి మల్లవిద్యాగురువు లీ దాసీపుత్రునకు యోధానుయోధుఁడు కాఁ దగిన యోగ మున్నది కాఁబోలు ననియు, రాజ్యతంత్రోపదేష్టలు మహామాత్యపదవి నందుటకుఁ దగిన యోగ మున్నది కాఁబోలు ననియు నూహించు చుండిరి. మఱియు నాతని శక్తిసామర్థ్యముల నాలకించి కొంద ఱల్పబుద్ధు “లీ దాసీపుత్రుఁడు వింజామరలు వీచుట నేర్చికొనక యీ మహావిద్య లభ్యసింపనేల?” యని తమలోఁ దా రెకసక్కెముగఁ బలుకుకొను చుండిరి. మఱియుఁ దమకంటె నన్ని విషయములయందును మిన్నలఁ

గుణులం దగుటవలనఁ గాలక్రమమున నశక్తిదుర్జనులై రాకుమారులు చంద్రగుప్తునెడల నసూయాభావమును గాంచిరి.

తూలరాశిం బడిన యగ్నికణమువోలె నా యసూయ స్వల్పకాలమునందే వృద్ధి యయ్యెను. ఈ విషయమును జంద్రగుప్తుఁడు గ్రహింపక పోలేదు; గాని దానివలన వానికేమియు మనోవైకల్యము నంటలేదు. అవసరమేమి? అసూయయు నగ్నియు నాశ్రయములనే దహించి వేయును. అల్పబుద్ధు లీ సంగతి నెఱుంగఁ జాలక తొట్రుపడియుందురు. స్థిరచిత్తు లీర్ష్యాళువులను మఱింత యేడ్పింతురు. దాని వలన దమకై నెదుటి వారి కసూయ పెరుఁగవలె ననియే వారి వాంఛ. అది వారికిఁ గార్యసాధకమై పరిణమింపఁగలదు. చంద్రగుప్తుఁడు సమయ మైనప్పు డెల్ల నెట్లు మాట్లాడినచో నసూయాగ్ని వారి హృదయాంతరాళములను దగ్ధము గావించునో, యేమి చేసినచో రహస్యమున వారి కన్నుల నుండి యశ్రులహరి ప్రవహించునో, యట్లే మాట్లాడుచు, నట్లే చేయుచుండెను.

కొన్ని దినములకు విద్యాభ్యాసము పూర్తి యయ్యెను. చంద్రగుప్తుఁడు సకలకళాకోవిదుఁ డయ్యెను. రాకుమారుల విజ్ఞానాంకురములు క్షణక్షణప్రవర్ధమానం బగు నసూయానలమువలనఁ గొంత వఱకు మాడిపోయెను; గాని తండ్రి వృద్ధుఁ డగుచుండుటయు, రాష్ట్రమునఁ దమ యాజ్ఞలు తిన్నతిన్నగఁ జెల్లుబడి యగుచుండుటయుఁ దటస్థించుటవలన వారికా విచారము లేక పోయెను. అంతకంతకుఁ జంద్రగుప్తుని బాధించుటకుఁ దగు నవకాశములు లభించుచుండుట వలనఁ బయింబయిగ వారి కొక విధ మగు నూతనోత్సాహము గూడఁ గలిగెను. ఇఁక నేమి కావలెను? చంద్రగుప్తుని బాధించుటయే వారికిఁ బదివేలు.

తొంటి వలెఁ గాక యిప్పుడు చంద్రగుప్తుని నిరంకుశప్రవర్తన కొకింత యడ్డంకులు కలుగఁ దొడఁగెను. సేవకులలోఁ గొందఱు బహిరంగముగ నాజ్ఞలను జవదాఁట సాగిరి. కోటయందలి కొన్నిస్థలములు త్రొక్కి చూడరా దని నిషేధము లేర్పడియెను. నందులు నిర్భయముగ నీచపుసంబోధనములు సేయఁ గడఁగిరి. ఇంక నిట్టి వనేకములు సంభవించెను. చంద్రగుప్తుఁడు, నందుల యీర్ష్య యీ విధముగఁ బరిణమించెఁ నని గ్రహింపక పోలేదు. అతని "కింక వీరివలన నే మగు నని యుపేక్షించి యుండ రా" దని తోఁచెను. దాసీపుత్రుఁ డైనను జంద్రగుప్తుఁ డభిమానభూషితుఁ డగుటవలన నందులకుఁ బ్రతిఘటించి నిలువ సాగెను. ఈ రూపమున వారి యంతఃకలహములు మఱింత వృద్ధి యయ్యెను.

చంద్రగుప్తునకు నందుల వలన నొత్తిడి యెక్కుడు కాసాగెను. ఇఁకఁ బ్రబలప్రతిక్రియ సేయకున్న లాభము లే దని తలంచి, తన లోపము లేకుండ నాతఁడు, తనకుఁ గలిగిన యగచాట్లను దొలఁగింపు మని పద్మనందునితోఁ జెప్పి చూచెను; గాని దాని వలనఁ బ్రయోజనము గలుగ లేదు. వార్ధకముచేఁ గలిగిన మతివిభ్రమము వలననో, మఱి యే కారణమువలననో పద్మనందుఁ డప్పు డాతని నొకింత తిరస్కరించెను. చంద్రగుప్తుని మనస్సు మఱింత చివుక్కు మనియెను. ఈ తిరస్కార మాతని క్రోధాగ్ని కింధన మయ్యెను. వెంటనే యాతఁడు నందులను సంహరించి మగధసింహాసనము నాక్రమించుటయే యిందులకుఁ బ్రతిక్రియ యని భావించి యట్లు చేసి తీరద నని దృఢప్రతిజ్ఞ గావించెను.)

దాసీపుత్రుఁ డగు చంద్రగుప్తునకు రాజ్యాశ గలిగినది. అందులకు మీరు నవ్వెదరేని మా యభ్యంతరము లేదు. కాని యాతని

రాజ్యతృష్ణ సామాన్య మైనది గాదు. "ఇదియే నేను చేయ వలసిన విధికృత్యము. ఇదియే నేను సాధింప వలసిన ఫలము. మగధసింహాసనారోహణమే నావంటివాఁడు కోరఁ దగినది" యని యాతఁడు నిశ్చయించుకొనియెను. ఆతఁడే యాధారమును జూచికొని యిట్టిప్రతిజ్ఞ దాల్చెనో, దాని పరిణామ మెట్లు కానున్నదో మే మిప్పు డేమియుఁ జెప్పఁజాలము; గాని మా కీ విషయమున వింత మాత్రము గలుగుట లేదు. తినఁ దిండియుఁ గట్ట గుడ్డయు లేని వారు మహారాజ్యాధిపత్యము దాల్చినట్లును, మహారాజులు కుండయుఁ గట్టియుఁ గొని బిచ్చ మెత్తికొనినట్లును జరిత్రలు సాక్ష్య మిచ్చుచున్నవి. చంద్రగుప్తుఁడు రా జేల కాఁ గూడదు?

తుద కెట్లు పరిణమించినను చంద్రగుప్తునకుఁ దల పెట్టిన కార్యము ప్రారంభించు దనుక నిద్రపట్టదు. ఎప్పుడో చేయ వచ్చునని యూరకున్న ముందే కార్య మడ్డువచ్చునో యనియు, నట్లె తటస్థించె నే నప్పుడు రెండుకార్యములును గూడఁ జెడిపోవు ననియుఁ జంద్రగుప్తుని నమ్మకము. ఇట్లు యోచించుట నిజముగ దూరదర్శి లక్షణము. నేఁటి పని రేపటికని నాపఁ గూడదు. ముం దెట్లు పోయి యెట్లు వచ్చునో యెరికినిఁ దెలియదు. ముందు చేయ వచ్చునని యేర్పఱచుకొనినంతదనుక జీవించి యుందు మని చెప్ప నెరికి నైతె గాదు. ప్రసక్త మైన కార్యమును సమయాంతరమునకు నిలుపుట కాపురుషలక్షణము. ఈ సిద్ధాంతము ననుసరించి చంద్రగుప్తుఁడు నందసంహారమున కుపాయములు పన్న సాగెను.

ఈ సమయమునందే ప్రజల హృదయముల యందు రాజద్వేషానలము తీవ్రముగ రవుల్కొనుచుండెను. ఇది చూచి చంద్రగుప్తుఁడు, తన ప్రయత్నమున కిది యొక శుభసూచక మని తలంచెను.

నందవినాశము దైవోద్దిష్టం బనియు, నందానంతరము మగధరాజ్యలక్ష్మి తన్ను వరించుటయు నట్టిద యనియు నాతఁడు నిశ్చయించుకొనియెను. మఱియు దేశమునఁ బ్రబలి యున్న యీ రాజద్వేషము ప్రాగదండనముకలన నుదితమై, దుర్నయసంస్కారము నే కోరుచున్న దనియు, నక్రూతిన మాగధులు నందసంహారమునకుఁ గేవలము తనకు సాయపడఁజాలరు గాని తన కడ్డు రారనియుఁ దన యభ్యుదయము వారి కనిష్టము కాఁ జాల దనియుఁ గూడ గ్రహించెను. వెంటనే పని చేయ కున్న నీ యగ్ని చల్లారు ననియుఁ, బిదప ఫలాఫలము లెట్లున్నను దన ప్రయత్నములు సాగుటయే కష్ట మనియుఁ గూడ నాతఁడు భావించుకొనియెను. వెంటనే తిన్నతిన్నగ నాతఁడు తన ప్రయోజనము నాచరణమునకుఁ దీసికొనివచ్చెను.

చంద్రగుప్తుని ప్రయత్నములను జూచి ప్రజ లనేకవిధములఁ జెప్పుకొన సాగిరి. నందుల వినాశమును, జంద్రగుప్తుని రాజ్యాభిషేకమును దైవోద్దిష్టము లని కొందఱు తలంచిరి. చంద్రగుప్తుని ప్రయత్నములకు, నందులు బుద్ధి తెచ్చికొని దేశమున నెప్పటి శాంతిని నెలకొల్పుటయే ఫల మని కొంద ఱనుకొనిరి. క్షత్రియపాలితమగు సింహాసనము దాసీపుత్రునిచేఁ బరిపాలింపఁ బడ వలసినదేనా? యని మఱికొందఱు సందేహించిరి. తుద కెట్లు జరిగినను ప్రస్తుతము దేశ మంతయు మందరఘూర్ణితసాగరము వోలె సంక్షుభితమై పోవుటయుఁ, బ్రజల బాధలు నలంత వృద్ధియగుటయుఁ, దప్పు వని [illegible] కొందఱు భావించిరి. విప్లవానంతరము మగధరాజ్యాధిపత్యము చంద్రగుప్తునకు సంక్రమించినను సంక్రమింప కున్నను ప్రభుత్వము మాఱుటకు సందేహము లేదని రాజ్యతంత్రజ్ఞులు స్థిరీకరించిరి. నందవినాశము జ్యోతిర్దర్పణమునఁ బ్రతిబింబితంబగుచున్న

డని సిద్ధాంతులు చెప్పిరి; గాని భావిప్రభు వితఁడా యను ప్రశ్నకు
మాత్ర మింకను బాగుగ నాలోచింపవలె ననిరి. చంద్రగుప్తుని ప్రయ
త్నము లన్నియు నందుల ప్రతీకారమువలన ఝంఝామారుతవిక్షేప
ముచే మాఁది పిందె లుద్ఘాతము లగునట్లు పరాపంచకై పోవు నని
మఱికొందఱు చెప్పిరి.

ప్రజ లనేకులు చంద్రగుప్తుని పక్ష మవలంబించిరి. అనేకు
లనేకవిధముల నాతని యాజ్ఞలను పాలించిరి. ఈ రూపమున నీ
ప్రయత్నప్రారంభమునందే చంద్రగుప్తుని యాజ్ఞలు ప్రజలలోఁ జెల్లి
పోఁజొచ్చెను. ఎట్లో దేశమునఁ దీవ్రవిప్లవప్రయత్నములు జరుగు
చున్న వని రాక్షసునకుఁ దెలియ వచ్చెను. వెంటనే యాతఁడు
దాని యాథార్థ్యమును దెలిసికొనుటకును, దత్కర్తల నెఱుఁగుట
కును గూఢచారులను నియమించెను.

చారులవలన రాజులకుఁ గలుగు ప్రయోజనము లనంతములు.
రాష్ట్రము నందలి బాహ్యాంతరంగిక సమాచారము లన్నియు రాజు
నకు వారి మూలముననే తెలియును. వేతనము స్వల్పమే యైనను
గౌరవమునందు భారత రాజ్యాంగ తంత్రము వీరి కున్నత స్థానము
నొసంగు చున్నది. " రాజులు చారచక్షుష్కు " లను మాటయం
దీ యర్థము విస్పష్ట మగు చున్నది. రాజునకు, వీరు స్వామి
ద్రోహు లగుచోఁ గలుగు కీడునకును, స్వామిభక్తు లగు నెడల
గలుగు మేలునకును మేర లేదు. అక్కారణమునఁ దమయెడల నెల్లపు
డును భక్తిప్రపత్తులు గలిగి యుండుటకు రాజులు చారులను కేవల
మును మాసవేతనముల వలననే గాక యప్పుడప్పుడు బహుమానముల
చేఁ గూడ గౌరవించుచుందురు. ఈ బహుమతుల కాసించి చారు
లెట్టి సందర్భములయం దైనను, మిగుల ధైర్యముతోడను, సాహస

ముతో దను, నతినిపుణముగఁ బని చేయుదురు. వారు లన్ని వేషములను వేయుదురు. వారి సాంకేతికము లత్యద్భుతములు. వారు నీటిలోఁ గూడ జాడలు తీయఁగలరు.

కోటలోఁ దను విషయమును గురించి రాజు మంత్రి మున్నగువారు చేయు నేర్పాటులను దెలిసికొనుటకుఁ జంద్రగుప్తుడు గూడఁ దనస్నేహితులను గొందఱను గూఢచారులుగా నేర్పఱిచెను. కాని చంద్రగుప్తుని చారులకును, రాజచారులకును జాల భేదమున్నది. ఇరువురును రహస్యముగఁ బ్రవర్తింపవలసిన వారే; గాని చంద్రగుప్తుని చారుల రహస్యము బయలుపడు నెడ నపాయము వాటిల్లును. రాజచారులకట్టి బాధలేదు. రాజాజ్ఞాకవచమువలన వారు సురక్షితులు.

వెంటనే వారు దేశ మెల్లయెడలను నతిరహస్యముగ దోషులను గాలించి వెదకసాగిరి. వారిని గురించి తెలియ నెవ్వరి తరము? ఆ దీర్ఘవిచారణమున వారు ప్రజలలోఁ గొందఱను, చంద్రగుప్తుని సహచరులను గొందఱను, నపరాధు లని యనుమానించి వారి వృత్తాంతము మహారాజునకు నివేదించిరి. వెంటనే వారి నందఱను రాజు సభలో విచారణ గావించి వారి వారికిఁ దగు నట్లు శిక్షించెను. ఇంతలోఁ జంద్రగుప్తుడుగూడ నీకుట్రలో నున్నాఁడని చారులకుఁ దెలియ వచ్చెను. అతనిఁ గూడఁ బట్టుకొని రాజు విచారణఁ బ్రారంభించెను.

ఈ విచారణము చాలఁ దీవ్రముగ జరిగెను. ప్రశ్నలును బ్రత్యుత్తరములును జాలఁ దీవ్రముగనే యుండెను. అతనిపై నెట్టి నేరము మోపఁబడినదో, యా నేరము విచారణలో నెంతవఱకు స్థిరపడినదో చెప్పఁ జాలము; గాని నందుఁడు, చంద్రగుప్తుని మగధదేశము నుండి తక్షణము లేచిపోవలయు ననియు, మఱల దేశములో నెప్పుడును బ్రవేశింపఁ గూడ దనియు నాజ్ఞాపించెను.

పద్మనందుఁడు దేశాంతరవాసశిక్ష విధించినపుడు చంద్రగుప్తుఁడు తన భాగధేయమును జాల మెచ్చుకొనియెను. రాజపుత్రులు తనయెడల మిపుల నీర్ష్య వహించి యున్నారు. వృద్ధనందుఁడు వారి మాట త్రోసివేయఁ జాల కున్నాఁడు. తాను గావించిన కృత్యము చాల సాహస మైనది. అగుటం జేసి రాజు తనకు మరణదండనము గాని యావజ్జీవకారాగారవాసశిక్ష గాని విధించిన నిఁకఁ జేయ వలసిన దేమున్నది? అట్టి మహాపాయములు సంభవింప కుండుటకంటె నదృష్ట మేమి? మాఱువేసముతో నితరుల దేశములోఁ బ్రవేశించినఁ దన్నెవ రేమి సేయఁ గలరు? తన భావిప్రయత్నముల కిది యెంత శుభసూచకము! ఇట్టి శుభసూచన లొకటి వెనుక నొకటి పొడసూపుట వలనఁ జంద్రగుప్తునకుఁ దనరాజయోగమునందు మఱింత దృఢవిశ్వాసము గలిగెను.

చంద్రగుప్తుని గుఱించి మహారాజు దాసీపుత్రుని వలన నేమి యనర్థము వాటిల్లఁగల దను తృణీకారభావముతో నుండి యుండును. అయినను చంద్రగుప్తుఁడు రాజద్రోహులలోఁ జేరిన వాఁ డగుట వలన దేశమున, విశేషించి కోటలో నున్నచోఁ గొంతవఱకు బాహ్యక్షోభము నాంతరంగికక్షోభమును గూడఁ గలిగించుట కే మైన నవకాశము లుండునేమో యను తలంపుతో వానికి దేశాంతరవాసశిక్ష విధించియుండును. రాక్షసుఁడు గూడ నట్లే భావించి యుండును. రాజు నధికానురాగమును బడసి యున్న చంద్రగుప్తుని జనని మురశూద్రజాతిస్త్రీ యగుట, ధనమునందలి కాంక్షచేఁ దనకుమారునకు సంభవించిన యీ స్వల్పశిక్షకు మిగుల వగచి క్రమముగ రాజానుగ్రహమును బడయఁ గోరి తనకుమారునకు బుద్ధులు గఱపి ద్రోహచింతను మానిపింపఁ గల దని గూడ వారు భావించి యుందురు.

ఏమైనను జంద్రగుప్తునకీ స్వల్పశిక్ష విధించుటలో నా రాజ్యతంత్ర ధురీణులకుఁ గల భావ మేమో మేము స్పష్టముగఁ దెలుపఁజాలము.

ఏది యెట్లయినను జంద్రగుప్తునకు మగధదేశమును విడిచి వెట్టి పోవుట కిష్టములేకపోయెను. ఈ శిక్షవలన "నందసంహార మవశ్యము చేయవలయు" నను నాతని సంకల్పము మఱింత బలపడుటయే తటస్థించెను. వివేకవతి యగు మురా, రాజు నాగ్రహము నాసి యవివేకకృత్యమును గావించితి వని చంద్రగుప్తు నేమైన నిందించెనో, యాతని యుద్యోగకారణములను జక్కఁగ గుర్తెఱింగి, మగధదేశమునకుఁ దన యాజ్ఞ నీశ్వరాజ్ఞగాఁ జెల్లించిన రాజుపైఁ గత్తి కట్టుమని ప్రోత్సాహపఱిచెనో తెలియదు; గాని చంద్రగుప్తుఁ డొరుల దూషణభూషణములను లెక్కసేయు వాఁడు మాత్రము కాఁడు. అక్కతన నాతఁడు రాజభటుల కన్నుల దుమ్ము గొట్టి తన తల్లితోఁ గూడఁ బాటలీపుత్రమునందే యొక రహస్యస్థలమున మాఱువేసముతో నివసించి యుండెను. మురా సంపాదించిన యమితధన మంతయు నాతని చెంతనే యుండెను.

ఈ కల్లోలసమయమున నొకనాఁ డొకరాజభవనమున ననేక పౌరులు గూడి యుండిరి. ఆ సభయం దొక బ్రాహ్మణుఁడు చక్కని యుపన్యాసము గావించుచుండెను. వేఱొక బ్రాహ్మణుఁ డగ్రాసనమున నతిగంభీరముగఁ గూర్చుండి యుండెను. ఆతని విశాలవదనమండలము, నాతని బలిష్ఠశరీరము నాతఁ డొక మహాపండితుఁ డనియు, నధిక తేజస్వి యనియుఁ జాటుచుండెను. ఆతని పేరు విష్ణుగుప్తుఁడు. చణకనందనుం డగుటఁ జాణక్యుఁ డనియుఁ బేరు గలదు. ప్రజ లెల్లరు నాతనినిఁ జాణక్యుఁ డనియే పిలుచుచుందురు. ఆతఁడు చతుర్వేదపారగుఁడు; షట్ఛాస్త్రవిదుఁడు;

దండనీతియం దనుపమానపండితుఁడు; కుటిలోపాయముల యం దతిచతురుఁడు; ముక్కోపి; పట్టిన పట్టు వీడని శూరశిఖామణి; మహాపరాక్రమశాలి; చక్కని సమయస్ఫూర్తియు, నెట్టి కార్యముల నైన ననాయాసముగ నెఱవేర్పఁ గల సామర్థ్యమును, నగ్గినైనఁ బిడికిటఁ బట్టు నంతటి సాహసమును గల నిశ్చలచిత్తుఁడు.

ఈ సమయమున రాక్షసామాత్యసహితులై నందు లటకుఁ జనుదెంచిరి. వారి గౌరవార్థము ప్రజలు లేచి నిలువంబడిరి. ఉపన్యాసకుఁ డొక్క క్షణ మూరకుండెను; గాని యగ్రాసనాసీనుఁడై యున్న చాణక్యుఁడు లేవ లేదు. సభలయం దగ్రాసనాధిపత్యము వహించు వారి కట్టి యధికారము గలదో, లేక యతఁడు నందుల లెక్క యేమి యని భావించెనో తెలియదు. పయింబయిగ నధరస్పందమైనఁ జేయ లేదు. అపాంగనిరీక్షణములతో నైన స్వాగత మిచ్చుటగాని, కూర్చుండుఁ డని సన్న గాని చేయ లేదు. అతిగంభీరముగ నట్లే కూర్చుండి యుపన్యాసము సాగింపు మని వక్తకుఁ గన్ను గిటెను. వెంటనే యాబ్రాహ్మణుఁడు మేఘగంభీరభాషణములతో నుపన్యాసమును బ్రారంభించెను.

నందు లిది యంతయుఁ జూచి చాణక్యుఁడు తమ్ము గౌరవించె నని భావించిరి. వారి కనుబొమలు ముడివడెను. మొగము లెఱ్ఱఁబాఱెను. అంత వారు రాక్షసుఁ డెంత సన్న చేయు చుండినను బాటింపక, కూడ నున్న రాజబంధువు లెంత బతిమాలు చున్నను వినక యత్యుత్కటం బగు కోపభరమ్మున నా బ్రాహ్మణునిఁ గ్రింది కీడ్చి వేయుఁ డని భటుల కాజ్ఞాపించిరి. ఆజ్ఞావచన మింకను ముగియక మున్నె భటు లగ్రాసనమును సమీపించిరి. ఉపన్యాసనిమగ్న

ప్రాదయాంఁ దగుటఁ జాణక్యుఁ డిది యేమియు నెఱుఁగఁడు. అట్టి వానిని రాజభటు లగ్రాసనమునుండి హఠాత్తుగఁ గ్రిందికి లాగివైచిరి.

ఆ లాగుటలోఁ జాణక్యుని జుట్టుముడి విడి పోయెను. అంతఁ జాణక్యుఁ డులికిపడి లేచి క్రోధాగ్నికీలావిస్ఫులింగములు రెగయఁ బండ్లు పటపటఁ గొఱుకుచు "ఓ నందాధములారా! నన్నిట్లగ్రాసనము నుండి లాగి యగౌరవపఱిచి నందులకు, మిమ్ము నిట్లే సింహాసనము నుండి లాగి, విశేషించి శిరఃకర్తనము గావించు నంత దనుక నీ జుట్టును ముడువ నని కాలరుద్రుని వలె గర్జించి పలికి యా సభాస్థానమును విడిచి పోయెను. రాక్షసుఁడును, మఱి కొందఱు దగ్గఱి వారు నెన్ని చెప్పినను నందు లాతని కోపానలమును జల్లార్పఁ బ్రయత్నింప రైరి. విశేషించి వారికి బీదబ్రాహ్మణుని వలన నేమగు నని తిరస్కారభావమును బ్రకటించి యూరకుండిరి.

చాణక్యప్రభావము రాక్షసునకుఁ దెలిసెను. అక్కారణమున వాఁడు, నందులు చాణక్యు నగౌరవపఱిచినందులకుఁ జాలఁ జింతించెను. ఇట్టి కల్లోలసమయమునఁ జాణక్యుని వంటి మహాతేజస్వితోఁ గలహము దెచ్చికొనుట నందులకుఁ జాలనష్టము. ఎంత చెప్పినను వారు విననియప్పుడింక రాక్షసుఁ డేమి సేయఁ గలఁడు?.

అంత యుండియు నందులు చాణక్యుని ఘనతను గ్రహింప లేక పోవు టాశ్చర్యకరము. రాక్షసామాత్యుని బోధనల వలన నైన గ్రహింప లేక పోవుట చింత్యము. కొలఁది దినములనుండి వారు చేయుచున్న వన్నియుఁ గ్రూరకృత్యములే యగుట శోచనీయము. ప్రజల యెడల వారికి విపరీతబుద్ధులు పుట్టుట విచారకరము. ఇవన్నియుఁ జూచిన తత్త్వజ్ఞులు బలీయ మగు నీశ్వరాజ్ఞచేఁ బ్రేరి

తులై, నందులు, కాలవాహినిం బడి వినాశసాగరమున కళిముఖులై పోవుచున్నా రని తలంపఁ జొచ్చిరి.

నాఁటి సభ యంతయు నీ విధముగ విచ్ఛిన్నమై పోయెను. పౌరులలో నప్పు డనేకుల కనేకభావన లుప్పతిల్లెను. మొత్తము మీఁదఁ బ్రజల కెల్లరికును హృదయావేదనం బధికం బయ్యెను. ఒక క్షణము కంటె మఱియొక క్షణము వారికిఁ బ్రబలాపాయశంకలు వృద్ధిఁ జొచ్చెను. నందుల కృత్యమునకు వక్త కూడఁ జాలఁ గోప పడియెను. ఉపన్యాసము సాంతము గాక పోవుటచే వక్తయుఁ జాణక్యుఁడును గూడ నంతకు మున్ను ప్రజాపక్షము వారో, రాజపక్షము వారో చెప్పుట కైతి గాదు. తుట్టతుదకుఁ బ్రభువునకుఁ బ్రజాద్వేషమును, ప్రజలకు రాజద్వేషమును గలుగుట పరస్పర వినాశకారణ మని చెప్పుచు నావక్త సభనుండి వెడలి పోయెను. నందులు తాము చేసిన పనికి గర్వపడుచు వెడలిపోయిరి. ప్రజాప్రముఖు లనేకవిధములఁ జెప్పుకొనుచు స్వస్థానోన్ముఖు లైరి. క్షణములో నా స్థల మంతయు నిర్జన మయ్యెను. ఈ వార్త గూడ నిముసములోఁ బట్టణ మంతయు వ్యాపించెను. నాఁడు పౌరుల కాలక్షేపమున కెల్ల నీ వృత్తాంతమే యాధార మయ్యెను.

నాఁడు చంద్రగుప్తుఁడు మాఱు వేసముతో నా సభయందే యుండెను. ఆతఁ డప్పు డచ్చట జరిగిన వ్యాపార మంతయుఁ జూచి మిగుల నానందించెను. ఆతఁడు చాణక్యుని ప్రభావము నంతకు ముందే విని యుండెను; గాని విశేషించి చాణక్యుఁడు సభాప్రారంభమునఁ జేసిన ప్రసంగమువలన నాతని సామర్థ్యమును స్వయముగఁ దెలిసికొనియెను. ఆ క్షణము మొదలుకొని యాతఁ "డీ మహానుభావుఁడు నాయెడల నెట్లు ప్రసన్నుఁ డగు" నని యోచింపసాగెను.

చాణక్యుని నందులు తమ పక్షమునకుఁ ద్రిప్పికొనక మాన రనియు, నట్లయిన నందసంహారము తనకుఁ జాల దుష్కరమై పోవు ననియు, నాతఁడు చింతించెను. నందులు సభకు వచ్చినప్పు డీ చింత మఱింత పెరిఁగెను; గాని వారు చాణక్యునిఁ బరాభవించినతోడనే యాతని మనస్సు కుదుటఁ బడియెను. నందసంహార మిఁకఁ దప్పదని యాతఁడు నిశ్చయించుకొనియెను. అప్పు డాతనికి మగధరాజ్యాధిపత్య మబ్బి నంత యానంద ముప్పతిల్లెను. ఆ మహితానందములో నాతఁడు, చాణక్యుఁడు భీకరశపథమును బట్టి సభను విడిచి పోయిన వెంటనే యాతని వెనువెంట బయలుదేఱెను. అయిన నతికోపభరమ్మున వెనుతిరిగి చూడకుండఁ బోవుచుండుటవలనఁ జాణక్యుఁడు చంద్రగుప్తునిఁ జూడ లేదు. చాణక్యుఁడు ముందును, జంద్రగుప్తుఁ డాతని ననుసరించి వెనుకను బోవుచుండిరి.

కొన్ని నిముసములకు వారు పాటలీపుత్రనగరమును దాఁటి సాంద్ర మగు నొక తోఁటలోఁ బ్రవేశించిరి. అప్పటికినిఁ జాణక్యుఁడు వెనుదిరిగి చూడలేదు. జుట్టు నట్లే విరియఁబోసికొని రూపొందిన కోపదేవత వలె నతిరభసమున ముందునకుఁ బోవుచునే యుండెను. అప్పు డిఁక నిట్లూరక నడచుచుఁ బోవుట వలనఁ బ్రయోజనము లేదని తలంచి చంద్రగుప్తుఁ డతిరయమ్మున ముందున కరిగి "మహాత్మా! నందవిద్వేషి చంద్రగుప్తుఁ డభివాదనము సేయుచున్నా" డని చాణక్యుని పదకమలముల నంటెను.

చాణక్యుఁ డులికిపడి చంద్రగుప్తునిఁ జూచెను. "నందవిద్వేషి" ననుటచే నాతఁ డీ యువకునివలనఁ గొన్ని యవసరము లైన సంగతులు తెలిసికొన వచ్చు నని యూహించి చంద్రగుప్తునిఁ బ్రియముతో లేవనెత్తి నీ వృత్తాంత మంతయుఁ జెప్పు మని యడిగెను. వెంటనే

చంద్రగుప్తుఁడు "కోటలోఁ బాగా వేసితి" వని సంతసించి తన వృత్తాంతము నామూలాగ్రముగఁ జాణక్యునకు విన్నవించి శరణము వేఁడెను.

చంద్రగుప్తుని వృత్తాంత మంతయు విని చాణక్యుఁ డాతని ప్రయత్నమునకుఁ జాల మెచ్చుకొనియెను. మఱియు, నాతని ముఖము వంక గంభీరముగఁ దిలకించి యా యనంతదివ్యతేజస్సును గ్రహించి, నందానంతరము మగధరాజ్యాధికార మీ యువకునకు సంక్రమించుట నిశ్చయ మని భావించి, మగధసింహాసనముపై నీ దాసీపుత్రునిఁ గూర్చుండఁ బెట్టుట నందులకు మఱింత పరాభవకారణ మని నిశ్చయించి, నందోన్మూలనదీక్షాపరతంత్రుఁ డగు నీయువకుని తోడ్పాటు వలన నందసంహార మక్రమముగ నెఱవేఱఁ గల దని యూహించి, పిదప మగధరాజ్యలక్ష్మి నీ ప్రతాపమూర్తి వక్షఃపీఠముపై నభిషిక్తం జేయుట శ్రేయస్కర మని చింతించి, యీ నవసాహసాంకుఁడు సన్నిధానమున నున్నచోఁ దన శపథ మెంతమాత్రమును విస్మృతము కాక యతిశీఘ్రకాలములో నెఱవేఱుట కవకాశము కలుగు నని తలంచి, రాజ్యతంత్రధురీణుం డగు నా పెదబాపనయ్య చంద్రగుప్తునకు "మగధరాజ్యమును నీకుఁ బట్టము గట్టెద" నని వాగ్దానము గావించి యాతని వెంటఁ గొనిపోయెను.

చంద్రగుప్తునకుఁ జాణక్యుఁడు తోడగుట యగ్నికి గాలి తోడైన ట్లయ్యెను. చంద్రగుప్తుఁడు మంత్రాంగము విషయమున నందులకుఁ బైచేయి యయ్యెను. ఇఁక వరూధిని గావలెను. చంద్రగుప్తున కిఁక దానిని సంపాదించుట యంత కష్టములోనిదిగాదు. ఇఁక నిరువాఁగులను దలపడుట కెంతో కాలము పట్టదు. నారదుని వంటివారెవ రైన నున్నచో వారికి సమయము కంటెఁ బంధువు లేదు.

నాఁ డట్లు చాణక్యచంద్రగుప్తు లెచ్చట కరిగిరో, యే మేమి యాలోచించికొనిరో తెలియదు; గాని యే కారణము వలననో చంద్రగుప్తుఁడు మగధను వీడి పాంచాలదేశమునకుఁ బోయెను.

మగధదేశ మిట్టి కలతలతో నిండియున్న సమయమునఁ బాంచాలము మఱింత దుస్థితియం దుండెను. అక్కడి రాజు లెల్లరు నంతఃకలహములలోఁ బడి మునిఁగిపోయి, వీలయి నప్పు డెల్ల నొకరి నొక రోడించుకొనుచుండిరి. ఈ సంగతి యంతయుం దెలిసికొని, ప్రపంచ మంతయు జయింప వలయు నని బయలుదేఱిన యలెగ్జాండ రను గ్రీసుదేశపురాజు భారతదేశమునఁ బ్రవేశించి తొలుదొల్తఁ దన దృక్పథమునఁ బడిన పాంచాలమును జయింపఁ బ్రయత్నించెను. పాంచాలమునందలి రాజులలోఁ గొంద ఱాతని పక్షము వహించిరి. భారతీయుల సాహాయ్యము వలన నా గ్రీకువీరుఁడు పాంచాలమునందలి చాల భాగమును జయించెను.

అప్పుడు పాంచాలమునఁ బురుషోత్తముఁ డను రా జొకఁ డుండెను. అతఁడు ప్రకృతము జేల మనఁబడు వితస్తానది వద్దఁ బ్రచండ మగు తన చతురంగబలముతో నలెగ్జాండరు నెదిరించెను. ఇరుతెగలవారికినిఁ బోరు ఘోరముగ జరిగెను. కాని యెంత పోరినను బురుషోత్తమునకు లాభము లేక పోయెను. తక్షశిలారాజులు గ్రీకుల పక్షమునఁ బోరుటవలనను, దన రథములు నదియొడ్డున బురదలో దిగఁబడిపోవుటవలనను, మదపుటేనుఁగులు తిరుగఁబడి స్వసైన్యమునే నాశము సేయుటవలనను, విశేషించి గ్రీకుదండు సంఖ్యాధికమై యుండుటవలనను బురుషోత్తమునకే యపజయము వాటిల్లెను. పాంచాలదేశ మలకసుందరుని వశ మయ్యెను.

అపుడు పాంచాలము నందే యున్న చంద్రగుప్తుఁ డీది యంతయుఁ జూచి చాల వగచెను. తక్షశిలా రాజులపైఁ జాల నాగ్రహము పూనెను. వీరస్వర్గము నలంకరించిన పురుషోత్తమునిఁ జాల మెచ్చుకొనియెను. ఏ దెసఁ దిలకించిన నాతనికిఁ బాంచాలమునం దంతటను గ్రీకుపతాకములే కాన్పింపసాగెను. అక్కృతిన నాతని హృదయమున ననంతక్రోధాగ్ని ప్రజ్వలిత మయ్యెను. పాంచాలము నుద్ధరింప బుద్ధి పుట్టెను. వెంటనే యాతఁడు తన చెంత నున్న యమితధనముతో నొక ప్రచండసైన్యమును నిర్మించెను. ఈ సందర్భమున నాతఁ డెప్పుడో యొకప్పు డలకసుందరునిఁ జూచె నని వదంతి కలదు.

పాంచాల మింత సులభముగ వశ్య మగుట వలనఁ దన యేఁబదివేల సైన్యముతో భారతవర్షము నంతను జయింప నెంచి యలకసుందరుఁడు ముందునకు సాగఁ బ్రయత్నించెను; గాని గంగాతీరమునఁ బ్రచండ మైన వరూధినియొకటి యున్నదని విని యడలియుఁ, నీదేశపుటుష్ణమునకుఁ దాళఁ జాలకయుఁ, నాతని వీరభటులు తమ యసమ్మతినిఁ దెలిపి, యజమానుఁ డెంతకును విననందునఁ దిరుగఁబడిరి. కొందఱు పాంచాలు రెదిరించిరి. ఇన్ని కారణముల వలన నలెగ్జాండరు శతద్రూనదిని గాని యమునానదిని గాని దాఁటకయే వచ్చిన దారిఁ బట్టి స్వదేశమునకుఁ బోయెను. పోవుచుఁ బోవుచు నాతఁడు పాంచాలమునందుఁ దన యధీనమున నున్న రాజ్యములను బరిపాలించుటకుఁ బ్రతినిధుల నేర్పఱిచెను. స్వదేశమునకుఁ బోయిన వెంటనే యాతఁడు మృతి నందినందున భారతదేశము నందలి యాతని రాజ్యము సెల్యూకసను వానికి సంక్రమించెను.

ఇంతలోఁ జంద్రగుప్తుని సేనానిర్మాణము పూర్తి యయ్యెను. పాంచాలమునందలి కొందఱు రాజులాతనికి సహాయపడిరి. ఉభయుల సేనలు గలిసి యొక ప్రచండసైన్య మయ్యెను. ఆ సేనవంతను దగునట్లు విభాగించి, తత్తద్భాగములకు వివేకభూషితులును, ప్రతాపమహితులు నగు వారి నధిపతులుగఁ జేసి తాను సర్వసేనాధిపత్యము వహించి చంద్రగుప్తుఁడు గ్రీకుసేనను దాఁకెను.

విజయగర్వమువలనఁ గ్రిందును మీఁదు నెఱుంగని గ్రీకురాజు సెల్యూకస్ యుద్ధభేరిని చాలకించి ప్రగల్భతాసూచకముగ మందహాసము గావించి, మహాట్టహాసముతో భారతవీరుల నెదిరించి నిలిచెను. పోరు ఘోర మయ్యెను. సెల్యూకసునకు భారతసైనికులు నిస్తేజులు గారని బోధపడియెను. కొంత కాలమునకు గ్రీకులకు భారతవీరులతోడి పోరాట మాట గాదని తెలియ వచ్చెను. మఱికొంత తడవునకు మన మింక గెలువ లేమను సంశయము దోఁచెను. దినములు గడచిన కొలఁది గ్రీకుసేన క్షీణింప సాగెను. అంత వారి మనస్సుల యందు భయము వృద్ధిపొందెను. ఎట్టి సమయముల యందైన హృదయమున భయమునకు రవంత స్థల మొసంగిన మానవుఁడెకఁ జనికిరాఁడు. కొన్ని గడియలలో గ్రీకువీరుల హృదయకుహరములు భయప్రపూరితము లైపోయెను. ఆ యుత్సాహము మటుమాయ మైపోయెను. ప్రళయాగ్నిఁ బోలు నా శౌర్యాగ్ని చల్లారిపోయెను. వెంటనే గ్రీకువీరులు కదనరంగమును విడిచి భరతవర్ష పు సరిహద్దులను దాఁటి పలాయనము స్వీకరించిరి. పాంచాల రాజ్యలక్ష్మి చంద్రగుప్తుని బాహుబంధమునఁ గులుకఁ జొచ్చెను.

ఇంతలోఁ "పాంచాలము నందలి నీ యభివృద్ధికిఁ జాల సంతసించితి ననియు, నిచ్చట నేను గావించిన నందవధోపాయము లన్ని

యూ ఫలోన్ముఖములై యున్న వనియు, నీవు క్రొత్తగాఁ జేర్చిన సేనను, నీకు సాయపడు సైన్యమును వెంట నిడికొని మగధరాజ్యలక్ష్మినిఁగూడ వరించుటకు శీఘ్రముగా రావలసినదనియుఁ జాణక్యోపాధ్యాయుని చెంగటనుండి చంద్రగుప్తునకు సందేశము వచ్చెను. అది చూచి చంద్రగుప్తుఁడు చాణక్యుని నందనిర్మూలనవిషయికం బగు దృఢదీక్షకును, దన మీఁది యఖండానురాగమునకును మిగుల నలరి యఖండసైన్యోపేతుఁడై మగధదేశము ముట్టడింప జయజయధ్వానములును, భేరీభాంకరణంబులును దిక్కటాహములు బ్రద్దలు సేయ మహావైభవముతో బయలుదేఱెను.

చాణక్యున కిందుశర్మ యను నొక సహాధ్యాయుఁ డుండెను. అతఁడు శుక్రనీతి యందును జ్యోతిశ్శాస్త్రము నందు నఖండ మైన వైదుష్యము గలవాఁడు. చంద్రగుప్తుఁడు పాంచాలమున కరుగక పూర్వ మతనినిఁ జాణక్యుఁ డిందుశర్మయనుగ్రహమునకుఁ బాత్రునిఁ గావించి "నందసంహారప్రయత్నమున సాయపడెద" నని యిందుశర్మచే నభయము గూడ నిప్పించెను. పిదప నిందుశర్మ క్షపణకవేషమును దాల్చి రాక్షసాదులకుఁ దనపై ననుగ్రహము పొడమునట్లు చేసికొని వివేకమహితులును, గిరిధీరులు నగు శిష్యులను గుప్తచారులుగా నియమించుకొని వారి పరముగా నందరహస్యములు చాణక్యున కెఱుక సేయుచు, దేశకాలపాత్రములకుఁ దగు నట్లు ప్రవర్తించుచుఁ జంద్రగుప్తునకుఁ దోడ్పడ సాగెను.

తక్షశిలానగరనాయకుం డగు పర్వతరాజు మగధరాజ్యము నాక్రమింప వలె నను తలంపుతో సమయమునకు వేచి యుండెను. చాణక్యప్రతిజ్ఞలను విని మగధరాజ్యసంపాదనమున కిదియ యదవని తలంచి జైత్రప్రస్థానమునకుఁ దగు ప్రయత్నములను గావింప

పోగెను. చారులవలన నిది యంతయుఁ దెలిసికొని చాణక్యుఁడు పర్వతరాజు వెంట కరిగి తన భూనికఁ దెలియఁ జెప్పెను. పరులను వంచించుటయందు దాటితేలిన పర్వతకుఁడు చాణక్యున కేమియుఁ బ్రత్యుత్తర మీయకుండెను. చాణక్యుఁడా యా మోసమునకు గుఱి యగువాఁడు? అంతను పర్వతకుని యాలోచనల నూహించికొని యతని సంశయములు నశించునట్లు దగిన మంత్రతంత్రము లన్నియుఁ బన్ని మెప్పించి నందరాజ్యమునం దర్ధరాజ్య మిచ్చునట్లు లొప్పికొని యాతని లోఁబఱచికొనియెను. వెంటనే పర్వతకుఁడు తనకు సాయముగ శకయవనకిరాతకాంభోజపారశీక బాహ్లీక రాజప్రభృతులను ససైన్యముగ వెంటఁ బెట్టుకొని యుద్ధమునకు బయలుదేఱెను.

ఇంతలోఁ బాంచాలమునుండి చంద్రగుప్తుఁడు తన యఖండ చతురంగబలమును గూర్చుకొని వచ్చి చేరెను. గురుశిష్యు లిరువురును దమతమ యాలోచనలను దెలిపికొని కర్తవ్యమును నిర్ణయించిరి. చాణక్యుఁడు చంద్రగుప్తుని ప్రయోగకౌశల్యమును జాల మెచ్చుకొనియెను. పిదప నిరువురును గలిసి సైన్యమును రెండు భాగములుగా విడఁదీసిరి. ఒక భాగము గండకీనదీప్రాంతము చేరి పాటలీపుత్రమును ముట్టడింపఁ బోయెను. రెండవ భాగము పర్వతకుని యాధిపత్యము క్రింద గంగాశోణాసంగమము దెసకు బయలుదేఱెను.

చారుల ముఖంబున నిది యంతయుఁ దెలిసికొని రాక్షసుఁడు తగు కట్టుదిట్టము లన్నియుఁ గావించి నందసమేతుఁడై, మహాసైన్యముతో సరయూసంగమున శత్రువుల కొఱకుఁ బ్రతీక్షించుచుండెను. చాణక్యసహాధ్యాయుఁ డిప్పు డూరకుండెనా? అతఁడు చంద్రగుప్తునకీ యుద్ధమున విలాసమాత్రమున జయము గలిగింపఁ దలఁచి ప్రబల

కుతంత్రములను బన్ని రాక్షసుని కంటి దుమ్ముకొట్టి నందులను విడఁదీసి చాణక్యుని వలయందుఁ దగుల్కొనునట్లు చేసెను.

యుక్తసమయమున నిరువాఁగుల వారును దలపడిరి. రాక్షస బలగర్వితులై నందు లీయుద్ధము నాటగా భావించిరి. ఒక బీద బాపని దురాలోచన ననుసరించి, దాసీపుత్త్రుని సాయముఁ జూచికొని దండెత్తివచ్చిన పర్వతకుని వారతిలాఘవముగఁ జూచిరి; గాని వారనుకొన్నట్లు పరబల మంత నిర్వీర్యము గాదు. క్షత్రియుఁ గ్షత్రియుఁ గలిపిన పిదప వారి యాటలు సాగినవి గావు. చంద్రగుప్తుని ప్రతాపానలము దుస్సహ మయ్యెను. చేతనైనంత వఱకును బోరి తుదకు నందపుత్రులు వీరస్వర్గమును జూఱకొనిరి. "నందవినాశ వృత్తాంతము సేనలయందుఁ బర్వఁగనే పర్వతరాజు బలముల కుత్సాహాధిక్యమును, పాటలి బలములకు దైన్యాధిక్యమును, రాక్షసునకు శోకవిహ్వలతయు నుప్పతిల్లె." అంత రాక్షసుఁ డికఁ బోరుటవలన లాభము లేదని గ్రహించి, మాయచే శత్రువులను జయింప నెంచి, నందకులమును నిలుపఁ దలఁచుచు వృద్ధనందుని బురమునుండి దాఁటించి ప్రాణత్రాణ పరాయణుఁడై యుద్ధరంగమునుండి తొలఁగి పోయెను.

చంద్రగుప్తునకు విజయలాభము గలిగెను. చాణక్యశపథములలో మొదటి దగు నందసంహారము నెఱవేఱెను. వృద్ధనందుఁడు జీవన్మృతుఁ డయ్యెను. రాక్షసుఁడు పరాజితుఁ డయ్యెను. ఇంక నెందు నెదురాడువారు లేరు. అయినను జాణక్యుఁడు, నాఁటిరాత్రి చంద్రగుప్తుని పాటలీపుత్రప్రవేశమున కంగీకరింప లేదు. పరాజితుఁడైనను రాక్షసుఁ డతిప్రతిభాశాలి; స్వామిభక్తిభూషితుఁడు; సకల మాయోపాయవిశారదుఁడు. అక్కతనఁ జంద్రగుప్తుఁడు యుద్ధరంగమునందలి తన శిబిరమునందే విశ్రమించెను. చాణక్యుఁడు చంద్ర

గుప్తపట్టాభిషేకమును గుఱించి యోచింపఁ దొడఁగెను. వీరభటు లత్యుత్సాహములతో నాటపాటలయందుఁ బ్రవృత్తులైరి.

రాక్షసుఁడు వంచనోద్యుక్తుఁ డయ్యెను. అతఁడు చిన్ననాఁటి నుండియు నొక యాఁడుపిల్లను బెంచుచుఁ, జిన్నచిన్న మాత్రలలోఁ బ్రారంభించి తీక్ష్ణమగు న ట్లేర్పాటులు గావించి యా పిల్లచే విషము తినిపించుచుండెను. అది యిప్పుడు నవమోహనాంగి యై యుండెను. ఆ పిల్ల మూలమునఁ దన ప్రయత్నమును నెగ్గించుకొనఁ దలంచి జీవసిద్ధి యను పేర క్షపణకవేషముతోఁ దన్నాశ్రయించి యున్న చాణక్యసహాధ్యాయి యగు నిందుశర్మను బిలిచి యాతని ననేకవిధములఁ బెద్దచేసి పొగడి, యా విషకన్యను జూపి, క్షమాప్ర కాసూచకముగఁ జంద్రగుప్తునకు సమర్పించి రమ్మని చెప్పెను. జీవసిద్ధియు నట్లే యని యంగీకరించి చాణక్యుని చెంత కరిగి సంగతిసందర్భము లన్నియుఁ దెలిపెను. అది విని చాణక్యుఁడు రాక్షసుని బుద్ధికుశలతకు మెచ్చుకొని యా కన్యను బర్వతకునకు సమర్పించి రమ్మని జీవసిద్ధికి నియమింప నతఁ డట్లు గావించెను. అది చూచి పర్వతకుఁడు స్త్రీలంపటుం డగుట రాక్షసునిఁ జాలఁ బొగడి యాతని యుపరాధములు మన్నించితి నని యభయ మొసంగి యా కన్యను స్వీకరించెను; గాని వెంటనే విషము తల కెక్కి మృతినొందెను. ఇట్లు చాణక్యుఁడు రాక్షసుని వంచించుటయును జంద్రగుప్తుని రక్షించుటయును గాక మగధరాజ్యమున నర్ధభాగమును గోరకుండఁ బర్వతేశ్వరునిఁ జాతుర్యముతోఁ దుద ముట్టించెను.

పర్వతకుఁడు మృతి నొందినను వాని పుత్రుఁడు మలయకేతు వుండెను. అతని భయభ్రాంతునిఁ జేసి పలాయనము గావింపఁ జేయఁ దలంచి చాణక్యుఁడు సేనాధిపతి భాగురాయణునిఁ

బిరికొల్పెను. వెంటనే భాగురాయణుఁడు, మలయకేతువునుఁ జేరి
"నీ తండ్రినిఁ జంపిన వాఁడు చాణక్యుఁడు. ఇంక నిచ్చటనే యున్న
నిన్నుఁ గూడ నంత మొందింపక మానఁడు. నాకుఁ జాణక్యచంద్ర
గుప్తులయెడ భక్తి లేదు. నన్నుఁ బోషించితివేని నిన్నుఁ గొలిచెద"
నని చెప్పెను. అది వినుటతోడనే మలయకేతువునకు మీఁది ప్రాణ
ములు మీఁదనే యెగిరి పోయెను. వెంటనే యాతఁడు భాగురాయ
ణుని వెంట నిడికొని యుగ్రశ్వాసముతోఁ దన నగరునకుఁ బోయి
భాగురాయణునకు మంత్రిపదవి నొసఁగి తండ్రినిఁ జంపిన పగఁ
దీర్చుకొన నెదురు చూచు చుండెను.

మలయకేతువు పాఱిపోయిన పిదపఁ జాణక్యుఁడు మహా
వైభవముతో జయఘోషము లుప్పతిల్లఁ జంద్రగుప్తునిఁ బురప్రవే
శము చేయించెను. ఇంతకుఁ బూర్వము చంద్రగుప్తుని రూపుమాపు
టకు రాక్షసుఁడు చేసిన ప్రయత్నము లనంతములు. సూత్రధారుఁ
డగు దారువర్మతో, రాజభవనద్వారములను గనకతోరణములతో
నలంకరించి యందతిరహస్యముగ నొక యంత్రము నునిచి చంద్ర
గుప్తుఁడు ద్వారప్రవేశము సేయునప్పు డది యాతని నెత్తిపైఁ బడు
నట్లు సవరించి చంద్రగుప్తునిఁ జంపు మని చెప్పెను. సమయము
చూచి కనకదండమున నమర్చిన కటారి దూసి చంద్రగుప్తునిఁ బొడువ
భద్రగజమునకు మావటీఁ డగు బర్బరకు నాజ్ఞాపించెను. రాజ
వైద్యుఁ డగు నభయదత్తునితో విషమిళిత మగు నౌషధ మిచ్చి
చంద్రగుప్తునిఁ గడతేర్పు మని చెప్పెను. మైమఱచి నిద్రించు తఱిఁ
గత్తితోఁ బొడిచి చంపు మని రాజశయనాధికారి యగు ప్రమోద
కుని నియమించెను. మఱియుఁ జంద్రగుప్తునిఁ బ్రహరింప రాజభవనాం
తర్భిత్తిసురంగము నందు బీభత్సకాది ఘాతుకసమూహము నుంచెను.

ఇంక నిట్టి యనేక మాయోపాయములను బన్నెను; గాని చాణక్యుని యెదుట నవి యేవియు నిలిచినవి కావు. అన్నియు నిరర్థకములై పోయెను. చంద్రగుప్తుఁడు నిరపాయుఁడై నిష్కళంక చంద్రుని వలెఁ బ్రకాశించెను. అటు పిమ్మటఁ జాణక్యుఁడు, రాక్షసప్రోత్సాహంబున సురంగమార్గము నుండి పురము వెలువడిపోయి వృద్ధనందుఁడు తపోవనమున నున్నాఁ డని తెలిసికొని, నందశేష ముంపఁ గూడ దని తలంచి, విశ్వాసపాత్రు లగు ఘాతుకులం బంపి యాతని శిరము దునిమించెను.

తాను బన్నిన యుపాయము లన్నియు నిట్లు విధ్వస్తములై పోవుచున్నను స్థిరచిత్తుఁడగు రాక్షసుఁడు తన ప్రయత్నముల నుండి విముఖుఁడు గాలేదు. అతఁడు, పద్మనందుఁడు గూడఁ జాణక్యక్రోధానలమున భస్మీభూతుఁ డగుట విని, తా నింకఁ బాటలీపుత్రమున నున్నచోఁ దన కపాయము వచ్చు నని యెంచి, ప్రాణస్నేహితుఁ డగు చందనదా సను నొక వైశ్యుని యింటఁ దన దారపుత్రుల నతిరహస్యముగ నిలిపి, యెట్లయినను జంద్రగుప్తుని సంహరించి తీర వలె నను సంకల్పముతోఁ దిన్నఁగ బోయి మలయకేతువు నాశ్రయించెను. రాక్షసుఁడు, తన తండ్రితోఁ బ్రత్యక్షముగఁ గత్తి కట్టి పోరిన వాఁడే యైనను, దన తండ్రినిఁ జంపించిన వాఁ డగుటఁ జాణక్యుఁడు తన కిపుడు ప్రతిస్పర్థియై యున్నాఁడు గావున నీ సమయమున నఖండ శేముషీధురంధరుఁ డగు రాక్షసామాత్యుని స్నేహమావశ్యకమని యెంచి, యాతనిఁ జాల గౌరవముతోఁ దన చెంత నిలుపుకొనియెను. రాక్షసుఁడును దాని కెంతయు సంతసించి, చాణక్యచంద్రగుప్తులను సంహరించి నందతర్పణము గావింప వలె నను తన ప్రతిజ్ఞను విప్పిచెప్పి, నీ వంటి యుత్తమవీరునకుఁ దండ్రినిఁ జంపిన

పగఁ దీర్చుటయే పరమధర్మ మని మలయకేతువున కుద్రేకము గలుగున ట్లు బోధించెను. అంత మలయకేతు వెంతయు నుబ్బిపోయి, రాక్షసామాత్యుని మంత్రాంగము వలనఁ దనకు జయము గలుగుట నిస్సంశయ మని తలంచి, సేనల నన్నిటిని సిద్ధము గావించి శుభముహూర్తమున దండయాత్రకు బయలువెడలెను. ఆతనివెంట శకయవనగాంధారచీనహూణకౌలూతాదిరాజులు గూడ బయలుదేఱిరి.

కౌటిల్యవిశారదుఁ డగు చాణక్యోపాధ్యాయుఁడు చారుల మూలమున రాక్షసుని ప్రయత్నము లన్నియుఁ దెలిసికొని వాని కప్రతిహతము లగు ప్రత్యుపాయములను బన్నెను. తన పరమమిత్రుఁ డగు పర్వతకునిఁ జంపుటకు రాక్షసుని యోగమున విషకన్యను దోడుకొని పోయె నను నపరాధమును బ్రకటించి జీవసిద్ధినిఁ బాటలీపుత్రము నుండి వెడలఁ గొట్టించెను. అక్కడ తన జీవసిద్ధికిఁ దిరిగి రాక్షసాశ్రయము లభించుటకును, దన్మూలమున నప్పటఁ జంద్రగుప్తుని పక్షమున వేగు నడపుటకును, రాక్షసమలయకేతువులకు వైరము కల్పించుటకును సందుకొరకెను. ఆ హేతువువలన విషకన్యాప్రేషణాపరాధము చాణక్యుని మీఁద నుండి రాక్షసుని మీఁదికి దొరలి పడి పోయెను. మఱియుఁ జాణక్యుఁ డిట్టి చారుల మూలమున రాక్షసుని చేతి ముద్రికను సంపాదించి, యా ముద్రికాసాహాయ్యమునఁ గొన్ని కాగితములు రాక్షసుని పేర సృష్టించి, మలయకేతువు వానినిఁ జూచు నట్లు తంత్రము పన్నెను.

చాణక్యుని ప్రయత్నములవలన మలయకేతువునకు రాక్షసునిపైఁ గల విశ్వాసము తొలఁగి పోయెను. అతఁడు రాక్షసుఁ డట్లు మాయవేసముతోఁ దన్నుఁ గూడఁ దుదముట్టింప వచ్చు నని భావించి తన యనంతసైన్యసముద్రమును వెనుకకు మరలించుకొనియెను.

ఈ నూతనవిపత్తువలన రాక్షసుఁడు చాల వగచెను. కాని చంద్రగుప్త వధోద్యోగమును విరమింపలేదు.

చాణక్యుఁడు రాక్షసాదుల ప్రయత్నము లన్నియుఁ జెడిపోవుటకుఁ జాల సంతసించి, రాక్షసుఁడు బ్రతికి యున్నంత కాలము తనకును, చంద్రగుప్తునకును, మగధరాజ్యమునకును గూడ విశ్రాంతి యొదవ దని భావించి, యెట్లయిన రాక్షసుఁ డమాత్యుఁ డగునేనిఁ జంద్రగుప్తుఁడు మధ్యందినమార్తాండుని వలె దుర్నిరీక్ష్యుఁడు కాఁ గలఁ డని తలంచి రాక్షసవశీకరణప్రయత్నములం జేయఁజొచ్చెను. కాని యెన్ని విధములను రాక్షసుఁడు వశుఁడు కాఁ డయ్యెను. చాణక్యుఁడు తుద కీ యుపాయము నూహించెను.

రాక్షసుని కుటుంబము చందనదాసు నింట నున్న దని చాణక్యుఁ డెట్లో తెలిసికొనియెను. అంతఁ జందనదాసుని రప్పించి యాతఁడు రాక్షసకుటుంబమును దన స్వాధీనము సేయుమని చెప్పెను. చందనదాసు నయము వలనను భయము వలనను గూడ స్వాధీనము కాలేదు. చాణక్యుఁడు ధనాశ చూపెను. రాజానుగ్రహపాత్రుఁడ వయ్యెద వని యూరించెను. అయిన నా వైశ్యశిఖామణి యందుల కంగీకరింపలేదు. అతఁడు రాక్షసుని దారపుత్రులు తన యింట లేక పోవుటయే గాక, వారి నెప్పుడు నెచ్చటను దాను జూచియే యుండలే దని బూకరించెను. తుదకుఁ జాణక్యుఁడు "రాజద్రోహుల కాశ్రయ మిచ్చె" నను నేరము మోపి చందనదాసునకు మరణదండనము విధించెను. ఈ సంగతి రాక్షసునకుఁ దెలియుట కెల్ల చోట్లఁ జాటింపించెను.

అయినను జందనదాసు నంతరాత్మ మిత్రద్రోహమున కంగీకరింపలేదు. సంతోషముతో నాతఁడు వధ్యశిల సమీపించి నప్పుడు

కూడఁ జాణక్యుఁడు బోధించి చూచెను; గాని యప్పుడు కూడఁ బ్రయోజనము లేక పోయెను. అయినను జాణక్యప్రయత్నము కొనసాగు సందర్భము మాత్రము తటస్థించెను. తనకు మలయకేతువుతో వైరము పొసఁగిన పిదప విదేశముల నుండి ప్రయత్నములు సేయుట వలన లాభము లేదనియుఁ, బాటలియందే యుండిన నెట్లయినను జంద్రగుప్తుని సంహరింప వచ్చు ననియుఁ దలఁచి రాక్షసుఁడు పాటలీపుత్రమునకు వచ్చుచుఁ బురప్రాంతమున నీ సమాచారమును వినియెను. ఇది విని యాతఁడు చాలఁ గటకటఁ బడి, తన కొఱకుఁ బ్రాణములు విడువ నున్న మిత్రుని కొఱకుఁ దాను బ్రాణములు విడువఁ దలంచెను. ఆహా! స్నేహధర్మము!

చందనదాసుని వధ నిశ్చయ మయ్యెను. ఆతఁడు వధ్యశిల నధిష్ఠించి మృత్యువు కొఱ కెదురు చూచుచుండెను. తలవరులు విచ్చుకత్తులు పూని విసరుటకు సిద్ధముగ నుండిరి. చాణక్యుఁడు వారల కాజ్ఞ యిచ్చుటకు సిద్ధముగ నుండెను. అంతలోఁ జుట్టును జేరి యున్న జనసంఘమునుండి, "యాగుఁడాగుఁ" డను గంభీరధ్వని విన వచ్చెను. వెనుదిరిగి చూచు నంతలో రాక్షసుఁడు వచ్చి యచ్చటఁ బ్రత్యక్షు మయ్యెను. తోడనే చాణక్యున కమితానందము గలిగెను; గాని యది ముఖముపై సాంద్రముగ నావరించుకొని యున్న క్రోధప్రతిసీరఁ జీల్చుకొని పైకి రాఁ జాలక పోయెను. అప్పుడు వగర్చుకొనుచు రాక్షసుఁడు చాణక్యుని సమీపించి "చందనదాసు నుద్ధరించి, యా శిక్ష నాకు విధింపు" మని కోరెను. చాణక్యుఁ డందుల కంగీకరింప లేదు. "ఒకఁడు చేసిన నేరమునకు మఱియొకని శిక్షించు టెట్లు? చందనదాసునకు శిక్ష యెట్లును తప్పదు. నీ విదివఱకుఁ జేసిన కుట్రలను గుఱించి నిన్నుఁ గూడ

విచారణ చేయకుండ విడువఁ బోము. మీ రిరువురు నపరాధులే" యని యాతఁ డందులకుఁ బ్రత్యుత్తరము చెప్పెను. అది విని రాక్షసుఁడు తన దురదృష్టమును జాల నిందించుకొనియెను. పాప మాతఁడు "నన్నేమి చేసినను జేయ వచ్చును; గాని చందనదాసుని రక్షింపు" మని దీనముగఁ బ్రార్థించెను. అప్పుడు చాణక్యుఁడు "నీవు సచ్చింతతోఁ జంద్రగుప్తునకు సాచివ్య మొనరించెదవా?" యని ప్రశ్నించెను. రాక్షసుఁ డీకఁ దప్పదని "వల్లె" యనెను. చాణక్యుఁడు కరుణ నభినయించెను. చందనదాసు విముక్తుఁ డయ్యెను. చంద్రగుప్తుఁ డెంతో యానందించెను. చాణక్యుని గభీరదృష్టులలో నానందలక్ష్మి మెఱసి పోవుచుండెను. వెంటనే చాణక్యచంద్రగుప్తులు రాక్షసునిఁ, జందనదాసు నతిగౌరవముతోఁ గోటలోనికిఁ దోడుకొని పోయిరి.

చాణక్యచంద్రగుప్తుల కప్రతిహతమైన విజయ మిప్పటికిఁ జేకూరెను. దేశమున మఱల శాంతి నెలకొనెను. చంద్రగుప్త రాజ్యము రామరాజ్యము వలె సుఖప్రద మగు నని ప్రజ లెల్లరును దలంప సాగిరి. కాని పారంపర్యాధికారము గల నందుల వినాశమునకు వారు వగవక పోలేదు. రాక్షసుఁడు మహాతేజస్సంపన్నుం డగుటఁ గీడు తలంపక నూతనప్రభువు నెడల భక్తివిశ్వాసములతోఁ బ్రవర్తింపఁ దొడఁగెను. చాణక్యునకుఁ దన యందుఁ గల నిర్వ్యాజానురాగమునకుఁ జంద్రగుప్తుఁడు మిగులఁ గృతజ్ఞతఁ గలిగి ప్రవర్తింపఁ జొచ్చెను. చాణక్యుఁడు తాను పట్టిన రెండు శపథములును నెఱవేఱుటయే గాక కాకతాళీయన్యాయంబుగ రాక్షసవశీకరణము గూడఁ గలిగి నందుల కెంతయు నానందించెను.

చాణక్యుఁడు శుభముహూర్తమునఁ జంద్రగుప్తునకుఁ బట్టాభిషేకము గావించి, యాతఁడు మహారాజుగను రాక్షసుఁడు మహామాత్యుఁడుగను బ్రకటించెను. చందనదాసునిఁ బ్రపంచము నందలి గొప్పవర్తకుల కందఱకుఁ దలమానికంబుగాఁ బ్రచురించెను. ప్రజాప్రముఖులు, రాజ్యతంత్రవిశారదులు, పండితులు, కవులు, యోధులు, సైనికులు మున్నగు వా రెల్లరును గౌరవింపఁ బడిరి. నందపరిపాలనమును, బ్రజాపీడయు, విప్లవమును బ్రజలకు స్వప్నసదృశము లయ్యెను. కొలఁది కాలములో జరిగిన యీ మార్పునకుఁ దేశము నం దెల్లరు నాశ్చర్యపడసాగిరి. రాజుగారి ప్రియురా లగు మురరాజమాత గూడ నయ్యెను. ఎంత యదృష్టము !

కాని చంద్రగుప్తుని రాజ్యతృష్ణ యంతటితో శమింప లేదు. ఆ దాసీపుత్రునకు మగధ్యగా జనిపించుకొనుట యంత ఘనతగాఁ దోఁప లేదు. రాజ్యతంత్రజ్ఞులు తన్నుఁ "జంద్రగుప్తుఁడు భారతదేశమునందలి మహారాజులలో నొకఁడు" డని మాత్రము పిలుతు రని యాతఁడు తలంచెను. తనలో సములు గాని, తన కంటె నధికులు గాని యుండుట యాతనికి లాఘవముగఁ దోఁచెను. రాజుల మీఁదఁ గూడఁ దన యధికారము చెల్లింప నాతఁడు కుతూహలము గలిగి యుండెను. అక్కతనఁ జంద్రగుప్తునకు భారతదేశమునకుఁ జక్రవర్తి గావలె నని తలంపు పుట్టెను.

ఈ తలంపు యొక్క సాధ్యాసాధ్యములను గురించి మేమిప్పుడేమియుఁ జెప్పఁజాలము. మీ రిది గొంతెమ్మ కోరిక యందురా? కాని మహారాజ్యాధిపత్య మశ్రమముగ లభించిన చంద్రగుప్తుని వంటి వానికి సామ్రాజ్యాధిపత్యము నందు వాంఛ గలుగుట వింత గాదు. ప్రకృతిధర్మ మే మనఁగా? పారంపర్యముగ గర్భదరిద్రుం

దగు వాఁడు లక్షాధికారి కా వచ్చును; గాని పారంపర్యముగ లక్షాధికారి యగు వాఁడు కోటీశ్వరుఁ డగుట కష్టము. ఏల? అతఁడు పుట్టుకవలననే లక్షాధికారి. లక్షాధికారి యగుటలో నాతని పౌరుషం బేమియు లేదు. స్వీయపౌరుషము నుపయోగింపక పోయినను నాతఁడు గౌరవముగా జీవయాత్ర గడపఁ గలఁడు. అక్కృతన నాతనికిఁ బౌరుషప్రభావమే తెలియదు. దరిద్రుని కట్లు గాదు. ఉన్నంత పౌరుషమును వినియోగింపకున్న దరిద్రునకు జీవయాత్ర సాగదు. అక్కృతన నాతఁడు తన పౌరుషము నంతను వినియోగించి దాని ప్రభావమును దెలిసికొనఁ గలఁడు. పౌరుషప్రభావము నెఱింగిన యాతఁ డెప్పటికిని సంతృప్తి వహించి యుండ లేఁడు. నూఱు రూపాయలు గడించిన వాఁడు రెండు వందలు గడింపఁ గోరును. తన సంతతపరిశ్రమచే లక్షాధికారి యైన వాఁడు కోటీశ్వరుండు కాఁ జూచు. త్రికరణశుద్ధిగఁ బౌరుషమును నమ్మి పనిచేయు వాని కభీష్టసిద్ధి గాక పోదు. లోకములో గర్భదరిద్రుల యభివృద్ధికి, నాగర్భశ్రీమంతుల యధఃపతనమునకును బౌరుషప్రభావపు జ్ఞానాజ్ఞానములే కారణములు. ఈ సిద్ధాంతము ననుసరించి యాగర్భశ్రీమంత మగు వంశ మధఃపతితం బగును. చిరకాలము దారిద్ర్యము ననుభవించిన వంశము మహాభాగ్యసంపన్న మై విరాజిల్లును.

ఎల్ల వస్తువుల వృద్ధిక్షయములకు నీ సిద్ధాంతమే చెల్లుచున్నది. ప్రపంచమునందలి యెల్లదేశములు నభివృద్ధి యన నెట్టిదో యెఱుంగక గాఢాజ్ఞానాంధకారమునఁ బడి యున్నపుడు భరతవర్షము దారిద్ర్య మన నెట్టిదో యెఱుంగని సంపద నభిరామమై విరాజిల్లినది. కాని కొంతకాలమున కా యౌన్నత్యమునకు విఘాతము గలిగినది. మఱల భరతవర్ష మున్నతి నంద వలె నన్నఁ గడచిన

దారిద్ర్యసాగరమును దాటవలెను. భరతవర్షము చిరకాల మట్టి నికృష్టదశ ననుభవించినది; గావుననే నల్లని యీ యాంగ్లేయ ప్రభుత్వమున నభివృద్ధిసూచనలు పొడకట్టుచున్నవి.

పౌరుషప్రభావమును ఒక్కొకఁగ నెఱింగినవాఁ డగుటఁ జంద్రగుప్తుఁడు వెంటనే తన వాంఛితము నీడేర్చుకొనఁ దలంచెను. ఆవెంటనే రాజ్యతంత్రమునం దద్వితీయుఁ డగు చాణక్యామాత్యుల మంత్రబలము తన కమితసాహాయ్యము గా నా మహాతేజశ్శాలి కొలఁది దినములలో నాఱు లక్షల కాల్బలమును, ముప్పది వేల గుఱ్ఱపుఁ బటాలమును, దొమ్మిది వేల యేనుఁగులును సంపాదించెను. ఈ వార్త విని భరతవర్షము నందలి రాజు లెల్లరు నబ్బురంపడి వెంటనే దిగాలు పడిరి. కొంద "ఱీ దాసీపుత్రున కీ రక్తపాతములోఁ దృప్తి కలుగ లేదు కాఁబోలు! వీఁడు జగత్త్రితయము నభిలషించుచున్నాఁ" డని తహతహ పడసాగిరి. తుదకుఁ జంద్రగుప్తుఁడు చాణక్యామాత్యుల యనుజ్ఞ నంది పంచి సమయమున భేరీ భాంకరణంబులచే దిక్కుహరములు పూరించి, నర్మదాహిమాలయములకును, ప్రాక్పశ్చిమసముద్రములకును మధ్యభాగమునఁ గల భారతదేశమునకుఁ బ్రథమచక్రవర్తి యయ్యెను.

చరిత్రకారులు చంద్రగుప్తుని నవతారపురుషుఁడుగ భావించి బట్టులవలెఁ బొగడి యున్నారు. దాసీపుత్రుఁడు సార్వభౌముఁ డగుటయే యవతారపురుషుఁ డనుట కాధారమా? అట్లయినచో మేము చరిత్రకారులతో నేకీభవింపఁ జాలము. చంద్రగుప్తుని యందు మఱియొక యాత్కృష్ట్య మే మైన నుండవలెను. మన మది యేదో పరిశీలింతము.

చంద్రగుప్తునకు సంగ్రామరంగమున వీరవిహారము గావింప వలయు ననుముచ్చట యింకను దీఱినది కాదు. రక్తపాతమునం దాతని కింకను నిర్వేదము గలుగ లేదు. అనేక యోధానుయోధుల శీర్షములను గొబ్బరి పుచ్చెలవలె వెగుడు గొట్టిన యాతని ప్రచండ కరవాల మింక నాతనిని సంగ్రామరంగమున కాహ్వానము సేయ సాగెను. చంద్రగుప్తునివంటి వీరుడా యాహ్వానమును నిరాకరింప గలడా? అది కాపురుషలక్షణము. వెంటనే చంద్రగుప్తు డధికోత్సాహముతో మఱల యుద్ధమునకు బయన మయ్యెను.

"ఎక్కడ" కని మీరు వేఱుగ నడుగ నక్కఱ లేదు. కలదు గదా విలాసమాత్రమున గ్రీకు దేశీయుడగు నలకసుందరునకు విహార ప్రదేశమైన పాంచాలము? నందసంహారమునకు బూర్వము పార్వతీయసహాయుండగు చంద్రగుప్తుని ధాటి కోర్వ లేక పలాయనము గావించిన సెల్యూకసు కొలది దినములు గడచిన పిదప మఱల తేఱికొని భరతవర్షమున దిరుగ గ్రీకుపతాకలను నెలకొలుప దలంచి పాంచాలముపై దండెత్తి వచ్చెను. చంద్రగుప్తుడు చాణక్యుని యోచన చొప్పున సెల్యూకసు సింధునదిని దాటు నంత దనుక నేమియు జేయక యూరకుండి పిదప నత్యంతచాతుర్యముతో దనయఖండసైన్యముచే గ్రీకుసైన్యమును జుట్టుముట్టడించి బంధించి వేసెను.

సెల్యూకసు నిర్భయముతోడను బట్టుదలతోడను భారతవీరులను దాకెను. గ్రీకుసైనికులు దండతాడితభుజంగముల రీతిని జాల బట్టుదలతోడనే పని చేసిరి; గాని పాపము! వారి యెడల విజయలక్ష్మి ప్రాతికూల్యము నవలంబించెను. తుదకు జేయునది లేక సెల్యూకసు గెడ్రోషియాయు, నరకోషియాయు ననబడు

నష్ఘనిస్థానమును బలూచిస్థానమును భారతసామ్రాజ్యలక్ష్మి కుపాయనముగ నర్పించి చంద్రగుప్తునితో నొడంబడిక గావించికొని యాత్మరక్షణము గూడఁ గావించుకొనియెను. ఈ యొడంబడిక జరుగుటకుఁ బూర్వము గ్రీకు సేనలపైఁ బడి మాగధులు కొంత తఱకుఁ దమ దోఃకండూతినిఁ దీర్చికొనిరి.

కాని చంద్రగుప్తుఁడు సెల్యూకసు నంతటితో విడిచిపెట్టుట కంగీకరింప లేదు. విజితుం డగుటవలన నసూయావిదగ్ధహృదయుఁడై సెల్యూకసు మఱల నెప్పుడైన దండెత్తి వచ్చినచో వాని కపజయమే సిద్ధించినను, బ్రజలకుఁ గష్టము లొదవును గావునఁ దిరిగి యెప్పుడు నా గ్రీకుయోధుఁడు భరతవర్షముపై దండెత్తి రాకుండున ట్లుపాయమును బన్నఁ జంద్రగుప్తుఁడు చాణక్యునిఁ బ్రార్థించెను. అప్పుడు చాణక్యునకుఁ దుల్యబలు లగుట నెప్పుడును గయ్యములు సంభవింపకుండుఁ గాత మని వియ్యముకొఱకు వియ్యము లందిన యాదవపాండవులును, విరాట పాండవులును జ్ఞప్తికి వచ్చిరి. ఇదియే మంచి యుపాయ మని చంద్రగుప్తునకుఁ దెలిపి యాతనికి సెల్యూకసు కూఁతు నిచ్చి పరిణయము సేయుటకు జాణక్యుఁడు తంత్రములు పన్నెను. సెల్యూకసు సార్వభౌముఁ డల్లుఁ డగుట మిగుల గౌరవాస్పద మని భావించి, మాఱు పలుకక యత్యానందముతో సుందరియు, జవ్వనియుఁ, జతురయు నగు తన ముద్దులకూఁతును జంద్రగుప్తునకు సమర్పించుకొనియెను. గ్రీకు యోధునకును భారత సార్వభౌమునకును వైర ముడిపి యొక్క-అబల యఖండస్నేహం బొనఁగూర్చెను.

పిదప సెల్యూకసు తన కైదు వందల గజములు (ఏనుఁగులు) గావలయు నని యల్లునిఁ బ్రార్థించెను. ఒక గజగమనకు బదులుగ

నైదు వందల గజము లిచ్చుట ధర్మవిరుద్ధము గా దని చాణక్యమం త్రాలోచనము ననుసరించి చంద్రగుప్తుఁడు తన మామ ముద్దు తీర్చెను. మాగధుల ప్రతాపము బడబాగ్నివలె దుస్సహం బగుటను, హతశేషం బగు సైన్యము భయభ్రాంతం బగుటను, విశేషించి తన పుత్రిక భారతదేశచక్రవర్తిని యగుటను సెల్యూకసు చంద్రగుప్తు నెదిరింప మఱలఁ గలనైనఁ దలంప లేదు.

పిదపఁ గొన్ని నాళ్లకుఁ దన దేశమునఁ బశ్చిమప్రాంతమున శంతిగోనసను పగతుఁ డొకఁడు తిరుగఁ బడె నని విని మెగాస్తనీసను వానిఁ జంద్రగుప్తు నాస్థానమునఁ దన రాయబారిగా నిలిపి సెల్యూకసు స్వదేశమునకుఁ బోయెను.

చంద్రగుప్తుఁడు నిశ్చలుం డయ్యెను. అతఁడు శాంతచిత్తుఁడై రాజ్యపరిపాలనము ప్రారంభించెను. రాజ్యసంపాదనమున నాతఁ డెంత కుశలుఁడో రాజ్యపరిపాలనమునఁ గూడ నంత చతురుఁడు. అతని రాజ్యాంగవిధానము లన్నియుఁ జరిత్రములు చదివిన వారికిఁ బరిచితములే. అతఁడు దాసీపుత్రుఁ డైనను మనకుఁ బూజ్యుఁడు. ప్రాతస్స్మరణీయుఁడు.

మన మీ యాఖ్యానము ముగించుటకుఁ బూర్వము చాణక్యో పాధ్యాయుని గుఱించి యొకింత ముచ్చటించుకొనక తీఱదు. ఈ బీద బ్రాహ్మణుని చరిత్రము మహోన్నతము. ఈతని ప్రారంభముల యౌ త్కృష్ట్యమును, నిరాయాస మగు తత్సాఫల్యమును జూడ నీతఁడు కారణజన్ముఁ డను నూహ పొడమక మానదు. ప్రప్రథమునఁ జాణ క్యచంద్రగుప్తులకు జరిగిన సమావేశ మయాచితమును, సమయాను కూలమును, బరస్పరవిజయకారియు నై యాశ్చర్యమును గొలుపు చున్నది. చాణక్యుని ఘనతను జంద్రగుప్తుఁడు గ్రహించినట్లు నందులు

గ్రహింప లేక పోయిరి. అర్థగర్వోన్మత్తు లగుట వారి కీతఁ డనామకుని వలెఁ దోఁచెను.

లోకములో నైశ్వర్యప్రమత్తుల వృత్తమే యిట్టిది. సంపన్నుల తలంపున దరిద్రులు మానవులుగాఁ బరిగణింపఁబడఁ దగరు గాఁబోలు. వారి కొక్కొక్క పేదవానియం దుండు విద్యావివేకములును, శక్తి సామర్థ్యములును దెలియవు కాఁబోలు! సంపన్నులు సంపన్నులకుఁ బ్రత్యుత్థానము లాచరించి యనుగులకు మడుగు లొత్తెదరు; గాని పేదలకు దర్శనమైన నొసంగరు. ఒసంగినో; కడుఁ జుల్కనగఁ జూతురు. తిన్నగ మాటలాడరు.

నందులు చాణక్యుని యెడల నట్లె ప్రవర్తించిరి. కాని చాణక్యుఁ డవమానపడి యూరకుండు నిస్తేజుఁడు గాఁడు. ఆ సభలో దన వాఁ డొక్కఁడును లేక పోయినను, స్వస్థలమున నైన బలఁగము లేక పోయినను బ్రత్యక్షముగ, రాజభవనమునందే యొక్కరుఁడు నిర్భయముగ "మి మ్మంత మొందింపకుండ నీ జుట్టు ముడఁవ"నని శపథము దాల్చుటకుఁ జాణక్యునకే తగును.

"నందసంహారము" "చంద్రగుప్త పట్టాభిషేకము" నను రెండు ప్రతిజ్ఞలు నెఱవేర్చుకొనుటలోఁ జాణక్యునకుఁ గలిగిన యంతరాయములకుఁ బారమును, నిందలకుఁ బరిమితియు లేదు. అయిన నాతఁ డెందులకు భీతిల్ల లేదు. అవి తటస్థించినపు డాతనికి సుంత యేని వైకల్యము గాని, యెట్లు సాధింతు నని విచారము గాని కలిగె నని చెప్పుటకు వీలులేదు. ఏలన? పురుషకారమున కసాధ్యము లేదనియుఁ బురుషకారమే సర్వఫలములకు సాధక మనియు నాతని యభిప్రాయము. ఆతఁ డట్టి విశ్వాసముతోనే పనిచేసెను. దానికిఁ

దగిన ఫలములనే పడసెను. అతని ప్రయత్నములలో నాత్మవిశ్వాస రహిత మొక్కటియు లేదు. విఫల మైనది యంతకు ముందే లేదు.

"అయిన నతఁడు కేవల నిరీశ్వరవాది" యని మీరు తలంచుటకు వీలు లేదు. అతఁ డాస్తికమహాజనులలో నెల్ల నుత్తముఁడు. సాంగచతుర్వేదములను వల్లె వేసిన వాఁడు; భగవత్పూజా ధురంధరుఁడు; స్వమతమునం దధికాభినివేశము గల సత్కులప్రసూతుఁడు. నైష్ఠికుఁడు; విజితేంద్రియుఁడు; గాని సర్వసంగపరిత్యాగము గావించిన సన్న్యాసి గాఁడు. అస్ఖలితబ్రహ్మచారి. అయినను లౌకికకార్యశూరుఁడు.

భారత సామ్రాజ్యం బంతయుఁ దన యాజ్ఞాబద్ధంబై యున్న నాతఁ డెప్పుడును వైభవముల నాసించిన వాఁడు కాఁడు. అతఁడు దంభముల పొంతఁ బోక, విషయసుఖవిముఖుఁ డై, మహర్షి వలె నొక పర్ణకుటీరమున వేదవిహితకర్మపరతంత్రుఁ డై యావజ్జీవమును నిష్కళంక బ్రహ్మచర్యములోఁ గడపెను.

ప్రతిజ్ఞా నిర్వహణ మను పేర నసంఖ్యేయ కుటిలకృత్యములం గావించిన యాతనికి నిర్మలబ్రహ్మచారిత్వ మెట్లు సిద్ధించు ననియు, వేదవిహితాచారపరాయణత యెట్లు చేకూరు ననియు సందేహింప వీలు లేదు. అతఁడు కర్మసన్న్యాసి గాఁడని ప్రథమము నందే చెప్పితిమి. అతఁ డేక కాలమునందే యిహపరముల రెంటిని సాధింపనెంచిన తేజస్వి. వేదవిహితాచారపరాయణతయు, లౌకిక కార్యనిర్వాహకతయు నాతనికి ముఖ్యవిధులే. ఇందే ధర్మము విడుచుటకు వీలగును? కొందఱు లౌకిక కార్యప్రవాహమునం బడి కొట్టుకొని పోవువారికి మతాచారనిర్వహణ మసాధ్య మందురు. ఈ వాద మవిచారహేతుక మగుట నిరాకరణీయము.

ఈ చర్చవలన మన చింతిత విషయము నిర్ధారితము కాలేదు. అది యొకింత విమర్శింతము. చాణక్యుని జీవితము నందుఁ గౌటిల్యమేమైన నున్నదా లేదాయని ప్రశ్న. లేదని ప్రత్యుత్తరము. మనము చాణక్యుని జీవితమును సామాన్య మానవుల జీవితములతోఁ బోల్చి విమర్శించుటకు వీలు లేదు. మహాపురుషుల జీవితలక్షణములను మనము గావించితి మేని చాణక్యుని జీవితము నందలి నైర్మల్యము మనకు బోధపడఁ గలదు. సామాన్యుల జీవితపరమావధి యానందానుభవము. మహాత్ముల జీవిత పరమావధి ధర్మసంస్థాపనము. లోకమున నధర్మము విజృంభించియున్నపుడే మహాత్ము లవతరింతురు. మాయ మాయైక సాధ్యము. అట్లే యధర్మము నధర్మైక సాధ్యము. అగుట ధర్మసంస్థాపనము కొఱకు మహాత్ము లపుడపు డధర్మము నాశ్రయింతురు. కాని వారి జీవితమున కది కలంకము నాపాదింపఁ జాలదు. మహాత్ము లని భక్తితో శ్రీరామకృష్ణులను బూజంపని వాఁడు భారతీయులలో నొక్కఁడు నుండఁ జాలఁడు. వారి చరిత్రములలోఁ దాటకా సంహారాదికములును, బూతనా హింసనాదికములు నగు నధర్మప్రవర్తనములు కాన్పించుటలేదా? వాని నధర్మప్రవర్తన లనుట కెవఁడైన సాహసింపఁ గలఁడా?

ఈ సందర్భమున నందసంహారమునకుఁ బోలెఁ బర్వతకనిగ్రహమునకుఁ దగిన కారణము లేదనియు, నది చాణక్యుని జీవితమునం దొక కలంక మనియుఁ గొందఱు సందియంపడ వచ్చును. ఈసందేహము లెస్స యైనది గాదు. పర్వతకుఁడు చంద్రగుప్తునకు సద్బుద్ధితో సాయము సేయ వచ్చినవాఁడు కాఁడు. అతనికిఁ జంద్రగుప్తునకుఁ గంటెఁ బూర్వమే మగధరాజ్యముపై నాశగలిగినది. అతఁడు చాణక్యుఁడు వచ్చి నందసంహారమునఁ జంద్రగుప్తునకు సాయపడ

వలయు ననియు, నందులకుఁ గాను మగధరాజ్యములో సగపాలు నీ కొసంగెద ననియుఁ జెప్పినపు "డిట్లు గావించినచో మగధపై దండెత్తినందులకుఁ బ్రజలు చంద్రగుప్తుని నిందించినంత తన్ను నిందింప రనియుఁ, జంద్రగుప్తుని సైన్యమును దనసైన్యమును గూడినచో నందసంహారం బగుట నిస్సంశయం బనియుఁ, బిదపఁ దన వెంట వచ్చిన శకయవనకిరాతాదిరాజుల సాయంబునఁ జంద్రగుప్తుని స్వల్పసైన్యమును నిముసములో భస్మపటలము గావించి వైచి మగధరాజ్యం బంతయుఁ దానే యనుభవింపవచ్చు ననియు భావించెను. కాని చాణక్యుని యెదుట నీ కౌటిల్యము దాఁగినది గాదు. అది కారణంబు వలనను, మగధరాజ్య మంతయు నీకుఁ బట్టము గట్టెద నని చంద్రగుప్తున కిచ్చిన వరమునకు భంగము తటస్థింపఁజోవుటను, బర్వతకునిఁ జంపించె నను నపవాదము తనపైఁ బడకుండునట్లు రాక్షసప్రేషిత యగు విషకన్య యను నాధారము లభించుటం జేసియుఁ జాణక్యుఁడు కుటిలుఁ డగు పర్వతకుని రూపుమాపెను. మోసగానిని మోసము చేయుట యధర్మము గాదు. పర్వతకుఁడు మోసము చేయ వచ్చి మోసపోయెను.

మొత్తము మీఁదఁ జాణక్యుఁడు చాల దుర్మార్గుఁ డని కొందఱ యభిప్రాయము. తన యెడల నన్యాయముగఁ బ్రవర్తించిన వారికిఁ బ్రతిక్రియ సేయుటయే దుర్మార్గ మగునేని లోకమున ధర్మ మను నది యిఁక లేనే లేదు. ప్రతిపురుషుఁడును బ్రతిపక్షుల యెడల దనకుఁ జేత నైనంత వఱకుఁ బ్రతిక్రియ సేసితీఱును. క్రియారూపమున నేమియుఁ జేయఁజాలని వాఁడు మాటలతో నైనఁ బగఁ దీర్చుకొనకుండ నుండ లేఁడు. నందులు తనయెడలఁ గుటిలముగను, నగౌరవముగను బ్రవర్తించిరి; గావునఁ జాణక్యుఁడు వారిని సంహరింపిం

చెను. అల్పులు చేయు ప్రతిక్రియ యల్పముగ నుండును. గొప్పవారు చేయునది గొప్పగ నుండును. గొప్పవారికిని గొలఁదివారికిని గల తారతమ్యమును గ్రహింపఁ గలవారికిఁ జాణక్యచేష్టితములు ప్రతిక్రియలుగనే తోఁచును. చాణక్యుఁడు నందుల యెడలఁ గావించిన ప్రతిక్రియ ప్రబలరక్తపాతరూపమైన దగుటచే రక్తమును గాంచి కండ్లుతిరిగి పడిపోవువారు చాణక్యజీవితము నందలి నైర్మల్యమును గ్రహింపఁ జాలరు. రాజనీతి యన నేమో యెఱుంగని వారు మొదలే గ్రహింపఁ జాలరు.

రాక్షసుఁ డచంచలనందపక్షపాతియై తన ప్రయత్నములను భగ్నము సేయుటకుఁ దీవ్రముగఁ బనిచేసి తన విజయమున కనుభోక్తగాఁ జేయఁ దలంచి యున్న చంద్రగుప్తుని సంహరించుటకుఁ గూడఁ జాలఁ బ్రయత్నములు చేసిన వాఁడే యైనను వాతని యఖండసామర్థ్యమును, నిర్మలస్వామిభక్తిని బట్టువలెఁ గొనడుటయే గాక యాతనిని ముఖ్యామాత్యపదవియందు నిలుపని యెడల మగధరాజ్యమునకును, మహోన్నతము లగు తన విజయములకును, జంద్రగుప్తునకును సుఖస్థితి చేకూర దని నిశ్చయించి యనేకవిధములఁ బ్రయత్నించి తుట్టతుద కా విషయమున లబ్ధవిజయుం డగుటయు, మిత్రునికొఱకుఁ బ్రాణత్యాగమునకుఁ గూడఁ దెగించియున్న చందనదాసుని రాక్షసవశీకరణము పొందెఁ జాల నిడుమలు గుడువఁజేసినను. కట్టకడపట వాతని యోగ్యతకు మెచ్చి ప్రపంచమునందలి గొప్పవర్తకుల కందఱకుఁ దలమానికంబుగాఁ బ్రకటించుటయుఁ జాణక్యుని గుణగ్రహణపారీణతకును సత్ప్రవర్తనమునకును సాక్ష్యములు గాక మానవు.

చాణక్యుని జీవితమున మనము పరిగణింపవలసిన విషయ మేమన? ఆతని జీవితరథము బ్రాహ్మణక్షత్రియ తేజస్సులను రెం డశ్వములచే లాగఁ బడినది. ఆ యశ్వములలో నొకటి యతిశాంత మైనది. రెండవది యత్యుగ్ర మైనది. ఆ రథచక్రములలో నొకటి యాతని యంతరాత్మ; వేఱొకటి చంద్రగుప్తుఁడు. వానిలో నొకదాని మార్గము మంత్రపూతహవిఃపూరితము లగు స్రుక్స్రువములు. రెండవ దాని మార్గము శాణవిమర్దనాతినిశితం బగు నసిధార. ఆత్మవిశ్వాస సంపన్నం బగు దృఢదీక్ష గానికి సారథి. ఇట్లయ్యు శత్రువులు గడగడ వడంక, మిత్రులు మిక్కుటముగ నానందింప, నెల్లరు నద్దిరా! యని నుతింప, నిరపాయముగ నా మహారథము పెద్దకాలము ప్రయాణము గావించి గమ్యస్థలము చేరినది. అహా! చాణక్యోపాధ్యాయుని మాహాత్మ్యము!

చంద్రగుప్తచరిత్రము నవగాహనము సేసికొనుటకుఁ జాణక్య మాహాత్మ్యమును దెలిసికొనుట యెంత యావశ్యకమో, చాణక్య మాహాత్మ్యమును దెలిసికొనుటకు రాక్షసగుణసమీక్షణ మంత యగత్యము. కాని చరిత్రకారులు రాక్షసుని గుఱించి యొకటి రెండు మాటలకంటె నెక్కుడు వ్రాసి యుండలేదు. వా రీతిని చరిత్ర వ్రాయుటకుఁ దగిన యాధారములు లేవని చెప్పెదరు. అయిన నున్నంత చరిత్రమును బట్టి రాక్షసుని గుఱించి యోచించునపుడు ప్రప్రథమమున మన మాతని యచంచలస్వామిభక్తిని గమనింపవలసి యున్నది. చాణక్యుని క్రోధానలమునఁ బడి భస్మపటలము గాకుండ నందవంశమును రక్షించుటకై యాతండు చేసిన ప్రయత్నములను బట్టియుఁ బడిన పాట్లను బట్టియు నాతని స్వామిభక్తి పరిమితిని మనము తెలిసికొన వచ్చును. ఇట్టి స్వామిభక్తి పరతంత్రుని కే దేశ చరిత్రమును

నుదాహరణము నొసంగఁ జాలదు. చాణక్యాచార్యులచే వృద్ధనందుఁడు సంహరింపఁబడిన పిమ్మట నాతఁడు గావించిన కూటప్రయత్నములు మగధరాజ్య రక్షణోద్దిష్టములై యుండిన యెడల రాక్షసుని స్వామిభక్తి, నిర్వ్యాజము కాదని చెప్పుట కవకాశము గలిగి యుండును. కాని యట్టి దేమియు సంభవింప లేదు. రాక్షసప్రయత్నము లన్నియుఁ బర్వతనందుఁడు బ్రతికి యున్నంతవఱకు నందవంశ సంరక్షణమునకును, పిదప స్వామిభక్తిఁ దీర్చుకొనుటకునై యుద్దేశింపఁబడినవి. ఇఁక నాతని రాజభక్తి యమలిన మని చెప్పుట కేమి యభ్యంతరము గలదు? కావుననే విరోధియయ్యు గుణజ్ఞుండగుటం జాణక్యుఁ డాతనిని మిగులఁ బ్రశంసించెను.

ఇట్టి యకృత్రిమ స్వామిభక్తితో నంద సంరక్షణమునకును, జంద్రగుప్త సంహారమునకును రాక్షసుఁడు చేసిన ప్రయత్నము లనంతములు. ఆతఁ డొక్కొక్క యంతరాయము తటస్థించినప్పుడు చూపిన ధైర్యస్థైర్యములు సంస్తవనీయములు. ఒక్కొక్కపుడు ప్రకటపఱిచిన పట్టుదలయు, సమయస్ఫూర్తియుఁ బ్రశంసనీయములు. కల్పనాచాతుర్యంబును, విమర్శనైపుణ్యము నాశ్చర్యకరములు. అయిన నేమి లాభము? అవి యన్నియుఁ బ్రతిహతములై పోయినవి. తుదకు రెక్కలు విఱిగిన పక్షివలె రాక్షసుఁడు చాణక్యుని వలలోఁ జిక్కుకొనియెను.

కార్యసిద్ధికిఁ బౌరుషమే ప్రధాన మగునెడల రాక్షసుని అమానుష యత్నము లన్నియు నట్లు భగ్నములై పోనేల యని యొక పూర్వపక్షము రావచ్చును. రాక్షస ప్రయత్నములు నిరంకుశములు గాలేదు. వానికిఁ జాణక్యుని ప్రయత్నములతో సంఘర్షణము గలిగినది.

అవి చాణక్యప్రయత్నములంత సుదృఢములు గావు. అక్కడితన నాద్వంద్వయుద్ధమునఁ బరాజితము లై పోయినవి.

చందనదాసున కట్టి గతి తటస్థింపదేని మన మింకను రాక్షసు నిచేఁ బన్నఁబడిన మఱికొన్ని కుట్రలను దెలిసికొనియుందుము. తన ప్రతిజ్ఞకు భంగము గలుగుటయేగాక, తా నెవ్వని వినాశము సేయఁ దలఁచెనో వాని నే సాచివ్య మొనరించి యభివృద్ధి నందింపవలసి వచ్చినను రాక్షసుఁడు మిత్రద్రోహము చేయఁజాలక పోయినాఁడు. అతని ఘనత కీయొక్క దృష్టాంతమే చాలును. అయినను జంద్రగుప్తు నకు మంత్రిత్వము నొప్పుకొనిన తరువాత నెట్టిద్రోహమును దలంప కుండుటను గూడ నిచ్చట నుదాహరింపక తీఱదు.

చంద్రగుప్త సంహార విషయికం బగు శపథమును వదలుకొ నుటయేగాక, చంద్రగుప్తుని యాస్థానముననే మంత్రిత్వమును వహించుట యేమిగొప్ప యని సందేహము గలుగవచ్చును. నందులు రూపుమాసిరి. నందవంశము పేరులేకుండఁబోయినది. చంద్రగుప్తుని రాచఱికము స్థిరపడినది. మౌర్యరాజ్యమును బ్రజలందఱు నానంద ముతో దీవించుచున్నారు. తన కెవ్వరును సాయపడక పోవుటయే మౌర్యరాజ్యమునఁ బ్రజలకుఁగల భక్తికి నిదర్శనము. ఇఁక మగధరాజ్య మేరికి ధారవోయుటకు రాక్షసుఁడు చంద్రగుప్తుని సంహరింపవ లెను ? తానే రాజ్యాధిపత్యము వహింపవలెనను కోరిక రాక్షసున కెప్పుడును లేదు. మగధరాజ్యము నిఁకఁ గ్రొత్త ప్రభువు స్వీకరింప క తప్పదు. చాణక్య శిష్యుండగు చంద్రగుప్తుఁ డతిప్రతిభాశాలి ; పరాక్రమశాలి. అతఁడు మగధరాజ్యమును జయించుకొనియెను. అతని ప్రభుత్వము నంగీకరింపక పోవుటకు రాక్షసునకుఁ గారణ

ములు లేవు. ఇఁకఁ జంద్రగుప్తసంహారమునకై యత్నించినచో నాతఁడు రాజద్రోహియై పోవును. ఏమి ప్రయోజనము? చంద్రగుప్తుఁడు దుర్మార్గుఁడు గాఁడు. ప్రజాసౌఖ్యము నాతఁడు తిరస్కరింపఁడు. అట్టి సత్ప్రభువు నెదిరించి యాతనికిఁ గీడు సేయఁదలఁచుట యేమి ధర్మము? చాణక్య చంద్రగుప్తులు తానింకను గుట్టలు పన్ను చుండినచో దేశమునకును దమకును నెమ్మది యుండదనిగదా రాక్షసుని మంత్రిత్వము నంగీకరింపుమని నిర్బంధించిరి? అటులయిన నాతఁ డభిమానశాలి యేని సర్వమును విడిచి యరణ్యమున కేల పోరాదు? ఇదియును నధర్మమే. రాక్షసుఁ డమానుషప్రజ్ఞాధురంధరుఁడు. కార్యనిర్వాహణమునం దతిచతురుఁడు. ప్రజల యెడల దయగలవాఁడు. ఆ తెలివితేటలు నా శక్తి సామర్థ్యములు నరణ్యములో మాసిపోవలసినదేనా? మహాత్ములు తమ జీవితమును వ్యర్థము సేయఁజాలరు. అరణ్యమునకుఁ బోవుటవలన నేమి ప్రయోజనము? అప్పుడాతనినిఁ బరాభవదుఃఖము విడిచిపోదు. అట్లయిన నాతనిచిత్తమునకు శాంతి యుండదు. మోక్షము కలుగనే కలుగదు. అట్లు జీవితము నొరుల కుపయోగపడకుండఁ జేసి తాను చెడి పోయిననేమిలాభము? చంద్రగుప్తుని మంత్రియైనచోఁ బ్రజలకు సుఖము గలిగింపవచ్చును. రాజునకు మంగళము నొదవింపవచ్చును. ఇంతకంటె నుత్కృష్టకార్యమేమి? ప్రతిష్ఠితరాజ్యము నెడల ద్రోహమును దలంపక పోవుట సజ్జనలక్షణము. శత్రువులచేఁ బూజింపఁబడిన రాక్షసుని జీవితమెంత మహోత్తరమైనది!

చంద్రగుప్తుని ప్రవర్తమునఁ బ్రతిపదమునందును మనకు గోచరించునది యప్రతిహతమగు పురుషకారము. చంద్రగుప్తుఁ డచంచల పౌరుషోపాసకుఁడు. కావుననే యాతఁడు చక్రవర్తి గాఁగలిగెను.

నందుల ప్రవర్తనమంతయు దోషభూయిష్ఠము. మనము నందులను గుఱించి యిప్పు డింతకంటెఁ జెప్పవలసినదిలేదు. పర్వతకునకు మంత్రమేగాని తంత్రము తెలియదు. మలయకేతువు రెండును దెలియని పరప్రత్యయనేయబుద్ధి. ఇందుశర్మ మహాతాంత్రికుఁడు. ఆతఁడు చేసిన కుట్రలన్నియు ఫలించినవి. అవియన్నియు నాశ్చర్యకరములు. అలెగ్జాండరు గొప్ప మాంత్రికుఁడే. గొప్ప తాంత్రికుఁడే. కాని యాతని కంగబలము చాలినది గాదు. వచ్చునప్పుడే కత్తి విసరఁ దొడంగుటవలన నీ దేశములో నాతని కది సాధ్యమైనది గాదు. సెల్యూకసు మంత్రతంత్రములలోఁ జక్కని జ్ఞానములేని సాహసికుఁడు. ఆతఁడు తగిన ఫలము ననుభవించెను.

శ్రీరస్తు

వీరపూజ

ప్రథమభాగము

పృథివిరాజు

శాలివాహనశకము పండ్రెండవ శతాబ్దప్రారంభమున నుత్తర భరతవర్షమున మహోన్నతస్థితిలో నున్న సంస్థానములలో ఢిల్లీ, అజమీరు, కన్యాకుబ్జము, చిత్తూరు, నబూగడము, ననిహిలపురము ననునవి ముఖ్యమైనవి. అందు ఢిల్లీ సంస్థానమును దువరవంశజుఁ డగు ననంగపాలుఁడును, నజమీరు సంస్థానమును జవహువాన్వంశజుఁ డగు పృథివీరాయఁడును, కన్యాకుబ్జరాజ్యమును రాఠోడ్వంశజుఁ డగు జయచంద్రుఁడును, జిత్తూరు సంస్థానము (మేవాడు రాజ్యము)ను గుహలోద్వంశజుఁ డగు సమరసింహుఁడును, నబూగడమును బరమారవంశజుఁ డగు జైతుఁడును, ననిహిలపురమును, జాళుక్యవంశజుఁడును ఘూర్జరాధీశుఁడు నగు భోలాభీముఁడును బరిపాలించుచుండిరి.

వీరందఱును సర్వతంత్రస్వతంత్రులు. అతులితపరాక్రమ భూషితులు. అయినను వారిలో వారు పరస్పర మంతస్తాపములు గలిగి యుండిరి. ఒకరినిఁ జూచి యొక రోర్వలే కుండిరి. తమలోఁ

దా మట్లుండుట చాల సహాయకర మని యెక్కఁడును భావింప లేదు. ఇతరులలో నిది మంచిది గా దని తెలిసినవారును, దెలిసినచో వారిలో వారికి స్నేహబాంధవము నొనగూర్చుట మంచి దని తలంచి యట్లు గావింపఁ బ్రయత్నించిన వారు నున్నట్లు తోఁపదు. పరులెవ రైన నట్టి ప్రయత్నములు గావించినను లాభము లేక పోయి యుండును. మూర్ఖులకుఁ బోలె నట్టి విజ్ఞానవంతుల కట్టింతఃకలహము లేల కలిగి యుండవలెనో తెలియదు.

వీరిలోఁ గొందఱు పరస్పర బాంధవమును గూడఁ గలిగి యున్నారు. ఆ చుట్టఱికమును బట్టియైన వా రైకమత్యమును పరకు సేయ లేదు. ఒక రిద్దఱి కంతెగా నంతస్తాపములు లేక పోవచ్చును; గాని మొత్తము మీఁదఁ జెప్పవలసి వచ్చునపుడు వీ రొకరి నొకరు గౌరవించుకొనుట కంగీకరింపని వా రని నిరాఘాటముగఁ జెప్ప వచ్చును.

వీ రందఱిలో దిల్లీనాయకుం డగు ననంగపాలుఁడు వృద్ధుఁడు. ఈతని కాలమునందే హస్తినాపురమునకు దిల్లీ యని పేరు వచ్చెను. ఎంత సమర్థుఁ డైనను వార్ధకము దిగఁదీయుచుండుటవలన నాతఁడు పరిపాలనాభారమును దప్పించుకొని విశ్రాంతి కొఱకు బదరికావనమునకుఁ బోవఁ దలంప సాగెను.

అయిన నీ భూభార మంతయు నేరిపైఁ బెట్టవలయును? ఆతనికిఁ బుత్రసంతానము లేదు. ఇరువురు కుమార్తెలు మాత్ర ముండిరి. పెద్ద కూఁతు రగు కమలాదేవి నజమీరుసంస్థానాధీశుఁ డైన సోమేశ్వరునకును, రెండవకొమార్తెను గన్యాకుబ్జాధీశ్వరుఁ డైన విజయపాలునకు నిచ్చెను. ఇందుఁ బెద్దకూఁతురు కొడుకు పృథివీరాజు.

చిన్నకూఁతురు కొడుకు జయచంద్రుఁడు. ఈ దౌహిత్రు లిరువురే యనంగపాలుని రాజ్యాధికారమున కుత్తరాధికారులై యుండిరి.

తన సంస్థానమును ముక్కలు గావించి మనుమల కిద్దఱకును బంచి యిచ్చుట కనంగపాలున కిష్టము లేక పోయెను. ఈ రాజ్యమంతయు నొక్కఁడే పాలింప వలయు నని యాతని యభిలాష. అట్లయిన నా యిరువురు దౌహిత్రులలో నెవరి యధికారము నెవరు వదలుకొందురు? సంస్థానమును విభాగింపకున్నచో నిరువురు మనుమలలో నొకఁ డనిష్టుఁ డగును. అంతియ కాదు. వారిలో వారు పరస్పరవినాశము నపేక్షింతురు. అనంగపాలున కప్పు డేమి గతి?

దిల్లీరాష్ట్రము విభాగింపఁబడ కున్నచో నీ సంశయము తీఱు నది గాదు. ఇది యంతయు నా వృద్ధుఁడు శోధించుకొనియే యుండును. దీని కేమి ప్రతీకార మూహించెనో యాతనికే యెఱుక. తన తరువాత ననంగపాలుఁడు దిల్లీరాజ్యమునకు సుస్థితిఁ గోరెనో వినాశము గోరెనో చెప్పఁ జాలము. దౌహిత్రుల నిరువురను సమానముగాఁ జూడకున్న లోకు లే మని పోదురో యని యాతనికి జంకు పొడమెనో లేదో వివరింపఁ జాలము. కాని యా వృద్ధుఁ డొక శుభముహూర్తమున నత్యంతసంతోషముతో దిల్లీరాజ్యమునకు బృథివీరాయనిఁ బట్టాభిషిక్తునిఁ గావించి నిశ్చింతతో విశ్రాంతి కొఱకు బదరికావనమునకుఁ బోయెను.

పుత్రు లెందఱున్నను జ్యేష్ఠపుత్రుఁడే రాజ్యాధికారి. అట్లగుట ననంగపాలుఁడు పెద్దకూఁతురు తనకుఁ బెద్దకుమారుఁడే యని భావించెనేమో. ఆతఁ డట్లు భావించెనేని బృథివీరాయనికి రాజ్యమిచ్చుట న్యాయ్యమే. కాని జయచంద్రున కట్టి భావన యనౌచిత్యముగాఁ దోఁచుట సహజము.

అనంగపాలుఁడు ఢిల్లీరాజ్య మంతయు బృథివీరాయనికిఁ బట్టము గట్టె నని వినినపుడు జయచంద్రుని హృదయక్షేత్రమునఁ బరాభవోద్భూతమై క్రోధాగ్ని హఠాత్తుగ నెగసెను. అతని తల్లి తన తండ్రి చేసిన యన్యాయ్యమునకుఁ జాల వగచి యూరకుండెను. కాని జయచంద్రుఁడు మాత్ర మట్లు సేయక యనంగపాలునియెడలఁ జాలఁ దిరస్కారభావము దాల్చుటయే గాక, పృథివీరాజు నెడలఁ బ్రబలవిరోధభావము వహించెను.

దాతపైఁ గినిసినఁ గినియవచ్చును. కాని ప్రతిగ్రహీతపైఁబగఁ బూను టేటి ధర్మము? అనంగపాలుఁ డిచ్చినఁ బుచ్చుకొనియెఁ గాని ఢిల్లీ రాజ్య మంతయుఁ దనకే కావలె నని పృథివీరాజు కోరియుండ లేదు గదా? ఇఁక జయచంద్రున కాతనిపైఁ గోప మేల? ఇచ్చిన వాఁడును, బుచ్చుకొనిన వాఁడు నగుట ననంగపాలుఁడును, బృథివీ రాజు నొకటియే యని యాతని భావము. శత్రుని మిత్రుఁడు తనకు శత్రువు. కావున జయచంద్రున కనంగపాలునితోఁ బృథివీరాజు గూడ విరోధియే. విరోధి నుపేక్షించి యుండ రాదు. కావున జయ చంద్రుఁడు పృథివీరాయనిపైఁ బగఁ దీర్చుకొనుటకు సమయము నిరీక్షింప సాగెను.

పగఁ దీర్చుట యనఁ గత్తియుఁ గత్తియుఁ గలుపుట యని యర్థము. దానివలన నెంత రక్తపాత మగును? ప్రజల కెంత సంక్షోభము కలుగును? అయిన నేమి? పూర్వకాలమున భరతవర్షమున నిట్టి ప్రసంగము లేవి తటస్థించినను గత్తియే యాధారము. ఇప్పుడో; అట్టి క్రూరకృత్యములతో నవసరము లేదు. ఎట్టి వివాదములు సంభవించి నను శాంతికి భంగము కలుగకుండఁ జక్కఁగఁ దీర్పు వా రిప్పుడు

కలరు. ఇట్టి యదృష్టము నా కాలపు భారతరాజు లెఱుఁగనే యెఱుఁగరు.

జయచంద్రుఁ డిట్టి సంకల్పముతో నున్నాఁ డని వినినపుడు పృథివీరాజు గూడ జయచంద్రుని యెడల విరోధిభావమును దాల్చెను. ఆతని కట్టు సేయుట తప్పని దయ్యెను. ఈ రూపమున నా యక్కచెల్లెండ్ర కుమారు లిరువురును బరస్పరవినాశమునకై యుద్ధమునకుఁ దగు ప్రయత్నములను జేయుటలోఁ బ్రవృత్తులైరి. అదృష్టవశమున వేఱొక పెద్దరాజ్యము సంక్రమించు రూపమునఁ దన యంగబలము నర్థబలము నిబ్బడి యగుటం జేసి పృథివీరాజు యుద్ధసన్నాహములను జేయుటయం దంతగాఁ దదేకదీక్షతో నుండ లేదు; గాని జయచంద్రుఁడు కాల మంతయు దానియందే వినియోగింప సాగెను. పృథివీరాజు, "సామంతరాజులతో సముఁ డగు నీ యసూయావిదగ్ధుఁడు నన్నేమి సేయఁ గలఁ"డని గర్వముతో నవ్వుకొన సాగెను.

అక్కచెలియండ్ర కొడుకు లగు నీ యన్నదమ్ము లిరువురు నిట్టి స్థితిలో నున్న సమయమున నబూగడమును బాలించు జైత పరమారుఁడు, నవలావణ్యవతియై యున్న తన కుమారిత యిచ్ఛనీ కుమారికి వివాహముఁ జేయ వలయు నను తలంపుతో నామె కనురూపుఁ డగు వరునిఁ జూచుచుండెను. ప్రముఖు లగు రాజు లెల్లరు నంతః కలహములలో నున్న యీ కాలమునఁ బ్రసంగము వచ్చినచో నందఱను జయింప సమర్థుఁ డగు రా జెవ్వఁడా యని యాతఁడు పరిపరివిధముల నాలోచించుకొని, తుట్టతుదకు రెండు రాష్ట్రముల కధీశుఁడై యున్న పృథివీరాజు తన కూఁతునకుఁ దగిన వాఁ డని నిశ్చయించుకొనియెను.

ఇచ్ఛనీకుమారికిఁ దగిన వరు నన్వేషించుచున్నాఁడని విని యనిహిలపురాధీశుఁ డగు భీముఁ డామెయందు బద్ధానురాగుఁడై, యామెను దన యంతటి వాని కిచ్చుటకు జైతుఁడు సందేహింపఁ డని యూహించి వర్తమాన మంపెను; గాని యంతకు మున్నే జైతుఁడు తన తనయకు వరుని నిశ్చయించుకొని యున్న వాఁడు గావున "నీ కీయఁ జాల" నని భీమునకుఁ బ్రత్యుత్తర మంపి వేసెను. అంత నాశాభంగము వలన సంక్షుభితమనస్కుఁడై జైతుఁడు తన్నతి నీచముగా నగౌరవపఱిచె నని క్రోధపరవశుఁడై భీముఁ డాతనిపై యుద్ధమును బ్రకటించెను.

జైతుఁ డిది యంతయు విని భీముని చేతకుఁ దనలో నవ్వుకొని, తన మనోనిశ్చయమును, భీమోద్యోగమును దెలుపుచు, వెంటనె వచ్చి యిచ్ఛనీకుమారినిఁ బరిగ్రహింపు మని పృథివీరాజునకు వర్తమానము చేసెను. పృథివీరా జంతకుఁ బూర్వమే యిచ్ఛనీకుమారి రూపలావణ్యాతిశయములను విని యామె యెడల ముగ్ధుఁడై యుండెను. అయిన నామెను దన కిమ్మని జైతునకు వర్తమాన మంపినచోఁ దన ఘనతకు లోప మని భావించి యామెతో విలాప ముగఁ గాలము గడప నువ్విళ్లూరుచు గుట్టుగా నుండెను. అట్టి వాఁ డగుటం జేసి యాతఁడు జైతుని యాహ్వానము నంగీకరించి యాతనికి సాయము సేయుటయే ముఖ్యకారణముగాఁ బ్రకటించి, చతురంగ బలముతో బయలువెడలెను.

చాళుక్యభీమునకు, జైతుఁడు తన్ను నిరాకరించుటచే నాతని నోడించుటయు, నిచ్ఛనీకుమారినిఁ గైకొనుటయునే ప్రథమోద్దేశము లుగా నుండెను; గాని జైతునకుఁ బృథివీరాజు సాయము వచ్చుట

విని, యిచ్ఛినీకుమారి నిచ్చుటకు జైతుండును గ్రహించుటకుఁ బృథ్వీరాజును కృతనిశ్చయులై యున్నారని తలంచి పృథ్వీరాజపరాభవము గూడఁ గావింపవలె నని నిశ్చయించుకొని యతిరభసంబున వచ్చి యబూగఢసైనికులను దాఁకెను.

ఇరుతెగలవారు నత్యుత్సాహముతోఁ దలపడిరి. శత్రుసైనికులు సంఖ్యయం దధికముగ నున్న కారణమున, జంకు వొడమి పాఱిపోకుండుటకును, నధికోత్సాహముతోఁ బోరుటకును భీముఁడు తన సైనికులను యుద్ధరంగము నుండి కదలకుండ బహుమతులను నాశాపాశముచే దృఢముగఁ గట్టి వైచెను. ఢిల్లీసైనికులు పృథ్వీరాయని యాధిపత్యము క్రిందికి వచ్చిన తరువాత నిదియే తమ పరాక్రమ ప్రదర్శనమునకుఁ బ్రథమప్రయత్నమగుట నాతని యాదరమును సంపాదింపఁ గోరి శక్తికి మించి పోర సాగిరి. ఢిల్లీఫౌజుల సాయంబున జయము గాంచె నను నపకీర్తి కలుగకుండవలె నని యజమీరు దండు మిగుల సాహసముతోఁ బోర సాగెను. ఇచ్ఛనీకుమారినిఁ బడయఁ గోరి పృథ్వీరాజు తన యఖండచతురంగబలముతో వచ్చి సాయము సేయకున్న గుజరాతిసైనికుల ప్రతాపానలమునఁ బడి మ్రగ్గిపోయి యుందు రని ప్రజలు తలంపకుండ నుండఁ గోరి యబూగఢసైనికులు గూడ నతినైపుణ్యముతో శత్రుసంహారమును గావింపఁ దొడఁగిరి. ఇట్లీ యుద్ధము చాల ఘోరముగ జరిగెను. అనేకయోధులు మడిసిరి. రక్తము కాల్వలు గట్టి ప్రవహించెను. తుట్టతుద కనిహిలపురసైనికులు పలాయనము చిత్తగించిరి. భీముఁడు తిరిగి చూడకుండఁ బాఱిపోయెను. పృథ్వీరాజు జైతునకు విజయలక్ష్మి నొసంగి తా నిచ్ఛనీకుమారినిఁ బుచ్చుకొనియెను.

మే మనేక రాజపుత్రికల పరిణయకథలను విని యున్నాము. కాని రక్తపాతము లేకుండ జరిగిన వివాహము లొకటి రెంటికంటె నెక్కుడు విని యుండ లేదు. అనేక వివాహములయందు వరులు కురుకులకాంతారదవానలుం డగు భీమసేనుఁడు దుర్యోధనరక్తముచే నార్ద్రము లగు కరములతో యాజ్ఞసేని పెన్నెరులను ముడిచినట్లు వైరివీరుల రక్తముచే నార్ద్రము లగు చేతులతోడనే వధూకంఠసీమలయందు మంగళసూత్రములను ముడివేయుట తటస్థించుచు వచ్చినది. దంపతుల ప్రబలానురాగమునకును, దన్మూలమున ననంతసౌఖ్యసంతోషములకును గారణము లగు నన్న స్వయంవరసమావేశములన్నియు రణరంగములుగనే మాఱి పోయినవి. కొన్ని సమయములయందు వధువు బంధువులును, మఱికొన్ని యెడల వరుని బంధువులును గూడ మడియుటగాని జర్ఝరితాంగు లగుటయో గూడఁ దటస్థించుచు వచ్చినది. మఱి కొన్ని యెడలఁ బెండ్లికూతుండ్రు సైతము కత్తి పట్టవలసి వచ్చె. ఒకపుడు వధువు గోరిన వరుఁడు సమయుటయు, మఱియొకపుడు వధువే గతించుటయుఁ గూడ సంభవించినవి. ఒక రాజు తన కూఁతు నిరువురు రాజులు కోరుటచే నం దేరికిచ్చుటకును సాహసింపలేక స్వయముగ నామెను విషమిచ్చి చంపుకొనియెను. ఒకప్పుడు పెండ్లియైన పిదప వరుఁడు పెండ్లికూఁతును దన పట్టణమునకుఁ దీసికొని పోవుచుండఁగా విఫలమనోరథు లగు రాజపుత్రులు కొందఱు మార్గమున నడ్డుపడి వధూవరుల నిరువురను గూడఁ బరలోకమున కంపివైచిరి. ఇంకొక యప్పు డొక వధువు తన కొఱకు కాసపడి వచ్చిన క్షత్రియకుమారులు మార్గమధ్యమున నడ్డుకొని తనభర్తనుఁ బరలోకమున కంపివేయ నామె యిఁక వైధవ్యజీవితము భారమై పోయె నను నిర్వేదముతో నొకచేయి పుట్టినింటి[illegible]

రికిని, వేఱొక చేయి యత్తింటివారికిని జ్ఞాపకార్థ మంపి స్వయముగ నసురుఁబోసెను. వేఱొకపు డిరువురు రాజు లొక రాచకన్నెను మోహించి విరోధపడి తమ జీవితకాల మంతయు యుద్ధరంగముల యందే గడిపివైచిరి. ఇట్టి యుదాహరణము లనేకము లున్నవి. రాజుల కిది సహజమా? లేక గౌరవమా?

అట్లు పాఱిపోయిన భోలాభీముఁడు జైతపరమారునిఁ బృథివీరాయని గెలుచుటకు మఱల నుపాయములను బన్న సాగెను. అతఁ డిచ్ఛనీకుమారీపృథివీరాయల దాంపత్యమున కెన్నఁటికైన నెట్లయిన విఘాతము గలిగింపవలె ననియు, నల్లుని బలము చూచుకొని మత్తెక్కి యున్న జైతు నెన్నఁటికైన సంహరించి తీఱవలె ననియు దృఢసంకల్పము గావించుకొనియెను. మఱియు, నంత పని తనయొక్కని వలననే నెఱవేఱఁ జాల దనియుఁ దనకు సాయము సేయఁగల రాజెవఁడా యనియు, నంతటి సమర్థత గల వారిలోఁ బృథివీరాయని ప్రాఁతశత్రువు లెవరైన నున్నారా యనియుఁ జూడసాగెను.

ఇది యిట్లుండ నిచ్ఛనీకుమారి కొఱకైన మహాసంగ్రామవార్తను, భోలాభీముని పలాయన వృత్తాంతమును, దిల్లీశ్వరుని విజయప్రసంగమును, విని జయచంద్రుఁడు చాలఁ గంటగించుకొనియెను. మఱియు, వాఁ డిట్లే యౌదాసీన్యము వహించి యూరకున్నఁ బృథివీరా జింకను బలాధికుం డగు ననియు, నప్పుడు గోటఁ దీర్పఁదగినది గొడ్డంటఁ దీర్ప వలసి వచ్చు ననియుఁ దలంచి, పృథివీరాయనిపై దండెత్తుటకుఁ జాలఁ దీవ్రముగఁ బ్రయత్నించుచు, నీ సందర్భమున దిల్లీశ్వరుని వైరి యగు భీమునితో స్నేహము సేయుట ముఖ్యావసర మని తలంచి తద్విషయిక ప్రయత్నములు గూడఁ జేయ సాగెను.

మహావీరుఁ డగుటను, ఢిల్లీశ్వరుని వైరి యగుటను జయచంద్రునితో మైత్రి నెఱపుట యావశ్యక మని తలంచి భీముఁడు సైతము తత్ప్రయత్నములోఁ బ్రవృత్తుఁ డయ్యెను. పరస్పర స్నేహము కొఱకు వాంఛించి యున్న యా యిరువురును శీఘ్రకాలమున నభీష్టసిద్ధి వడసిరి. ఈ సమయమునఁ బృథివీరాజునకు నాగపురము నొద్ది ఖటుపురమునం దొక గొప్ప నిక్షేపము దొరకుటయుఁ, జందేలు రాజుతో యుద్ధము పొసఁగి యందు జయలాభము గలుగుటయుఁ గూడ సంభవించెను. ఇది విని భీమజయచంద్రులు మఱింత తల్లడిల్లిరి.

పిదప వా రిరువురును దమ బలాబలములను గుఱించియు, వైరి బలాబలములను గుఱించియు విచారణ ప్రారంభించిరి. మాళవ యగుట జైతపరమారుఁడును, భావుకుం డగుట మేవాడు రాజ్యాధీశ్వరుం డగు సమరసింహుఁడును, మఱికొందఱు సామంతరాజులు నవశ్యము పృథివీరాజునకు బాసటై వత్తురని నిశ్చయించుకొని యందఱను దాఁకుటకుఁ దమకు శక్తి కలదా యనియుఁ, దమ కెవ్వరు సాయము వత్తురనియు యోచించుకొనిరి. కాని వారి కెందును సాహాయ్యము గాన్పింప లేదు. ఒక రిద్దఱు చిన్న రాజులు దక్కఁ దక్కినవారెల్లరు నా యాయి కారణములను జెప్పి వారి యాహ్వానమును నిరాకరించిరి.

ఒక రిద్దఱు రాజుల సాహాయ్యములో వారికిఁ దృప్తి గలుగ లేదు. ఇఁక నొక మహావీరుఁ డెవ్వఁ డైన సాయపడకున్నఁ దమ కపజయము తప్ప దని తలంచి వారు దేశ మంతటను దృష్టిఁ బఱపి చూచిరి; గాని భారతీయుఁ డైన వాఁ డెవ్వఁడును ఢిల్లీశ్వరునితోఁ బోరుట కంగీకరింప లేదు. వెంటనే వారి దృష్టి హిమాలయపర్వత

ము నను భేదించుకొనిపోయి గురుపఖ్తానమునందలి గజ్నీపట్టణ
ముపైఁ బడెను. అప్పు డా పట్టణమును గ్యాసుద్దీను శహాబుద్దీ
నను గోరీవంశజు లగు నిరువు రన్నదమ్ములు కలిసి యతిమైత్రితో
బరిపాలించుచుండిరి. వా రిరువురును శౌర్యసాహసములయం దసా
మాన్యు లని పేరు వడసియుండిరి. మఱియు వా రఖండవాహినీపరి
వృతు లగుటఁ జూచి వారి సాహాయ్యంబున ఢిల్లీశ్వరుని విలాసమా
త్రమున గెలువ వచ్చు నని తలంచి భీమజయచంద్రులు వారి సాయ
మును గోరిరి.

ఈ యాహ్వానము వచ్చుటతోడనే యా యన్నదమ్ము లిరు
వురు నుప్పొంగి పోయిరి. ఇంతకుఁ బూర్వము వారు భరతవర్ష
మసారము లగు ధనరాసులకు నిలయ మనియు, మున్ను గజ్నీ మహ
మ్మ దనేకపర్యాయములు భారతదేశము నతిసులభముగ దోచుకొని
యనంతధనసంపత్తినిఁ దీసికొని పోయె ననియుఁ దెలిసి యున్న
వా రగుటం జేసి భారతదేశము నెప్పుడు ముట్టడింతుమా యని సమ
యము కొఱకు నిరీక్షించు చుండిరి. అక్కతన నీ యాహ్వానము వచ్చు
టతోడనే యందుల కంగీకరించి, యసంఖ్యాసైనికులను గూర్చుకొని
శహాబుద్దీనుఁడు, పృథివీరాయుని జయించుటకును, భారతదేశమునఁ
జంద్రధ్వజమును నెలకొల్పుటకును, భీమజయచంద్రులకు సాయము
చేయుట కని వంక పెట్టి వచ్చి చేరెను.

భీమజయచంద్రులు శహాబుద్దీనుని సాయము గోరి రని విని
యభిమాననిధాను లగు రాజులు కొందఱు వారినిఁ జాలఁ దూల
నాడిరి. దేశీయు లెల్లరును జాలఁ గటకటం బడిరి. పృథివీరాజు
చాల నొచ్చుకొనియెను. రాజ్యతంత్రజ్ఞు లిది దేశవినాశకం బగు

ప్రయత్న మని మిగులఁ దల్లడంపడిరి. అంతకు మున్నొకప్పుడు పండ్రెండు తడవలు దండెత్తివచ్చి భారతదేశమున గజ్నీమహమ్మదను తురుష్కుఁడు చేసిన రాక్షసకృత్యములను వృద్ధస్త్రీల వలన నాలకించి భారతరమణీమణు “లభిమానహీను లగు భీమజయచంద్రులు నాశమై పోదురు గాక” యని శపింప సాగిరి. మొత్తము మీఁద నత్తురుష్కుని రాక విని భారతీయు లాబాలగోపాలమును జాలఁ గలవరం పడసాగిరి.

కొందఱు రాజులకు భీమజయచంద్రులపైఁ జాల నాగ్రహము వచ్చెను. వారియందెల్లఁ జిత్తూరు దుర్గాధీశ్వరుం డగు సమరసింహుఁడు ముఖ్యుఁడు. అతఁడును మఱికొందఱు నీయకృత్యముకొఱకు భీమచంద్రులకుఁ దగిన శిక్ష సేయ వలయు నని పృథవీరాజునకు సాయముగా వచ్చిరి. యుక్తసమయమున నుభయపక్షములకును యుద్ధము పొసఁగెను. స్థలసంకోచమువలన మే మీ యుద్ధమును విపులముగ వర్ణింపఁ జాలము. చాల ఘోరముగ జరిగెను. కొసకుఁ బాపము! భీమజయచంద్రులకుఁ బరాజయము తప్పినది కాదు. వారు పాఱిపోయిరి. శహాబుద్దీనుగోరి పృథవీరాజుచేఁ జెఱఁ బెట్టఁ బడియెను.

ఈ వార్త నిముసములో దేశ మంతయు వ్యాపించి దేశీయుల నెల్లర నానందసాగరమున నోలలాడించెను. వారు కేవల మా యనిందితానందము ననుభవించుచు నూరకుండ లేదు. కొంద “ఱీ మానవాధములకుఁ దగిన ప్రాయశ్చిత్త మైన” దనిరి. మఱికొందఱు “న్యాయ్య మోడిపోవునా”? యనిరి. ఇఁక నొక కొందఱు “దుష్టు లగు భీమజయచంద్రులను గూడఁ జెఱ పెట్టుట ల” గ్గనిరి. వేఱొక కొందఱు

"ముం దీ తురుష్కాధముని సంహరించి వేయ వలె" ననిరి. అందఱును బృథివీరాయుని, దత్పక్షమునఁ బనిచేసిన వారిని మిగులఁ గొనియాడిరి.

పిదపఁ బృథివీరాయఁడు చెఱపెట్టఁబడిన గోరీని వెంట నిడుకొని, యా మహాయుద్ధమున నత్యద్భుతముగఁ బోరిన సమరసింహాది వీరులను గూడుకొని మహావైభవముతో దిల్లీపట్టణము ప్రవేశించెను. పౌరు లెల్లరు నెదురుగఁ జని సగౌరవముగ వారికిఁ బురప్రవేశము సేయించిరి. పౌరకాంతలు సౌధోపరిభాగముల నుండి పుష్పవర్షము గురిసి వారి యానందమును బ్రవృద్ధము గావించిరి.

పృథివీరాజు నాఁడు కొలువుదీర్చి పౌరుల నెల్లరను దగునట్లు లాలించెను. సైనికులకు వారివారి కర్హములగు బహుమతుల నొసంగెను. సేనానాయకులను, గుఱ్ఱములు, యేనుఁగులు, జాగీరులు, ఖడ్గములు మున్నగు పసదనముల నొసంగి గౌరవించెను. సాయము వచ్చిన సమరసింహుఁడు మున్నగు రాజులను జయ మంతయు మీదే యని కొనియాడి చాల బహూకరించెను. నాఁటి కొలువుకూటము వివిధములగు నత్తరు సువాసనలచే మివుల గుబాళించెను. దేశమం దంతట నొక్క మహానంద తరంగము వీచెను.

ఇట్లు కొన్ని దినములు గడచిపోయిన పిదపఁ గారాబద్ధుం డగు గోరీ తా "నజ్ఞానము వలన భీమ జయచంద్రుల పక్షమునఁ బోరాడితి" ననియు, "నీ ప్రథమాపరాధమును సైఁచి విడిచి పుచ్చవలె" ననియుఁ బ్రార్థనాపూర్వకముగఁ బృథ్వీరాజునకుఁ దెలియఁ జేసెను. దానిపైఁ బృథివీరాజు సమక్షమున మాట లాడుటకు గోరీ కవకాశ మొసంగెను. పిదప నిరువురకు నేమి సంభాషణము

జరిగెనో, గోరి ప్రార్థనము మీఁదఁ బృథివీరాజున కేమి తోఁచెనో తెలియదు; గాని యాతఁ డెనిమిది వేల గుఱ్ఱములను దీసికొని గోరిని విడిచి పెట్టెను. బ్రతుకు జీవుఁడా యని గోరి స్వదేశమునకుఁ బోయెను.

ఇటుఁ జేఁ జిక్కిన వైరి నిట్లు విడిచిపుచ్చుట నీతియా యను నొక సందేహము గలుగుచున్నది. రాజ్యతంత్ర విశారదులు దీని కేమి ప్రత్యుత్తరము చెప్పెదరో తెలియదు. పృథివీరాజు పొరబడె నేమో యనుటకు మఱియొకప్పుడు "సముద్రశిఖర" మను పట్టణమునకుఁ బోయి వచ్చుచు మఱల శహాబుద్దీను గోరిచేత నే యెదిరింపఁబడి, యా యుద్ధమున లబ్ధవిజయుం డగుటయు గాక, గోరినిఁ జెఱపట్టియు నసంఖ్యధనమును దీసికొని మఱల వానిని విడిచిపెట్టెను. అంతటితో నూరకుండక యిట్లే యా గోరివలన నింక నైదు తడవలు మార్కొనఁ బడి వానినిఁ జెఱపట్టియు విడిచిపెట్టెను. గోరివలన నన్ని తడవలు నసంఖ్యధనరాసులను గైకొనుట మాకు సమ్మతమే; గాని కరుణించి విడిచిన కొలఁదిఁ దిరుగఁ బడు వానిని విడుచుటను గుఱించియే సందేహము. అట్టివానివలన ధనము గైకొనుటయే నీతి యగునా? దీనముగఁ బ్రార్థించినపుడు విడుచుట ధర్మ మందు లేని నా విషయమున మేము మాట్లాడఁ జాలము; గాని సందిగ్ధము లగు రాజకీయ విషయముల యం దట్టి ధర్మమును బాటించుట లగ్గని మే మంగీకరింపఁ జాలము. ఏడు పర్యాయములును గూడ గోరిని విడుచుటలోఁ బృథివీరాయని యాస్థానమున నున్న మంత్రి మున్నగు రాజ్యతంత్రధురీణుల యభిప్రాయము లెట్లుండెనో చరిత్రములవలనఁ దెలిసికొనఁ జాలము.

x

ఈ రెండు దండయాత్రల యందును గోరీ కసంఖ్యాధన నష్టము, సమితబలనష్టమును గూడఁ గలిగెను. మాననష్టము ప్రప్రథమమునందే కలిగెను; గాని ధైర్య నష్టము మాత్ర మెంత మాత్రమును గలుగలేదు. కావున నాతఁ డెట్లయినఁ బృథివీరాయని జయించి భారతదేశమునఁ దురుష్క సామ్రాజ్యమును స్థాపింపవలె నని దృఢదీక్షను దాల్చెను. ఆ యభిప్రాయముతో నాతఁడు భారతదేశాధీశ్వరుల రహస్యములను దెలిసికొనుటకును వీలయినపుడు వారిలో వారికి నంతఃకలహములు గలిగించుటకును, బైరాగి, గోసాయి మున్నగు వేషములతోఁ దన చారులను నియమించెను.

ఏమో సాయము సేయు నని కొండంత యాశపడి తీసికొని వచ్చిన గోరీ యిట్లేడు పర్యాయములు పరాజయము నంది నెత్తిపై ముసుఁగు వైచుకొని పోవుటచే భీమజయచంద్రులు కొంతకాలము వఱకు యుద్ధమును మానియుండఁ దలచుకొనిరి. కాని తనకును, బృథివీరాజునకును సార్వభౌమాధికారమును గుఱించి వివాదము గలిగి యున్నందునఁ దానే సార్వభౌముఁడ నని ప్రకటించుటకు జయచంద్రుఁడు రాజసూయయాగము సేయ సంకల్పించుకొనియెను. మఱియు, నా యాగమునందే తన కూఁతురు సంయుక్తకు స్వయంవరము సేయవలయు నని గూడ నిశ్చయించుకొనియెను.

యుక్తసమయమున రాజసూయయాగమునకు వలయు సాధనసామగ్రి యంతయు సమకూర్పఁబడెను. చుట్టములు, పక్కములు, సామంతులు, స్నేహితులు, నాశ్రితులు మున్నగు వా రెల్లరును జనుదెంచిరి. వేదవేదాంగములయం దసామాన్యు లని విఖ్యాతి వడసి జయఘంటలం గట్టుకొనిన విద్వత్ప్రకాండు లనేకు లాహూతులై

వచ్చి చేరిరి. పట్టణ మంతయు జనసంకులమై పోయెను. ముహూర్తము సమీపించెను. మంగళస్నానము గావించి ధర్మపత్నీద్వితీయుఁడై బ్రాహ్మణశ్రేష్ఠుల వేదఘోషములతో మిళితములై, సామంతాదుల జయఘోషములు బ్రహ్మాండ మంతయుఁ బ్రతిధ్వను లీనుచుండ జయచంద్రుఁడు యజ్ఞశాలను సమీపించెను. కాని యిది యంతయుఁ దన చారుల మూలమున నెఱింగి పృథివీరాజుఁ డా యాగమున కంతరాయము గలిగింపఁ దలఁచి జయచంద్రుని సన్నిహితజ్ఞాతి నొకనిం జంపి యీ వార్త నాయజ్ఞశాలచెంతఁ బ్రకటన సేయించెను.

పృథివీరాజు, సన్నిహితజ్ఞాతినిఁ జంపి జయచంద్రుని యాగమునకు విఘాతము గలిగించుటఁ గూడ మాకుఁ జాల నాశ్చర్యమును గొలుపుచున్నది. ఇట్లు వ్రాయుటకుఁ జరిత్రకారుల కేమి యాధారము లున్నవో తెలియదు. మే మిది కేవల మబద్ధమని చెప్పుటకు సాహసింప లేము; గాని, యనేకపర్యాయములు తన ధాటి కోర్వఁ జాలక పాఱిపోయిన జయచంద్రుని యాగమును భగ్నము సేయఁ బృథివీరా జట్టి నీచపుఁ బని కొడిగట్టుట కవసర మేమి వచ్చెనో యూహింపఁ జాలకున్నారము. రాజుల నందఱను జయించి, వారినుండి కప్పములను గొనిగదా రాజసూయము సేయవలసినది? జయచంద్రుఁ డట్టి ప్రయత్నము లేవియుఁ జేసినట్లు కాన్పింపదు. జయచంద్రుని రాజసూయమును విచ్ఛిన్నము సేయుటకుఁ, బృథివీరాజు తనయఖండదోర్వీర్యము వలనను బూనుకొనవచ్చును. పూర్వవైరమును బురస్కరించుకొనియు సిద్ధపడవచ్చును. కాని యుద్ధము చేసి దానిని ధ్వంసము సేయవలయునే గాని మానాభిమానములు లేని సామాన్యజనులు చేయు నిట్టి కృత్యమును జేయుట పృథివీరాజునకుఁ గలంకకారణ మని నిస్సందేహముగఁ జెప్పవచ్చును. లోకములోఁ

దమ శత్రువుల యింట వివాహాదిశుభకార్యములు జరుగునపు డోర్వ లేని వారు కొంద ఱాశౌచమును బట్టుచు నెల్లరకును దెలియు నట్లు ప్రతిష్ఠలమునందును జాటిచెప్పుచును, గందపుఁబొట్లు పెట్టుకొని యును, దొంగవార్తల నంపుచును గార్యవిఘ్నమును గలిగించుట గలదు. కాని యట్టి పని పృథివీరాయని యంతవానికిఁ జేయఁ దగినదియా ?

ఎట్లయినను జయచంద్రుని యాగము విచ్ఛిన్నమై పోయినది. ఈ పరాభవబాణము జయచంద్రుని నల్లగుండెకుఁదీవ్రముగఁ నాటెను. మఱల జయచంద్రుఁడు పృథ్వీరాజుపైఁ గత్తి కట్టునని ప్రజలు తలంచిరి. సైనికులు ఢిల్లీయజమీరుల దండులఁపై గత్తులు నూరసాగిరి. ఈ తడవ మా ప్రతాపముఁ జూడుఁ డని క్రొత్తయోధులు మిత్రుల చెంతఁ బ్రగల్భములు కొట్ట సాగిరి. కాని జయచంద్రుఁడు యుద్ధము మాటఁ దలపెట్ట లేదు. అతఁడు యాగము విచ్ఛిన్నమై పోయినను గూఁతురు స్వయంవరమును మానఁ దలంప లేదు. మఱియొక సుముహూర్తమున నది యథాప్రకారముగ జరుపునట్లు చాటించెను.

సంయుక్తాస్వయంవరదినము సమీపించెను. దేశదేశములనుండి యందగాండ్రమని విఱ్ఱవీఁగు రాజపుత్రు లనేకులు మహేంద్రవైభవములతో వచ్చి చేరిరి. జయచంద్రుఁ డందఱకును స్వాగతము నొసంగి యర్హనివేశముల విడియించెను. కన్యాకుబ్జపౌరు లెల్లరును పూర్వపుఁ గల్లోలములను మఱచి మహోత్సాహముతో నుండిరి. పట్టణ మంతయు స్వర్గమువలె దేదీప్యమానమై జనసంకులమై పోయెను. పరస్పర విరోధు లగుటం జేసి జయచంద్రుఁడు పృథివీరాజును బిలువలే దని గాని, పృథివీరాజు రాలే దని గాని మేము వ్రాయవలసిన పనిలేదు.

ఒకనాఁడు శుభముహూర్తమున స్వయంవరసభ కూర్పఁబడియెను. రాజపుత్రు లెల్లరును గంభీరవేషములను ధరించి ప్రత్యేకస్థలమునందలి యున్నతాసనములపై సదర్పముగఁ గూర్చుండి యుండిరి. బంధుగులు, స్నేహితులు, ప్రేక్షకులు మున్నగు వారు నిర్దిష్టస్థలములయం దాసీనులైరి. జయచంద్రుఁడు పృథ్వీరాజు నేవలఁ దనకుఁ గల వైర మంతయుఁ దీఱిపోవు నట్లాతని ప్రతిమ యొకటి చేయించి దానిని "ఢిల్లీశ్వరుఁడు నా ద్వారపాలకునితోఁ దుల్యుఁ" డను భావముతో ద్వారమున నిలిపెను. అది చూచి సభ్యులనేకవిధభావనలకు లోనైరి. కాని యెవరును మాట్లాడ లేదు. అంతటను గాంభీర్యము విరాజమాన మగుచుండెను.

అంతఁ బుష్పమాలికను జేఁబూని సఖీజనములు వెంటరా రూపొందిన సౌందర్యాధిదేవతవలె సంయుక్త సభాస్థలమునకు వచ్చెను. నవలావణ్యావలిత్రియై కుసుమమాలికను జేఁబూని గంధర్వరమణివలె నున్న సంయుక్త నారసి రాజపుత్రు లెల్లరును ముగ్ధులై పోయిరి. ప్రతిరాజపుత్రుఁడును సంయుక్త తప్పకుండఁ దన్నే వరించు నని గంపెఁ డాశపెట్టుకొని యుండెను. ఇందఱు రాజపుత్రులలో నీ బంగరుబొమ్మ నలంకరింపఁ గల రాజమణి యెవఁడా యని ప్రేక్షకు లెల్లరు నాలోచనాధీనులై యుండిరి. జయచంద్రుఁడును డోలాయమానహృదయుఁ డయ్యెను. శుద్ధాంతజనము గూడ నట్లే యుండెను. అంత రాజవర్ణనము సేయుటకు నియుక్త యగు చేటి యొక రాకుమారుని చెంతకుఁ దీసికొని పోవుటకు సంయుక్త చేయి పట్టుకొనియెను. అప్పుడు సంయుక్త హృదయమున నొక్కమాఱు మహాగ్ధ్యప్రవాహము వెల్లివిరిసి పోయెను. కాని వెంటనే తెప్పిరిలి సంయుక్త చేటిచేయి విడిపించుకొని మదపుటేనుఁగు గున్న

వోలె గంభీరగమనమునఁ బోయి ద్వారపాలకుని స్థలమునం దున్న పృథ్వీరాయని ప్రతిమ మెడలోఁ గుసుమదామమును గీలించెను.

వెంటనే సభయందంతట నొక గొప్ప కోలాహలము ప్రారంభ మయ్యెను. అందఱు ననేకవిధములఁ జెప్పుకొన సాగిరి. సంయుక్త యా కోలాహలము నేమియు లక్ష్యము సేయక తిన్నగ శుద్ధాంతమునకుఁ బోయెను. స్వయంవర మిట్లగు నని యెవ్వరు ననుకొన లేదు. సంయుక్తతల్లి మందహాసవదనారవిందయై తన యల్లుఁడే రాజకుమారుఁడో తెలిసికొన నువ్విళ్లూరుచుఁ గన్నులు సంయుక్తమీఁదనే పెట్టుకొని యుండెను. తక్కిన స్త్రీ లెల్లరును గరకంకణములైన ధ్వనిచేయకుండఁ బుత్తడిబొమ్మలవలె నిలిచి యుండిరి. జయచంద్రుఁడు భావరహితము లగు చూపులతో రాజపుత్రుల నెల్లరను గలయఁ జూచుచుండెను. పాపము వారి యాశ లన్నియు నిట్లు భగ్నములై పోయెను. ఎల్లరును దెల్లవోయిరి. జయచంద్రుఁడు మహోగ్రుఁడై మండిపడుచు "దుశ్శీల యగు దీనినిఁ గారాగారమునఁ బంధింపుఁ డని యఱచి లోనికిఁ బోయెను. పాపమాతని కంతకంటె నవమానకరం బేమి యున్నది? రూపరాశియగు సంయుక్త కొఱకుఁ బుట్టెఁడాశతో వచ్చి, యామె స్వయంవర సభలోఁ బ్రవేశించినప్పు డనేకవిధము లగు శృంగారచేష్టలను గావించిన రాజకుమారు లెల్లరును నిర్విణ్ణులై, నిరాశాసంతప్త చిత్తులై వెడలి పోయిరి. ప్రేక్షకు లనేక విధములఁ జెప్పుకొనుచు నాస్థలము విడిచి పోయిరి. లోకుల నెవ రేమి సేయఁ గలరు?

సంయుక్త యట్లు రాణివాసమునకుఁ బోయినపిదప శుద్ధాంతజన మంతయు వచ్చి యామెను జుట్టుకొనియెను. ఆమెను గొందఱు కసరుకొనిరి. కొందఱు నీ కిట్టిది తగ దనిరి. కొంద ఱిది యేమి

చిత్రమే యని సన్న సన్నముగఁ జెప్పసాగిరి. కొందఱు కోపపడిరి. ఆమెను పొద్దుమీఁటి చీవాట్లు పెట్టుటలోఁ గొందఱి కంఠములు బొంగురువోయెను. ఎవ్వరును రాజపుత్రిక యని సందేహింప లేదు. ఎవరికిఁ దోఁచి నట్లు వారు నిందించిరి. బుగ్గలపైఁ బొడిచిరి. సిగ్గు లేని దానా! యని యెత్తి పొడిచిరి. అందఱికంటె నధికముగఁ బుత్రికాప్రేమను దిగమ్రింగి యామె తల్లి మండిపడియెను. కాని సంయుక్త యేమియు మాట్లాడ లేదు. మఱల గుసగుసలు మెండయ్యెను. రుసరుసలు ప్రబలెను. సంయుక్త యెరికిని జవాబు చెప్ప లేదు. మొగ మెత్తి యెరినిఁ జూడ లేదు.

కాలరుద్రునివలె గర్జించుచు నంతలో జయచంద్రుఁ డచ్చటకు వచ్చి సంయుక్తపైఁ జాలఁ గోపపడియెను. నీకిట్టి బుద్ధి యేల పుట్టె ననియెను. మతి పోయెనా యని కసరుకొనియెను. మా గౌరవ మంతయు మంటఁ గలిపితి వని తహతహ పడియెను. చూడు మేమి చేసెదనో యని పండ్లు పిండిచేసికొనియెను. పాపము కోపభరమ్మైన జయచంద్రుని శరీర మాపాదమస్తకము వడఁకిపోయెను; గాని సంయుక్త యేమియుఁ జలింపలేదు. అప్పుడు గూడఁ దన వరాలనోట మాట్లాడ లేదు. సంయుక్త మౌనమువలన జయచంద్రుని క్రోధము మఱింత వృద్ధి యయ్యెను. వెంటనే యాతఁ "డీ తుచ్ఛురాలినిఁ జైదులోఁ బడవేయుఁ" డని యఱచెను.

ఆ మాటయే రెట్టించి రెట్టించి పలుకుటవలన నది నిశ్చయమై నదియే యని భావించి చెలికత్తెలు సంయుక్త చేయి పట్టుకొనిరి. అంత జయచంద్రుఁడు ముందు బయలుదేఱి కారాగారము దెస దారి తీసెను. అప్పు డైనను సంయుక్త చలింపలేదు. వెంటనే యా

క్రొత్త పెండ్లికూఁతురు కైదులో బంధింపఁ బడియెను. అచ్చటి స్త్రీలలో నామె స్థితి నారసి "పాప మయ్యో" యని వగచిన వారొక్కరును లేరు. ఆహా! పెండ్లికూఁతు రని సకలోపచారములును జేయవలసిన యా స్త్రీసంఘ మప్పు డామెయెడల నెంత కాఠిన్యము వహించెను!

చుట్టములు గాని పక్కములు గాని తలిదండ్రులు గాని సంయుక్త భావ మేమో గ్రహింపఁ గలిగి రని చెప్పుటకు వీలులేదు. చిన్నతనమునుండియుఁ బెంచి పెద్దచేసిన దాదులును, నరమర యన నెట్టిదో యెఱుంగక చిన్నప్పటినుండియుఁ గలసి మెలసి తిరుగు చెలికత్తెలును గూడ గ్రహించిరో లేదో వారికే యెఱుక. చేష్టలను బట్టి గ్రహించిన వారు లే రనియే చెప్పవచ్చును. అయినను దలిదండ్రులకును, చుట్ట పక్కములకును, చెలికత్తెలకును గూడ వ్యతిరేకముగఁ బ్రవర్తించి కారాబద్ధ యైన సంయుక్త ముం దేమి చేయఁ దలఁచి కొనినదో?

అటఁ బృథివీరాజు, తన యెడల జయచంద్రుఁడు గావించిన కృత్యమును విని మండిపోయెను; గాని సంయుక్త గావించినది విని వెంటనే పొంగిపోయెను. "జయచంద్రుఁ డంతటి సభలో నాకుఁ గావించిన యగౌరవమునకు నే వచ్చుటకుఁ బోకుండఁగనే ప్రతీకారము జరిగి పోయినది. అల్లారుముద్దుగఁ బెంచుకొనిన యాతని గాదిలికూఁతురే తత్క్షణ మా దుష్టుని మానమును దగ్ధము గావించివైచినది. ఆహా! సంయుక్త యెట్టి సుగుణమణి!" యని యాతఁ డామె ధైర్యసాహసాదులకు మెచ్చుకొనియెను; గాని యనుంగుబిడ్డయై యుండియుఁ దన గౌరవమును మంటఁగలుపుటచేఁ గోపోద్దీపితుఁడై

దురభిమానియగు జయచంద్రుఁడు, సంయుక్తను, సభలోఁ బలికినట్లు కారాగారమున బంధింపక మానఁడనియు, సహింపరాని బాధలు పెట్టక మానఁడనియు నిశ్చయించుకొని, ప్రాణములమీఁదఁ గూడ నాశవదలుకొని తన గౌరవమునకుఁ గలంక మొదవకుండఁ గాపాడిన యా కన్యాతిలకము నుద్ధరింపకున్నను, దనయెడల నతినీచముగఁ బ్రవర్తించిన జయచంద్రుని శిక్షింపకున్నను, దన ప్రాభవమునకును బౌరుషమునకును గలంకము కలుగక మానదని తలంచి, ముఖ్యముగా సంయుక్త ప్రేమ త్వరపెట్ట వెంటనే ప్రయాణభేరిని మ్రోయింపించి యాకస్మికముగాఁ గన్యాకుబ్జనగర సమీపమున విడిసెను.

ఈ సమాచారమును విని కన్యాకుబ్జపౌరులు చాలఁ దల్లడిల్లిరి. జయచంద్రుని కోపాగ్ని మఱింత వృద్ధి యయ్యెను. అక్కతన నాతఁడు వెంటనే తన సైన్యమునందుఁ జక్కని వ్యవస్థ నేర్పఱిచి సంయుక్త యున్న కారాగారమును గుఱించి స్వయముగఁ జాల జాగ్రత్త పుచ్చుకొనసాగెను. చిన్నటనాఁట నుండియుఁ జెలికత్తెలై యుండియుఁ జేఁటిపాలను గాపాడు స్త్రీలు పాపము ముద్దరాలగు సంయుక్త యెడలఁ జాలఁ గాఠిన్యమును జూపఁ దొడఁగిరి. "పృథివీరాజు వచ్చెనని నీవు మురియ నక్కఱలేదు. అతఁడు ప్రాణములతోఁ బోవునపుడు చూతములే" యని వా రపుడపుడు సంయుక్తను మర్మోద్ఘాటనము సేయ సాగిరి. కాని సంయుక్త యప్పుడు గూడ నేమియు మాట్లాడ లేదు. మనమున నించుకేనియు జంకు వహింపలేదు. పయింబయిగఁ బృథివీరాజు రాక నాలకించిన నాఁటఁగోలె నామె మఱింత గాంభీర్యమును దాల్చెను. ఈ లక్షణములను జూచి యెల్లరు నామెకు మతిపోయినదని తలంచిరి.

నాఁటి రాత్రి యిరుతెగలవారును సమరసన్నాహములలోఁ బ్రవేశించిరి. జయచంద్రుఁడు పృథ్వీరాజు నెదిరించుటకుఁ గహారకంతీరుఁ డను సేనాధీశుని యాధిపత్యముక్రింద మూఁడువేల సైన్యము నేర్పాటు గావించి యుంచి దుర్గమునందుఁ జాలఁ గట్టుదిట్టములు గావించెను. బురుజు లన్నియు ఫిరంగీలతో నింపివేయించెను. ప్రాకారములయం దెల్లయెడల సైనికులను నిలిపెను. కొందఱు సేనాధిపతులు కోటలోపలను వెలుపలను నిలిపిన సైనికులను బరీక్షించుటకాయంధకారపరీత మగు నిశీథసమయమున నశ్వారూఢులై పటాక్షేపముతో నటునిటు సంచరింప సాగిరి.

సంయుక్త కీ సంగతి యెట్లో తెలియవచ్చెను. వెంటనే సంయుక్తయు నిరువురు చెలికత్తెలును బురుషవేషములను దాల్చి గుఱ్ఱముల నెక్కి సేనాపరీక్ష గావించు సేనానులవలె నటించుచు దుర్గమును దాఁటి పృథ్వీరాయని సేనానివేశము దెసకు గుఱ్ఱములను డాయించిరి. కాని వారి నెవ్వరును జూచి యుండలేదు. చెఱసాలలో దాసీలు సంయుక్తకుఁ గలిగించిన వన్నియుఁ దమపై రాజునకు విశ్వాసము గలుగుటకై కల్పించిన కృత్రిమబాధలే కాఁబోలు! ఔరా! స్త్రీల చాతుర్యము! పృథ్వీరాజు సంయుక్త రాక కెంతయు నలరి, యామె సాహసము నెంతయు మెచ్చుకొని యామె నప్పుడే గాంధర్వ విధిం బరిణయ మయ్యెను.

ఈ వివాహవిధానము భారతధర్మశాస్త్రమునకుఁ గేవలము వ్యతిరేకముగ నున్నది. పృథ్వీరాజజయచంద్రు లక్కచెల్లెండ్ర కుమారు లగుటంజేసి సంయుక్త పృథ్వీరాజునకుఁ గూఁతురు. ఇట్టి సంబంధమును భారతీయుఁ డైన వాఁ డెవ్వఁడును జేసికొనక పోవు

టయే గాక యిట్టిది జరిగెనని వినినచో(జాల(గంటగించుకొన కుండ నుండ(జాల(డు. అట్టి యెడల సంయుక్త పృథివీరాయని(ప్రేమించుటయు(నాత(డామె ప్రేమ నంగీకరించుటయు(గూడ(జాల నాశ్చర్యముగ నున్నది. అప్పటి వారెవరైన దీనిని గురించి యాక్షేపణలు సేసిరో లేదో చెప్పుటకు(జరిత్రములయం దాధారములు గాన్పింపవు. చరిత్రకారులు గూడ దానిని జాఱవిడిచిరే గాని యాక్షేపించి యుండలేదు. ఇట్టి వివాహములు భారతీయేతరుల యందు జరుగుచున్నట్లు విందుము. భారతధర్మశాస్త్రమునందు(గొన్ని వావులును, విశేషించి కొందఱు బంధువుల కన్యకలును వివాహములయందు స్వీకర్తవ్యలు గారని నిషేధము లేర్పడి యున్నవి. మేనరికమును జేసికొనుటకు(గూడ(గొంద ఱంగీకరింపరు. భారతీయ వివాహములలో శాస్త్రమునకును, లోకమునకును గూడ విరుద్ధముగ జరిగినది సుప్రసిద్ధమగు ద్రౌపదీపరిణయ మొకటి కాన్పించుచున్నది. అయినను దానిని(గొన్ని కారణములు నూపి వ్యాసభగవానుడు విశేషవిధిగా సమర్థించి యున్నా(డు. ఈ సంయుక్తాపరిణయమును గూడ నెవరైన(గారణములు నూపి విశేషవిధిగా సమర్థింప(గలరా? దీనిని(గేవలాక్రమవివాహములలో(బరిగణించుటకు మా కనుజ్ఞ నొసంగెదరా?

సంయుక్తరాకయు, నీ వివాహవృత్తాంతమును గూడ సంయుక్త చెలికత్తెలకు(దక్క ఢిల్లీ సేనానివేశమున నైన మేరికిని(దెలియదు. కాని కొంత తడవున కెట్లో సంయుక్త సఖీసమేతయై చెఱనుండి తప్పించుకొని పృథివీరాయని(జేరెనని జయచంద్రునకు(దెలియవచ్చెను. అప్పు డాతనికి(గలిగిన కోపమును, దుర్గమునం దంతటను బొడమిన కలవరమును మేము వివరముగ వర్ణింప(జాలము.

వెంటనే జయచంద్రుని యనుజ్ఞ నంది సంయుక్తాపృథివీరాయులం బట్టి తెచ్చుటకుఁ గహారకంఠీరుఁడు తన మూఁడువేల సైన్యములో రహస్యముగ బయలుదేఱెను.

కాని, యంతకుము న్నిట్టిది సంభవింపవచ్చు నని కన్యాకుబ్జనగరమునకును, దన శిబిరములకును నడుమఁగల యంధకారపరీత మగు విశాలప్రదేశమునఁ బృథివీరాజు తన భటుల నటనట నుంచుటంజేసి కహారకంఠీరుని రహస్యము దాఁగినది కాదు. దిల్లీభటులు వారినిఁ జూచుటతోడనే సంకేతానుసారముగఁ గాహళముల నూఁదిరి. దిక్కుహారములు ముఖరితములు సేయు నా బాకాధ్వనుల నాలకించి యంతకుముందే సమరసన్నాహములతో నున్న దిల్లీసైనికులు బారులు దీరి ముందునకు నడచిరి. దాని కాతతాయి యను నతఁడు నాయకుఁడై యుండెను. పృథివీరాజు గూడ సంయుక్త చెంత సెలవు గైకొని హరహరా! యని యుద్ధరంగమున కురికెను.

అంత భేరీభాంకరణంబులును సింహనాదంబులును మిన్ను ముట్ట యుద్ధము ప్రారంభ మయ్యెను. వీరు కాల్బంటులు, వీరు రాహుత్తులు నను భేదము లెక్కసేయక సంకులసమరము ప్రారంభించిరి. మత్తగజములు నడగొండలవలె ఘీంకారములు సేయుచు నెదుటి వారి నెల్లరినిఁ ద్రొక్కి చంపుచుండెను. ఎందఱో యోధుల యుత్తమాంగములు బంతులవలె నెగిరిపోవుచుండెను.

అప్పుడు కహారకంఠీరుఁడు, నాతతాయియు ద్వంద్వయుద్ధమునకుఁ దలపడిరి. నాగాయుతబలులును, బరస్పరమును దుల్యులు నగు వారి పోరెంతయు ఘోరం బయ్యె, నెంతో దర్శనీయముగ నుండెను. వారి భ్రూభంగములును, సింహనాదములును, బరివర్తనములును,

లంఘనములును, బంతములును, మిగుల హృదయంగమములై యుండెను. అంతకంతకు వారికి శౌర్య మెక్కు డయ్యెను. ఆ సందర్భమున నతి లాఘవముగ నాతతాయినిఁ దన ఖడ్గభుజంగికి బలియిచ్చి కహారకంఠీరుఁడు విజయానందంబునఁ బేర్చి యార్చుచు ఢిల్లీసైన్యము నురుమాడఁ జొచ్చెను.

అంతఁ దమ నాయకుని పాటును, బరనాయకుని పోటును జూచి రిచ్చవడి ఢిల్లీసైనికులు వెన్నిచ్చి పాఱిపోఁ జొచ్చిరి. అది చూచి సహింపఁ జాలక పృథివీరాజు తన సైనికుల నోడకుఁ డోడకుఁడని హెచ్చరించుచుఁ జిచ్చఱ పిడుగువలెఁ గహారకంఠీరుని పై కుఱికెను. వా రిరువురు నట్లు చాలఁ గాలము పోరిన పిదపఁ బృథివీరాజు హుంకరించి తన ఖడ్గమును కహారకంఠీరునిపై విసరెను. కాని యా వేటు తప్పిపోయెను. వఱలఁ బృథివీరాజు సన్నద్ధుం డగు నంతలోఁ గహారకంఠీరుఁడు విజృంభించి ఢిల్లీశ్వరునిపైఁ జంద్రహాస మెత్తెను. ఒక్క రెప్పపాటు కాలములోఁ బృథివీరాయని శిరస్సు సంగ్రామరంగమునం బడి దొర్లుచుండ వలసినదియే; గాని యంతలో వెనుకనుండి యొకవీరుఁడు సమదెంచి కహారకంఠీరునిఁ బరలోకమున కంపివైచెను. ఢిల్లీశ్వరున కపాయము తప్పిపోయెను.

ఆకస్మికముగాఁ, గహారకంఠీరుఁడు కూలుటచే రిచ్చవడి ఢిల్లీశ్వరుఁ డెదుట నున్న వీరునిఁ జూచి యాశ్చర్యపడెను. అది చూచి యా వీరుఁడు "రాజా! ఆశ్చర్యమున కిది సమయము గాదు. ముందున కుఱుకుము. అహితుల నఱకు" మని హెచ్చరించుచుఁ గన్యాకుబ్జసైనికులపైఁబడి యద్భుతముగ వీరవిహారము సేయఁ దొడఁగెను. అప్పటికినిఁ బృథివీరా జాతనిం గుర్తింపఁ జాలకపోయెను. అయిన నిప్పు డాతనిం గుఱించి యోచించుచుం గూరుచుండిన నుప్పు

వాటిల్లు నని తలంచి యాతని వెంటనే వైరివీరుల నురుమాడఁ జొచ్చెను. ఇది చూచి ఢిల్లీ సైనికులు మఱింత యుత్సాహముతోఁ బోరసాగిరి.

క్రొత్తవీరుని ఖడ్గమునకు, ఢిల్లీశ్వరుని చంద్రహాసమునకును వైరియోధు లెందఱు బలి యైరో లెక్క లేదు. ఒక నిముసములోఁ గహారగంఠీరుఁడు కూలిన వార్త యెల్లెడను వ్యాపించెను. ఇది వినియుఁ గ్రొత్తవీరుని యౌద్ధత్యమునకును, ఢిల్లీశ్వరుని ధాటికిని నోర్వఁ జాలకయుఁ, దమ వారు స్వల్పముగను, బరు లధికముగను నుండుటం జూచియు నింకఁ గార్యము లే దని జయచంద్రుని భటులు వెన్నిచ్చి పాఱఁదొడంగిరి. అయినను విడువక పృథ్వీరాజు నాతని భటులు గన్యాకుబ్జయోధులను దఱిమి తఱిమి కసిమసంగఁ జొచ్చిరి. అపుడు క్రొత్తయోధుఁడు దయార్ద్రహృదయుఁడై "రాజా! నీకు విజయము లభించె; పాఱుఁబోతులఁ జెనకకు" మని యెలుగెత్తి పిలిచెను. అది విని యాతనిపైఁ గల సాద్యస్కం బగు గౌరవము వలన మాఱుపలుక నోడి సేనలను మఱలించుకొని పృథ్వీరా జాతనితోఁ గూడ శిబిరముఁ జేరెను.

శిబిరముఁ జేరిన పిదపఁ గూడఁ బృథ్వీరాజు క్రొత్తవీరుని గుఱుతింప లేక పోయెను. ముఖమునఁ బొంగి పొరలి పోవుచున్న లావణ్యమును, విశాలనయనములయం దుచ్చలితం బగుచున్న తారళ్యమును, గలిగిపలుకులయం దుత్తరంగిత మగుచున్న మాధుర్యమును జూచి యరసాక్కి పృథ్వీరాజు మున్నెప్పుడో యొకప్పు డాతనితోఁ జాలఁదడవు మాట్లాడి యున్న ట్లనుమానించుచు నడుగుట గౌరవము కా దనియుఁ గొంత తడ వేదో ముచ్చటించుచుఁ గూర్చున్నఁ దెలియక పో దనియుఁ దలంచి యాతని యెదుటఁ గూర్చుండఁ

బెట్టుకొని యాతఁడు తనకుఁ గావించిన మహోపకారమునకుఁ గృతజ్ఞతఁ జూపఁ దొడఁగెను. శ్రోత్రవీరుండు నింకను రాజు తన్ను గుఱుతింప లేనందులకు ముసిముసినగవులు నగుచు నల్లనల్లనఁ దగునట్లు ప్రత్యుత్తర మిచ్చుచుండెను. ఎంతకును రాజు కృతార్థుఁడు కాలేక "నా జ్ఞాపకశక్తి యిట్లు మందమై పోయిన దేల?" యని చాలఁ దొట్రుపడ సాగెను. ఇఁకఁ దన్నుఁ గుర్తించుట రాజువలనఁ గాదని తలఁచి వీరుఁ డా పటకుటీరమంతయు మాఱుసిపోవునట్లు విద్యుత్కటాక్షముల నంతట నొక్కమాఱు నెఱపి మోము వంచి యూరకుండెను. అంత దరహాసితవదనలై సంయుక్త చెలికత్తె లిరువురును మదనుని పూవుటమ్ములవలె క్షణములో వచ్చి వీరుని భుజములపైఁ జేతుల నానుకొని యిరుదెసల నిలుచుండిరి. అప్పుడు రాజహృదయ మొక్కమాఱు కలఁగి పోయెను. వెంటనే యాతఁడు వీరుని చేయి పట్టుకొని ముఖము దెస గంభీరముగఁ జూచి "సంయుక్తా" యని పిలిచెను.

ఇఁక వీరుఁ డటఁ గూరుచుండఁ జాలక తటాలున రాజు చేయి విడిపించుకొని యడుగులు తడఁబడ శరవేగమున మఱియొక పటకుటీరములోనికిఁ బోయెను. చెలికత్తె లంత సిగ్గెందులకే యని రాజు దెసకుఁ జూచిరి. వెంటనే రాజు "సంయుక్తా" యని పిలుచుచు నామె యున్న పటకుటీరమునకుఁ బోయి యెంత వెనుకకుఁ బోఁ బోవుచున్నను వదలక యామె చేయిపట్టుకొని తీసికొని వచ్చి యంకతలమునఁ గూరుచుండఁ బెట్టుకొని ప్రియమారఁ గౌగిలించికొని మోము ముద్దాడి "దేవీ! నాఁడు మానము నిలిపితివి. నేఁడు ప్రాణము నిలిపితి" వని యనేకవిధములఁ గొనియాడఁ దొడఁగెను. వీరుఁడు సంయుక్త యని పాఠకుల కిఁకఁ దెలుప నక్కఱ లేదు.

రా జట్లు చేయుటవలన సంయుక్త కెక్కుడ లేని సిగ్గును వచ్చెను. పాప మాముద్దరాలి నా లజ్జ యుక్కిరి బిక్కిరి గావించి వైచెను. అక్కటతడ నామెయేమియు మాట్లాడఁజాలక మోమువంచికొని రాజు దృఢాలింగనమునఁ గరఁగిపోవుచుఁ గూరుచుండి యుండెను.

చెఱనుండి తప్పించికొని పురుషవేషముతో నశ్వము నధిరోహించి నిశీథసమయమునఁ గావలివాండ్రను వంచించి వెదకికొనుచు వచ్చి రాయని గాంధర్వవిధిం బరిణయ మైనప్పుడును, మఱలఁ బురుషవేషము దాల్చి పృథివీరాయనిఁ గాపాడి వైరివీరులను వేటాడినప్పుడును లేని యింతటి లజ్జ సంయుక్త కిప్పు డేల? అది యేమో స్త్రీలకే తెలియవలెను. సమయము వచ్చినపు డబల లెంతెంత పనులనైనఁ గావింతురు; గాని పిదపఁ బురుషులను జూడవలసి వచ్చునపు డెంతో సిగ్గుపడెదరు. ఇది లోకములో జరుగుచున్న యాచారము. దీనికి హేతు వేమో చెప్పఁజాలము. పురుషు లైనచో నుత్కృష్ట కార్యములను నిర్వహించివచ్చి తఱుచుగఁ బెద్దపెద్ద సభలలోఁ బ్రగల్భములు గొట్టెదరు. స్త్రీ లట్లేల సిగ్గుపడెదరో? స్త్రీలకు సిగ్గుపడుటయే ప్రగల్భములు కొట్టుట వంటిదా?

ఈ యుద్ధమునఁ బృథివీరాజునకు సంపూర్ణముగ విజయము కలిగెను. అట జయచంద్రుఁడు దిల్లీశ్వరుని మీఁదికి మఱల సైన్యము నంపక యాతఁడు కోట ముట్టడించె నేనిఁ జూచుకొంద మని యూరకుండెను. కాని రాజు మాత్రము దుర్గమును ముట్టడింప లేదు. రాఁదగిన వస్తువు చేఁజిక్కె ననియుఁ గాఁదగిన పని యైపోయిన దనియుఁ దలంచి యూరకుండెనో, తన యెడలను రాజు నెడలను జాల నగౌరవమును దిరస్కారమును జూపినను జయచంద్రుఁడు కన్నతండ్రి యగుటచేఁ బుత్రికాసహజం బగు ప్రేమంబునఁ గోటను

ముట్టడింప మాను మని సంయుక్త ప్రార్థించెనో, గాని కన్యాకుబ్జ దుర్గమును బట్టుటకుఁ బ్రయత్నింపక రాజు సైన్యమును మఱలించు కొని సంయుక్తా సమేతుఁడై ఢిల్లీ చేరికొనియెను.

అన్ని యుద్ధములయందును బరాభవమే కలుగుచుండుట వలన జయచంద్రుని యసూయ పెరిగి పోఁజొచ్చెను. కన్నకూఁతురు కూడ శత్రువులలోఁ జేరుటవలన వాని హృదయము దగ్ధమై పోయెను. అక్కాలమున వాఁడు "ఢిల్లీ యజమాని కన్యాకుబ్జములను బృథ్వీరాజైన నేలవలెను; నేనైన నేలవలెను; లేదేని మఱియొకఁడేని నేలవలెను. కాని నా కంఠములోఁ బ్రాణము ఉండఁగాఁ బృథ్వీరాజునకు విశ్రాంతి యొదవ నీ"నని యాతఁడు చెప్పసాగెను. ఆట భోలాభీముఁడు గూడ నిట్టి యభిప్రాయము నే గలిగి యుండెను. మఱల నిరువురును గలసి యథాప్రకారముగ యుద్ధప్రయత్నములను జేయసాగిరి.

ఇంతవఱకును జరిగిన యుద్ధములలోఁ బృథ్వీరాయని సేనాధికులలో ననేకులు మడిసిరి. అయిన నింకను జాలమంది వీరు లుండుట వలనను, సంయుక్తను దీసికొని వచ్చిన పిదప భోగపరాయణత బలిసి పోవుటవలనను రాజున కా విచారమే లేకపోయెను. కాని మిగిలిన వారిలో గొప్పవాఁడు కయమాసను మంత్రి. అతఁడు "ఖటుపుర ములోని నిధానమును దీసెను. మరుస్థలములోని పిడిహారరాజుం జంపెను. గోరీనిఁ జెఱపట్టెను. బలవంతు లైన తురకరాజులను భారతీయరాజులను జయించెను. అందువలన జహువాళ రాజునకు (పృథ్వీరాజునకు) భయపడునట్లు చేసెను. అతఁడు పెద్దపులి వలె భయంకరుండై తన కీర్తిచే నన్ని దేశములను నింపెను" అట్లున్న

విధములఁ దనకుఁ గుడిచేయియై యుండినను సొంకమాఱు తన భోగ కాంతను గామించె నని పృథ్వీరా జాతనిఁ జంపించెను.

మిగిలిన వారిలోఁ జాముండరాయఁ డను నాతఁడు గూడఁ జాల గొప్పవాఁడు. అవక్రపరాక్రమశాలి. విశేషించి రాజునకు స్యాలకుఁడు. అన్నివిధముల నీతఁడును కయమాషువలెనే రాజునకుఁ గుడిభుజమై యుండువాఁడు. అయిన నొకప్పు డీతఁడు రాజున కత్యంత ప్రీతిపాత్రమైన యొక యేనుఁగును సంహరించినందునఁ గోపమువచ్చి రాజీతనినిఁ గైదులోఁ బెట్టించెను. అప్పు డీతఁ "డిఁక శస్త్రము పట్ట" నని శపథము దాల్చెను.

రాజున కంతకంతకు భోగపరాయణత మితిమీఱి పోఁజొచ్చెను. ఆతఁడు రాజకార్యములను జూచుట పూర్తిగ మానివేసెను. వానిని గుఱించి యుద్యోగు లేమైనఁ జెప్పఁ బోయినయెడల వారిపైఁ గోపింపఁ దొడఁగెను. ఒకప్పు డేదో సందర్భమున హాహులీరాయఁ డను వీరాధివీరుఁ డగు చమూపతిని మిక్కిలి పరాభవించెను. దాని కాతఁడు చాలఁ గోపించి "రాజు పాగ రణఁచెదఁ గాక" యని ప్రతిన పూని గోరీ కొలుకు గజ్నీపట్టణమునకుఁ బోయెను.

అప్పటి కిటు భీమచంద్రుల ప్రయత్నములు గూడఁ బూర్తి యయ్యెను. గుప్తచారులవలన వారికి ఢిల్లీయందలి కయమాషు సంహారమును, జాముండరాయని కారాబంధనము, నాతని శస్త్రసన్న్యాసము, హాహులీరాయని పరాభవము, నాతని గజ్నీపట్టణ ప్రయాణము నెప్పటి కప్పుడే తెలిసిపోయెను. ఆ కారణమువలన వారు మఱింత యుత్సాహమంది యింక జాగు సేయరా దని గోరీని మఱల ప్రోత్సహించిరి.

అంతకు ముందే గోరీ తన గుప్తచారుల మూలమున భారత దేశమునందలి సమాచారము లన్నియుఁ దెలిసికొని దండయాత్రకొఱకు మిక్కిలి యత్నములు సేయుచుండెను. ఇంతలో భీమచంద్రుల రాయబారులును హాహులీరాయఁడు నాతనికిఁ బ్రత్యక్షమైరి. అప్పటి యాతని యానందమునకుఁ బరిమితి లేదు. వెంటనే యాతఁడనంత సేనాసాగరమును గూర్చుకొని కాజీలచే నిర్దేశింపఁబడిన సమయమున భారతసామ్రాజ్యమును జయించుటకు బయల్వెడలెను.

ఈ వార్త తత్క్షణమే పృథివీరాజునకుఁ దెలియ వచ్చెను. కేవలము గోరీ సైన్యమే యపారముగ నున్న దనియు, భీమజయచంద్రుల వాహిని సైతము సామంతుల వరూధినితోఁ గలిసి యగణ్యమై యున్న దనియుఁ గూడఁ దెలియ వచ్చెను. ఆ వెంటనే యాతఁడీ యుభయ సైన్యంబులును గలిసినచో నజయ్యం బగు నని యూహించి సంగతి సందర్భము లన్నియుఁ దెలుపుచు వెంటనే సాధ్యమైనంత సైన్యమును గూర్చికొని దేశము నుద్ధరించుటకు బ్రాణములపై నాశ గూడ విడిచి యెట్లున్న నట్లు రావలసిన దని భావమునందియు మహావీరుఁడు నగు మేవాడురాజు సమరసింహునకును, మిత్రులకును వార్తల నంపెను.

పృథివీరాజు, పగఱర సమరసన్నాహములును, దమ యుద్ధ ప్రయత్నములును, బ్రజాభిప్రాయమును, దేశస్థితియుఁ జూచి యీ తడవ శ్రీమంతం బగు భారతదేశము నిష్కంటకం బగుట యుండదు భారతంత్ర్యం బను నంధకారబంధుర మగు కూపంబునఁ బడిపోవుట యుండదు దప్ప దని నిశ్చయించుకొని తదనుగుణము లగు ప్రయత్నములను జేయ సాగెను. సంతత యుద్ధపరిశ్రమ వలననో, భారతదేశమునకు దౌర్భాగ్యదశ యాసన్నం బగుటనో, మఱల యుద్ధము

సంభవించె ననునిర్వేదము వలననో, శత్రువాహిని యగణ్యమైయున్న దను జంకు వలననో, యుద్ధములోఁ జనిపోయిన వారు గాక మిగిలిన తమనాయకులలోఁ గొందఱ క్రమముగ శిక్షింపఁ బడిపోయిరి గదా యను విచారము వలననో, యింటిగుట్టంతయుఁ బాపాత్ముఁడు పోవు లీరాయఁడు శత్రువులకుం దెలిపివేయు నిఁక నేటి జయంబను సందేహము వలననో, యీ మహాసంగ్రామమువలన దేశమునందలి స్త్రీపురుష లాబాల గోపాలము నట్టుడికిపోవు నట్టుడికిపోదు రను సంతాపము వలననో, మఱి యే కారణము వలననో ఢిల్లీసైనికు లొకింత కళదక్కి యుండిరి. కాని యది దూరదర్శులకుఁ గాని తెలియరానిదై యుండెను. దానిని బరీక్షించి చూచిన వారు గూడ లేదు.

ఇంతలో రావలసిన వారెల్లరును దమ తమ బిరుదములకుఁ దగినట్లు మహావైభవముతో వీరరసము మూర్తీభవించెనో యనునట్లు యోధవేషము లలవఱచికొని పెండ్లికొడుకుల వోలెఁ దరలి వచ్చిరి. మొత్తము పృథివీరాజు పక్షమునఁ బోర నరుదెంచినవారు రథగజ తురగపదాతి సైన్యములు గాక మహారథు లగు సేనాధీశులును, రాజులును, గలసి నూటయేఁబండ్రుండిరి. అందఱిలో సమరసింహుఁడు, నాతని కుమారుఁడు కల్యాణరాయఁడును ముఖ్యులు. వా రందఱును గలసి దేశభక్తి ప్రేరితులై గంగోదకములు చేతఁబట్టి "శత్రువులను గెలువనైన గెలిచెదము, స్వధర్మము కొఱకు రణాంగణమున దేహముల నర్పింపనైన నర్పించెద" మని శపథములు సేసిరి. అప్పుడు భేరీమృదంగ తూర్యాది మంగళధ్వనులచే దిక్కుహరములు ముఖరితము లయ్యెను. బ్రాహ్మణుల వేదఘోషములచే నా మహావీరుల శరీరములయందుఁ బ్రవహించు రక్తము పవిత్రం బయ్యెను. భట్రాజులు గావించిన శౌర్యవీరయశోగానముచే నా రక్తము

కవోష్ణమై వారి ముఖములయందు వీరతేజం బంకితమయ్యెను. ప్రబోధగీతములు పాడుచుఁ బుణ్యాంగన లొసంగిన మంగళహారతులచే నా తేజము వినీలమేఘములపై నృత్యము గావించు క్రొక్కాఱు మెఱుంగువలె విరాజిల్లెను. పృథివీరాజు వచ్చి స్వధర్మమును గుఱించి గంభీరోపన్యాసము నొసంగి, స్వయముగఁ గంఠములయందుఁ బుష్పహారములు వేసినపుడు వారి శరీరములు పొంగిపోయెను. ఇచ్ఛినీకుమారి సంయుక్త మున్నగు నంతఃపురస్త్రీ లెల్లరును వచ్చి "మిమ్ము విజయలక్ష్మి వరించుఁ గాక" మని పుష్పాంజలులు వెదచల్లినపు డైహికవిషయప్రపంచ మెల్ల నదృశ్యమై వారి మనోదర్పణములయందుఁ గేవల మసిధారాతీర్థమును విరాజమానము గావించు నా యాదిశక్తి వారికిఁ బ్రత్యక్ష మయ్యెను.

అంత నెల్లరకు నవశక్తి యొదవెను. నిశ్చలంబుగ నిలిచి గంభీరముగఁ జూచుచు నా యాదిశక్తి వారినిఁ జేయెత్తి యాహ్వానించెను. గభీరము లగు భేరీభాంకరణములు వారి హృదయములకుఁ జలనము గలిగించెను. వెంటనే వారు తటాలున నశ్వములను, రథములను, గజముల నధిరోహించి సువ్యవస్థావిరాజమానము లగు తత్తత్సైన్యభాగముల కధీశులై దిల్లీదుర్గాధిదేవత కభివందనములు గావించి, ప్రత్యాకార వినిర్ముక్తములును భుజనిక్షిప్తములు నగు నిశితకరవాలముల తీక్ష్ణకాంతులు మిఱుమిట్లుగొలుప "జయహర! జయమహాదేవ" యని రణఘోషము గావించుచు స్థానేశ్వర మహాక్షేత్రమునకుఁ బ్రయాణమై పోయిరి. అట భీమ జయచంద్రులును, గోరియు యుక్తసమయమునఁ జక్కని యేర్పాటులు గావించుకొని యచ్చటికిఁ జేరిరి.

వీరటఁ జేరక పూర్వమే మందహాస వదనారవిందులై, [illegible] తోమర భిండివాలాద్యాయుధములను ధరియించి, చిఱు [illegible]

హృదయంగమంబుగ ధ్వనిసేయఁ బరశక్తియాయుద్ధరంగమునఁ దాండవము ప్రారంభించెను. ఆమె విద్యుత్కటాక్షములనుండియు, బింబాధరమునుండియు, నీషత్ప్రకట మగు శ్వేతదంతపంక్తినుండియు, నవరత్నస్థగితము లగు బంగరు భూషల నుండియు, నిశితము లగు వివిధాయుధముల నుండియుఁ బదాఱువన్నె బంగారము నవఘళించు కోమలదేహవల్లి నుండియు వెలువడు వివిధకాంతులు మిళితములై సూర్యభగవానుని సహస్రమయూఖములతో వియ్యమంది యామహాసంగ్రామ రంగమున వ్యాపింపసాగెను.

ఎవరు శత్రువులం జంపుట గాని, చచ్చుట గాని గొప్ప యని భావింతురో, యెవ రీ పాంచభౌతికదేహములు నిశాతఖడ్గముల కాహుతు లైనప్పుడే పవిత్రము లగు నని తలంతురో, యెవరు తమ మృదుతనులతలయందలి కవోష్ణరక్తముచే ఖడ్గముల కభిషేకము గావించిన యెడల మోక్షము గలుగు నని భావించెదరో, యెవ రసిధారాతీర్థమునం దవగాహనము గావించినవారే ధన్యులని నమ్మెదరో వారి కామె ప్రత్యక్ష మగును. ప్రేమభరితము లగు పలుకులతో బుజ్జగించును. ఓడిపోయినను విచారము గలుగనీయక సంతోషము గలిగించును. ఆమె విహారస్థల మగు రణరంగమునం బ్రాణములు బాసిన వారిని వీరస్వర్గమునకుఁ గొంపోవును. కాని మన కామె గోచరింపదు. మనము రణరంగమునకుఁ బోయితిమేని హతు లగు యోధుల శరీరములనుండి ప్రవహించు రక్తధారలం ద్రావ నెల్లయెడల సంచరించు శాకినీ ఢాకిన్యాదిభూతములు ప్రత్యక్షమై తమ పని కడ్డువచ్చితిమేమో యని మనపైఁ బడుటకు సిద్ధపడును. కావున మనము రణరంగమునకే పోవద్దు.

మన మా యాదిశక్తినిఁ జూడ నభిలషింప వద్దు. యోధజీవన ముత్కృష్టమైనదే. కాని మన కది వలదు. మనము ఋషిసంతతివారము. శాంతజీవనము గూడ మోక్షప్రదమే. మన మా శాంతము నాశ్రయింతము. తపోవృత్తి నవలంబింతము. అప్పుడు మనకుఁ గూడఁ బరశక్తి ప్రత్యక్ష మగును. కాని యోధులకుఁ బ్రత్యక్ష మగు దానికిని దీనికిని భేద మున్నది. ఆమె యాయుధములు కుంతతోమరాదికములు. ఈమె యాయుధములు విజ్ఞానసీధుములు. యోధజీవనము కంటె శాంతజీవనము తక్కువది యని మీరు భావింప వలదు. యోధునకు శాంతజీవన మలవడుట కష్టము. కాని శాంతునకు యోధజీవన మలవడుట కష్టము గాదు. అసంఖ్యావైరివీరులకు వీరస్వర్గము నొసంగిన యోధు లనేకులు వార్ధకమున శాంతజీవనము నవలంబించి దానియందే తమ దేహయాత్రను జాలించిరి. అంతియ కాని చాలఁ గాలము శాంతజీవనమునం గడపి తుదకు యోధులై తజ్జీవనమునందే జీవయాత్ర ముగించినవా రరిది. దీనివలన మీరు శాంతజీవనోత్కృష్టత్వమును సులభముగ గ్రహింపవచ్చును.

కాని మన పూర్వు లెల్లరును యోధులే. వా రెల్లరును కత్తి కట్టి పోరాడిన వారే. వా రెల్లరును భారతీయుల బలపరాక్రమములను బ్రపంచమున కంతటికినిఁ జాటి చెప్పిన వారే. వారి కా యోధజీవనము రుచించినది. వారి యనుగ్రహమున రాణించి యాకాల మంతయు వీరకృత్యములయందే ప్రవర్తించినది. కాని మన మిప్పుడు శాంతజీవనము నవలంబింతము. ఇప్పు డీ బ్రిటిషుప్రభుత్వమునఁ గాలము గూడ శాంతముగ నున్నది. లేకున్నను గాలము మానవాధీనము. అది మానవుని యిచ్చవచ్చినట్లు తిరుగును. అదియుఁ గాక మనము భారతీయులము. మనవలనఁ గాని దేదియు లేదు. మన మిప్పుడు శాంత

జీవనము నాశ్రయించి భారతీయుల శక్తి సర్వతోముఖ మని ప్రపంచ మున కంతటికిని జాటి చెప్పుదము. ప్రపంచమునందలి యెల్లవారికిని శాంతావలంబనమునకు మనమే మార్గదర్శకుల మౌదము. శాంతజీవన మునందే మనము మోక్షము సంపాదింతము.

అట్లా పరశక్తి స్థానేశ్వరరణరంగమున సకలాయుధధారి ణియై తాండవము ప్రారంభించిన వెంటనే బంగరు తట్టలనిండ సుగంధకుసుమములను నింపుకొని కరములయందుఁ బుష్పహారములు దాల్చి విమానాధిరూఢలై వచ్చి యాకసమునం దంతటను యక్ష కిన్నరకింపురుష విద్యాధరాప్సరోగంధర్వకాంతలు నిండిపోయిరి. వా రెల్లరు నద్భుతవీరవిహారములు గావించిన వారిపైఁ బుష్పములను వర్షింతురు. అసిధారాతీర్థమునం దవగాహనము గావించిన వీరులను వరించి స్వర్గమునకుం గొంపోయి సకలోపచారములను గావించి యానందపెట్టెదరు. ఈ మహాయుద్ధమునం బోరుట కనేకయోధులు వచ్చియున్నారు. అక్కడ తన నిప్పుడు వారి ముఖతామరసములయందు మహానందలక్ష్మి తాండవ మాడుచున్నది. అట్టి యానందపరీతహృ దయు లగు నా శాంతామణుల వలన నా యోధు లెంత సుఖింతురో; గాని యా కాంతలు గూడ మనకుఁ గాన్పింపరు. వారి పుష్పప్రవర్ష ణము గూడఁ గాన్పింపదు.

ఆ యంతరిక్షమున నొకయెడ నవరత్నోజ్జ్వల మగు బంగరు సింహాసనం బమర్పఁబడి యుండెను. దాని చుట్టును గొందఱు పరి చారికలు నిలిచి యుండిరి. దాని రత్నకాంతు లాకసమునం దంత టను దురంగలించుచు విద్యాధరాదికాంతల సుందరవేషములకు మెఱుంగు లిడుచుండెను. కొంతతడవునకు మనోహరకుసుమమాలిక

యొకటి చేఁబూని చేటీజనంబులు బరాబరులు సేయుచుండ మదగజగమనయై చనుదెంచి విజయలక్ష్మి యా గద్దియ నధివసించెను.

పిదప నుభయసేనానివేశములనుండియు బ్రహ్మాండము బ్రద్దలగు నట్లు భేరీధ్వానములును జెవులు గింగురువోవు నట్లు బాకాధ్వనులు నెగసెను. ఇంకను వివిధారావంబులు వెలువడెను. పిమ్మట రణఘోషములు గావించుచుఁ జతురంగబలములు యుద్ధరంగమున సాక్షాత్కరించెను. ఆ వీరుల యుద్యోగ మొరులను జంపుట. లేకున్నఁ జచ్చుట. అట్టి వారికి భేరీకాహళాదిమంగళధ్వను లెందుల కని మీరు ప్రశ్నింతురా?

యుద్ధరంగము స్వయంవర సభ. యోధులు వరులు. విమానాధిరూఢులై యాకసమున గుంపులు గూడి యున్న గంధర్వాదికాంతలు పెండ్లికూఁతుండ్రు. విజయలక్ష్మిగూడ వధువే. దివ్యసౌఖ్యముల నపేక్షించు యోధులు పాంచభౌతిక దేహములను విడిచిపెట్టి యజరామర మగు దివ్యదేహము నాశ్రయింతురు. వెంటనే దివ్యకాంతలు వారిని వరింతురు. విజయలక్ష్మి విజేతను వరించును. యోధులు పెండ్లి కాకముందే వసంత మాడుకొందురు. ఆ వసంతోత్సవమును గాంచి వధువు లెంతో యానందింతురు. లోకములో మంగళ వాద్యములు లేకుండ నెవరు పెండ్లి చేసికొందురు?

ఈ మంగళధ్వనుల కింక నొక యాంతరంగిక హేతువుగూడఁ గలదు. భేరీతూర్యాదిధ్వనులు హృదయపీఠముల నధివసించియుండు శౌర్యమూర్తులను బ్రబోధించి యోధులను రణరంగమున పురికించును. కాహళాదిగీతనిస్వనములు యోధుల శక్తిసామర్థ్యములను బొగడి వారిని మఱింత విజృంభింపఁజేయును. ఈ రూపమున నీ ధ్వనులు

యోధులకుం గావించు నుపకారములకుఁ బరిమితి లేదు. కాని యీ ధ్వనుల యం దాయర్థము యోధులకే గాని మనకు స్ఫురింపదు. అవి మన హృదయములను బ్రద్దలు సేయును.

పిదప యుక్తసమయమున యుద్ధప్రారంభ మయ్యెను. ఇది చాలకాలము చాల ఘోరముగ జరిగెను. భారతదేశోపద్రవకరం బగు నీ యుద్ధమును మే మింతకంటె వర్ణింపఁ జాలము. ఇరుతెగల యందు ననేక యోధులు మడిసిరి. కాని పృథ్వీరాయని పక్షమునఁ బనిసేయవచ్చిన నూటయేఁబద్రెండు యోధులు రూపుమాసి పోయిరి. సైన్య మంతియు నశించెను. ఒక రిద్దఱు పాఱిపోయి యుందురు. వారు ఢిల్లీయందలి వారికి సమాచారములు దెలుపుటకుఁ బోయి యుందురని మన మూహింప వచ్చును. పృథ్వీరాజు తాతార్ఖానుఁడను తురుష్కునిచేఁ జెఱ పెట్టఁబడియెను.

తన కిట్టి యవస్థ తటస్థించినందులకుఁ బృథ్వీరాజు చాల సిగ్గు పడియెను. చాల వగచెను. కాని యంతకంటె నేమి సేయఁ గలఁడు? తన్ను విడిపించుటకుఁ గాని, తన పక్షమునఁ బోరుటకుఁ గాని తన వా రెవ్వరును లేరని తెలిసికొని యాతఁడు నిర్విణ్ణుఁడై పోయెను. ఒకింతతడవునకుఁ దెలివి తెచ్చుకొని "నేను గోరీ నేడుసారులు చెఱపట్టి దయఁదలఁచి విడిచి పెట్టితిని. ఆ యుపకారము తలంచుకొని యైనను నన్ను విడువు" మని రాజు తాతార్ఖానునిఁ బ్రార్థించెను. ఖానుఁ డందుల కంగీకరింప లేదు. "నేను గోరీ నేడుసారులు చెఱ పట్టి విడిచితి ననుమాట నీ యవివేకమునే వెల్లడిసేయుచున్నది. నీ వప్పు డట్లు విడిచితివి కావుననే నీ కిట్టి గతి పట్టినది. నీ మౌర్ఖ్యమునకు నీవు ఫల మనుభవింపక తప్ప" దని ఖానుఁడు ఖండితముగఁ జెప్పెను. రాజు ఖానునకు ధనాశఁ గూడఁ జూపెను; గాని ఖానుఁడు

"నీవు నాకెంత ధన మిచ్చినను నీవు శిక్షింపఁబడుటవలన నాకుఁ గలుగు నంతటి యానందము, గౌరవమును, లాభమును గలుగఁబోవు. నీవు శిక్షింపఁబడుటయే నా కోరిక" యని ప్రత్యుత్తర మిచ్చి భీమ జయచంద్రహాహులీరాయలతో విజయానందము ననుభవించుచుఁ గూర్చుండియున్న గోరీయెదుటకు ఖానుఁడు రాయనిఁ దీసికొనివచ్చి నిలిపెను. అంత వా రందఱును గలిసి రాజునకుఁ గావించిన పరాభవమును, దిరస్కారమును, హేళనమును, నాలేఖిని వివరింపఁ జాలదు. పృథివీరా జేమియు మాట్లాడ లేదు. బలపరాక్రమములు మంటఁ గలిసిపోయినవి. ఐశ్వర్యము నీటఁ గలిసిపోయినది. మానాభిమానములు భగ్నములై పోయినవి. కాని కోపాగ్ని హృదయమును గాల్చి వేయుచున్నది. ముఖము కందిపోయెను. దేహము కొయ్యబారి పోయెను. ఇఁక నేమి సేయఁ గలఁడు? "నా కింత బలపరాక్రమము లొసంగుట పగవానిచే బంధింపఁ బడుటకేనా" యనియు, "నిదివఱ కనేక పర్యాయములు జయలాభము నొసంగుట యీ మహాసంగ్రామమున నోడించుట కేనా" యనియు నాతఁడు భగవంతు నుద్దేశించి విచారింప సాగెను.

నిజముగ నిట్టి స్థితి ననుభవించుట మానికిఁ జాలఁ గష్టము. ఇంతకంటె మరణము మేలు. ఇంతకంటె యమయాతన యుండఁబో దని చెప్పవచ్చును. ఉండిన నది యింత దుస్సహముగా నుండదు. యమునకుఁ గూడ నొకింత దయ గలుగునేమో. అయిన ననుభవింపక తప్పదు. దైవమును దూఱిన నేమి లాభము? ఇది దైవికము గాదు. స్వయంకృతాపరాధము. పూర్వజన్మార్జితము గూడఁ గాదు. ఈజన్మమునఁ జేసికొనిన దానికే యిది సద్యఃఫలము.

అట్లు భీమజయచంద్రహాహులీరాయలు రాజును దమ కసితీఱునట్లు నిందించి నిందించి విసిగిపోయి యూరకుండిరి. కాని గోరీ కింకను విసుఁగు పుట్ట లేదు. అక్కసు గూడఁ దీఱ లేదు. ఏడుసార్లు రాయనిచేఁ జెఱపట్టఁబడిన గోరీ కడుపుమంట నిందించుట వలనను, బరాభవించుటవలనను, సంహరించుటవలనను గూడఁ దీఱునది గాదు. కావున వాఁడు నిలిచియుండఁగనే, తత్క్షణమే రాజు కండ్లు పీకించి పాదములకు దుర్భరము లగు లోహపుబేడీలను వేయించి కారాగారమునఁ ద్రోయించెను. అంతటితోనైన వానికి సంతృప్తి కలిగినదో లేదో.

పిదప గోరీ తాతార్ఖానుని బెద్దగా గౌరవించి యుత్కృష్టము లగు బహుమతుల నొసంగెను. సైనికుల నెల్లరిని సంతోష పెట్టెను. దిల్లీ సేనానివేశ మంతయు జాగ్రత్త పెట్టించెను. భీమజయచంద్రహాహులీరాయలను జాలఁ గొనియాడెను. ఆ వెంటనే మహావైభవముతో జయఘోషము మిన్నుముట్ట దిల్లీ నాక్రమించుటకు బయలు వెడలెను.

ఈవార్త విని భారతీయు లెల్లరు నాకసము విఱిగి మీఁదఁబడిపోయినట్లును, బ్రపంచము తలక్రిందు లైపోయినట్లును దలంచి గొల్లున గోల పెట్టిరి. ఇచ్ఛినీకుమారి, సంయుక్త మున్నగు రాజపుత్రస్త్రీ లెల్లరును చాలవిచారించిరి. తుదకు దిల్లీదుర్గమునందలి రమణీమణు లెల్లరును నిఁక లాభము లే దని తలంచి గుమిగూడి దుర్గాధిదేవతను బూజించి, కోటయందంతటను జితులు పేర్పించుకొని భగభగమండు నగ్నిహోత్రములలో దుమికి శాశ్వతపదవికిఁ బోయిరి. దుర్గరక్షణార్థము నియమింపఁ బడిన భటులు గోరీ నెదిరింపఁ బోయి వీరస్వర్గమును జూఱఁగొనిరి. దిల్లీ గోరీచే నాక్రమింపఁ బడెను.

ఈ సందర్భమునఁ దురుష్కవీరుల చేతులలోఁ బడి యనేక భారతీయులు హతులై పోయిరి.

గోరీ కోట యంతయు బాగు చేయించెను. చితుల యానవాలైనయు లేకుండఁ జేయించెను. మఱల దుర్గము జనసంకులమయ్యెను. కాని దానికిఁ బూర్వశోభ రాలేదు. ఢిల్లీదుర్గాధిదేవతయొక్క యా పూర్వలావణ్య మంతయు మాసిపోయినది. పృథ్వీరా జెందు వసియించి రాజ్యపాలనము గావించెనో యందే, దేశమునందలి క్రూరులను శిక్షించుటకు దాను కట్టించిన కారాగారమునందే బంధింపఁబడియెను. కుతుబుద్దీ నను సరదారుని ఢిల్లీరాజప్రతినిధిగా నియమించి విజయవార్త నన్నగారికి స్వయముగా విన్నవించుటకు గోరీ గజ్నీపట్టణమునకుఁ బోయెను.

కాని గోరీ భారతదేశమునఁ గావింపవలసిన పను లింకను ముగియలేదు. గజ్నీపట్టణమున గ్యాసుద్దీను గోరీయు, శహాబుద్దీనుగోరీయు నేమి యాలోచనములు గావించికొనిరో వారికే యెఱుక. తరువాత వెంటనే గోరీ ఢిల్లీకి వచ్చి మఱలఁ బ్రచండసైన్యమును గూర్చి హఠాత్తుగఁ గన్యాకుబ్జనగరమును ముట్టడించెను.

కన్యాకుబ్జాధీశ్వరుం డెవఁడు? జయచంద్రుఁడు గాఁడా! అతఁడు గోరీనిఁ బిలిచికొనివచ్చి పృథ్వీరాజును బట్టించి ఢిల్లీసింహాసనము నెక్కించినవాఁడే గదా? అట్టి జయచంద్రుని నగరమును గోరీ ముట్టడించుటా? ఈవార్త విని యెల్లరును విస్మితులైరి. జయచంద్రుఁడు తెల్లవోయెను. ఔరా! గోరీసాహసము! ఇంత కృతఘ్నతయా!

పిదప జయచంద్రుఁడు గోరీరాకను గుఱించి యనేకవిధములఁ జర్చించుకొనియెను. తాను గోరీని భారతదేశమునుండి సాగనంపుటకు గుట్రలు పన్నుచుండఁగ నెవ్వఁడో కిట్టనివాఁడు గోరీతోఁ దన మీఁదఁ దాసికలు చెప్పినట్లు, నా కారణమువలన గోరీ తనపై నెత్తి వచ్చినట్లు నాతఁడు భావించెను. కాని తుద కాతని కట్టిదేమియు సంభవింపలేదనియు గోరీ తనరాజ్యమును గూడ హరించుటకు బుద్ధిపూర్వకముగనే వచ్చెననియుఁ దెలియవచ్చెను. వెంటనే యాతని మనస్సు ఛిన్నభిన్నములై పోయెను. భావయంత్రము చిక్కువడిపోయెను. అతని జ్ఞానమంతయు మాయమైపోయి యా స్థానమున భయము పొడసూపెను. వెంటనే చూడలేక పాప మాతఁడు కనులు మూసికొనియెను; గాని కృపాణపాణియై, యాగ్రహనేత్రుఁడై, భయంకరవదనుఁడై గోరీ యా మూఁతవడిన కన్నులయందే సాక్షాత్కరించెను.

అప్పుడు జయచంద్రుని హృదయము మీఁది మౌఢ్యప్రతిసీర తొలంగిపోయెను. ఆతని కిప్పుడు తాను గావించిన కృత్యములయందలి దౌష్ట్య మంతయుఁ గరతలామలక మయ్యెను. మఱియు దేశము నుద్ధరించుటకు స్థానేశ్వరయుద్ధమునఁ బృథివీరాయని పక్షమునఁ బోరి ప్రాణములను విడిచిన సమరసింహాదివీరశిఖామణులు, నగ్నిహోత్రములయందుఁ బడి ప్రాణముల నర్పించిన యిచ్ఛనీకుమారి, సంయుక్త మున్నగు వీరకాంతలును బారులుతీరి మందహాసముతో నిలిచి తన్ను గుఱించి యేమో చెప్పుకొనుచున్నట్లును, ఢిల్లీ సింహాసనము నలంకరించు పృథివీరాజు, విగతనయనుఁడై, బద్ధపాదుఁడై చింకిరిగుడ్డగట్టుకొని ఢిల్లీ కారాగారమునఁ బడి భోరన నేడ్చుచున్నట్లును, దనపై కులుకఁ బోవు గోరీ వెనుక నిలిచి భారతసామ్రాజ్యలక్ష్మి వెక్కి వెక్కి యేడ్చు

చున్నట్లును, గాన్పింప సాగెను. మఱియు నగరప్రవేశసమయమున గోరీభటులచే సంహరింపఁబడిన దిల్లీవారలును, నిప్పుడు గోరీ మఱలఁ దమమీఁదికి దండెత్తివచ్చుటవలన భయభ్రాంతులై యున్న కన్యాకుబ్జవారలును గలిసి తన్నతి నీచముగ నిందించుచున్నట్లును, దన యంతఃపురస్త్రీ లెల్లరును దాను గావించిన యకృత్యములం దలంచికొని తన్నుఁ దిట్టుచు ఘోరముగ విలపించుచున్నట్లును, భారత దేశమందలి రమణీమణు లెల్లరు నకృత్యములను గావించిన తనపై నిప్పులు గ్రక్కుచు శాపోదకములను విడువఁబోవు చున్నట్లును, గూడ గోచరింపఁ జొచ్చెను.

వెంటనే యాతఁడు, తన జీవితము పాపభూయిష్ఠమై, నింద్యమై, నిరర్థకమై పోయిన దనియు, నీ ప్రపంచము నం దెందును దనయంతటి 'ద్రోహి' వంచకుఁడు, కుటిలుఁడు, జాతిభ్రష్టుఁడు, నపాంక్తేయుఁడు నగు పాపాత్ముఁడు లేఁ డనియుఁ, దనకొఱ కింతకు మున్నే యముఁడు నరకమున స్థలనిర్దేశమును, శిక్షానిర్ణయమును గూడఁ గావించియుండు ననియు, యమకింకరులు తమతమ పరికరములతో బాధింపఁ దనకొఱకు వేచియుందు రనియు నూహించికొని, యిఁక గోరీని జయించుట దుర్ఘట మనియుఁ దన కిఁక వినాశము తప్పదనియు నిశ్చయించుకొని దా నిఁక నీ లోకమున బ్రతికియుండుట లజ్జాకరం బనియు, నసంభవ మనియు గూడ నిర్ధారణము గావించికొని, గోరీపైఁ గత్తి గట్టుఁ డని సైనికుల కాజ్ఞాపింపలేక గంగలోఁ బడి ప్రాణములు విడిచెను.

ఈ వార్త విని యంతఃపురస్త్రీ లెల్లరును జోహారు గావించి శాశ్వతానందనిలయమునకుఁ బోయిరి. యవనయోధుల కత్తి కెందు నెదురు లేకపోయెను. కన్యాకుబ్జము గోరీ స్వాధీన మైపోయెను.

వెంటనే యట నొక పాలకుని నియమించి గోరి ఢిల్లీ చేరికొనియెను. జయచంద్రుని వినాశవృత్తాంతము చదివిన వారి కాతనితోఁ గలిసి పని చేసిన భీమహాహులీరాయలయెడలఁ గూడ గోరీ యెట్లు ప్రవర్తించునో యూహించుకొనుట కష్టము గాదు.

పృథివీరాయఁ డింకను ఢిల్లీ కారాగారమునందే నవయుచుండెను. గోరి కెప్పటికైన దయగలుగు నని చెప్పుటకు వీలులేదు. అతఁడు రాజకీయ విషయములయం దెన్నఁడును గనికరము జూపి యెఱుంగఁడు. అయిన నికఁ బృథివీరాజున కెప్పటికిని గారాగారనివాసము తప్పనిదేనా? ఢిల్లీ చక్రవర్తియై యనంతవైభవము ననుభవించిన యాతఁడు బందిఖానా యందే జీవయాత్ర ముగింపవలయునా?

స్థానేశ్వర యుద్ధసందర్భమున ఢిల్లీ దుర్గమునందలి దేవీమందిరమునఁ గూర్చుండి "పృథ్వీరాజరాసా" యను మహాగ్రంథమును రచియించిన మహాకవియుఁ, బృథివీరాయని బాల్యమిత్రుఁడును, విశేషించి యాతని యాస్థానకవియు నగు చాందభట్టను భట్రాజు, రాజు తురుష్కులచేఁ జెఱపట్టఁబడి నప్పటినుండియు నిట్లే యోచించుకొనుచుండెను. ఆ కారణమువలన, నిండోలగంబునఁ దన కత్యంత గౌరవము గావించిన యా ప్రాణస్నేహితున కెట్టులైన మోక్షము గలిగింపకున్నచోఁ దన యంతటి కృతఘ్నుఁ డీ లోకమున వేఱొకఁ డుండఁ బోఁ డనియుఁ, దాను బ్రతికి యుండియుఁ జచ్చిన వారిలో లెక్కయే యనియు భావించి పృథ్వీరాయ మోక్షణోపాయముల నాలోచింప సాగెను.

ఈ సందర్భమున నాతని కనేకవిధము లైన యోచనలు గలిగెను; గాని పునర్విచారణలయందు మాత్ర మన్నియుఁ

ప్రతిహతము లై పోయెను. "ఇఁకఁ బృథివీరాజు జీవించి యుండుట లగ్గా? యిహలోకమును విడిచిపోవుట లగ్గా?" యని యాతని కీ ప్రశ్న తీరకముందే మఱియొక ప్రశ్న తోఁచెను. ఈ రెండు ప్రశ్నలను గుఱించి యోచించుటలో "గోరీనిఁ జంపుట గూడనె" ట్లని యాతనికి వేఱొక ప్రశ్న తోఁచెను.

అతిజటిలము లగు నితిహాసములను విలాసముగఁ గల్పింపగల మహాకవి కుపాయములు తోఁచుటలోఁ గొఱంత యుండఁబోదు. కాని కావ్యముల యందలి పాత్రము లన్నియుఁ దనయిచ్ఛవచ్చినట్లే ప్రవర్తింప వలసిన వగుటచే నెట్టిచిక్కులఁ బైనను కవి తక్కని యుపాయములను బన్ని విడదీయఁ గలఁడు. మఱియుఁ, గుట్రల నుండి తప్పించుకొనుట కుపాయములను బన్నువాఁడే కుట్రలను గూడఁ గల్పించువాఁ డగుటంజేసి కవి తాను విడఁదీయఁ జాలని కుట్రలను గల్పింపనే కల్పింపఁడు. కావ్యములయందలి కుట్రలను బట్టి వానిని విడఁదీయుటకుఁ బన్నిన యుపాయములు సాధారణములైన,నత్యద్భుతములుగనే తోఁచును. అయినను గావ్యములయందేగాని కార్యములయం దట్టియాటలు సాగి రావు. కుట్రలు పన్నువాఁడు ప్రతీకారోపాయముల నూహించు తన కంటె వే ఱగుటచే నిట్టి సందర్భములందు సాధారణముగఁ గుట్రల యాంతరంగిక స్థితి నెఱుఁగుటయే కష్టము. కుట్రలను బన్నువాఁడు విజాతీయుఁ డగు నెడల వాని రహస్యములను దెలిసికొనుట మఱింత కష్టము. మొదటఁ గుట్రల యాంతరంగికస్థితినిఁ దెలిసికొనుట యెంత కష్టమో పిదప వానికిఁ బ్రతీకారములను బన్నుటయు నంత కష్టమే. కావునఁ జాందభట్టునకుఁ దొల్తఁ దురుష్కుల తత్త్వమును దెలిసికొనుట యావశ్యకమయ్యెను. అగుటంజేసి,యాతఁడు పృథ్వీరాజు మోక్షణోపాయమును

దరువాత నాలోచించుకొనవచ్చు నని తలంచి మున్మున్న భగీరథప్రయత్నములు గావించి, గోరీ యనుగ్రహమును సంపాదించి మెల్లమెల్లఁగఁ దవాస్థానమునకు రాకపోకలు గావింప మొదలు పెట్టెను. ఈ సందర్భమున నాతఁడు పృథివీరాజుని బాల్యస్నేహితుఁడగుటఁ బ్రకటన గానీయలేదు. అట్లయిన నాతనికి గోరిచెంతఁ బ్రవేశమే గలుగదు.

గోరీ మహాకవినిఁ బోషింపఁ దగిన యంతటి రసికుఁడు గాఁడు. ఆతఁడు కేవలయుద్ధప్రియుఁడు. వీరచరిత్రములను, యుద్ధవార్తలను వినునంత ప్రీతితో నాతఁడు శృంగారరసభూయిష్ఠములైన గ్రంథములనైన వినఁడు. అక్కతనఁ జాందభట్టునకు సర్వతోముఖమగు తన కవితాశక్తి నంతను జూపుట కవకాశము చిక్కినది గాదు. అతనికి గోరీచెంత నెంతసేపును వీరబీభత్సభయానకరసములనే వర్ణింపవలసి వచ్చెను. ఇతరరసములను వర్ణించుటలోఁ గూడఁ జాల నైపుణ్యముండినను, నా కాలమునందు రాజపుత్రుల నాశ్రయించియుండు భట్రాజులకు ముఖ్యముగా నా రసములను వర్ణించుటయే విధియై యుండెడిది. చాందభట్టునకుఁ గూడఁ దద్రసములను వర్ణించుటయందసామాన్యమగు నైపుణ్యముండుటవలన నాతఁడు త్వరలో గోరీ యనుగ్రహమును బడయఁగలిగెను. మహాకవి కసాధ్యములేదు. ఆతఁడు మూఢుని కుమ్మహృదయమును గూడ సరసము గావింపఁ గలఁడు.

కొలఁది దినములలో గోరీ చాందభట్టు కవిత్వమునందలి పారమ్యమును గ్రహించుటలోఁ జాల నిపుణుఁ డని పేరుగాంచెను. ఒక్కొక్కప్పుడు భట్టు రచించి తెచ్చిన పద్యములను విని గోరీ

వివశుండగుట గూడ సంభవించుచువచ్చెను. గోరీవలన భట్టు కనకాంబరవస్తువాహనాదికము లగు పసదనము లనేకములు సంపాదించెను. గోరీ యాస్థానమునందలి వారెల్లరును భట్టు నెలికతోఁ దుల్యముగఁ జూడసాగిరి. భట్టున కొక్క యంతఃపురము దక్కఁ దుర్గములో నింకెందును బోరాని స్థలము లే దయ్యెను.

ఇట్టి స్థితి సంభవించునప్పటికి భట్టునకుఁ దురుష్కుల తత్త్వమంతయుఁ దెలిసిపోయెను. తన చింతితకార్యము సాధించుకొనుట కప్రతిహత మగు నుపాయము తోఁచెను. అప్పుడు భట్టునకుఁ గలిగిన యానందమునకుఁ బారము లేదు. అతఁడు తన జీవితములో నింతవఱకు నంతటి యానందము ననుభవించి యెఱుఁగఁడు. కారాగారమునుండి పృథివీరాయనికి మోక్షము గలిగినట్లును, గోరీ హతుఁడైనట్లును, దన జన్మ సార్థకమైనట్లును దలంచి యాతఁడు పొంగిపోయెను. ఈ సందర్భమున వాతఁ డొకనాఁడు పేరోలగంబున గోరీప్రతాపమును వర్ణించి వర్ణించి వాని నానందసాగరమున ముంచివైచి "మీచేఁ జెఱఁబట్టఁబడిన వారి నొకమాఱు చూడఁ గోరిక గల" దని చెప్పి నిరభ్యంతర మగు గోరీ యనుజ్ఞ నందెను.

మఱునాఁడు బయలుదేఱి భట్టు నాలుగైదు చెఱలను బరీక్షించెను. అందలి వారు కొందఱు బ్రాహ్మణులు; మఱికొందఱు వీరులు. వారింతవఱకును బద్ధులైన పిదప భారతీయుని ముఖమైనఁ జూచి యెఱుఁగరు. అగుటంజేసి, వారు భట్టు సారని యెంతో సంతసించిరి. వారి వారి యవస్థ లేమేమో చెప్పికొనిరి. కొంతతడ వేడ్చిరి. ఇఁక మాకు మోక్షము లేదా యని భట్టు నడిగిరి. భట్టు వారికిఁ దగునట్టి ప్రత్యుత్తర మిచ్చి పృథ్వీరా జున్న చెఱచెంత కరిగెను.

ఆ బందిగమును సమీపించినపుడు భట్టునకుఁ గలిగిన మనఃక్లేశ మింతింత యని చెప్పఁ జాలము. కాళ్లు కంపింప సాగెను. కంఠమున గద్గదికయుఁ గన్నులయందు బాష్పోద్గమంబును గూడఁ గలిగెను. "కొలువుకూటమున సింహాసనమునఁ గూరుచుండి ధర్మసంరక్షణము గావించుచుండఁ జూచిన కనులతోడనే నేఁడు రాజు విగతనయుఁడై బందిఖానాలో నవయుచుండుటఁ జూడవలసివచ్చెఁ గదా" యని యాతఁడు చాల విచారపడియెను. నిజముగ స్నేహము కొఱకుఁ ప్రాణములను ద్యజింపఁ దలచువారి కింతకంటె విచారహేతు వుండదు గదా?

ఆ వడఁకుచున్న కాళ్లతోడనే భట్టు చెఱలోనికిఁ బోయెను. లోనికిఁ బోవునపుడు భట్టు హృదయము దడదడఁ గొట్టుకోసాగెను. నడువలేక నడువలేక యెట్లో లోనికేగి భట్టొక మూల మూర్తీభవించిన విచారదేవతయో యనఁ గూర్చుండియున్న పృథివీరాయనిం జూచెను. వెంటనే యాతని మనస్సు చెక్కలై పోయెను. భట్టు చైతన్యము లేక యొక నిముస మట్లే నిలిచిపోయెను.

పాప మప్పటికి రాజు తనకు సంభవించిన నికృష్టదశం దలంచికొని వగచుచుండెను. కనులనుండి యశ్రుధారలు ప్రవహించుచుండెను. తిన్నగ నాహారనిద్రలు లేకపోవుటవలనను, సమధికంబగు మనఃక్లేశమువలనను, నాతఁడు చాలఁ జిక్కిపోయి యుండెను. శిరస్సు ముండితం బగుటను, జూచుటకుఁ గన్నులు లేకుండుటను, లలాటగండఫలకములు ధూళిపరీతంబు లగుటను, ముఖము రాహుగ్రస్త పూర్ణచంద్రమండలమువోలెఁ గళావిహీనమై యుండెను. చిరకాలమునుండి, స్నానము లేకుండుటంజేసి చిక్కి శల్యావశిష్టమై

యున్న దేహము మసిలోని బంగరు శలాకవలె నుండెను. హృదయఫలక మెంత బీటలు వాఱిపోయినదో, భావసూత్ర మెంత చిక్కులుపడియున్నదో, యాతనికే యెఱుక. చూచుటకుఁ గన్నులు లేకపోవుటను, గాళ్లకు లోహపుబేడీలు వేయఁబడియుండుటను నెంత బాధగా నున్నదో యాతనికే తెలియును. అట్టి స్థితిలో నున్న పృథ్వీరాజు భట్టు లోనికివచ్చినప్పు డొకింత యలికిడియగుటచే మొగము పైకెత్తి యెవరు వారని పలుకరించెను.

ఆ ప్రశ్న కేమని ప్రత్యుత్తరము చెప్పవలెను? ఉత్కటవిచారమువలన భట్టునకుఁ గొంతవఱకు నేమియుఁ దోఁచినది గాదు. తుదకాతఁడు గద్గదమైపోయిన కంఠము నెట్లో యొకింత తెఱపిచేసికొని "సార్వభౌమా" యని పిలిచెను. వెంటనే రాజు వచ్చి సుకవీ! యని భట్టుపైఁబడి విలపింపసాగెను. అది చూచి భట్టొకింత తెప్పిరిలి "యీశ్వరుఁడు రాజు నింకను సర్వశూన్యునిఁ గావింపలే" దని చాల సంతసించెను. ఆరహస్య మేమో?

కొన్ని నిముసములు గడచిపోయిన తరువాత రాజు "మిత్రమా! నీ వింకను జీవించి యుంటివా?" యని ప్రశ్నించెను. "నీ బంధమోక్షణము కొఱకు. ఇప్పుడు గోరీసాస్థాన కవినై యాతని మన్ననలం బడయుచున్నాఁడ" నని భట్టు రాజునకు సంగ్రహముగఁ దన యభిప్రాయము నెఱింగించెను. రా జందేమి విశేషార్థమును గ్రహించెనో గాని యెంతో యానందించెను. అతఁడు మైత్రియందలి ఘనత నిప్పుడు గ్రహించిన ట్లెప్పుడును గ్రహించియుండలేదు. ఇట్టి యవసరములయందే స్నేహగౌరవము ప్రకాశమగును. ఇతరులతో నత్యంత స్నేహము గావించిన వారే స్నేహగౌరవమును. దెలిసికొనఁగలరు

తాను సార్వభౌముఁడైనను గొంచెమైన గర్వము లేక పృథివీ రాజు భట్టుతో నభేదముగఁ బ్రవర్తించెను; గావుననే భట్టు నేఁడిట్టి ప్రయత్నము సేయుట తటస్థించెను. ఇది యంతయు నూహించి కాని యింతవఱకు "దేవుఁడు లేఁడు. ధర్మమునకు బలము లే" దని వగచు పృథివీరా జిప్పుడు దేవుని యస్తిత్వమునందును, ధర్మప్రభావమునందును, విశేషించి ఋణబంధమోక్షమునందును విశ్వాసము దాల్చెను. పిదపఁ గొంతతడవు వా రేమేమో మాట్లాడుకొనిరి. భట్టు వెడలిపోయెను.

నాఁటి సాయంత్రము భట్టు యథాపూర్వముగ దర్బారున కరిగెను. ఆ నిండోలగంబున భట్టు బందీసందర్శనప్రసంగము వచ్చెను. వెంటనే భట్టు లేచి తన యనర్గళకవితాధారం బ్రవహింపఁ జేసి పెద్ద యుపన్యాసము చేసిచేసి పిదపఁ "బృథివీరాజు కనులకుఁ గంతలు కట్టుకొని ధ్వనిజాడం బట్టి లక్ష్యభేదనము గావించుచుండు వాఁడఁట! అట్టి రౌద్రాగ్రేసరునిఁ గూడ విలాసమాత్రమున బద్ధునిఁ గావించిన నీ ప్రతాప మమానుషం"బని గోరీనిఁ బొగడి పొగడి విడిచెను. అంత గోరీ యబ్బురంపడి "గ్రుడ్డివాఁడై యున్న యాతఁ డిప్పుడు గూడ నట్టి శరసంధానచాతుర్యమును జూపఁగలఁడా?" యని ప్రశ్నించెను. భట్టు చూడవచ్చు ననియెను.

అది విని సభికు లెల్లరును జమత్కృతు లైరి. మఱియు నెల్లరు నా వినోదమును జూడ వేడుకపడి సుల్తానువంకఁ జూచిరి. సుల్తాను వారి యింగితముల నెఱింగి తాను గూడ నా వింతఁ జూడ వేడుకపడుచున్నవాఁడే గావునఁ బృథివీరాయునిఁ దీసికొని రమ్మని [illegible]కసరదారున కాజ్ఞ యిచ్చెను.

ఆతఁడు వెంటనే చెఱసాలలోనికిఁ బోయి "పృథివీరాజా!" యని పిలిచెను. రాజు చెఱసాలకు వచ్చిన తరువాత నా పేరుతోఁ గాని యంత గౌరవముగఁ గాని యెవరు నాతనిఁ బిలువ లేదు. వా రాతనిం జాల నీచసంబోధనములు గావించెడి వారు. అక్కతన రాజు నేఁటి మార్పునకు వింతపడి నిముసములోఁ గారణ మూహించుకొని "బెబ్బులి కింత సౌమ్యత యెప్పుడు వచ్చిన" దని మాఱు పలికెను. అందలి యర్థ మత్తురుష్కున కవగతము కాలేదు. ఆతఁ డొకింత తడవూరకుండి మఱలఁ బృథ్వీరాజా! యని పిలిచెను.

"వీఁడు పట్టి మొద్దని భావించి తనలోఁ దాను నవ్వుకొని రా జెందుల కని యడిగెను. సరదారుఁడు సుల్తాను నభిప్రాయము నెఱింగించెను. అది విని రాజు "బికారివేసములో నున్న యోధుఁడు శరసంధానము సేయఁ కలఁడా?" యని ప్రశ్నించెను. అత్తురుష్కుఁడు "దన్నా రాజున కెంత యభిమాన!" మని వింతపడి యేమనెద నని యెను. 'లాగు, కాపెకోక, అంగరకా, సాగా, మొలలోఁ గైజారు' నున్న గాని నేను శరము బట్టఁ జాల నని సుల్తానుతోఁ జెప్పు మని రాజు వాని నంపివైచెను. సుల్తా నందుల కంగీకరించి వాని నంపివైచెను. రాజు వానిని ధరించి బయలుదేఱెను. సరదారుఁడు రాజును దారితప్పిపోకుండఁ దన చేతిగఱ్ఱను బట్టుకొని రమ్మనియెను; గాని రా జందులకు నవ్వి "కఱ్ఱతోఁ బనిలేదు. నీవు మాట్లాడుచు నడువుము. నేను నిన్ననుసరించి వచ్చెద" ననియెను. సరదారుఁ డట్లే చేసెను. రాజు దర్బారులోనికి వచ్చెను.

రాజు నారసి సభ్యులెల్లరు నాతఁ డేమి మాట్లాడునో యని నిశ్శబ్దముగ నుండిరి. అట్టి స్థితిలో గూడ రాజు నెమ్మొగమునఁ

దాండవము సేయు శౌర్యగాంభీర్యముల నారసి గోరీ యులికిపడెను. అప్పుడు గోరీకిఁ దా నేడు తడవ లాతనిచేతఁ జిక్కి భగీరథప్రయత్నముల వలనను, రాయని యఖండకృపవలనను విడువఁబడిన వృత్తాంతము జ్ఞప్తికి వచ్చెను. వెంటనే యాతని హృదయము మొకింత చలించెను; గాని ధైర్యము తెచ్చుకొని "రాజా! నీ శరసంధాననైపుణ్యము జూడఁ గోరుచున్నా" నని పలికెను. రాజు " చూడ వచ్చు " నని యూరకుండెను.

అపుడు తాతార్ఖానుఁడు తిరస్కారసూచకముగ మందహాసము గావించి "రాజా! యోధవేష మలవఱచికొంటివి. కవచము మాత్రము లోపమై యున్నది. అది యక్కఱ లేదా?" యని ప్రశ్నించెను. రాయఁడు ఖానుని దిక్కు మొగంబై గంభీరముగ నిలువఁబడి తాతార్ఖానుఁడా! యని సంబోధించి "నీవు గూడ శరసంధానచాతుర్యము జూప నెంచెదవా యేమి? అట్లయిన నీవు వేగముగఁ గవచము ధరించి రమ్ము. నా కక్కఱ లే"దని ప్రత్యుత్తర మిచ్చెను. అందులకు మాఱు పల్కలేక ఖానుఁడు తలవంచికొని యూరకుండెను. సభ్యులు రాయని శూరత్వమును మెచ్చుకొనిరి. సుల్తాను శరవినోదప్రదర్శనమునకు రాయనిం ద్వరపెట్టెను.

ఒకింత దవ్వున నొక బెత్తముతో నచ్చటి స్తంభముమీఁదఁ గొట్టి ధ్వనిసేయుట కొక సరదారుఁడు నియమితుఁ డయ్యెను. సభయందలి యెల్లర దృష్టులును స్తంభమునకును రాజునకును నడుమఁ బర్వు లిడసాగెను. అంత వేఱొక సరదారుఁడు విల్లునమ్ములను గొనివచ్చి రాజున కిచ్చెను. కాని రాజు వానినిఁ జేతఁబట్టి చూచి "యివి ధను ర్బాణములు గావు. వీనితో నే నేమియుఁ జేయఁ

జాలు" నని క్రిందఁ బడవైచెను. రాయని గ్రహణశక్తి యా సభయందంతటను రహస్యముగఁ గొనియాడఁ బడెను. రాయని ధనుర్బాణములను దెచ్చి యిచ్చుటకు సుల్తాను నాజ్ఞ యయ్యెను. వెంటనే యా యానతి పాలింపఁబడెను.

రాజు తన ధనుర్బాణములను జేఁగొని మనస్సునందే వానిని మ్రొక్కి యభినందించి యాశ్రమంబున నల్లెక్కువెట్టి నారి టంగుటంగున మ్రోయించి విడిచెను. ఆ యద్భుతధ్వనిచే నచ్చటి సరదారుల హృదయములు వీరరసపూరితము లయ్యెను. ఈ స్థితి గోరీకిఁ గూడఁ గలిగెను. చాందభట్టు గూడఁ దన్మయుఁ డయ్యెను. వెంటనే యాతడు కవితావాహిని యడ్డుకట్టు దెగఁగొట్టి గోరీనిఁ గొనియాడుచు, రాయనిం బ్రబోధించుచు నాతని దరిఁ జేరెను.

భట్టు కవిత్వమువలన రాయని శౌర్యమును, గోరీశౌర్యమును, సభ్యుల శౌర్యమును గూడ మఱింత యుద్రేకించెను. రాయఁడు మఱల నారి మ్రోయించెను. ఆ గుణధ్వని "యిట శూరు లైనవా రెవరో లెండు. అనంత మగు కీర్తికిఁ గాని, యక్షయం బగు వీర స్వర్గసౌఖ్యమునకుఁ గాని ప్రాణముల నైన విడువఁ దలంచెడి వా రెవరో రం" డని పిలుచుచున్న ట్లుండెను. ఉండుట యేమి? ఆ గుణధ్వని యర్థ మదియే. దానివలన నెల్లరును మఱింత వీరరసోద్రిక్తు లైరి. ఇది యంతయుఁ జూచి "మీ మనస్సుల నవ్వాత్ర మఱల్పకుఁడు. మీ చూడ్కులు లక్ష్యమునందే ప్రతిష్ఠింపుఁ" డని భట్టు సభికుల నెల్లరను బ్రబోధించి ధ్వనిచేయు మని సరదారునకుఁ గన్నుగీటెను. వెంటనే నిశ్శబ్ద మైన యా సభలో టకటకధ్వని వ్యాపించి, సభ్యుల నాందోళ పఱిచెను. రాయఁడు ధ్వని నాలకించుచు

నుత్సాహుఁడై యట్లే నిలుచుండెను. అదిచూచి సుల్తాను "జాల మేల? కొట్టు" మని కేక వేసెను. సభ్యులెల్లరును లక్ష్యమునందే దృష్టి నిలిపి యుండిరి. భట్టు చాలఁ గనుగలిగి యుండెను. క్షణములో నా టకటకధ్వని కిర్రివ్వు మను ధ్వనితో మిళితమై వెంటనే "హా హా! చచ్చితి" నను నా క్రందనధ్వనిలో లీనమైపోయెను. ఆ వెంటనే హరహరా, యను మఱియొక గంభీరధ్వని యా సభామండపస్తంభములను గూడ గడగడ లాడించెను. "మహాదేవా!" యను మఱియొకధ్వని యా గభీరారావమునకుఁ బ్రాణమువోసెను. ఆ వెంటనే మఱల సభలో గాంభీర్య మొక్క క్షణకాలము విరాజమానమయ్యెను. లక్ష్యమునందే ప్రతిష్ఠింపఁ బడి యున్న సభ్యుల దృష్టి లాలస్యమున కోర్వఁజాలక తటాలున నొకమాఱు రాజుదెసకు మఱలెను. కాని యేమి ప్రయోజనము? అంతయు విపరీతముగఁ బరిణమించి పోయెను. ప్రపంచ మంతయుఁ దలక్రిందులైన ట్లయి పోయెను. రాయని శిరాఘాతమువలన గోరీ సమసెను. రాయఁడును, భట్టు నొకరినొకరు పొడుచుకొని స్వర్గమునకుఁ బోయిరి.

ఆశ్చర్యచకితము లగు సభ్యుల దృష్టులు తొలుత రాయనియొక్కయు, భట్టుయొక్కయుఁ గళేబరముల నుండి ప్రవహించు రక్తప్రవాహపు సుడిగుండములలోఁ బడి మునిఁగిపోయి యెట్టకేలకుఁ దేలి తెప్పరిలి వెంటనే గోరీకళేబరమునుండి ప్రవహించు రక్తవాహినిలోఁ బడిపోయెను. వెంటనే సభయందంతట నొక్క పెద్ద కోలాహలము ప్రారంభ మయ్యెను. అందఱును బిచ్చియెత్తి నట్లు పరువు లెత్తసాగిరి. కొందఱు గోరీ నాడినిఁ బరీక్షింపఁ దొడఁగిరి. మఱికొందఱు రాయభట్టుల కళేబరములను ద్రొక్కి వానిపై నుమియ సాగిరి. కొందఱు వైద్యులు వైద్యు లని కేకలు పెట్టిరి. అట్లు కొన్ని

నిముసములు గడచిపోయిన పిదప నిఁకఁ బ్రయత్నము లనావశ్యకము లనియు, భట్టును, రాయఁడును గూడ గతించి రనియు నందఱకును దెలిసి పోయెను. అందఱును గడగడ లాడిపోయిరి. ఆకంప మొకింత యడఁగిన తరువాత నిఁకఁ జేయునది లేక గోరీ కళేబరమును మహా వైభవముతోఁ బూడ్చివేసిరి. రాయనియొక్కయు భట్టుయొక్కయుఁ గళేబరములను యమునలోఁ బారవేయించిరి; గాని యా భారతీయుల నా యమునానదీమతల్లి పూతులం గావించు నని సంతాప దగ్ధహృదయు లగు నస్మత్పురుషు లప్పుడు గ్రహింపలేకపోయిరి.

ఇంతటితోఁ బృథివీరాయని చరిత్రము ముగిసినది.

ఈ చరిత్రమునందలి ముఖ్యపాత్రములలో గోరీ యొకఁడు. పృథివీరాయఁ డొకఁడు. జయచంద్రుఁ డొకఁడు. చరిత్రమునం దీ యుద్ధసందర్భమున రాయని మామ యగు జైతపరమారుని ప్రశంస యేమియు లేదు. ఇ య్యవసరమున భోలాభీముని విషయమునఁ గూడఁ జరిత్ర మౌదాసీన్యము వహించినది. మఱియొక వీరుఁడు సమరసింహుఁడు. ఇఁక మిగిలిన యాతఁడు హాహులీరాయఁడు. ఈతనిఁ గూడ మన మీ చరిత్రమునందలి ప్రధానపాత్రగా స్వీకరింపవచ్చును.

ఈతనిని రా జవమానపఱిచిన మాట యథార్థము. ఈతనియెడ నపరాధ మేమియు లేకపోవుటయు స్త్రీలంపటుఁడై రాజీతని నక్రమముగ శిక్షించుటయుఁ గూడ యథార్థములే. అక్రమ శిక్ష విధించి నపు డెట్టివానికిఁ గోపము రాకమానదు. అట్టిచో శూరుఁడై సేనానియైన వాని కాగ్రహము వచ్చుట తప్పు గాదు. శూరునకు మానహానికంటె మరణము మేలు. త న్నతినీచముగ నవమానపఱుచుట

వలన నీతఁడు రాజునకుఁ బ్రత్యుపకారము గావింతు నని శపథము
దాల్చుట మే మాక్షేపింపఁ జాలము; గాని యాతఁడు తనశపథమును
దీర్చికొనుటకుఁ జేసిన ప్రయత్నము మంచిదా చెడ్డదా యని ప్రశ్న.

ఇది యంత కఠినమైన ప్రశ్న గాదు. పోహాలీరాయఁడు తన
శపథమును దీర్చుకొనుటకై చేసిన ప్రయత్నమువలనఁ బృథివీరాయ
నికే గాని మఱి యెరికిని బాధ కలుగఁగూడదు. న్యాయ మిట్లుండ
నీతఁడు చింతితకార్య నిర్వాహణమునఁ దోడ్పడుటకై గోరిని సాయము
గోరెను. గోరీ యాగమనమువలనఁ గలిగిన ఫలము భారతసామ్రాజ్య
విధ్వంసము. పృథ్వీరాయపదభ్రంశ మనుట సాహసము. అగుట
నీతని శపథము నెఱవేఱ లేదు. ఈతనికిఁ దన కవమానము జరిగిన దని
తెలియును; గాని దాని యాంతర్యము తెలిసినది గాదు. అగుటవలననే
యేమిచేసినఁ బృథివీరాయనికిఁ బరాభవ మగునో యాతఁడు గ్రహింప
లేక పోయినాఁడు. మొత్తము మీఁద నీతఁడు శూరుఁడే గాని జ్ఞాన
లవదుర్విదగ్ధుఁడు.

శహాబుద్దీనుగోరీ యభిప్రాయములును, బ్రయత్నములును జేష్ట
లును, ధర్మబద్ధములా, ధర్మబాహ్యములా యను సమస్య రాజ్య
తంత్రమున రవంతైన జ్ఞానము లేనివారికిఁ దీరునది గాదు. మే
మాతనిని గుఱించిన విమర్శలోఁ బుటలను నింపివేయఁ దలంచికొన
లేదు. ఎన్ని విధముల నెన్ని యిక్కట్టులు వచ్చినను గోరీ వెనుదీయని
యోధశిఖామణి. కావుననే యాతఁడు విజయలక్ష్మిని జేపట్టఁ గలి
గెను. ఇంతియ చాలును.

జయచంద్రుని చరిత్రము ప్రారంభమునుండి సమాప్తివఱకు
నెగుడుదిగుడులు లేక యొక్కతీరున నున్నది. అతని హృదయ

క్షేత్రమున నసూయాబీజమును జల్లినవాఁ డనంగపాలుఁడు. అయినను క్షేత్రము మంచిది గాకపోవుటచే నా యసూయాంకురములు వెఱ్ఱితలలు వైచినవి. మధ్యమధ్యఁ దటస్థించిన సంభవముల ననుసరించి యా యసూయాంకురము లా వెఱ్ఱితలలతోడనే యెంతవఱకుఁ బెరుగఁగలవో యంతవఱకును బెరిగిపోయినవి. వెఱ్ఱితలలు వైచిన వృక్షము లెట్టి ఫలముల నిచ్చునో వెఱ్ఱితలలు వైచిన యా యసూయాంకురములు గూడ నట్టి ఫలములనే యిచ్చెను. జయచంద్రుఁడు గంగలోఁ బడి ప్రాణములను విడిచెను. చరిత్రకారులును, జనులునుగూడ జయచంద్రుని, దేశఘాతుకుఁ డనియు, నధమాధముఁ డనియు నిందించుచున్నారు.

పృథివీరాయని చరిత్రమున ననేకవిధము లైన రంగములు ప్రసక్తము లైనవి. అశక్తతన నాతని చరిత్ర నామూలాగ్రముగ ననేకు లవగాహనము చేసికొనలేకపోవుచున్నారు. దాని యందలి మర్మార్థమును దెలిసికొన వలసిన భారమును మేము పాఠకమహాశయులకే విడిచిపెట్టుచున్నారము. ప్రజల సుఖమునకును, దేశస్వాస్థ్యమునకును రాజేయాధారభూతుఁ డైయుండుటవలనఁ జేజిక్కిన వైరిని విడిచిపెట్టు రాజులను రాజ్యతంత్రము గర్హించుచున్నది. గోరీని విడిచిపెట్టకపోయినచోఁ గొంప మునిగిపోవు సందర్భము లేవియుఁ దటస్థించి యుండనట్లు చరిత్ర వివరించుచున్నది. విడిచిన కొలందిని మీఁదికి వచ్చువానిని విడుచుట యవివేకిలక్షణ మను విషయము మూఢులకుఁ గూడఁ దెలియనిది గాదు.

పృథివీరాజు, తనభోగకాంతను మోహించిన కయమాసమంత్రిని సంహరించుట, తనకు మిక్కిలి ప్రీతిపాత్ర మగు చేమఁగుణ

జంపిన చాముండరాయనికిఁ గారాగారశిక్ష విధించుట మున్నగు విషయములను విమర్శించుటకు మేము రాజ్యతంత్రజ్ఞులను బ్రార్థించుచున్నారము. రాయఁడు, తాను హాతాఖానునిచేఁ బట్టుబడి యీ రొక్కమాటు విడువు మని ప్రార్థించుటచే గోరీ నేఁడుతడవలు విడుచుటవలన నే కీర్తి గలుగు నని తలంచెనో యా కీర్తివలనఁ గూడ వంచితుం డయ్యెను. తుద కట్లయిన నేమి? భారతసామ్రాజ్యము విచ్ఛిన్నమై పోయెను. చరిత్రకారులును, బ్రజలును గూడఁ బృథివీరాయఁడు దేశభక్తుఁడనియు, భారతమాతృసత్పుత్రుఁ డనియు స్తోత్రము చేయలేక విసిగి పోవుచున్నారు.

ఈ సందర్భమున మనము చాందభట్టును విస్మరించితి మేనిఁ జాల నింద్యుల మయ్యెదము.

చాందభట్టు మహాకవి. ఈతఁడు "పృథివీరాజరాసా" యను పేరునఁ బృథివీరాజు చరిత్రమును రచియించెను. అది హిందీలో నొక యంతర్భాగం బగు చారణీభాషలో వ్రాయఁబడిన లక్షగ్రంథము. కావున నీతఁడు గౌరవపాత్రుఁ డనుటకు సందేహము లేదు; గాని మే మీతని కొసంగిన గౌరవ మంతయు నందులకే యని తలంపవలదు. బాల్యమునుండియుఁ దన్న భేదప్రతిపత్తితోఁ జూచిన రాయని యెడల నతఁడు కనఁబఱచిన కృతజ్ఞత సంస్తవనీయము. రాజు బందిగంబున నున్నంతకాలము నీతఁ డనుభవించిన విచారపుఁ బరిమితి, పిదప మిత్రుని బంధమోక్షణార్థము గావించిన ప్రయత్నములను బట్టి మనము తెలిసికొనవచ్చును. ఈతఁడు రాజు బంధమోక్షముకొఱకే గోరీపైఁ గవిత్వము చెప్పెను గాని ధనసంపాదనము కొఱకు గాదు. మిత్రునకు బంధమోక్షణము గావించి యాతని వైరి వానిచేతనే చంపించి యాతనితోఁగూడ నిహలోకమును బాసిపోయిన యీ

మహాకవినిగుఱించి మనుష్యమాత్రుఁ డెవ్వఁడును వ్యతిరేకాభిప్రాయమును గలిగి యుండఁ జాలఁడు.

అయిన నతఁడు రాయని కొఱకుఁ బ్రాణములను గూడ విడుచుటకుఁ దగిన కారణము లేమి యున్నవో మన మొకింత పరిశీలింతము. రాయఁ డీతని కవిత్వమును మెచ్చుకొని ధనకనకవస్తువాహనము లవ్వారిగ నొసంగెను. ఇంత మాత్రముననే భట్టు రాయని కొఱకు ప్రాణములను బాసెనా? ఇది సరియైన కారణము కాదు. ధనమువలననే లోకప్రవృత్తి యంతయు జరుగుచున్న దని మేము చెప్పఁజాలము. "ధనమూలమిదంజగ" త్తను లోకోక్తిని మే మెఱుంగక పోలేదు; గాని యీ లోకోక్తి కంతటను సిద్ధి లేదు. ఇఁక నిందలి రహస్య మేమనగా?

రాయఁడు, భట్టునకు మనసిచ్చి మనసు పుచ్చుకొనియెను. ఈ రూపమున వారి యంతరంగముల కైక్యము సంఘటిల్లినది. కావుననే రాయఁడు కారాగారమున నున్నపుడు భట్టు నానాబాధల ననుభవించుటయు, నాతని బంధమోక్షము కొఱకు ప్రయత్నించుటయు, నాతనితో నీ లోకమును విడుచుటయు సంభవించినది.

కవి యైనంతమాత్రమున భట్రాజుతో స్నేహము గావించినందులకు రాయఁడు స్తుతిపాత్రుఁడే; గాని రాజు తన యెడలఁ జూపిన గౌరవమును గ్రహింపఁ గలిగినందులకు మనము భట్టు నెంతయు మెచ్చుకొనవలసియున్నది. భట్టు హృదయము గూడ విశాలము గావున నట్టిది సంభవించెను. హృదయవైశాల్యమే మానవుల కౌన్నత్యము సంఘటించునది.

శ్రీరస్తు

వీరపూజ

ప్రథమ భాగము

భీమసింహుఁడు

లక్ష్మణసింహుఁడు చిత్తూరు దుర్గమునందలి మేవాడు సింహాసనము నలంకరించి ధరాపాలనము గావించుచుండెను. యుద్ధాదికము లగు నుత్పాతము లేవియు లేమిం జేసియు, సహజముగ రాజు ప్రజాసౌఖ్యము నభిలషించువాఁ డగుటను దేశము శాంతిభూయిష్ఠంబై యుండెను. ప్రజ లెల్లరు రాజభక్తితత్పరులై, యఖండసౌఖ్యములతోఁ దులతూఁగుచుండిరి.

సృష్టిరహస్య మేమో గాని, శాంతి కెందును సుస్థితి గలుగుట చూడము. అలజడు లన్నియుఁ బోయి శాంతి నెలకొనిన దని వినిన మఱువాఁడే, యెచ్చటనో, యేవిధముననో, మఱల నశాంతి ప్రబలిన దను వార్తయే వినవచ్చుచున్నది. మొత్తము మీఁద విమర్శలోఁ జూచినచోఁ బ్రపంచ మంతయుఁ గల్లోలసంకుల మగు మహోదధి ననుకరించి యున్న దనుట యథార్థము. మహోన్నత మగు నొక్క యల వచ్చి యల్లకల్లోలము గావించిపోయిన పిదప,

మఱల వేఱొక యల వచ్చునంతలో నట సముద్రము శాంతమై యున్నట్లు కాన్పించును. భౌతిక ప్రపంచప్రవృత్తి గూడ నిట్టిదియే. ఒకానొకప్పు డే దేశమునందైనఁ గొన్ని దినములు శాంతి నెలకొనినచో నా శాంతి యాగామి యగు ప్రబలాశాంతిని సూచించును. ప్రకృతము మేవాడు రాజ్యమునందలి శాంతి గూడ నిట్టిదే యైనది.

భీమసింహుఁడు రాణాలక్ష్మణసింహునకుఁ బినతండ్రి. అతఁడు భీముని వలె మహాపరాక్రమశాలి. వివేకసహితుఁడు. సుగుణములకుఁ బుట్టినిల్లు. అతఁడు ఖడ్గవ్యాపారమున సర్వసేనాధిపతియుఁ, గార్యాలోచనమున మహామాత్యుఁడును, బాంధవమునఁ దండ్రియంతటివాఁడునై, త్రికరణశుద్ధిగ రాణా యభ్యుదయమునే గోరుచు నాతనికిఁ గుడిభుజమై యుండెను.

అతఁడు సింహాల ద్వీపపురాజగు హామీరసింహుని కూఁతురు పద్మినీదేవి యను నామెను బరిణయమయ్యెను. ఆమె ప్రపంచమునం దెందు నంతటి చక్కనిచుక్క లేదని పేరు గాంచెను. మఱియు, నామె చక్కఁదనమునకుఁ దగునట్లు సుగుణవతియై, యన్ని విధముల భర్త కనురూపయై యాతని పదదాసియై మెలఁగుచుండెను. ఇఁక భీమసింహుఁడు స్వర్గసౌఖ్యము ననుభవించుచున్నాఁడనుటలో వింత యేమి యున్నది? ఇహలోకమున భార్యకంటె సుఖదాయక మగు వస్తువు మఱియొకటి యేమున్నది.?

“భార్యారూపవతీశత్రు.” వని యొక గ్రామీణోక్తి గలదు. ప్రాపంచికవృత్తిమును విమర్శించి చూచినచో నిది యథార్థ మని చెప్పుటకు సందేహ మక్కఱలేదు. రూపవతులకొఱకనేక యుద్ధములు

ప్రవర్తిల్లినవి. అనేకవంశము లంతరించిపోయినవి. అనేక రాజ్యము లడుగంటినవి. రూపవతి యగుట వలననే దేవయాజనసంభవ యగు జానకి రావణాపహృత యైనదని యొక చాటూక్తి గలదు. ఎచ్చట నైన నే కారణమువలన నైన నీ గ్రామీణోక్తి కప్పుడైన వ్యతిరేకము జరుగుట సంభవించినను మొత్తము మీఁద దీనినిఁ ద్రోసివేయుటకు వలనుపడదు. పురాణములయందే గాక భారతదేశేతిహాసమునఁ గూడ దీని కనేకోదాహరణములు కాన్పించుచున్నవి.

మేవాడు రాజ్యమును రాణా లక్ష్మణసింహుఁడు పరిపాలించు కాలమున నల్లాయుద్దీనుఁ డను తురుష్కుఁడు ఢిల్లీ సింహాసన మధిష్ఠించి యుండెను. అల్లాయుద్దీనుఁడు ఖిల్జీ వంశజుఁడు. ఫిరోజను నాతఁడు బానిసవంశమునందలి కడపటివాఁ డగు కైకుబా దను సుల్తానునిఁ జంపి జలాలుద్దీనుఁడను పేరుతో ఢిల్లీశ్వరుఁ డయ్యెను. అల్లాయుద్దీనుఁడు జలాలుద్దీనుని తమ్ముని కుమారుఁడు. అల్లాయుద్దీనుఁడు సాహసధైర్యములయం దసమానుఁ డగుటచేఁ బెదతండ్రి యాతనినిఁ జాలఁ బ్రేమతోఁ జూచుచుఁ బెద్దపెద్ద కార్యములయందు వినియోగించుచుండెను. ఇట్లు చాలఁగాలము కడచిన పిదప నల్లాయుద్దీనుఁడు పెదతండ్రినిఁ జంపి ఢిల్లీశ్వరుఁ డయ్యెను.

పిదప నల్లాయుద్దీనుఁడు పద్మిని యంతటి సుందరి యీప్రపంచమున లేదని వినియెను. ప్రకృతిధర్మమేమో గాని "సుందరి, సుందరుఁడు" నను మాటలు రెండును వినిపించిన వెంటనే స్త్రీపురుషుల హృదయముల కొకవిధ మగు చలనము గలుగుట చూచుచున్నారము. హృదయ మన్యత్ర పనిసేయునప్పు డీచలనము పాలపొంగు వలె నంతలో శాంతించిపోయినను, హృదయము సుస్థిరమై

యున్నపుడు మాత్ర మంతకంతకు వృద్ధియై, దుర్భరమై కామాంకుర ములను తెచ్చెదించుచున్నది. అపిమ్మట జరుగునదియు, జరుగుచున్న దియు విస్పష్టమే. అనేక పురుషులు సుందరు లని వినినంతనే యా స్త్రీలకొఱకు కస్తులు గూర్చి వేలకొలఁది జనులను సంహరించిరి. అనేక స్త్రీలు కళ్ల లోకేంద్రవైభవములను గూడఁ బరిత్యజించి యొక దేమనుకొనెదరో యను సందియమును విడిచిపెట్టి సుందరపురుషుల కొఱకు కలువడిచి నిర్జనప్రదేశములకైనఁ బోయియున్నారు. అయినను మే మా విషయమును చెప్పుటకుఁ జెప్పుట లేదు. ఇఁక మా సందియ మేమనఁగా? స్త్రీపురుషుల హృదయములకు వికారములను గలిగించు నా శక్తి సౌందర్యమునందే యున్నదా? సౌందర్య శబ్దమునందుఁ గూడ నున్నదా?

పద్మినీదేవి త్రిలోకసుందరి యను మాట యల్లాయుద్దీనుని హృదయమున కొకమాఱు చలనమును మాత్రము గలిగించి యూరకుండ లేదు. వెంటనే దానివలనఁ గాఁదగిన పని యేమో యైపోయెను. అతని హృదయమునఁ గామాంకురములు మొలకలెత్తెను. ఆ కామము నశించిపోవుటకుఁ దగిన యవకాశము లేమియుఁ దట స్థించినవి గావు. క్రమక్రమముగ నా కామము మోహముగాఁ బరిణ మించెను. తుదకుఁ బద్మినీమోహనరూప మాతని హృదయక్షేత్ర మునఁ దాండవము ప్రారంభించెను. అతఁ డెప్పుడును బద్మినిని బ్రత్యక్షముగఁ గాని, పటమునఁ గాని చూచి యుండ లేదు. అయిన నేమి? భగవంతునిచే నొసంగఁబడిన భావనాబలము నిరంకుశమై యుండ వానికిఁ బద్మినీమోహనరూపసందర్శనమున కభ్యంతర మేమి? అదియైన తరువాత నిఁకఁ గావలసిన దేమున్నది? రాజ్యపాలనమున

నశ్రద్ధ తృప్తమైను. నిద్రాహారములయం దాసక్తి పోయెను. ఇంకం బద్మినీదేవి తన యంతఃపురమునకు వచ్చినం గాని బ్రతుకంజాల నని యాతండు నిశ్చయించుకొనియెను.

అది యేమి చిత్రమో గాని భారతదేశేతిహాసమున వర్ణింపంబడిన తురుష్కరాజులలో నేమి సరదారులలో నేమి యనేకులు భారతీయ స్త్రీలకు మానభంగము గావింపం దలంచికొనిన వారే కాన్పించుచున్నారు. అనేకు లాప్రయత్నమున లబ్ధవిజయు లైనారు. అనేకులు విఫలప్రయత్ను లైనారు. అనేకులు ప్రాణములు గూడం దొరంగినారు. కొందఱు కొన్ని సంసారములను గూలంద్రోసినారు. మఱికొందఱు కొన్ని రాజ్యములను బగ్గంపాలు చేసినారు. అనేకులు భారతరమణీమణులచేతులలోనే మడిసినారు. దీనివలనం దురుష్కులందఱు నట్టి కాముకులే యనియు, దురుష్కజాతి కంతకు నది సహజగుణ మనియు మేము చెప్పుట లేదు. భారతదేశమునం బరిపాలనము గావించిన యే తురుష్కుని చరిత్రమును వ్రాయంబూనినను సాధారణముగ భారతస్త్రీమానభంగమును గూర్చిన వారి ప్రయత్నములను వర్ణించుట యనివార్య మగుచున్నపు డీవిషయమును బ్రత్యేకముగ వివరించి చెప్పుటకుం బక్షపాతము గాని యన్యాయము గాని కారణము గా దని సహృదయులకుం దెలియనిది గాదు.

పద్మినీదేవి యెట్లు చేంజిక్కును? ఆమె యవివాహిత గాదు. మగనాలు. పయింబయింగ నన్నివిషయములయందును దురుష్కుల నీసడించు వంశమునకు భూషణము. సహజముగ మేవాడుసంస్థానాధీశ్వరులు మానధను లని పేరువడసిరి. అందును భీమసింహుం డగ్రేసరుండు; భీమపరాక్రముండు. ఈ కోరిక యెట్లు సాధ్యపడును?

పెద్దజాగీ రొకటి యిచ్చినచో వారు స్వయముగఁ బద్మినీదేవినిఁ దన యంతఃపురమునకుఁ దీసికొనివచ్చి విడిచిపోయెద రని యల్లాయుద్దీనుఁడు తెలిపెను. కాని చెంత నున్న వా రీయాలోచన కొనసాగఁజాల దని విన్నవించిరి. దీనిపై నాతఁడు యుద్ధమైనఁ జేసి తీసికొని వచ్చెద ననియెను. అందులకు వా రెల్లరును సమ్మతించిరి. మేవాడు సంస్థానమువారు నీ ప్రతాపానలము నెదుట శలభమాత్రు లని వా రాతనినిఁ బొగడిరి. పద్మినీదేవికొఱకు విడిది మున్నగు నేర్పాటు లన్నియుఁ జేసినచో యుద్ధమునకు బయలు వెడల వచ్చునని సలహా చెప్పిరి. తుద కల్లాయుద్దీనుఁ డఖండసైన్యమును వెంట నిడుకొని వచ్చి చిత్తూరుదుర్గమును ముట్టడించెను.

హఠాత్సంభవ మైన యీ విపత్తు నారసి రాజపుత్రులు చాలఁ గలవరపడిరి. పినతండ్రిని జంపి రాజ్య మపహరించిన యల్లాయుద్దీనుని క్రూరస్వభావమును వారు విని యున్నారు గావున నాతఁడు రాజ్యకాంక్షియై వచ్చె నని భావించిరి. అల్లాయుద్దీనుఁడు పద్మినీదేవికొఱ కాసించి వచ్చె నను సంగతి యా క్షత్రియవీరుల కేమి యెఱుక? కాని వారి కీశ్వరునితో యుద్ధము పొసఁగినను భయము లేదు. ఉత్తరభరతవర్షమునందలి క్షత్రియకుటుంబములయం దెల్ల శౌర్యసాహసాదికముల విషయమున మేవాడు రాజకుటుంబమే యగ్రస్థానము వహించుచున్నది. వైరివీరులను ఖడ్గములకు బలి యిచ్చుట యుండెఁ దాము బలియగుట యుండెఁ దక్క వారికి మఱియొక నిశ్చయము లేదు. అట్లగుటచే వారికి సంగర మనిన సంబరము. సైన్యము కొలఁదిగ నున్న సంకోచింపరు. గొప్పగ నున్న సంతోషింపరు. యుద్ధప్రసంగము వచ్చినచో వెంటనే నడుముకట్టి

యొఱనుండి కత్తి దూసి రణరంగమున కుఱుకుట తక్క వారు మఱి యొకటి సేయరు. మీ రిది రాజనీతిజ్ఞుల లక్షణము గా దందురా? వారు, పరుఁడు వచ్చి యుద్ధమునకుఁ బిలిచినప్పుడు పోకకుండుట క్షత్రియలక్షణము గా దందురు. ఈ రెండు వాదములయందలి సమీచీనతను గుఱించి మేము తరువాతఁ జెప్పెదము. కథ నడపుటయే యిపుడు మా విధి. అల్లాయుద్దీనుఁ డట్లు కోటను ముట్టడించిన వెంటనే వారు దుర్గద్వారములను మూయించి యుద్ధమునకు సిద్ధపడిరి.

రాణా తురుష్కుని యాగమనకారణమును గుఱించి యాలోచింప సాగెను. అప్పు డాతనితో భీమసింహుఁడును గూడ నాలోచనమునఁ బ్రవృత్తుఁడై యుండెను. ఒకదానిపై నొకటి చొప్పున వారి కనేకయోచనలు తోఁచెను. తుదకు వారీ యోచనాపరంపరచే విసిగిపోయి "యింకఁ గారణములతోఁ బనిలేదు. యుద్ధము తప్ప" దని నిశ్చయము గావించుకొని సైన్యపరీక్షకు బయల్వెడలిరి.

ఇంతలోఁ దురుష్కుని వద్దనుండి కోటలోనికి నొక వార్త వచ్చెను. ఆ వార్త వినుటకు వారు చాలఁ దొందరపడిరి. అల్లాయుద్దీనుఁ డిట్లు కబురంపెను. "మేము మీ కోటను బ్రద్దలుగొట్టి మీ రాజ్యము నాక్రమించుకొనవలె నని గాని, మీచేఁ గప్పము పుచ్చుకొనవలె నని గాని వచ్చి యుండలేదు. మీరు, వారును మీ కోటకును, మీ రాజ్యమునకును, సుస్థితినిఁ గోరెద రేని త్రిలోకసుందరి యగు పద్మినీదేవిని మాకిచ్చివేయుఁడు. లేకున్న బలిమినిఁ దీసికొని పోయెదము"

ఆ క్షత్రియవీరు లావార్త నాలించి ప్రళయకాలరుద్రుల వలె మండిపడిరి. ఇంతకంటె వారి యాగ్రహమును మేము వర్ణింపఁ జాలము. భారతీయులకుఁ దమ స్త్రీలమానమును గాపాడుకొనుట కంటె వేఱొక యుత్కృష్టకార్యము లేదు. ఇతరజాతుల వారికిఁ గూడ నిట్టి పట్టుదల యుండిన నుండవచ్చును. కాని యొక్క స్త్రీ మానమును గాపాడుటకు భారతీయులు జూపునంతటి యాత్మత్యాగము నెవ్వరును జూపఁజాలరు. పరస్పరభిన్నాచారము లగు రెండు జాతుల మైత్రిని మే మంగీకరింతుము గాని సమ్మేళనము నంగీకరింపఁ జాలము. భిన్నజాతిసమ్మేళనము వలనఁ గలుగు లాభము లాభాసములు. గంగాగోదావరీకృష్ణవేణ్యాదినదుల పావిత్ర్యమును, గోబ్రాహ్మణమహాత్మ్యము నంగీకరించువా రెవరును భిన్నజాతిసమ్మేళనమున కంగీకరింపజాలరు.

తమ జాతియే సర్వోత్కృష్ట మని భారతీయుల యభిప్రాయము. ఋగ్యజుర్వేదాదికము లగు భారతీయుల మూలగ్రంథముల ఘనతను స్వయముగ నెఱింగిన విజాతీయపండితులు గూడ భారతజాతి యుత్కర్షము నంగీకరించి యున్నారు. తమ తమ జాతుల యెడల నిట్టి యభిప్రాయ మెల్లరకు నుండవచ్చును. అట్టియెన జాతిసాంకర్యమున కవకాశమే యుండదు. ప్రపంచమునందలి జాతుల కన్నిటికి నైక్యము గావలె నని గొందఱు వాదము విచారమూలకముగఁ గావింపవచ్చును; గాని సర్వజాతులకు నైక్య మెన్నటికిని సంఘటిల్ల దనియు, నొకవేళ సంఘటిల్లినచో నది రాజకీయవిషయములఁ గాని సాంఘికవిషయములఁ గా దనియు నెఱుంగుట వారికి శ్రేయము. ప్రకృతమునఁ గాకపోయినఁ బూర్వకాలమున నైత

నున్నతి వహించియున్న జాతిలోఁ బుట్టినవాఁడు, తన పూర్వు లజ్ఞాను లని గాని, తన వేద మజ్ఞానవిలసిత మని గాని చెప్పుటకుఁ గాదు; తలంచుటకుఁగూడ నంగీకరింపఁజాలఁడు.

ఉత్తరభారతదేశమునందలి క్షత్రియసంస్థానములలో నెల్ల ముఖ్యముగ మేవాడు సంస్థానమువారు తొలునాళ్ల నుండియు నీ భావమునే ప్రకటించిరి. అత్యాగ్రహోగ్రులై యున్న రాణాయును భీమసింహుఁడును గూడ నతిభీషణంబున బురుజుల మీఁది కరిగి తురుష్క శిబిరములను ధ్వంసముసేయుఁడని ఫిరంగీల సైనికుల కాజ్ఞ యిచ్చిరి. హఠాత్ప్రయుక్తమై, తన సైనికులలో ననేకులకు వీరస్వర్గము నొసంగిన భీకరాయసగోళపతతియే యల్లాయుద్దీనునకుఁ బ్రత్యుత్తరం బయ్యెను.

ఇది యంతయుఁ జూచి సంగతిసందర్భములు గ్రహించికొని యల్లాయుద్దీనుఁ డత్యుగ్రుఁడై కోటను ధ్వంసముసేయ సైనికుల కాజ్ఞాపించెను. వెంటనే యుద్ధము ప్రారంభ మయ్యెను. ఈ యుద్ధము చాల దినములు జరిగెను. రాజపుత్రు లెవ్వరును జిత్తూరు వారికి సాయము రాకుండ మార్గము లన్నియు నరికట్టి తా నవసర మైనపు డెల్ల దిల్లీనుండి క్రొత్తసైన్యమును రప్పించుకొనుచు నల్లాయుద్దీనుఁడు పద్మినీదేవి పొం దొనఁగూడినచోఁ గలుగు నానందము నూహించుకొనుచుఁ బోరు సాగించుచుండెను.

కాని యెన్నివిధములఁ బ్రయత్నించినను రాజపుత్రులు స్వాధీన మగుదు రని తలంచుట కాధారములు కాన్పింపవయ్యెను. దినములు కదచిన కొలఁదిని దురుష్కసైన్యములు తరిగిపోసాగెను; కాని రాజపుత్రులు మాత్రము చెక్కుచెదరక యట్లేయున్న ట్లుండిరి.

దుర్గ మెత్తయిన కొండమీఁద నుండుటచేఁ దురుష్కుల ఫిరంగీల బాగులు చాలవఱకు నిష్ఫలములై పోవుచుండెను. రాజపుత్రులు ప్రయోగించు ప్రతిశతఘ్నులు వందల కొలఁది తురుష్కులను రూపుమాపుచుండెను. అట్లగుటంజేసి తుట్టతుద కల్లాయుద్దీనుఁ డిఁక జయము నెడల నాశ వదలుకొనవలసినదే యని నిశ్చయించు కొనియెను.

కాని పద్మిని మీఁది యాశ మాత్ర మాతని కింకను పెరిగిపోవు చునే యుండెను. ఆ యాశవలన క్షీణించిపోయిన పౌరుష మపు డపుడు మఱల నుద్దీప్తంబు కాసాగెను. ఈ యాశయు నా పౌరు షంబును గలిసి శిబిరమునఁ గూరుచుండి ఢిల్లీకిఁ బోవలయు నని యూహించుకొనుచుండ నల్లాయుద్దీనుని మఱల మఱల యుద్ధభూమి కుఱికించుచుండెను. ఎంతచేసినను ఫలము లేదయ్యెను. తుదకుఁ బద్మినీదేవిమీఁది యాశ పూర్వపక్షమై పోయెను. పౌరుషము మొదలే నశించిపోయెను. ఇఁక నేమియుఁ జేయఁజాల నని తలంచి లజ్జ నంతకు ముందే త్యజించి యల్లాయుద్దీనుఁడు, "పద్మిని నొకమాఱు చూపినఁ జాలును. నేను ముట్టడి మాని ఢిల్లీకిం బోయెద" నని రాజ పుత్రులకుఁ దెలిపెను.

రాజపుత్రులు కూడఁ గొంత యలసిపోయిరి. రాణాయును భీమసింహుఁడును, దక్కుంగల కులవృద్ధులు నీ విషయమును గుఱించి చాలఁ దీవ్రముగ నాలోచించిరి. ఎవ్వఁడే స్త్రీని గామించి తీసి కొనిపోవుటకు వచ్చెనో యా విజాతీయున కా స్త్రీనిఁ జూపునెడల మానమునకును శౌర్యమునకునుఁ గలంకము వచ్చునా రాదా యని మొదటి ప్రశ్న. దానికి వారెట్లో సమాధానము నూహించుకొనిరి.

వెంటనే "యింకటితోఁ దురుష్కుఁడు ముట్టడిమాని పోవునా పోఁడా? యని మఱియొక ప్రశ్న తారసిల్లెను. దానికిఁ గూడ నొకవిధముగ సమాధానము నూహించుకొనిరి. కాని యెల్లరును గలిసి కట్టకడపల "నీ యవసరమున భీమసింహుఁడు ప్రత్యుత్తర మీయవలసియుండు" నని చెప్పిరి. రాణాయు నా యభిప్రాయమునే సూచించెను.

భీముఁడు వారి మాటలవరుసను బట్టి తురుష్కుని కోరికను దీర్చుటయే వారి యభిప్రాయ మైనట్లు గ్రహించెను. పిదప నాతని మనస్సు పరిపరివిధములఁ బోయెను. కులమువా రంగీకరించినంతమాత్రమున మానభంగమున కొప్పుకొనవలసినదేనా యని యొకమాఱును, నిది మానభంగ మగునా కాదా యని మఱియొకమాఱును, యుద్ధము సేయలేక విసివిపోయి యిట్లు కోరిన తురుష్కుఁడు దీని కంగీకరింపకున్న నేమి సేయఁగలఁ డని యింకొకమాఱు నాతఁ డిట్లనేకవిధములఁ దనలోఁ దాను చర్చించుకొనియెను. కాని యెటు సెప్పుటకు నాతనికి సాహసము గలిగినది గాదు. మఱల మఱల నాలోచించుకొనియెను. పద్మిని యేమి చేసిన నేమనునో యని గూడ సంశయము తోఁచెను. ఈ తీవ్రచర్చలో నాతనికి మఱియొక సందియము గలిగెను. కులపుఁబెద్దల సంగతి యట్లుండుఁగాక. ఏమి చేసినను బద్మిని యిఁకఁ దనకుఁ దక్కునా తక్కదా? ఈసందేహము తోఁచినపు డాతని హృదయము కలఁగిపోయెను. ఇఁక హృదయ మాలోచనకుఁ జో టిచ్చినది గాదు. అక్కఁతన నాతఁడు సాహసించి "యిట్టి సందిగ్ధస్థితిలోఁ గర్తవ్యనిర్ధారణము కులస్వాములే చేయవలయు" నని చెప్పెను. ఇది విని వా రెల్లరును "భీముని బిగి సడలి

పోయినవని తలంచిరి. ఒక్క భీముని బిగియే గాదు. రాజపుత్రుల యందఱిబిగియు సడలినదని మేము తలంచుచున్నారము.

పిదప భార మంతయుఁ దమపైఁబడుటచేఁ గులస్వాములును లక్ష్మణసింహుఁడును మఱల మఱలఁ జాలఁ దీవ్రముగ నాలోచించి తుదకుఁ బద్మినీప్రతిబింబమును జూపుట కంగీకరించిరి. భీముఁ డందులకుఁ దన యభ్యంతర మేమియు లే దనియెను. అప్పుడు రాణా "నీకుఁ బ్రత్యక్షముగఁ బద్మినీదేవి దర్శన మగుట కలలోని వార్త. తలయునెడల నిలువుటద్దములోని యామె ప్రతిబింబమును నీవు చూడవచ్చు" నని తురుష్కునకుఁ దెలియఁబఱిచెను.

"కాముకస్య కుతో లజ్జా" యని యొక లోకోక్తి గలదు. దీని యాథార్థ్యమును గుఱించి సందేహింపవలసిన యావశ్యకము గాన్పింపదు. ఒక్కొక్కప్పుడు కాముకులు తమతమ మనోహారిణుల యెడలఁ గావించు చేష్ట లాశ్చర్యజనకములు. దర్శనమాత్రమునఁ గొంద ఱానందింతురు. పదశ్రవణమాత్రంబుననే మఱికొంద ఱుబ్బిపోయెదరు. తమ ప్రియురాండ్రను గుఱించి పరు లెవరైనఁ జెప్పుకొనుట విని సైతము ధన్యుల మని తలంచు మహాత్ము లున్నారు. తలుపు చాటున నుండియైన, నిముస మైన నామె ముఖమండలము గాన్పించినఁ జాలు నని విసుగులేకుండఁ దఱచుగ నా వీధినిఁ దిరుగువారు వందలకొలఁదిగ నున్నారు. ఆమె ధరించి పాఱవైచిన కుసుమమాలికలను, గేవలకుసుమములను గూడ నత్యానందముతోఁ దీసి యత్యాదరముతో నాఘ్రాణించి జాగ్రత్త సేయువారు గూడ నున్నారు. ఇఁక నామె చెప్పినపనులు చేయుటయందుమాత్రమే దినములు, మాసములు, సంవత్సరములు గూడఁ గడపివైచిన వారి విషయమున్న

భావనావలంబనచే నామె కోర్కెల నూహించుకొని వెంటనే తీర్చువారి సంగతిని, నే హేతువువలన నైన నామె గ్రామాంతరము వెళ్లినచో నేదో యొక వంక పెట్టుకొని తాము గూడ నా గ్రామమున కరుగువారిని గుఱించియుఁ జెప్పవలసిన పని యేమున్నది? అంత మాత్రమున నేమి ఫల మని మీరు మమ్ము ప్రశ్నింప వలదు. అది కాముకైక వేద్యము. మే మెట్లు చెప్పగలము?

కాముకవృత్తం బిట్టిదగుట నల్లాయుద్దీనుఁ డందులకే సంతోషముతో నంగీకరించెను. అతఁడు, యుద్ధము మాని సైనికుల నందఱను శిబిరములలో విశ్రమింప నాజ్ఞాపించెను. కోటలోఁ బద్మినీసందర్శనమునకు వలయు నేర్పాటు లన్నియు నిముసములో ముగిసెను. నిలువుటద్దమునఁ దురుష్కునకుఁ దన ప్రతిబింబమును జూపుటకుఁ బద్మిని మనస్ఫూర్తిగ నంగీకరించెనో, పురుషుల బలాత్కారము వలన సమ్మతించెనో చెప్పఁజాలము. ఎట్లయిన నేమి?

ఇంతలో రావచ్చు నని కోటలోనుండి వర్తమానము వచ్చెను. అది విని పరమానందభరితుఁడై చక్కఁగ నలంకరించుకొని యున్న యల్లాయుద్దీనుఁడు వెంటనే బయలుదేఱి యొంటరిగఁ గొండ యెక్కి దుర్గములోఁ బ్రవేశించెను. సంధి కుదిరినది గావున రాజపుత్రులు కొందఱతని నుచితమర్యాదలతో నెదుర్కొని రంగస్థలమునకుఁ దీసికొనిపోయిరి. అట నొకదానిలోని ప్రతిబింబ మొకదానిలోఁ బ్రతిబింబించునట్లు నిలువుటద్దములు వరుసగ నమర్పఁబడి యుండెను. తరువాతఁ గొన్ని నిముసములకుఁ బద్మినీమోహనరూప మా దర్పణములయందుఁ బ్రతిబింబిత మయ్యెను. తురుష్కుఁ డది చూచి ఘూర్ణుఁడై కొంతవఱకుఁ బ్రతిమాకృతిని దాల్చెను. పిమ్మటఁ

దెలిపెుంది, యామె తన మోహనరూపమును గాంచినచో నిప్పుడు గాకున్న మఱియొకప్పుడైన వెనుదగిలి రాక మానదని భావించి, తన ప్రతిబింబ మామెకుఁ గాన్పించున ట్లద్దమున కెదురుగ నిలిచి యామె సౌందర్యమును మఱల నొకమాఱు చూచి నిశ్చితవదనుఁడై మఱల యథాస్థానమునకు వచ్చి కూర్చుండెను.

పద్మినీరూపసందర్శన మింతటితో ముగిసెను. అల్లాయుద్దీనునకును రాజపుత్రులకును స్నేహ మేర్పడెను. ఎప్పటికి నీ స్నేహమిట్లేయుండవలయు నని వారు కూడఁబలికికొనిరి. ఎల్లరిచెంతను సెలవు గైకొని యల్లాయుద్దీనుఁడు తన శిబిరమునకు బయలుదేఱెను. రాణా మున్నగువా రెల్లరు నచ్చటనే యుండిపోయిరి. పెద్దల యనుజ్ఞ చొప్పున భీమసింహుఁడు తురుష్కుని సాగనంపుటకు బయలుదేఱెను. వా రిరువురును మందహాసవదనులై యేమేమో మాట్లాడుకొనుచుఁ బ్రాకారము లన్నియు దాఁటి మెట్లమీఁదనుండి కొండ దిగసాగిరి. ఛీ! తన భార్యను దీసికొనిపోవుటకు వచ్చిన వానిని సగౌరవముగ సాగనంపుటా?

ఆ మాటయు నా మాటయు ముచ్చటించుకొనుచు, నడుమ నల్లాయుద్దీనుఁడు "మీ రొకసారి మా ఢిల్లీనగరమునకుఁ జనుదెంచి మమ్ము గౌరవింపఁ గోరుచున్నార" మని భీమసింహునితో ననియెను. "తీరికయైనప్పు డట్లే చేయవచ్చు"నని తురుష్కునకు భీమసింహుఁడు ప్రత్యుత్తర మిచ్చెను. వా రిట్లు మాట్లాడుకొనుచుఁ గొండమీఁదఁ జాల దూర మరిగిరి. భీమసింహుఁ డిఁక వెనుకకుఁ బోవలె నని తలఁచి యల్లాయుద్దీనుని యసంపూర్ణవాక్యమును దానే ముగించి "యిఁక సెలవు గైకొనియెద" ననియెను. "చిత్త" మని చెప్పి

చిన్నగవులోఁ దురుష్కుఁడు మార్గమున కిరుకెలంకులనున్న సాంద్ర లతాగుల్మములకెస దృష్టి సారించి కొంచెము దగ్గుట నభినయించెను. కనుమూసి తెఱచునంతలో నాపొదలచాటునుండి కొందఱు తురుష్క భటు లురుకెంచి భీమసింహునిఁ గదలకుండఁ బట్టుకొని కాలుసేతులకు సంకెలలు తగిలించి ఖైదు చేసిరి. భీమసింహుఁ డది చూచి నిర్విణ్ణుఁడై పోయెను. ఔరా! ఎంత వింత!

అల్లాయుద్దీనుఁడు ద్రుతగమనంబున క్షణములో శిబిరమును జేరికొని భీమసింహునిఁ బ్రత్యేకశిబిరమున బంధించి "యిఁకఁ బద్మిని యెట్లు చేఁజిక్కదో చూచెద"నని యనుకొని తన తెలివితేటల కొక మాఱు గర్వించి, యుద్ధము సేయుటకు సైనికులను సర్వసిద్ధముగా నుండ నియమించి "పద్మిని నిచ్చినఁ గాని భీమసింహుని విడువ" మని రాజపుత్రులకు వర్తమానము చేసెను. అట్లు చేయకపోయినచో మఱల యుద్ధము ప్రారంభించుటయే గాక, "భీమసింహుని సంహరించివైచెద" మని గూడ నా వార్తలో సూచించెను.

కోటబురుజులమీఁదఁ గాపున్న భటులమూలమున భీమసింహుని బంధనవృత్తాంతమును విని తెల్లవోయియున్న రాణాయుఁ గులస్వాములు నల్లాయుద్దీనుని సందేశమును విని కొయ్యబాఱి పోయిరి. అంతఃపుర మంతయు గగ్గోలుపడసాగెను. తక్కిన వారెల్లరును గళవళపడఁజొచ్చిరి. రాణా చాల విచారించెను. పిదప నెల్లరును గూడి భీమసింహుని విడపించుట యెట్లని యాలోచింపఁ దొడఁగిరి. వారి కనేకోపాయములు తోఁచెను. కాని యన్నియుఁ బ్రతిహతములై పోయెను.

రాణా యగుట లక్ష్మణసింహునిపై నిప్పుడు చాల భారము పడినది. అల్లా యుద్దీనున కిప్పు డాతఁడే సమాధానము చెప్పవలసి యున్నది. మొదటి నుండియు సక్షత్రియప్రేమలోఁ గేవలము తన యభ్యుదయముకొఱకు జీవితము ధారవోయుచున్న భీమసింహుని విడిచిపెట్టుట న్యాయ్యమా? అతనికొఱకు కాతని యర్ధప్రాణ మగు పద్మినీదేవిని విడుచుట ధర్మమా? మేవాడురాజ్యమునకుఁ బ్రతిష్ఠ వచ్చినను, నప్రతిష్ఠ వచ్చినను, జయము సేకూరినను, వినాశము సంప్రాప్తించినను నేఁటి యీ సమస్య వలననే యెల్ల మగును. ఇప్పుడు మేవాడు రాజ్యములోఁ గూడ వారిరువురను రక్షించితీఱవలెను. ఏమి దారి?

అంతఃపురమునఁ బద్మిని సైత మిట్లే తనకును, దనభర్తకును, మేవాడు రాజ్యలక్ష్మికి నెట్టి యపాయము నొదవకుండ నీ యాపద నుండి దాఁటుట యెట్లని యాలోచించుచుండెను. పాప మీ సందర్భమున నామెకుఁ గూడ ననేకాలోచన లుప్పతిల్లి వెంటనే యన్నియుఁ బూర్వపక్షములై పోయెను. మఱల దీర్ఘాలోచనము ప్రారంభించెను. ఇంతలో "దర్శనమునకు నిరీక్షించి యున్నాఁడ" నని లక్ష్మణసింహుఁడు పరిచారికాముఖమున నామెకు సమాచార మంపెను. అప్పటి కామె యాలోచన పూర్తి యయ్యెను. "ఇఁక నిప్పుడు దర్శనమునకు రానక్కఱ లేదు. "మీకుఁ బద్మినీదేవి నిచ్చివైచెదము. మీరు ముట్టడి మానివేయవలయును. మఱియుఁ బద్మినీదేవి చాల గౌరవము గల దగుటవలన నామెను సాగనంపుటకై యేడువందల మేనాలలో క్షత్రియస్త్రీలు వచ్చెదరు. కావున నా పల్లకు లెల్ల విడియుటకుఁ దగిన యేర్పాటులు గావింపవలెను. కాని

రాణివాసమున కేమియు భంగము గలుగఁ గూడదు. నీ వా రెవ్వరు నా డేరా చెంగట నుండ రాదు. అట్లయినఁ బద్మిని మీకుఁ దక్కు" నని తురుష్కునకు సందేశ మంపవచ్చు" నని యామె కుమారునకుఁ బ్రత్యుత్తర మంపెను.

అదివినిన వెంటనే లక్ష్మణసింహుఁడు చిన్నవడెను; గాని తోడనె యందలి మర్మము నెఱింగి పినతల్లి వివేక గౌరవమునకుఁ జాల సంతసించి కార్యసిద్ధి యైనట్లే భావించెను. ఆ వెంటనే యీ వార్త నల్లాయుద్దీనునకుఁ దెలియఁజేసి ప్రత్యుత్తరము కొఱకుఁ బ్రతీక్షింపసాగెను.

అప్పు డల్లాయుద్దీనునకుఁ గలిగిన యానందమునకు మితి లేదు. తాను వినినంతకంటె నెక్కుడు సౌందర్యవతియై యున్న పద్మిని తన్ననుగ్రహించు నని తెలియవచ్చుటచే నత్తురుష్కుఁ డిఁకఁ దన యంతటి యదృష్టవంతుఁడు భూలోకమున మఱియొకఁ డుండఁబోఁడనియు, నిలువుటద్దమున నామె కెదురుగ నిలిచి తాను గాంచిన ప్రేమసూచకం బగు కనుసన్న పూర్తిగఁ బనిచేసె ననియు, నామె యా యద్దమున స్వీయప్రతిబింబమునకు సహసఁ బ్రతిబింబితంబైన తన ప్రతిబింబము నాఁగసి నిలువెల్లఁ గరఁగిపోయి యుండు ననియు, నప్పుడే యామె యిప్పుడీ రసికశేఖరునితోఁ గలిసి సుఖించుట సంభవించు నని యనుకొని యుండు ననియు, నట్లగుట నీ సమయమునఁ దాను భీమసింహునిఁ జెఱఁబట్టుట పద్మినికినిఁ దనకును గూడ మంచిదే యైన దనియు భావించి యాతఁ డుప్పొంగిపోసాగెను. ఈ యానందాతిరేకమువలన భావరహితములై పోయిన యాతని చూడ్కు లప్పుడు విద్యుల్లతల వలె మెఱసిపోఁజొచ్చెను.

ఇట్లొక నిమిషము గడచిపోయిన తరువాతఁ బద్మినిని సాగనంపుట కేడువందల పల్లకీలలో క్షత్రియ స్త్రీలు వచ్చెద రనియు, వారికిఁ దగు విడిది యేర్పాటు చేయవలయు ననియు రాజపుత్రులు పంపిన సందేశము జ్ఞప్తికి వచ్చెను. వెంటనే యాతఁ డొక పెద్దడేరా నిర్మింపించి పద్మిని రాకకై చిత్తూరు దుర్గసింహద్వారము దెసకుఁ జూచుచుఁ గూర్చుండెను. అప్పు డాతఁడు "రాజపుత్రు లేమో మహాపరాక్రమశాలు లను నమ్మకముతో నిఁకఁ బోరుటవలన లాభము లేదని తలంచి పద్మిని నొకమాఱు చూపినఁ జాలు నని తాననుట చాలఁ బొరపాటుపని యనియు, నింకను రెండు దినము లట్లే పోరాడినయెడలఁ దన కీ కళంకము రాకుండ నుండునదియే యనియు ననుకొని "యిఁక గతించిన దానిని గుఱించి విచారించుట వలనఁ బ్రయోజనము" లేదని మనస్సునకు సమాధానము చెప్పుకొనెను.

ఇంతలో దుర్గద్వారము తెఱవఁబడియెను. ఆయుధపాణు లగు కొందఱు కాల్బంటులు ముందు వచ్చిరి. వారి వెనుకఁ బట్టుతెరలతో మూయఁబడిన నాలుగువందల పల్లకులు వచ్చెను. పిదప నిశితాయుధములను ధరించిన సుందరీమణులచేఁ బరివేష్టింపఁబడి, ముత్యాల జాలరులతో నలంకరింపఁబడిన పట్టుబురకాచే నాచ్ఛాదిత మగు దంతపుఁబల్లకీయు, దాని వెనుక మఱి మూఁడువందల పల్లకులును, వాని వెనుక నాయుధపాణు లగు కాల్బంటులును వచ్చిరి. ఒక్కొక్క పల్లకీకిఁ బదార్గురు బోయీ లేర్పఱుపఁబడి యుండిరి. ముందు వెనుకల నున్న కాల్బంటుల సంఖ్య యొక సహస్రమునకు మించి యుండును. అది యంతయుఁ జూచి యల్లాయుద్దీనుఁడు "పద్మిని చాల మానవతి. నాకుఁ దగిన రాణి" యనుకొని, క్షత్రియ స్త్రీలకు విడిదిగా నేర్పఱుపఁబడిన డేరాచెంగటఁ బురుషు లెవ్వరును లేకుండ

నటు చూడ నొక సరదారున కాజ్ఞయిచ్చెను. ఆ సరదారుడు యజమానుని కంటెను మొగమోటలేనివాఁడు. పెద్దమనుష్యుఁ డగు నా సరదారుఁ డా దెసకుఁ బురుషు లెవ్వరును రాఁదనే కూడ దని శాసించెను. క్షణములో నేడువందల పల్లకులును వచ్చి యా గుడారము ప్రవేశించెను. కాల్బంటులు గుడారము చుట్టును బారులు తీఱి నిలిచిరి.

ఇది యంతయుఁ జూచి భావనాప్రపంచమున విహరించుచున్న యల్లాయుద్దీనుని యెదుట గంభీరాననముతో వచ్చి యొక రాజపుత్ర యోధుఁడు నిలువఁబడియెను. అతనిచేత నొక నిశితభల్లమును నడు లగ్నబంధమున దిట్టు కరవాల మొకటియు నుండెను. అతని కోరమీసముల మీఁదను, గంభీరదృష్టుల యందును వీరరసము పొంగి పొరలి పోవుచుండెను. అల్లాయుద్దీనుఁడు హఠాత్తుగ నాతనిం జూచి యులిక్కిపడి యంతలో ధైర్యము తెచ్చికొని "ఎవఁడవు" అని ప్రశ్నించెను. అందుల కాతఁడు "నేను రాజపుత్రుఁడను. పద్మినీదేవి వెంట వచ్చితిని. ఆమె నీ యాధీనము సేయక మున్ను నీతో నొకటి చెప్పవలసి యున్నది." అని ప్రత్యుత్తర మిచ్చెను.

అది విని సుల్తాను విస్మయుఁ డయ్యెను. అతని చిత్తచాంచల్య మువశమిల్లెను. అప్పు డది యేమో చెప్ప వచ్చునని మెల్లఁగఁ బలుక రాజపుత్రుఁ డిట్లనియెను. "త్రిలోకసుందరి యగు శ్రీమతి పద్మినీదేవి యిప్పుడు నీ వశము గానున్నది. ఈ రూపమునఁ జాలఁగాలము నుండి కలసిమెలసి యున్న పద్మినీభీమసింహులకు వియోగము కలుగుచున్నది. నీ యంతఃపురముఁ జేరుటవలనఁ బద్మినీదేవికి సుఖముగలుగ వచ్చును. కాని భీమసింహున కిఁక నీ వైవాహిక జీవితము కుంభీపాక నరకము కాకమానదు. కావున నామె నీ యంతఃపురము చొచ్చుటకుఁ

భాగ్యము మరదృష్టవంతుఁ డగు భీమసింహున కామెతోఁ గొన్ని నిమిషములు మాత్రము మాట్లాడుట కవకాశ మీయవలెను. ఇది కానున్న నీ దేవి యగు పద్మిని యభిలాష"

"పద్మినీదేవి యభిలాషయా? అట్లయిన నభ్యంతర మేల? అట్లే చేయవచ్చును. పద్మిని యాజ్ఞ కాదను నెవరులే" యని చెప్పుచు వెంటనే యల్లాయుద్దీనుఁడు భీమసింహుని రప్పించెను. రాజపుత్ర యోధుఁడు భీమసింహునిఁ దనతోఁ గూడ రమ్మని పిలిచెను. భీమసింహున కది యేమియు నర్థము కాలేదు. అతని మోమునఁ గ్రోధరసము ప్రత్యక్షమయ్యెను; గాని యోధుఁడు కనుసన్న సేయుట వలన వెంటనే భీమసింహుఁ డాతనితో బయలుదేరెను. క్షణములో వారు పద్మిని విడిదిలోఁ బ్రవేశించిరి. మఱల యోధుఁడు వచ్చి యథాపూర్వముగ నల్లాయుద్దీనుని చెంగట నిలువఁబడియెను.

కాల మెంతసేపు నిలిచి యుండును? నిముసముల మీఁద నిముసములు వచ్చి పడిపోవుచుండెను. గడియ దాఁటెను. ఇఁక నొక యరగడియ గూడ దాఁటిపోయెను. "ఇంక నెంతసేపు మాట్లాడవలయు" నని సుల్తాను వేగిరపడసాగెను. ఇంతలో డేరానుండి కొన్ని పల్లకీలు కోటదెసకు బయలుదేరెను. అది యేమని యాత్రముతో నల్లాయుద్దీనుఁడు ప్రశ్నించెను. "పద్మినిని సాగనంపవచ్చిన క్షత్రియస్త్రీలు తిరిగి దుర్గమునకుఁ బోవుచున్నా" రని రాజపుత్రుఁ డనెను. "వలనుపడదు. పద్మిని మా యంతఃపురమునకు వచ్చువంత దనుక నేరును గదలఁ గూడ" దని సుల్తా నఱచెను. రాజపుత్రుఁడు దాని కేమియుఁ బ్రత్యుత్తర మీయక యున్నట్లే యుండి హఠాత్తుగఁ బద్మిని విడిది దెస కొకసారి దృష్టి సారించి, బ్రహ్మాండము

బ్రద్దలగునట్లు "హరహరా!" యని యఱచి, సుల్తానువైపు కుఱికి బల్లెము విసరెను; గాని యాతనిచెంత నున్న తురుష్కసర్దారులలోఁ గొందఱు రాజపుత్రుని వంకఁ దీక్షదృష్టితోఁ జూచుచుండుటవలన నాతఁడు విఫలమనోరథుఁ డయ్యెను. అతని యేటు తప్పిపోయెను; కాని దానిచే నొక తురుష్కసర్దారుఁడు మాత్రము కూలఁగూలెను. వెంటనే ఱక్కిన వారు రాజపుత్రునిపైఁ బడి చిత్రవధ గావించిరి. ఆలోపున మఱికొందఱు తురుష్కసర్దారులు కూలిరి. ఇంతలో డేరాచుట్టును నిలిచియున్న రాజపుత్రులు ముందున కుఱికిరి. సుల్తాను పలాయనము చిత్తగించెను. రాజపుత్రులు నిరంకుశులైరి. క్షణములో డేరాలోనుండి నాలుగైదువేల రాజపుత్రులు వచ్చి మొదటి వారికి సాయపడిరి. తురుష్కులు నమ్మినట్లు పల్లకీలలో క్షత్రియస్త్రీలు రాలేదు. ప్రతి పల్లకియందును, కత్తి, కటారి, తుపాకి, బల్లెము, డాలు మున్నగు యుద్ధోపకరణము లుండెను. బోయీ లెల్లరును రాజపుత్రయోధులు. పద్మినితో మాట్లాడుటకు డేరాలోని కరిగిన భీమసింహుఁడు, పద్మినిని సాగనంపి క్షత్రియస్త్రీలు తిరిగి కోటలోనికిఁ బోవుచున్నా రనిన పల్లకులయం దొక దానిలోఁ గూరుచుండి యప్రతిహత మగు నుత్సాహమును బన్ని తన మానప్రాణములు కోటలో నంతఃపురమున నుండియే కాపాడిన రమణీమణి యగు పద్మినీదేవితో మాట్లాడుటకుఁ బోయెను. "నిన్ను దీసికొనిపోవుటకు వచ్చి చాలలేక, నిలువుటద్దమున నీ ప్రతిబింబమును జూచి సాగనంపఁబోయినపుడు నన్నుఁ గైదుచేసిన తురుష్కుని బారినుండి నీ యనుగ్రహమువలననే తప్పించుకొని వచ్చితి" నని భీమసింహుఁడు, పద్మినికిఁ గృతజ్ఞతఁ జూపుటకుఁ గాఁబోలుఁ

గానున్న సంగ్రామము మాట తలంపక రహస్యముగఁ బల్లకిలోఁ గూరుచుండి తప్పించుకొని పోవుట ! అదిరా ! పౌరుషము !

రాజపుత్రయోధుల కలకలం బాలకించియును, బలాయనము గావించిన యల్లాయుద్దీనునిచేఁ బ్రబోధితులై యును తురుష్కసైనికులు తొలుత దిక్కుచెడిరి గాని వెంటనే ధైర్యము తెచ్చుకొని దీన్ దీన్ యను రణధ్వనులు మిన్నుముట్ట శీఘ్రవేగముగ వచ్చి క్షత్రియసైన్యమును దాఁకిరి. ఇంతలో దుర్గములోనుండి మఱికొందఱు క్షత్రియులు వచ్చి తాము వారితోఁ గలిసికొనిరి.

ఈ సంకులసమర మతిభయంకరముగఁ బ్రవర్తిల్లెను. ఇరుతెగలవారును జాలఁ బట్టుదలతోఁ బోరిరి. రక్తపుఁగాల్వ లఖండముగఁ బ్రవహించెను. ఇది యాకస్మికముగఁ గారసిల్లుటం జేసి యవనులంతవఱకు రాజపుత్రులవలెఁ గాక తురుష్కులు యుద్ధముచేయవలసిన యగత్యము లేదని యుపేక్షించి యుండుటవలనను రాజపుత్రుల చేయి మీఁదయ్యెను. తురుష్కవాహిని క్షత్రియప్రతాపమున కోర్వఁజాలక యింకిపోయెను. హతశేషులు పాఱిపోయిరి. అల్లాయుద్దీనుఁ డంతకుముందే యపజయము తప్పదని నిశ్చయించుకొని తిరిగి చూడకుండ ఢిల్లీకిఁ బాఱిపోయెను. భాగ్యవశమున విజయలక్ష్మి రాజపుత్రులనే వరించెను. కాని యీ సంకులసమరమున వారిలోని విఖ్యాతయోధు లనేకులు మడిసిపోయిరి.

పద్మినీదేవి సౌందర్యమును వినినపుడే యంకురించి, దర్పణమున నామె నిజరూపమును గనులారఁ గాంచినపిదపఁ బ్రవృద్ధమై వనవన లాడఁ దొడంగిన యల్లాయుద్దీనుని మోహలత దుస్సహాపరాభవఝంఝామారుతహతిచేఁ బడిపోయి మలినం బయిపోయినను, మగుడఁ

దలయెత్తి విజృంభింప సాగెను. అతని హృదయము మఱలఁ జెదరి పోయెను. కంఠములోఁ బ్రాణము లుండఁగా నెన్నఁటికైన నయముననో, భయముననో పద్మినీదేవినిఁ గూడితీరవలె నని యాతఁడు నిశ్చయించుకొనియెను. నిరాయాసముగఁ దన్ను వంచించి పాఱఁద్రోలిన చిత్తూరురాజపుత్రులను దగునట్లు శిక్షింపకున్నయెడలఁ దానెగాక తక్కిన భారతీయరాజు లెల్లరును బాలకనఁ జేయుదు రనియు, నట్లయినఁ దన ఢిల్లీరాజ్య మొక్కటే గాక, భరతవర్షమున మహమ్మదీయులు సైతము నిలుచుట యసంభవ మనియు నా హేతువుల వలన మఱలఁ జిత్తూరువారికి గర్వభంగము సేయవలయు ననియుఁ గూడ నిశ్చయించుకొనియెను. ఈ నిశ్చయమువలన నాతని క్రోధాగ్ని మఱల నిముసములో రేగెను. వెంటనే చిత్తూరుమీఁదఁ జైత్ర ప్రస్థానమును బ్రకటించెను.

రాజపుత్రులు మహాసంగ్రామమున నల్లాయుద్దీను నిదివఱ కొక మాఱోడించినవారగుటంజేసి వాని రాక కదలలేదు. మనుష్యుఁడు, ధైర్యములోఁ బోరాడిన భయపడఁగూడ దనియు, దీనముగఁ బ్రార్థించిన దయదలఁపరా దనియు నిశ్చయించుకొని వారు యుద్ధమునకు సిద్ధపడిరి.

మఱల యుద్ధము ప్రారంభ మయ్యెను. పరాభవదుఃఖమువలన మహమ్మదీయులును, విజయగర్వమువలన రాజపుత్రులు, ఒడలు మఱచి పోరసాగిరి. భేరీకాహళాదిగంభీరధ్వనులవలనను, వీరుల సింహనాదములవలనను, గజఘీంకారములవలనను, హయహేషలవలనను, నగ్నాయుధముల భయంకర ఘంఘణనినాదములవలనను, కఠోరశరముల రివ్వు మను ధ్వనులవలనను, బడిపోయిన వీరభటుల మూల్గులవలనను బ్రహ్మాండము ప్రతిధ్వనింపసాగెను. ఇట్లీ

యుద్ధము చాలఘోరముగ జరిగెను. కొన్ని దినములు రాజపుత్రులకును, కొన్ని దినములు మహమ్మదీయులకును బత్తుపాటము నూపెను. తుదకు రాజపుత్రుల కపాయశంక పొడమెను. ఇఁక జయము గలుగుట దుర్లభమని వారు నిశ్చయించుకొనిరి.

అయినను సంగ్రామరంగమునుండి వెనుదిరిగిపోవుటకు వా రంగీకరింపలేదు. "పాఱిపోవుట మన కులధర్మమునకు విరుద్ధము. శత్రులం జంపుదము. లేకున్నఁ జత్తు" మని వారు నిశ్చయించుకొనిరి; ఈ నిశ్చయమువలన వారి శౌర్యాగ్ని మఱింత దుస్సహ మయ్యెను. గాని మహమ్మదీయు లందులకుఁ జలింప లేదు. "విజృంభింపుఁడు. మనకు జయము గలుగుట యథార్థము. చిత్తూరుదుర్గముపైఁ జంద్ర ధ్వజమును నిలుపుట కల్లా యాజ్ఞ యైనది. చిత్తూరుదుర్గములో నచ్చ గలను వలఁదన్నఁగల స్త్రీలు వేలకొలఁదిగ నున్నారు. విజృంభింపుఁ" డను నల్లాయుద్దీనుని ప్రోత్సాహమువలన వారి శౌర్యము నుత్సాహ శక్తియు నిబ్బడి కాసాగెను.

చిత్తూరుదుర్గమునందలి మహారథికులలోఁ జాలమంది గతించిరి. లక్ష్మణసింహుని పండ్రెండుగురు పుత్రులలోఁ బదునొకండ్రు వీరస్వర్గము నలంకరించిరి. అంత రాణా తన ద్వితీయపుత్రుఁ డగు నజయసింహునిఁ జేఁబిలిచి "వంశ మంతరించిపోకుండ నీవు పోయి యారావలీపర్వతములలో వసియింపుము. అటనుండి నీవు చిత్తూరు దుర్గముకొఱకుఁ బ్రయత్నింపుము. నీ జీవితకాల మంతయు నాప్రయత్నమునందే గడుపుము. మేవాడు రాజ్యము నీకు స్వాధీన మైనను గాకున్నను దాని స్వామ్యమును, నీ యన్న కొమరుఁడును, న్యాయ్యము ననుసరించి నా తరువాత నీ రాజ్యమున కధీశ్వరుఁడు నగు హమీరున

కిచ్చివేయుఁ"డని యాజ్ఞాపించి వీలయినంత ధన మొసంగి పంపి
వేసెను. పిదప స్త్రీలకు జవహరవ్రతమున కాజ్ఞయిచ్చి పురుషుల నిఁక
యుద్ధరంగమునుండి తిరిగి రాఁగూడ దని గూడ శాసించెను.

క్షణములోఁ గోటయం దంతటను చితులు పేర్పఁబడియెను.
రాజపత్నులు, రాజకన్యలు, రాజస్నుషలు, సర్దారుల భార్యలు,
సైనికుల యిల్లాండ్రును మున్నగు కోటయందలి స్త్రీలెల్లరు నగ్నికార్య
ప్రయత్నములయందుఁ బ్రవృత్తులైరి. కోటయందలి పురుషు లాబా
లగోపాలమును బచ్చని వస్త్రములు గట్టుకొని యొడలినిండ రక్తగంధ
ములందికొని, రక్తకుసుమమాలాలంకృతులై, ఖడ్గపాణులై యుద్ధరంగ
మున కుఱికిరి.

రాజపుత్రుల నాఁటి సమరవేషములం గాంచి యవను లాశ్చ
ర్యపడిరి; గాని వెంటనే యవి యన్నియు దాంభికవేషము లని తలం
చిరి. ఒక్కమా టుభయపక్షములవారును దుఫాను సమయమునం
దలి మహాసాగరము వోలె నటునిటు నూఁగిపోయిరి. అదియే యుద్ధ
మున కంతిమప్రయత్న మయ్యెను. యవనభటతరంగములలోఁ బడి
రాజపుత్రు లదృశ్యులై పోయిరి. వారి విజయధ్వజము కూలిపోయెను.
తురుష్కులు విజయప్రమత్తులై పేర్చియార్చుచుఁ గోటజొరఁ
బరువు లెత్తిరి.

తమవారి జయాపజయములను దెలిసికొనుటకు బురుజులపై
నెక్కి చూచుచున్న క్షత్రియస్త్రీలు వెంటనే చితులచెంతఁ గనిపె
ట్టుకొని యున్న రమణీమణులతో నిఁకఁ ద్వరపడవలె నని చెప్పివే
సిరి. అంత నేతికుడ్డలతో నిండియున్న చితు లన్నిటికిని నిప్పు ముట్టిం
పఁబడియెను. క్షణములో నగ్ని హోత్రుఁడు నిజరూపమును దాల్చెను.

పద్మినీ ప్రముఖులగు స్త్రీ లెల్లరును సంతోషముతో నగ్నిహోత్రమున లీనమైపోయిరి.

తురుష్కులు కోటలోఁ బ్రవేశించిరి. ఘోరాగ్రము లగు చితుల యగ్నిజ్వాలలు వారికి స్వాగత మొసంగెను. అశ్వారోహణము గావించి యత్యుత్సాహముతో నచ్చటికి రెండు దండెలలో వచ్చి చేరిన అల్లాయుద్దీనుఁ డచ్చట జరిగిపోయిన వ్యాపార మంతయుఁ జూచి, హతాశుఁడై, నిలువున నీరై, మొదలు నఱికిన చెట్టువలెఁ గ్రిందఁ గూలఁ బడెను. కొంతసేప టాతఁడు మూర్ఛపోయెను. తెలివి వచ్చిన తరువాత నాతఁడు పద్మినికొఱ కెంతో వగచెను. పద్మిని చిచ్చులో నుఱికి తన హృదయమునఁ జిచ్చువెట్టె నని పరితాప పడెను. తుద కల్లాయుద్దీనుఁడు మాలవదేవుఁ డను నొక రాజపుత్రునిఁ జిత్తూరుదుర్గమునకుఁ బాలకునిగా నేర్పఱచి ఢిల్లీకిఁ బోయెను.

ఇంతటితో నీ యాఖ్యానము ముగిసినది.

భీమసింహుఁడు, లక్ష్మణసింహుఁడు మున్నగు వారు దేహబలమునఁ గొంతవఱకు మనోబలమును గూడఁ గలవా రని యొప్పుకొనక తప్పదు. వారికిఁ గొఱవడినది బుద్ధిబలము. వెఱ్ఱియభిమానము దానిని దగ్గఱకే చేరనిచ్చినది గాదు. అది లేనందులకుఁ గలుగు ఫలమును వారు పూర్తిగ ననుభవించిరి.

అల్లాయుద్దీనునకుఁ బద్మినీదేవి ప్రతిబింబమును నిలువుటద్దమునఁ జూపినప్పుడు మానమో యని కొట్టుకొను వీరిమానమును, బద్మినీదేవిని సాగనంపి క్షత్రియస్త్రీలు తిరిగి కోటలోనికిఁ బోవుచున్నా రనిన పల్లకులలో నొకదానిలోఁ గూర్చుండి భీమసింహుఁడు కోట

లోనికిఁ బోయి ప్రాణము దక్కించుకొనినపుడు పౌరుషమో యని ప్రాకులాడు వీరి పౌరుషమును, బద్మినీదేవియు, నామెను సాగనంపుట కేడువందల పల్లకీలలో క్షత్రియస్త్రీలును వచ్చుచున్నా రని ప్రకటించి, దొంగవేషములతో వీరభటుల నంపినపుడు ధర్మమో యని దొర్లాడు వీరి ధర్మమును, సమూలముగ నాశమైపోయినవి. పద్మినీదేవినిఁ దీసికొనిపోవుటకు వచ్చిన యల్లాయుద్దీనుని నామె భర్త యగు భీమసింహుని చేతనే సాగనంపించినపుడు వారి సిగ్గులేనితనమును, జయ మిఁకఁ గలలోని ముచ్చట యని తోఁచినపుడు స్త్రీలకు జహార్వ్రతమున కాజ్ఞ యిచ్చి తా మందఱును యుద్ధములోఁ జచ్చినపుడు వీరి చేతగానితనమును, "బద్మిని నొకమాఱు చూపినను జాలు నని తురుష్కుఁడు కోర దీర్ఘాలోచనము చేసిచేసి తుదకు వల్లె యని యంగీకరించినపుడు వీరి పిఱికితనమునుఁ బూర్తిగఁ బట్టబయలైనవి. వంశము నిలుచుటకై యొక్క యజయసింహుని మాత్రమే కోటదాఁటించి పంపివేసి యందఱును గుమిగూడి చచ్చుట వలనఁ బగసాధించుటలో వీరికిఁ గల పట్టుదల గూడఁ దేటతెల్లమైనది. ఇఁక నొంటరిగఁ గోటలోనికి వచ్చిన యల్లాయుద్దీనునిఁ బూలలోఁ బెట్టినట్లు చాల గౌరవముతోఁ బంపివైచిన వీరి రాజనీతిధౌరంధర్యమును వేఱుగఁ గొనియాడ నక్కఱ లేదు. అట్టి వీరినిఁ జరిత్రకారులు కొంద "అత్యుచ్చనీతితత్త్వమును పాటించిన వా"రని పొగడిపొగడి విడిచిపెట్టినారు. ఏమి నీతిరా?

ఇఁక మే మిప్పుడు చెప్పఁబోవునది యే మనఁగా? భీమసింహాదులు శక్తిశూరులును, శక్తిపరాక్రమవంతులును గాని నిర్మల-

శూరులును, నిర్దుష్టపరాక్రమవంతులు గారు; కావుననే వారి కట్టి గతి ప్రాప్తించినది. ప్రాచ్యదృష్టికి వారి సంఘమరణము వీరమరణముగనే తోఁపవచ్చును; గాని రాజనీతిజ్ఞుల కంత యుత్కృష్టమరణముగాఁ గాన్పింపదు.

శ్రీరస్తు

వీర పూజ

ప్రథమ భాగము

హమీరసింహుఁడు

రాణేంద్రి యగు లక్ష్మణసింహుని యానతి చొప్పున నజయ సింహుఁ డారావలీ పర్వతమునందలి కేల్వా డను స్థలము నకుఁ బోయి యచ్చట నివసించి యుండెను. అతని కుమారు లిరువురు, నన్న యగు నూరుసింహుని కొడుకు హమీరుఁడును గూడ నాతని యొద్దనే యుండిరి. అల్లాయుద్దీనుఁడు చిత్తూరుపై నెత్తివచ్చి భగభగమండు చితులతో నిండి భయానకమై యున్న కోటను స్వాధీనము చేసికొనిన యపుడు హమీరుఁడు తన తాతగారి యింటఁ బెరుగుచుండెను. అక్కట తన నాతని కా యుద్ధమునఁ బ్రసక్తి గలిగినది గాదు.

నూనూఁగు మీసములతోడను, సుదృఢబాహుదండములతోడను, విశాలఫాలతలములతోడను, గభీరనయనయుగ్మములతోడను, విజయలక్ష్మి సింహాపీఠము లన నొప్పు వక్షస్స్థలములతోడను వీరరసాకారావతారములో యనఁ దేజరిల్లు తన కుమారులను, హమీరుని

జూచి యజయసింహుఁడు వేఁడి నిట్టూర్పులు విడువని క్షణము లేదు. విశాలసామ్రాజ్యపాలనాసమర్థ మగు వివేకమును, యోధసహస్రముల నవలీలజయింపఁగల బాహుబలమును, వెదురుధాన్యము మున్నగు క్షుద్రాహారపదార్థములను సేకరించుకొనుటకును, వ్యాఘ్రాదిహింస్రపశువుల బారిఁ బడకుండఁ దమ్ముఁ దాము కాపాడుకొనుటకు నే భగవంతుఁడు వీరికిఁ బ్రసాదించెఁ గాఁబోలు నని వగవని దినము లేదు.

ఈ విచారమువలనఁ బూర్వస్మృతియు, దానివలన నుత్కట విషాదము, నితరేతర ప్రవర్ధకములై యాతని కుక్కిరిబిక్కిరి గలిగించుచుండెను. ఈ దుర్భరస్థితివలన నుత్సాహశక్తియు, మంత్రశక్తియు నశించిపోయెను. ఇఁక నే మున్నది? ప్రకాశవంతమై మహోన్నతము గాఁదగిన యా క్షత్రియవీరుని జీవితము గాఢాంధకారబంధురమై యధఃపతితం బై పోయెను. కష్టము వెంట సుఖమును, సుఖము వెంటఁ గష్టమును గలుగుట ప్రకృతిధర్మము. కష్టము వచ్చినప్పుడు క్రుంగిపోవుటయు, సుఖము వచ్చినపుడు పొంగిపోవుటయు వీర ధర్మము గాదు; గాని యేలకో యాతని జీవిత మట్టి దై పోయినది.

ఆతని కుమారులకును, హమీరునకును మాత్ర మిట్టి గతి సంభవింపలేదు. నూనూఁగు మీసములకు నైల్య మొదవిన కొలందినిఁ, జూడ్కులయందును హృదయములయందును గాంభీర్యము పొడసూపిన కొలందిని, ననవరతశింజినీసమాకర్షణమువలన సుకుమార బాహుదండములు కిణాంకితము లై నకొలందిని, వారికి నవశక్తియు, నవ్యభావములును బ్రభవించి దినదినప్రవర్ధమానములు గాఁజొచ్చెను. క్రమక్రమముగ వారికి శత్రుసంహారేచ్ఛయు, రాజ్యస్పృహయుఁ గూడఁ గలిగెను. ఆ చిత్తూరే రాజధానిగఁ జేసికొని యా మేవాడు రాజ్యమునే

బరిపాలింపఁగలయు నను దృఢదీక్ష గూడఁ గలిగెను. అంతటితో వారిజీవితనాటకమునఁ బ్రథమాంకము ముగిసి ద్వితీయాంకము ప్రారంభ మయ్యెను.

అప్పటినుండియు వా రజయసింహుని, మేవాడు రాజ్యమును గురించియుఁ జిత్తూరుదుర్గమును గురించియు, యుద్ధవిధానముల గురించియుఁ, దన పూర్వుల శక్తిసామర్థ్యములను గురించియు, శత్రువుల బలాబలములను గురించియు, వారి రాజనీతిపద్ధతులను గురించియుఁ దీవ్రముగఁ బ్రశ్నించుచుఁ దమలోఁ దాము చర్చించుకొనఁ బ్రారంభించిరి. దానిచే నజయసింహుని జీవితమున నంతలో నూతన మగు మార్పు గలిగెను. దుర్భరవిషాదమువలన మాడిపోయి రూపు మాయుట కున్ముఖములై యున్న రాజ్యప్రత్యాశాలతలు మఱలఁ బల్లవితములు కాఁజొచ్చెను. తేజోవిహీన మైన యాతని ముఖమున నవలావణ్య మంకిత మయ్యెను. తండ్రి నారసి కుమారులును గుమారులను జూచి తండ్రియు నత్యంత ధైర్యవంతు లగుచుండిరి. ఇది యంతయుఁ జూచుచున్న యజయసింహుని రాణి మఱలఁ దొంటి యౌన్నత్యము వచ్చితీఱు నను నమ్మకముతోఁ దన ముఖమండలమునఁ దాండవము సలుపుటకు దరహాసలక్ష్మి నాహ్వానము సేయ సాగెను. అది చూచి యజయసింహుఁడు మేవాడు రాజ్యలక్ష్మి తనపై నపాంగ నిరీక్షణములం బఱపుచున్న దని యానందింపజొచ్చెను.

తినుటకుఁ దిండియుఁ గట్టుటకు గుడ్డయు,నిలుచుటకు నీడయు లేని వానికి రాజ్యకాంక్ష గలిగినది. కత్తి చేఁబట్టి పోరాడుట కొక్క భటుఁడైన లేనివానికిఁ బ్రబలుండగు వైరితోఁ బోర నిచ్ఛ గలిగి నది. వీరిలో నెవరికైన నిది పరిహాసపాత్రముగఁ దోఁచుచున్న దియా!

మేము దీనిని గుఱించి యేమియుఁ జెప్పఁ జాలము. తన వాంఛలను నెఱవేర్చుకొనుట కింక నజయసింహున కాంతరంగికము లగు నాధారము లేమి యున్నవో, యాతని భావయంత్ర మెట్లు పనిచేయుచున్నదో, తెలియదు. ఆతని యూహ లెట్లు పరిణమింపఁగలవో, ప్రయత్నము లెట్లు ఫలింపఁగలవో యూహించుట కైలి గాదు. అయిన నతఁడు రాజ్యతృష్ణ యధిక మైనకొలందిని రాజ్యసంపాదనమును గుఱించి యనేకోపాయములను బన్నసాగెను. ఆతని పుత్రులుం గూడ నా పనిమీఁదనే యుండిరి.

కాల మిట్లాలోచనలతోఁ గడచిపోవుచుండ నాతని కొక భిల్లునితో విరోధము సంభవించెను అది మాటలతోఁ దీరునది గాదు. కత్తులు కలుపవలసివచ్చెను. ఆటవికుండగుటంజేసి భిల్లుఁ డందులకు జంక లేదు. క్షత్రియునకు మాత్రము జంకెక్కడ? వెంటనే ద్వంద్వయుద్ధము సాఁగెను. హమీరుని ఖడ్గాఘాతమువలన భిల్లుని శిరము బంతివలె నెగిరిపోయెను. తోడనే హమీరుఁ డా శిరస్సును గొని వచ్చి పినతండ్రి పదనికటమున నుంచెను.

అది చూచి యజయసింహుఁడు, హమీరుని శౌర్యప్రతాపములను, దనయందలి భక్తినిఁ జాల మెచ్చుకొనియెను. ఈ సందర్భమున నజయసింహునకు వీరస్వర్గప్రయాణోన్ముఖుండై జనకుఁ డగు లక్ష్మణసింహుఁడు చెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చెను. అప్పు డాతని హృదయకుహరమున "హమీరుఁడే మేవాడురాజ్యేశ్వరుఁ" డను మాట గంభీరముగఁ బ్రతిధ్వనించెను. వెంటనే యా హృదయము చేయిపెట్టి కలఁచినట్లు కలంగిపోయెను. వివిధము లగు ననేకభావము లుదయించి యాకల్లోలమున నొకదానిపై నొకటి పడి చిందఱవందఱయై

యొడుగంట మునిఁగిపోయెను. అంత నజయసింహుఁ డాఖిల్జిని శిరస్సు నుండి స్రవించు రక్తముతో హామీరునకు బొట్టువెట్టి "నీ జనకుఁడు నా కగ్రజుం డగుటంజేసియు, విశేషించి నా తండ్రి విధించుటం జేసియు, నీ సంతోషసహాయమున నీకు మేవాడరాజ్యాధిపత్యము నొసంగుచున్నాఁడను. అశేషంబుగ నీ వా రాజ్యమును జయించి కొని పెద్దకాలము కులాహ్లాదకరంబుగఁ బరిపాలింతువు గాత"మని యాశీర్వదించెను. అతని కుమారు లిరువురును గూడ నందుల కంగీకరించిరి. ఇది జరిగిన కొలఁదిదినముల కజయసింహుని రెండవ కుమారుఁడు పరలోకగతుం డయ్యెను. జ్యేష్ఠపుత్రుం డగు సజ్జన సింహుఁ డప్పుడైన మేవాడ రాజ్యాధిపత్యముకొఱకై హామీరునితోఁ బోరాడు నేమో యని తలంచి యాతఁడు "నీవు మేవాడ రాజ్యమును విడిచి యెందేనిఁ బొ"మ్మని పెద్దకొడుకున కాజ్ఞాపించెను. సార్థకనాముఁ డగు సజ్జనసింహుఁడు పితృవచనమును వేదవాక్యముగా భావించి వంశభూషణుండ వగు మని హామీరుని దీవించి, తలిదండ్రుల కెఱఁగి దక్షిణమునందలి మహారాష్ట్రదేశమునకు సంతోషముతో వెడలి పోయెను.

హామీరున కిట్లు మేవాడ రాజ్యాధిపత్యము చేకూరెను. కాని దానివలన నేమి ప్రయోజనము? పాలించుటకు రాజ్యమెక్కడ? తురుష్కుల యధీనమునం దున్న మేవాడ రాజ్యమున కజయసింహుఁడు హామీరునిఁ బ్రభువుగాఁ జేయుట యేమి సందర్భముగ నున్నది? ఇవి యన్నియుఁ జూచిన మా పాఠకమహాశయులు వింత పడక మానరు; కాని హామీరుఁ డెంతో యానందించెను. తన యెడలఁ జూపిన గౌరవమున కాతఁడు పినతండ్రి కనేక ధన్యవాదములను

సమర్పించెను. వెంటనే యాతఁడు మేవాడు రాజ్యసంపాదనమునకుఁ దగు ప్రయత్నములను బ్రారంభించెను.

లోకములో రాజ్యసంపాదన మైన తరువాత నాధిపత్యము సిద్ధించుచున్నది; గాని యాధిపత్యము సిద్ధించినతరువాత రాజ్యలాభము గలుగుచున్నట్లు వినము. ఈ వృత్తాంత మంతయు లోకాచారమునకు విపరీతముగ నున్నది. తండ్రి యభిప్రాయము నజయసింహుఁ డెంతవఱకు కర్థము చేసికొనెనో, యట్లు చేయుటలో నాతని యభిప్రాయ మేమో, హమీరుఁడు రాజకుమారుఁడ నగు నేను రాజ నెట్లు కాకపోదు నని తలంచెనో, మన మేమో చెప్పఁజాలము. మేవాడు రాజ్యేశ్వరుఁ డన్న హమీరుని బిరుదము సార్థక మైనదో, నామమాత్ర మైనదో చరిత్రలవలన మనము తెలిసికొందము.

ఇది జరిగిన కొలఁదిదినములకు అజయసింహుఁ డిహలోకమును విడిచిపోయెను. కన్న కొడుకుల కంటెఁ దన్నెక్కుడు ప్రేమతోఁ జూచిన యజయసింహుని మరణమునకు హమీరసింహుఁ డెంతో విచారించెను; గాని విచారించి యేమి సేయఁగలఁడు? హమీరు నీ కష్టసమయములో "నయ్యో! నీ కిట్టి చిక్కు తటస్థించినదా?" యని యూరడించుట కెవ్వఁడును లేఁడు. "ఏమైనను నీకు భయము లేదు. నీవు క్షత్రియవీరుఁడ" వని ధైర్యము చెప్పవా రంతకుమున్నె లేరు. పాపము మేవాడు రాజ్యాధీశ్వరుఁ డగు హమీరుఁ డిట్లు దిక్కులేక యారావళీపర్వతారణ్య వాటికలయందు సంచరింపవలసిన వాఁడై పోయెను.

లోకములో మానవుల కింతకంటె శోచనీయ మగు నవస్థ వేఱొకటి లేదు. తినుటకుఁ దిండి లేకపోయినను "నా" యన్న వాఁ

డోకఁ దుండినచో హృదయ వేదన కొకింత యుపశాంతి కలుగ వచ్చును. అట్టి వారు లేకున్న వానికంటె దైవోపహతుఁడు వేఱొకఁ డుండఁబోఁడు. ఇప్పుడు హమీరుఁ డట్టివాఁ డై పోయెను. అయిన వాతఁ డిందుల కేమియు సంచలింపలేదు. అతని హృదయ మీ విష యమునే గమనింపలేదు. అప్పు డాతనిమనస్సు వేఱు విషయమున లీనమై యుండెను.

ఆ విషయ మేది? శత్రుసంహారము. మఱియు, రాజ్యసంపా దనము. వీని విషయమై యాతఁడు తీవ్రాలోచనము ప్రారంభించెను. రాజ్యసంపాదనమున కీ దిక్కులేనివాని కే రాజైన సాయము సేయ వచ్చునా? అది వట్టి భ్రాంతి. అసంభవము. అట్లగుట నాతఁడు పర రాజుల నాశ్రయింపవలె ననునూహ పొడమిన వెంటనే దానిని హృదయక్షేత్రమునుండి తొలఁగించివైచెను. "స్వయముగనే ప్రయ త్నింపవలెను ఇతరులకు ఫలానుభోగము లేని కార్య మితరుల తోడ్పాటువలన నెఱవేఱఁ జాల"దని యాతఁడు నిశ్చయించుకొ నియెను.

ఇట్లు నిర్ధారణము గావించుకొని వెంటనే యాతఁడు విల్లు నమ్ములు ధరించి యోధజీవనము గావించు నాటవికులను సైనికులుగాఁ జేర్చుకొనసాగెను. అచ్చటి భిల్లు లెల్లరు నా వీరాగ్రేసరుని నాయ కత్వము నంగీకరించిరి. క్రమముగఁ గొలఁదిదినములలో నైదువేల భిల్లు లాతని నీడఁ జేరిరి. ఇఁక శత్రుసంహారమునకుఁ బ్రారంభము సేయ వచ్చునని యాతఁడు నిశ్చయించుకొనియెను.

ఈనిశ్చయము ననుసరించి పనిఁ బ్రారంభింపఁబోవునపు డాత నికి మఱల నీ విషయమున నపజయశంక పొడమెను. ధనలోపము వలన నానాబాధలు ననుభవించు నిక్కాలమునఁ దురాకి ఫిరంగి

మున్నగు దీక్షాయుధములు లేని కేవలధానుష్కులగు నీ యైదువేల భిల్లుల సాయంబువలన బలాధికుఁడై యున్న శత్రువు లొంగుట కలలోని వార్త యని యాతనికిఁ దోఁచెను. అక్కతన వాతఁడు దిల్లీరాజ్యమునఁ బ్రవేశించి యసంఖ్యధనము సంపాదించెను. ఆతఁడా ధనమంతయు నారావళీపర్వతారణ్యవాటికలయందలి కేల్వా డను స్థలమునకుఁ జేర్చి, యంతకంతకుఁ బౌఁజు వృద్ధిచేసికొని క్రమక్రమముగఁ బట్టణములను దుర్గములను గూడ ముట్టడించుచుఁ దుదకుఁ జిత్తూరుదుర్గము దక్కఁ దక్కిన మేవాడురాజ్య మంతయు వశపఱచుకొనియెను.

ఆతఁడా స్థితికి వచ్చునప్పటికి గుఱ్ఱములు, ఏనుఁగులు, రథములు, తుపాకులు, ఫిరంగీలు మున్నగు రణపరికరములను గల బ్రహ్మాండసైన్యము సమకూరెను. రాజపుత్రస్థానమునందలి భారతీయ రాజన్యులందఱితోడను బరిచయమును, గొందిగనో గొప్పగనో స్నేహము నొనఁగూడెను. మంత్రి ప్రధాని సచివుఁడు నమాత్యుఁడు మున్నగు ప్రకృతివర్గము గూడ నేర్పడెను. ఇట్లు దిక్కులేని హమ్మీరుఁడు రాజయ్యెను. దీని కంతకును గారణ మాత్మగౌరవపౌరుషములో, యజయసింహుఁ డాతనికిఁ బట్టాభిషేకము గావించినప్పటి ముహూర్తపుఁ బ్రభావమో మేము చెప్పఁజాలము.

అల్లాయుద్దీనుఁడు చిత్తూరుదుర్గమున మాలవదేవుఁ డను రాజపుత్రునిఁ బ్రతినిధిగా నేర్పఱచుట మా పాఠకులకు విదితము. ఇప్పుడు గూడ నాతఁడే చిత్తూరుదుర్గమున కీశ్వరుఁడై యుండెను; గాని దిల్లీశ్వరుఁడు మాత్రము మాఱిపోయెను. హమ్మీరుఁడు మేవాడు రాజైన యీ సమయమున మహమ్మూద్ ఖిల్జీయను వాఁడు దిల్లీశ్వరుఁడై

యుండెను. మేవాడు రాజ్యము నంతను స్వాధీనము చేసికొనుచున్న హామీరుని మాలవదేవుఁడు చాలఁబడక యెదిరించెను; గాని ప్రయోజనము లేకపోయెను. తుద కెట్లో మాలవదేవుఁడు తన కొమార్తెను హామీరున కిచ్చి పెండ్లిచేయుట తటస్థించెను.

తన యజమానుని రాజ్యమును కొల్లకొట్టి పాలించుచుండు దన విరోధియైన హామీరునకు మాలవదేవుఁడు తన కొమార్తె నిచ్చుట కెట్లంగీకరించెనో, తురుష్కులకు దాసులైన వారి నేవగించుకొను హామీరుఁడు, తురుష్కుని సేవకుఁడను, దన పైతృక మగు సింహాసనము నధిష్ఠించి తన్నేకపర్యాయము లెదిరించినవాఁడు నగు మాలవదేవుని కన్యను వివాహమగుట కెట్లంగీకరించెనో తెలిసికొనుటకుఁ జారిత్రికములగు సాధనము లేమియు లేవు. ఈ వివాహవార్త ఢిల్లీశ్వరునకుఁ దెలిసెనో లేదో, తెలిసిన నాతఁడు దీని కెట్లు సమ్మతించెనో కూడఁ దెలిసికొనఁజాలము.

ఈ వివాహసందర్భమున నింక నొక విశేషముగూడఁ గలదు. హామీరునకుఁ బెండ్లిచేయఁబడిన కన్య బాలవిధవ. కాని యీవిషయమును గప్పిపుచ్చి మాలవదేవుఁ డీ పెండ్లి గావించెను. దీనివలన మాలవదేవునకు హామీరునిఁ బరాభవింప నుద్దేశ మున్నట్లు తోఁచుచున్నది. ఢిల్లీశ్వరుఁ డీ వివాహమున కేమియు నాక్షేపణములు చెప్పకపోవుటకుఁ గూడ నిదియే హేతువై యుండవచ్చును. ఏది యెట్లయిన నీ రహస్యము మాత్రము దాఁగినది గాదు. హామీరున కంతయుఁ దెలిసిపోయెను. కాని యాతఁ డందుల కేమియు ననలేదు. మామగారి నేమియు దూషింపలేదు. భార్య నిందుకయుఁ దూలనాడలేదు. ఏరి మీఁదను గోపము చూపలేదు. భార్య నాతఁ డెంతో ప్రేమించెను.

ఆ దంపతులు సీతారాములవలె నితరేతరానురక్తులై మెలంగసాగిరి. హమ్మీరుని మిత్రులగు రాజపుత్రులు గూడ నీ వివాహమును గురించి యాక్షేపణలు సేసినట్లు కాన్పింపదు.

హమ్మీరుఁడు, బాలవిధవ యని తెలిసియుఁ దన కూఁతు నధికానురాగముతోఁ జూచుచుండుటవలననో, హమ్మీరునిఁ బరాభవింపవలయు నను నభిప్రాయమే లేకపోవుటవలననో, హమ్మీరుఁడు మహాపురుషుఁ డని తెలిసికొనుటవలననో, మాలవదేవుఁడు హమ్మీరునిఁ జాల గౌరవముతోఁ జూడసాగెను. తనకుఁ బిల్లనిచ్చిన మామగా రగుటం బూజ్యుఁ డనియే తలంచెనో, తన స్వకీయ మగు సింహాసనము నెక్కియుండె నను కోపమును విడనాడెనో, చిత్తూరుదుర్గము నెడల నాశయే వదలుకొనెనో గాని హమ్మీరుఁడు గూడ మాలవదేవు నెడలఁ జాల గౌరవముఁ జూపసాగెను.

కాల మిట్లు గడచిపోవుచుండఁగా మాలవదేవుఁ డొక సమయమున దారపుత్రులతోఁ బెద్ద సైన్యమును గూర్చుకొని ఢిల్లీశ్వరుని యాజ్ఞచొప్పున నెచ్చటికో యుద్ధము సేయఁబోవుట తటస్థించెను. అప్పుడు చిత్తూరుదుర్గము మీఁదఁ దద్రక్షణార్థము కొలదిసైనికులతో హమ్మీరుఁడు నాతని భార్యయు నుండి రని చరిత్రలు చెప్పుచున్నవి. ఈ సమాచార మెంతో వింతగా నున్నది. దీనికిఁ జరిత్రకారుల కెట్టి యాధారము లున్నవో తెలియదు. అట్టి యెడల హమ్మీరుఁడు చాల యుక్తిపరుఁడు గావున భార్యకు నామె తండ్రిపైఁ బ్రబలవిరోధమును గలిగించి సైనికులను లోపుచేసికొని స్వస్థలము నంపి తన సైన్యమును గొంత రప్పించికొని చిత్తూరుదుర్గము నాక్రమించితి వని మిత్రుల కెల్లరను తెలియఁజేసెను.

చిత్తూరు దురుష్కుని యధీనమున నుండుటవలన రాజపుత్రులకుఁ జాల నిబ్బందిగా నుండెను. వారందఱును రాజపుత్రస్థానమునఁ దురుష్కుఁడు ప్రవేశించె వీనినిఁ దఱుము కొట్టని యోచించుచుండిరి. అట్టివారగుటంజేసి హామీరుని సందేశమునకు వారెంతో యానందించిరి. ఇఁకఁ దురుష్కుని పీచ మడంచుట విలాసమాత్ర మని భావించి వారందఱును "కలసినప్పుడు మా మా సైన్యములతో నీకు సాయము గా సిద్ధముగ నున్నా" మని హామీరునకుఁ బ్రత్యుత్తరము లంపిరి. అది చూచి యాతఁడు పదివేల యేనుఁగుల బలము వచ్చినట్లు సంతోషించెను.

ఇంతలో మాలవదేవుఁడు తా నరిగిన పని ముగించుకొని వెనుకకు మఱలి చిత్తూరుదుర్గమును సమీపించెను; గాని హామీరుని వీరభటులవలన నిరోధింపఁబడెను. అది చూచి మాలవదేవుఁడు నిర్విణ్ణుఁడై యంతలో నంతయుఁ దెలిసికొని, మఱియొక యుద్ధసందర్భమున హతశేషు లగు తన స్వల్పసైనికులతోఁ జిత్తూరుసైన్యమును దాఁకెను. కాని ప్రయోజనము లేకపోయెను. ఆ స్వల్పసైన్యము గూడ రూపుమాసెను. మాలవదేవుఁ డఱచేతఁ బ్రాణములు పెట్టుకొని దిల్లీకిఁ బోయెను.

అట దిల్లీశ్వరునితో నాతఁ డేమిచెప్పెనో తన కేమియు నపాయము రాకుండునట్లు చేసికొనియెను. వెంటనే మహమూదుఖిల్జీ యనంతసైన్యోపేతుఁడై చిత్తూరుదుర్గమును ముట్టడింప బయల్వెడలెను. ఈ సంగతి దెలిసికొని హామీరుని స్నేహితు లందఱును దమతమ సైన్యములతో వచ్చి చిత్తూరు చేరికొనిరి.

యుక్తసమయమున నిరుతెగలవారికిని జంబళానదీతీరమున సింగోలీ యను జనపదము దగ్గఱ సంకులసమరము ప్రారంభ

మయ్యెను. “మేము తురకబిడ్డలము. మ మ్మొక్కరులం జెనకఁ గలరా” యని ఢిల్లీ సైనికులును, “మేము క్షత్రియవీరులము. ప్రపంచమున మా కెదురు గలదా? యని చిత్తూరు యోధులును జాలఁ బట్టుదలతోఁ బోరిరి. తుదకు మహమూద్ ఖిల్జీ క్షత్రియులచేఁ జెఱఁబెట్టఁబడెను. హతశేషు లగు తురుష్కులు పాఱిపోయిరి.

చేఁజిక్కిన ఖిల్జీని వెంటఁబెట్టుకొని మిత్రులం గూడి హమ్మీరుఁడు జయజయధ్వనులతోఁ జిత్తూరుదుర్గము ప్రవేశించెను. పౌరు లెల్లరును యోధులకు స్వాగత మొసంగిరి. రాజాంతఃపురమున కరిగి నపుడు రాణి స్వయముగ మంగళహారతి నొసఁగి యాతనిని ధన్యునిఁ జేసెను.

పిదపఁ జిత్తూరుదుర్గమునఁ దన పూర్వు లెల్లరును సభదీర్చిన భవనమునందే కొలువుదీరి మిత్రుల నెల్లరను గౌరవించి సైనికుల కర్హబహుమానముల నొసంగి హమ్మీరుఁడు దేవేంద్రునివలె విరాజిల్లెను. రాజపుత్రస్థానమునందలి స్త్రీపురుషు లాబాలగోపాలమును హమ్మీరుని దీవించిరి.

ఈ యుద్ధమున మాలదేవుఁ డేమైనదియుఁ దెలియదు. కాని యాతని పెద్దకొడుకు రణవీరుఁడు సంగ్రామరంగమునుండి తిన్నగ వీరస్వర్గమునకుం బోయెను. రెండవ కొడుకు వనవీరుఁడు హమ్మీరునిచే బద్ధుం డయ్యెను. హమ్మీరుఁడు వానినిఁ గొలువుకూటమునకు రప్పించి బంధముక్తునిఁ గావించి “నీకును నాకును గల బంధుత్వముసంగతి యట్లుండ, మన మిరువురము నొక జాతికి, నొక మతమునకు జెంది యున్నాము. నీవు నీ స్వజాతియెడల గౌరవము గలిగి ప్రవర్తింపు” మని బుద్ధి చెప్పి యొక జాగీ రొసంగి పంపివేసెను.

మూఁడు నెలలు గడచిన తరువాత హమీరుఁడు ఖిల్జీని గురించి విచారణ ప్రారంభించెను. ఈ మూఁడుమాసములు సత్పురుషుఁడు చిత్తూరుదుర్గమునందే బద్ధుఁడై యుండెను. తుదకు, ఖిల్జీ హమీరున "అజమీరు, రణథంభోరు, నాగోరు, సుయీసోపూరు" అను ప్రాంతములును నేఁబదిలక్షల రూపాయలును, నూఱేనుఁగులును సమర్పించి "యిఁక ముందెన్నఁడును నేను మేవాడురాజ్యము మీఁదికిఁ గాని, యితర రాజపుత్రుల రాజ్యములమీఁదికిఁ గాని దండెత్తి రాఁగలవాఁడను గాను. ఇతరు లెవరైన దండెత్తివచ్చినయెడల నేను మీకు సాహాయ్యము సేయఁగల వాఁడ"నని చెప్పి యొప్పించుకొని బంధవిముక్తుఁడై ఢిల్లీ చేరికొనియెను.

రాజపుత్రస్థానమునందలి వారెల్లరును హమీరసింహుని దివ్యపురుషునిగా భావించి గౌరవింపసాగిరి. మఱియు "నబూ, బుందీ, గ్వాలేరు, చందేరీ, రాయసహాను, సిక్రీ, కాల్వే, జయపురము, జోదపురము సంస్థానాధీశ్వరులు సంతోషముతో నాతనికి సామంతులై కొలువసాగిరి. ఈ రూపమున రాజపుత్రస్థానమున నైకమత్యము మఱలఁ దలయెత్తసాగెను.

మహమ్మదీయు లీ దేశమునకు వచ్చుటకుఁ బూర్వము మేవాడు రాజ్యము చాల వైశాల్యము కలదియై యుండెను; గాని యది పిదపఁ గాలక్రమమునను, నంతకుఁ బూర్వపు రాజుల రాజకీయ విషయములయందలి యౌదాసీన్యము వలనను, చాలవఱకుఁ దగ్గిపోయెను. హమీరుఁడు సమధిక మగు పట్టుదలతోఁ బ్రయత్నించి మేవాడు రాజ్యమునకుఁ బూర్వవైశాల్యము గలిగించెను. అపారధన రాసులను సంపాదించి దివ్యమందిరము లనేకములు గట్టించి, యంత

వఱకుఁ దన ప్రజలు తురుష్కులచే ననుభవించిన బాధలు మఱచి పోవుటకును, దారిద్ర్యసాగరమునుండి యుత్తీర్ణు లగుటకును దగు సౌకర్యములు చేకూర్చి బళిరా యనునట్లు పెద్దకాలము ప్రజాపాలనము గావించి, విపులైశ్వర్యమును విశాలరాజ్యమును దనయుఁ డగు క్షేత్రసింహునకుఁ బట్టముగట్టి యా మహారాజు భౌతిక శరీరమును విడిచి స్వర్గమునకుఁ బోయెను.

ఈ హామీరసింహుని జీవితమును శ్రద్ధతోఁ బఠించిన వారికీతని యభివృద్ధి యంతయు నిరవధిక మగు పురుషకారము వలననే గలిగిన దని తెలిసికొనియే యుందురు. ఖిల్జీముదలను, మఱియొకటి రెండువిషయములయందు నీతఁడు తన పూర్వుల నీతినే యవలంబించెను; గాని మొత్తము మీఁద నీతఁడు రాజకీయములయందుఁ జాల మెలఁకువతోడనే ప్రవర్తించెనని చెప్పవచ్చును. ఇఁక నీతని జీవితమునందలి విశేష మేమన?

తనకుఁ బెండ్లిసేయఁబడిన కన్య బాలవిధవ యని తెలిసికొనియు నీతఁ డామె సౌందర్యమును జూచియు, సద్గుణములను జూచియు నామెను జాల ననురాగముతోఁ జూచెను. వివాహకాలమున మాలవదేవుఁడు తన కూఁతురు బాలవితంతువని తెలియనీయక రహస్యముగ నుంచుటవలన నా కాలమున వితంతువివాహాచార మున్న దని సందేహించుట కవకాశము గాన్పించుటలేదు. అయినను హామీరుఁ డిది యనాచార మని జంకలేదు. రాజపుత్రు లెవ్వరును దాని కేమియు నాక్షేపములు చేసినట్లు తోఁపదు. పయింబయిఁగ వారెల్లరు నాతనిఁ జాల గౌరవించిరి. సాంఘికనియమములకు వ్యతిరేకముగ నడచిన హామీరునిఁ గేవల రాజకీయ సంబంధముల వలన వారు గౌరవించి

రని చెప్పుటకు వలనుపడదు. రాజు లెల్లరు నాతని వివాహము నా క్షేపింపక పోవుట యీ కాలమున వితంతువివాహాచార మాచరణములో నున్న దని వాదించు వారి కొకింత యాధారముగా నుండ వచ్చును; గాని యంతమాత్రమున నా కాలపు సాంఘిక నియమములను నిర్ధారింప నైతి గాదు.

శ్రీరస్తు

వీరపూజ

ప్రథమభాగము

సంగరాణా

రాయమల్లుఁ డనన్య సామాన్యపరాక్రమశాలి. ప్రజాహిత చింతకుఁడు; మహేంద్రవైభవము ననుభవించిన రసికశేఖరుఁడు. ఈతఁడు తన ప్రతాపమున కుదాహరణముగ బహిలోలనుఢిల్లీ పాదుషా నొకమాఱును, మాళవదేశపు సులతానగు ఘియాసుద్దీన్ ఖిల్జీ యను వాని నింకొకసారియు జర్జరితాంగులం జేసి పాఱఁద్రోలెను. తమ యెడ నధికానురాగమును జూపుచుండుటవలనఁ బ్రజ లీతనిని దేవుఁడని పూజించుచుండిరి. రాజపుత్రస్థానమునం దంతటను రాయమల్లుఁడనఁ జాల గౌరవము గలిగి యుండెను.

కాని పాప మీతని చరమదశ దైవదుర్విపాకమువలనఁ గష్టభూయిష్ఠం బై పోయెను. ఈతనికి మువ్వురు పుత్రులు గలిగిరి. జయమల్లుఁ డగ్రజుఁడు. పృథివీరాయఁడు ద్వితీయుఁడు. సంగుఁడు కడగొట్టు పట్టి. వీరు మువ్వురును వివేకమహితులే. కాని విధిప్రాతికూల్యమువలన వారొకరితో నొకరు కలహించుకొనఁ బ్రారంభించిరి.

ఈ కలహమును నివారింప రాయమల్లుఁడు చాలఁ బ్రయత్నించెను. అయినను బ్రయోజనము లేక పోయెను. తుద కాతఁడు విసిగి వేసారి ముగ్గురు కొడుకుల నిలువెడలఁ గొట్టెను.

అంతటితో నాతని కష్టముల కంతము గలుగలేదు. ప్రపంచ మంతను జయింపఁగల మూవురు పుత్రులను గలిగి యుండియు నపుత్రకుని మాదిరి నుండవలసివచ్చెఁ గదా యను నూతనవిచార మను భవించుచుండఁ బరలోకమున జయమల్లపృథివీరాయ లిరువురు నిహలోకమును విడిచిపోయిరి. పిడుగువంటి యీ వార్త విని రాయమల్లుఁడు గూడఁ బరమపదించెను.

సోదరులు చనిపోవుటవలన నిరాతంకుఁడై యున్న సంగుఁడు పితృమరణానంతరము రాజాయయ్యెను. తండ్రివలెనే యాతఁడు గూడ మహాశూరుఁడును; చతురుఁడు. బాలుఁడయ్యును బ్రజాపాలనముఁ జక్కఁగఁ బ్రారంభించెను. ఇతని యేల్బడిసైతము సౌఖ్యభూయిష్ఠం బగు నని ప్రజ లానందింపసాగిరి. తోటి రాజు లెల్లరు నీతనితోఁ గోరి మైత్రి చేయసాగిరి. అపరపరాక్రమవంతుఁ డగుటవలన నీతనికి యుద్ధ మనిన నెంతో సంతోషము. అశ్వారోహణమునందును, ఖడ్గప్రహారమునందును, శరసమ్మోక్షణమునందును భల్లప్రఘాతమునందును గడుఁ గుశలుఁడు. అగుట నీతఁ డెనిమిదివేల గుఱ్ఱపురౌతులును, నేడుగురు గొప్పరాజులును, దొమ్మండ్రు రావులను యోధాగ్రేసరులును, నూటనలుగురు ఠాకురు, రావత్తను సరదారులును, నైదువందల యేనుఁగులును, నసంఖ్యాకపదాతివర్గంబునుగల మహాసైన్యమును గూర్చుకొని పరభయంకరుఁడై యుండెను.

ఇది యంతయుఁ జూచి ఢిల్లీశ్వరుఁడును, మాళవదేశప్రభుండును, నీతని యెడ నౌదాసీన్యము వహించి యుండరా దని తలంచి యిరువురు నిరుదెసలనుండియు నొక్కమాఱుగ నీతనిపై దండెత్తి వచ్చిరి. అది చూచి సంగుఁ డేమియు జంకలేదు. అఖండధైర్యముతోడను, ననంత శౌర్యముతోడను సాహసించి వారి నిరువురినిఁ దాఁకి పోరాడించి పాఱఁద్రోలెను. పరాభవఖిన్నులై కొంచెము సేదదేర్చికొని వారిరువురు మఱల దండెత్తివచ్చిరి. సంగుఁడు మఱలఁ దఱిమెను. మొత్తము మీఁద వారిక్లేశ విడువక యీతనిని సాధించితీఱవలె నని పట్టుపట్టి పదునెనిమిదిసార్లు దండెత్తి వచ్చిరి. కాని పదునెనిమిది మాఱులు నోడిపోయిరి. అంతియ కాదు. ఒకప్పుడు సంగుఁడు ఢిల్లీశ్వరుని పుత్రునిఁ జెఱపట్టి చిత్తూరు తీసికొనివచ్చి విడిచిపెట్టెను.

ఈ రూపమున సంగుని ప్రతాపము చాల విరాజిల్లెను. కీర్తిలతలు దశదిశలం బ్రాఁకెను. భారతీయు లగు రాజు లెల్లరు నాతని యెడల భయభక్తులు చూపసాగిరి. సంగుని యాజ్ఞ కెందు నభ్యంతరము లేదయ్యెను. మేవాడు రాజ్యము చాల విస్తృతం బయ్యెను. కొలఁదిదినములలో మఱల భారత సామ్రాజ్యము తలయెత్తు సూచనలు పొడసూపెను.

ఈ సమయమున ఢిల్లీశ్వరుఁ డగు నిబ్రాహీములోదీ పరాక్రమహీనుం డగుటవలన నాతని సరదారు లెల్లరు నసంతృప్తులైరి. ప్రజలు తిరుగఁబడ నారంభించిరి: ఈ రూపమున మఱల భారతభూమిలోఁ గల్లోలము ప్రారంభ మయ్యెను. లాహోరుసంస్థాన సుబేదారుఁ డగు దౌలత్ఖానుఁడు స్వతంత్రుఁడు కా నూహించి ఢిల్లీశ్వరునితోఁ బోరాడి పరాభూతుఁడై, తన యభీష్టము నెఱవేఱనందున

యెట్లయిన ఢిల్లీశ్వరుని శాసన మందింపవలయు నని ప్రతిజ్ఞ పూని కాబూలు దేశమునకుఁ బోయి తయమూరు వంశజాఁ డగు బాబ రను వానిని భారత దేశమునకుఁ దీసికొనివచ్చెను.

వెంటనే బాబరు నిబ్రాహీమును దర్పోద్ధతులై పానిపత్తను చోటఁ దలపడిరి. లోదీపఠానుఁడును, బాబరు మొగలుజాతివాఁడు నైనను నీ యుద్ధము చాల భయంకరముగ జరిగెను. కాని లోదీ బాబరువలెఁ బరాక్రమశాలియు వివేకవంతుఁడును గాకపోవుటవలన బాబరునకే జయము చేకూరెను. లోదీ నిహతుం డయ్యెను. ఢిల్లీసామ్రాజ్యము మొగలుల స్వాధీన మయ్యెను.

ఈ విజయము వలన బాబరు రాజ్యతృష్ణ మతింత వృద్ధి యయ్యెను. భారత దేశమున కంతకును జక్రవర్తి కావలె నని యాతఁడు నిశ్చయించుకొనియెను. చక్రవర్తి కావలె ననుకాశ యాతనికిఁ జిన్నప్పటి నుండియుఁ గలదు గాని పైతృక రాజ్యమును జ్ఞాతు లందఱును హరించి యాతని నిలువ వెడలఁ గొట్టిరి. అక్కాలమున నాతఁడు స్వదేశమును విడిచి యఫ్ఘనిస్థానమునకు వచ్చి సైన్యమును గూర్చుకొని కాబూలు రాజ్యమును జయించి, మధ్యాసియాయందలి పైతృక రాజ్యము నెడల నిరాశ గావించుకొని భారత దేశముపై నుఱికెను. ఢిల్లీ రాజ్యము స్వాధీన మైన వెంటనే దానికంటెఁ బ్రతాపవంతమైన మేవాడు రాజ్యమును గెలుచుకొనవలయు నని యాగ్రామీఁదుఁగా బయలుదేఱి మున్ముందు సంగరాణామీఁదికిఁ బదునైదు వందల గుఱ్ఱపు రౌతుల నంపెను.

తమ యజమానుని యభీష్టమును నిర్వహించుట కా గుఱ్ఱపు రౌతులు యుక్తకాలమున వచ్చి సంగరాణాను దాఁకిరి. వారల

మూలమున దేశదేశములయందలి వార్తల నన్నిటినిఁ దెలిసికొను చున్నాఁడు గావున రాణా యీ యాశ్వికసైన్యము రాకముస్నే యుద్ధసన్నాహములం గావించుకొని యెదుర్కొనెను. పిదప నుభయ పక్షములవారును సాయంకాలముగఁ దలపడిరి. ఈ తుములయుద్ధ మెంతో ఘోరముగ జరిగెను. విజయలక్ష్మి సంగుని వరించెను. రాజపుత్రులు బాబరు వాశ్వికబలమును జీల్చి చెండాడిరి.

ఈ పరాభవమువలన బాబరు ప్రతాపోష్మ కొంత చల్లారెను. అతఁ డప్పుడు రాజపుత్రులు తా ననుకొని నట్లు నిస్తేజులు గారనియు కేవల బాహుబలమువలన జయము గలుగఁజాల దనియు గ్రహించి ప్రయాణ మాపివేసెను. తనతోఁగూడ నున్న ప్రచండ సైన్యము చుట్టును శత్రువు లాకస్మికముగ మీఁదఁ బడకుండ గంభీర మగు కందకమును ద్రవ్వించి యొకచో విడిసెను. మఱియు, "సంగారాణా మోడిపోయి మేవాడు రాజ్యము స్వాధీన మగునెడల దేవునకు నే యిచ్చెద నిది యిచ్చెద" నని మ్రొక్కుచుఁ దుదకు మిత్రభేదమువలన గార్యము సాధింపఁ దల పెట్టి యందులకుఁ దగు నుపాయముల నాలోచింపసాగెను.

అట సంగరాణాయు, శత్రువాహిని గాంభీర్యము నెఱింగి వచ్చుటకు గుప్తచారులను నియమించి చాలఁ గనుగలిగి యుండెను. ఈ యవసరమున నెట్లు సంఘటిల్లెనో యిరుతెగలవారును సంధిప్రయత్నములయందుఁ బ్రవృత్తులైరి. ప్రజాక్షయమును, బ్రజాపీడయుఁ గలుగకుండవలె నని సంధికొఱ కిరువురులు దమతమ రాయబారులను నియమించిరి. సంగుఁడు సిలోదీ యను రాజపుత్రుని బాబరు చెంతకుఁ దన రాయబారిగాఁ బంపెను.

సిసోదీ రాజనీతియందుఁ జాల సమర్థుఁడు. సంగరాణా చెంతకు బాబరుచే నంపఁబడిన తురుష్కుఁడు గూడ రాజ్యతంత్రమున నసామాన్యుఁడే. ఆ రాజనీతిధురంధరు లిరువురును దమయుత్తమ పక్షముల కెట్టి నష్టమును గలుగకుండునట్లు సంధి నియమములను గూర్చింపసాగిరి. ఈ సందర్భమున రాజ్యతంత్రమున వీరిరువురకంటెఁ గడు సమర్థుఁడగు బాబరు సిసోదీతో నూఱుదారిని మాట్లాడఁ దొడఁగెను. రాజపుత్రుల గుట్టంతయుఁ దనకుఁ దెలిపి సంగరాణాను దన కప్పగించినయెడల నసంఖ్యాధనము నొసంగెద నని యాతఁడు సిసోదీతో బేరమాడెను. ఆ వ్యాపారసరళి యంతయు మన కప్రస్తుతము. పర్యవసానమేమనఁగా? సిసోదీ బాబరు వినోదముగఁ బెంచుకొను కుక్కయైపోయెను. అతఁడు సంగునితో సంధినియమము లింకను నిశ్చితములు గాలేదనియు, స్వల్పవిషయములలో మాత్రమింకను గొలఁది తగవు జరుగుచున్నదనియు, సంధి తప్పక కుదురుననియుఁ జెప్పి యాతనిఁ జల్లగ జోకొట్టెను.

లెక్కలేనన్ని యుద్ధములలో గెలుపొందిన సంగుఁడు తన ప్రతాపమును దలంచికొని గర్వపడెనో, బాబరుని జయించుట సాధ్యము గాదని యూహించెనో, ప్రజాపీడకును సైన్యవినాశమునకును జంకెనో, యుద్ధప్రయత్నమున నశ్రద్ధవహించెను. ఆ సమయమున సిసోదీ హఠాత్తుగ బాబరునిఁ దీసికొనివచ్చి సంగునికంఠముపైఁ గూర్చుండఁ జేసెను. అప్పుడు సంగునకు బుద్ధివచ్చెను. అతని కూపి రాడినది గాదు. విల్లెక్కువెట్టి బాణము వదలుటకైన వీలులేకుండునట్లు ఖరాసురుఁడు శ్రీరాముని మీఁదికి వచ్చినట్లు మహమ్మదీయులు మీఁదఁబడుటవలన రాజపుత్రులకు యుద్ధసాధనములను జేతఁ బట్టుటకైన వీలు చిక్కినది గాదు. అక్కట తన వారిలో ననేకులు శత్రువులను మార్కొనక

పూర్వమే కూలిరి. సిసోదీ ప్రత్యక్షముగ బాబరుపక్షమున రాజపుత్రుల మీఁదఁ గత్తి విసరెను. తుదకు హతశేషులతోఁ గూడ సంగరాణా యప్పటికిఁ దప్పించుకొని పోవలసిన వాఁడయ్యెను. తురుష్కులు జయించిరి. మేవాడు రాజ్యమునందలి చాలభాగము వారి వశమయ్యెను.

డొంగరుపురాధీశుఁ డగు నుదయుసింగురావలు తన రెండువందల సహచరులతోడను మడసెను. భోండావంతు లనఁబడు తన మూఁడుశందల సగదాయులతో సాళుంబ్రాధీశుఁడగు రత్నఠాకురును మాన్వాడ రాజపుత్రుఁ డగు రాయమల్లరాఠోడును, మేఁటువా రగు ఖేతసీగత్నా యను వారును, సోన్గడ రా జగు రావు రామదాసుఁడును, ఝాల్వాడ రా జగు జోర్ఝా గోకులదాసప్రమారుఁడును జవాన్వంశీయు లయిన చంద్రబాణమాణిక్యచంద్రు లను వారును, స్వధర్మసంరక్షణమునకై తమ ప్రాణముల నొసంగిరి. ఇదియంతయుఁ జూచియుఁ దనకుఁ జాల గాయములు తగులుటవలనను బరాజయము సంభవించుట వలనను వ్యాకులుఁడై సంగుఁడు బాబరునోడింపకుండఁ జిత్తూరు దుర్గమునఁ గాలిడ నని ప్రతిన పూని మేవాడు దేశపుఁ బర్వతారణ్యవాటికలయందు వాసము చేసెను.

అప్పట నాతనికి శరీరస్వాస్థ్యము చెడిపోయెను. దానికిఁ గారణము పరాభవదుఃఖ మని కొందఱు, నచ్చటి జలవాయువులు పడ లేదని మఱికొందఱు నూహించిరి. విషాయుధప్రహారణ మని వేఱొకకొందఱు భావించిరి. అనేకరాజవైద్యు లౌషధసేవ సేయించిరి. దేనివలనను బ్రయోజనము గలుగ దయ్యెను. వ్యాధియంతకంత కతిశయించెను. అతనికి జీవితాశ తగ్గెను. సహచరులుగూడ నట్లే యెంచిరి. తుద కదియే నిశ్చయ మయ్యెను.

అతనినే నమ్మి యాతని కొఱకే తమ మానప్రాణములు సమర్పింపఁ దలఁచిన మంత్రులు, సరదారులు నాతని చుట్టును

శేరి యుండిరి. అతని కుమారు లగు రత్నసింహుఁడును, విక్రమాజితుఁడును నుదయసింహుఁడును గూడ దగ్గఱనే యుండిరి. సంగరాణా తన పరలోకప్రయాణ మింకఁ గొన్ని నిముసములలో నున్నదనఁగా నిట్లు చెప్పెను. "నే ననేకయుద్ధములు చేసితిని. అనేక శత్రులం గెలిచితిని; గాని నా జీవితము నోడిపోయినను నపవాద ననుభవించుచు విడిచిపెట్ట వలసి వచ్చినది. నే నెన్ని తడవ లెంతటి గొప్ప రాజులను గెలిచినను బాబరుని జయింపకుండఁ జనిపోవలసి వచ్చినందులకు సిగ్గగుచున్నది"

ఇది విని యాతని పుత్రులు "మీ రిందులకై వగవఁ బని లేదు. మీ చేతికి శేషించినది మేము చేసెద" మని యెలుగెత్తి పలికిరి. అది విని యా మహారా జానందములోఁ ప్రాణములు విడిచెను. పిదప నెల్లరును దుఃఖసముద్రములో మునిఁగిరి.

సంగరాణా మహావీరుఁడని చరిత్రకారులు వర్ణించియున్నారు. ఈతఁ డొకమా ఱన్నగారితోఁ బోరునపు డొక చేయి పోయెను. మఱియొక యుద్ధమున గుండు తగిలి కాళ్ల కపాయము కలిగెను. ఇవి గాక యీతని శరీరమున నెనుబదిగాయపు మచ్చ లుండెను. ఇవి వీరున కలంకారములు గదా! అన్ని విధముల నీతఁడు మహావీరుఁ డని యంగీకరింపక తప్పదు. ఈతఁడు లోదీయెడలను, మాళవదేశపు సుల్తాను యెడలను, ఢిల్లీశ్వరుని పుత్రుని యెడలను దన పూర్వులనే యనుసరించి ప్రవర్తించెను.

ఈ సందర్భమున మనము పిసాదీని మఱచిపోఁ గూడదు; గాని యాతని గుణములను గీర్తించుటకు నా కిట స్థలము చాలదు.

శ్రీరస్తు

వీర పూజ

ప్రథమ భాగము

ప్రతాపసింహుఁడు

ప్రతాపసింహుని తండ్రి యుదయసింహుఁడు. తల్లి వీరాబాయి. తండ్రియంతటి పిఱికిపంద లేఁడు. తల్లియంతటి శౌర్యభూషితులు లేరు. ఒకపు డక్బరు దండెత్తివచ్చి యుదయసింహునిఁ జెఱపట్టెను. వెంటనే వీరాబాయి భయంకరకాళికామూర్తియై యక్బరునిఁ దఱిమికొట్టి భర్తను జెఱ విడిపించుకొని వచ్చెను. ప్రతాపసింహుఁడు పరస్పరసామ్యము లేని యిట్టి దంపతుల కుద్భవించెను. అతఁడు తండ్రివంటి పిఱికిపందయే యయ్యెనో, తల్లివంటి శౌర్యనిధియే యయ్యెనో మనము చరిత్రములవలనఁ దెలిసికొందము.

యథాన్యాయ్యముగ నుదయసింహుని తరువాతఁ బ్రతాపసింహుఁడు రాజ్యమునకు వచ్చెను; గాని యేలుటకు రాజ్యమును, పోరుటకు సైన్యమును, సైన్యమును గూర్చుటకు ధనమును లేవయ్యెను. ఉపాయము చెప్పుటకుఁ గాని సహాయము చేయుటకుఁ గాని స్నేహితులు గూడ లేకపోయిరి. పటిష్ఠంబయిన దిల్లీశ్వరుం డగు నక్బరు

ప్రతిస్పర్థియై యుండెను. అతని బలమును జూతమా? బొక్కసము లన్నియు ధనరాసులతో నిండి యుండెను. చతురంగబల మసంఖ్యమై యుండెను. ఇంతవఱకు మేవాడు రాజులకు ముఖ్యస్నేహితులుగా నున్న జోధపురము, నంబేర, బికానీరు, బుందీ మున్నగు సంస్థానాధీశు లెల్లరు నక్బరు పదదాసులై యుండిరి. విశేషించి సాగరజీ యను ప్రతాపుని తమ్ముఁడు గూడ నక్బరు పక్ష మవలంబించి యుండెను. దీని నంతను బట్టి యీశ్వరుఁడు ప్రతాపునకుఁ బ్రతికూలుఁడై యుండె నని చెప్పుట కేమి యాభ్యంతరము?

ప్రతాపసింహుఁడు మేవాడు రాజ్యమున కధీశ్వరుఁడే. అందులకు సందేహములేదు; గాని యాతని నివాస మారావళీపర్వతారణ్య వాటికలయందు. అతని యాజ్ఞాప్రచార మచ్చటి భిల్లులయందు మాత్రమే. భిల్లులచే నిర్మింపఁబడిన గుడిసెలయందే కాఁపురము. ఒక్కొక్కపుడు చెట్లక్రిందనే. అతని యాహార మొక్కొక్కప్పుడు గోధుమరొట్టెలు. ఒక్కొక్కపుడు కొఱ్ఱలు రాగులు మున్నగు క్షుద్రధాన్యములతోఁ జేయఁబడిన రొట్టెలే. ఒక్కొక యవసరమున నవి గూడ భుజించుటకు వీలు లేకుండెను. శత్రుల రాక విని ముందు వడ్డింపఁబడి యున్న యా రొట్టెలను గూడ దిగవిడిచి భార్యాపుత్రులను నిరపాయ మగు స్థలమునకుఁ జేర్పఁగలసి వచ్చుచుండెడిది. అతని రాణిగారే యాతని పరిచారిక. అభయసింహాదు లగు కుమారులే పరిచారకులు. భర్తచేతను బుత్రులచేతను బ్రేమగౌరవములతోఁ జూడఁబడు రాణి తనకుఁ దానే పరిచారిక యైయుండెను. పరస్పరానుకూల్యముతో నా దంపతులును, బ్రేమానురాగములతోఁ దనయులును గూడి కూడి యుండుటవలన, వారి కా యరణ్యవాటికలే యుద్యానవనవాటికలుగను, బర్ణశాలలే దివ్యభవనములుగను దోఁచుచుండెను.

ఇది మేవాడుదేశాధీశ్వరుం డగు రాణా ప్రతాపసింహుని సాంసారిక స్థితి. ఇఁక నాతని మానసికస్థితి నొకింత పరికింతము.

అతఁ డా యరణ్యమున సంచరించుచు వీరరసప్రధానము లగు తన పూర్వుల యితిహాసములును, భట్రాజకృతము లగు పూర్వవీర యశోగీతములును, సతతము బఠించుచుండెను. తన్మూలమునఁ దన పూర్వుల ప్రతాపమును, శత్రుకోటియెడల వారు చూపిన తిరస్కారమును, విపత్సమయములయందుఁ బ్రకటపఱిచిన ధైర్యసాహసాదికములును, కులగౌరవరక్షణమునందలి పట్టుదలయు, భౌతికశరీరముల యందలి నిర్మమతయు, వీరవిహారమునందును, సద్యశస్సముపార్జనమునందును గల యధికాసక్తియు, నాతనికిఁ దేటతెల్లముగఁ దెలిసి విరోధులయెడల ద్వేషమును, స్వమతమునెడల భక్తియు, స్వకులమునెడల గాఢాభిమానమును, స్వధర్మమునెడలఁ బ్రబలానురక్తియుఁ బ్రవృద్ధములు గాఁ జొచ్చెను.

ఈ రూపమున నాతనికి వీరవిహారమునం దాసక్తి ప్రౌఢమెను. ఎల్లప్పుడు నాతని చిత్తవృత్తి రణరంగమునందే సంచరింప సాగెను. తాను ప్రబలచతురంగబలముతో నక్బరుసైన్యమును దాఁకినట్లును, మానసింహాదులు తన సైన్యమును జెండాడ వచ్చి యోపలేక వెన్నిచ్చి పలాయనము సేయుచున్నట్లును, వారినిఁ బ్రోత్సహించుచు ముందునకు వచ్చిన యక్బరు, తా నాడుగఱచి రౌద్రమూర్తియై యెదిరింప సన్న సన్నముగ భటుల చాటుననుండి యవ్వలకు జాఱుచున్నట్లును, నది చూచి దేవతలు తనపైఁ బుష్పవర్షము గురిపించినట్లును, విజయానందమున నరసాక్షియున్న తన పాదకమలముల నంటి యంతవఱకుఁ దనయెడ లాఘవబుద్ధితో నున్న శత్రుకోటిలోని కొందఱు రాజ

పుత్రులు "కులభూషణా! మాపై ననుగ్రహముం బూనుము. మమ్ము నీ బిడ్డలనుగా భావించి, నీ శ్వేతాతపత్రచ్ఛాయకుం జేర్చి రక్షింపు" మని ప్రార్థించుచున్నట్లు నాతని కవస్థాత్రయమునందును గూడ స్వప్నములు వచ్చుచుండెను. సాతత్యంబు లగు నిట్టి స్వప్నముల వలనను, బూర్వప్రతాపస్మరణము వలనను, నాతఁ డప్పుడప్పుడు భయంకరవదనుఁడై కత్తి దూయఁబోవుట తటస్థించుచువచ్చెను.

తండ్రి నికటమునఁ గూర్చుండి శాత్రవరహస్యములును వైరిబలాబలంబులును, వ్యూహనిర్మాణవిధానములును, రాజ్యతంత్ర రహస్యములును వినుచున్నపు డభయసింహాదులు సైత మట్లే ప్రవర్తించుచుండిరి. ఈ విషయమునఁ దండ్రికంటెఁ గొడుకులును గొడుకులకంటెఁ దండ్రియు నత్యుత్సాహముతో నుండిరి.

అయిన నాతఁ డిట్టి శౌర్యోద్రేకమువలనఁ గేవలము హృదయ వికారమునకు లోనగుటతో నూరకుండ లేదు. శత్రుసంహారమును గుఱించియు రాజ్యసంపాదనమును గుఱించియు ననేకవిధముల నాలోచించుచునేయుండెను. కాని యాతని యోచన లన్నియు నమిత దారిద్ర్యమువలన విచ్ఛిన్నము లై పోవుచుండెను.

అంతమాత్రమున నాతఁ డేమియుఁ జలింపలేదు. సానఁ బట్టిన కొలఁది మాణిక్యమునకు వన్నెలు హెచ్చునట్లాతని కాపదలు సంభవించినకొలఁది ధైర్యస్థైర్యము లధికము కాఁజొచ్చెను. ఇదియంతయు జూచి [illegible]రుం డగు నక్బ రొకింత సంచలించెను. చరిత్రములు చదివినవారి కక్బరు స్వభావము, నాతని రాజనీతియుఁ జక్కఁగఁ దెలిసియే యుండును. అతఁడు, ప్రకృత మేమియుఁ జేయలేక

పోయినను బ్రతాపసింహుఁ డసహాయశూరుఁ డనియు, వానివలన నెప్పుడైనఁ దనకు మహావిపత్తు గాక మాన దనియుఁ, బ్రక్కలోని బల్లెమై యున్న యాతనిని దండోపాయమున నిగ్రహించుట కల్ల యనియు, భావించి సామంబునఁ గార్యసాధనము సేయ నూహించి "నీవు నాకు శరణుఁజొచ్చెద వేని నీ రాజ్య మంతయు నీ కిచ్చి వేసెదను. నీకుఁ జాల బహుమతు లొసంగి, నా కొలువున నగ్రస్థాన మిచ్చి, యందఱికంటె నెక్కుడుగ గౌరవించెద" నని ప్రతాపునకు వర్తమానము చేసెను.

ప్రతాపసింహుఁ డది చూచి యక్బరును గుఱించి "చూచుచుండఁగనే కనులలో గుమ్ముకొట్టు మాయకాఁడు. కొందఱు రాజపుత్రుల యాభిజాత్యమును మంటఁ గలిపిన వంచకుఁడు. పరస్త్రీలకు మానభంగము గావించుచు, జారశిఖామణియై, మహాత్ముఁ డని పేరు వడిన యవినీతుఁ" డని భావించి తనలోఁ దాను నవ్వుకొనియెను. మఱియుఁ, బరుల భుజాబలమువలనఁ "బ్రతాపమహితుఁడ" నని గర్వించి యున్న యక్బరు నండఁ జేరుటవలన సత్కీర్తికి భంగమే గాని లాభము లేదనియు, స్వప్రతాపమువలన నార్జించిన విజయము నక్బరున కారోపించుట నిస్తేజు లగు మానసింహాదులకుఁ దగిన పని గాని తనకుఁ దగనిదనియు, నక్బరున కంకితుఁడై వానిచే మహావీరుఁ డని పిలిపించుకొనుటకంటెఁ దన వీర్యమును లోకమునకు స్వయముగ వెల్లడించుటయే యుత్తమ మనియు నిశ్చయించికొని యాతఁడు "బాప్పారావలువంశమునఁ బుట్టి తురుష్కునకు లోఁబడి నా వంశమున కపఖ్యాతి తెచ్చెడి కార్యము నావలనఁ గాలత్రయమందును గాఁజాల" దని యక్బరునకుఁ బ్రత్యుత్తర మంపెను.

ఇంతటి నిస్సహాయస్థితిలోఁ గూడ నిసుమంతయుఁ జలింపక, యెవ్వరునంతవానిని "నీ వెంత" యని ధిక్కరించుటవలనఁ బ్రతాప సింహుని యశోగీతము లారావళీపర్వతగుహాలు మాఱ్మ్రోగెను. అంత వఱకు నసమానుల మని పిల్వఁబడు క్షత్రియవీరులు కొంద ఱాతనిని మహావీరుఁడని ప్రశంసింపసాగిరి. అప్పు డది విని విహ్వలుఁ డయ్యెను. ఆతని యాస్థానమునందలి మానసింహాదులు తెల్లవోయిరి. విజయగర్వమువలన మిన్నును మన్నును గానక సంచరించు తురుష్కసైనికు లులికిపడిరి.

ఇది విని కొందఱు రాజపుత్రులు ప్రతాపుని మాహాత్మ్యము ను గుఱుతెఱింగి యాతనికి సాయము సేయకుండుట చాలఁ దప్పని భావించి, యాతని మహారాజత్వము నంగీకరించి యాతనికొఱకును, స్వమతముకొఱకును—స్వధర్మము కొఱకును, ఢిల్లీశ్వరు నెదిరించి పోరుటకు సంసిద్ధులైరి. వారిలోఁ బ్రతాపుని సవతితమ్ముని కుమారులును, సాళుంబ్రాధీశుఁ డగు టోండావంశీయరాజును, దెల్వాడాధీశుఁ డగు చిన్నసంస్థానికుఁడును, ముఖ్యులు. ఇంకను జిన్న చిన్న రాజు లనేకు లుండిరి.

వారి రాకకుఁ బ్రతాపుఁడు చాల సంతసించి వారివారికి దగునట్లు గౌరవించి "స్వధర్మముకొఱకుఁ బ్రాణముల నొసంగెదమని వారిచే శపథములు చేయించెను. అప్పుడు "నౌరోజాఉర్సు" అను పేరున భారతరమణులకుఁ గావించు మానభంగమునుగుఱించి ప్రతాపుఁడు ముచ్చటించినపుడు వారు ప్రళయకాలరుద్రులవలె మండిపడిరి. పిదప వారిలో దూరదర్శులు ననుభవముగలవారు నగు

కొందఱు రాజులను మంత్రిమండలముగాఁ జేర్చికొని ప్రతాపుఁడు మేవాడురాజ్యమును సాధించుటకు సమకట్టెను.

కొందఱు రాజులు సాయము వచ్చుటచే వారి సైన్యము తన చేతిక్రిందికి వచ్చినను నది యంత ప్రబలము కాకపోవుటంజేసి ప్రతాపున కక్బరునిఁ బ్రత్యక్షముగ నెదిరించుట కవకాశము చిక్కినది కాదు. అక్కతన నాతఁడు తన మంత్రివర్గముతో నాలోచించి శత్రురాజ్యమునందలి సంపన్నము లగు జనపదములను కొల్లగొట్టుటకు సైనికుల కాజ్ఞాపించెను. వెంటనే వారు నిరంకుశులై లెక్కలేనంత ధనమును దీసికొనివచ్చి ప్రతాపునకు సమర్పించిరి. ఆ ధనముతో నాతఁడు "కుమలమేరు, గోగుండా" యను స్థలములయందు బలిష్ఠము లగు దుర్గములను గట్టి మఱికొంత క్రొత్తసైన్యము సంపాదించెను. ప్రతాపుఁడు తన సైనికులకు శత్రురాజ్యముపైఁ బడుటకు మఱలఁ గన్నుఁగీఁటెను. మఱియొకమాఱుగూడఁ గన్నుగీఁటెను. ప్రతాపుని భాండాగారములు ధనముతో నిండిపోయెను.

ప్రతాపుని భటులు త్రొక్కిన స్థలము లన్నియు విధ్వస్తములై పోయెను. గ్రామము లన్నియు నిర్జనము లయ్యెను. "వ్యవసాయము లన్నియు నశించెను. పంటలు పండవలసిన పొలములలో నిలువెడెత్తు గడ్డి పెరిగెను. జనులతోడను, రథవాహనములతోడను త్రొక్కుడు పడుచుండవలసిన త్రోవ లన్నియు దుమ్ములతోడ నిండిపోయెను. రాజమందిరములలోను, ధనికుల గృహములలోను హింస్ర పశువులు వాసముచేయఁ దొడఁగెను.

ఇట్లా ప్రదేశ మంతయుఁ జిట్టడవి యైపోయెను. అక్బరునకు రావలసిన పన్నులు చెల్లకుండెను. అంతియ గాక, యా త్రోవనుండి

పోయెడి ఢిల్లీపౌఁజులను, వస్తుసామగ్రి మున్నగు నితరవస్తువులను గొల్లకొట్టుటకుఁ బ్రతాపుని సైనికులకుఁ జాల వీలయ్యెను. అప్పు డక్బరునకుఁ గావలసిన సీమసరకు లన్నియు నీ ప్రాంతమునుండియే ఢిల్లీకిఁ బోవలసియుండెను. అక్కతన వానిలో నొక్కటియైన ఢిల్లీ శ్వరున కందకుండఁ ద్రోవయందే ప్రతాపుఁడు కొల్లగొట్టింపసాగెను. ఈ విధముగా నాతఁడు తన ప్రబలశత్రుని బాధపెట్టఁదొడఁగెను.

ఒకనాటికంటె నొకనాఁ డాతఁడు ధనమునందును బలము నందును గూడఁ బ్రబలుఁడు కాసాగెను. సంతతవిజయములవలన నాతనికి సాయమువచ్చిన వారికిని బ్రోత్సాహ మధికము కాసాగెను. మేవాడురాజ్యము స్వాధీన మగు సూచనలు పొడసూపఁదొడఁగెను. అదియంతయుఁ జూచి ప్రతాపుఁడు సహచరులతో "మన ప్రయాణము నిర్విఘ్నముగఁ గొనసాగుచున్నది. మన గమ్యస్థానపు శిఖరములు గోచరించుచున్నవి. మేవాడు రాజ్యలక్ష్మి సంతోషముతో మనల నాహ్వానించుచున్నది. వీరులారా! ధైర్యముతోఁ బ్రవర్తింపుఁ" డని ప్రబోధింపఁజొచ్చెను.

పిదపఁ బ్రతాపుఁడు క్షత్రియజాతియందు నవీనము లగు కొన్ని యేర్పాట్లు గావించెను. రాజపుత్రులు కొంద ఱుద్యోగముల కొఱకును, సంపత్తులకొఱకును దురుష్కులకుఁ దమ యాఁడుపిల్లలను గాన్కగా నిచ్చి యుండిరి. ప్రతాపుఁడు "తురకలకుఁ బిల్లల నిచ్చిన క్షత్రియులతో నితరులు సంబంధబాంధవములు సేయఁగూడ" దని శాసించెను. దాని కాతని యనుయాయు లందఱును సమ్మతించిరి. రాజపుత్రస్థానమునందలి తక్కిన క్షత్రియులలోఁ గూడఁ గొందఱు సమ్మతించిరి.

ఈ నిబంధనమువలనఁ బ్రతాపుని శత్రుసంఖ్య మఱింత వృద్ధి యయ్యెను. తురుష్కులకుఁ దమ కన్యల నిచ్చిన క్షత్రియు లెల్లరు నాతనిపైఁ దీవ్రశత్రుత్వము వహించిరి. వారియం దెల్ల మానసింహుఁడు ముఖ్యుఁడు. జోధపురాధీశుఁడు గూడ నట్టివాఁడే యయ్యెను. తన మేనత్త నక్బరు తండ్రి యగు హుమయూనునకును జెల్లెలి నక్బరునకు నిచ్చి యున్నందున మానసింహునకుఁ బ్రతాపసింహునిపైఁ జాలఁ గోపము వచ్చెను; గాని యది యంతయు హృదయమునందే దాఁగియుండి క్షణక్షణమునకును బెరిగిబోవుచుండెను. మానసింహుఁ డెప్పటికైనఁ బ్రతాపుని యాభిజాత్యమునకుఁ గళంకము గలిగించి యాతని మద మణఁచివేయవలయు నని నిశ్చయించుకొనియెను.

ప్రతాపుఁడు, మతనిబంధనము గావించినందులకు మానసింహాదులు తనపై నత్యంతాగ్రహముఁ బూని యున్నా రని గ్రహింపక పోలేదు. అక్బరు బానిసలై యుండ, యిదివఱకే తనకు విరోధులై యింతవఱకు వా రేమి సేయఁగలిగిరో యిఁకముందు నదియే చేయ నిమ్మని యాతఁడు మానసింహాదులయెడల నైస్యము వహించి యూరకుండెను.

పిదప నొకప్పు డక్బరు నాజ్ఞ నంది మానసింహుఁడు సోలాపురప్రాంతమును జయించుటకై యరిగి, యా యుద్ధమున విజయము గాంచి, యా జయము నక్బరునకు సమర్పింప ఢిల్లీనగరమున కరుగుచు మార్గమధ్యమునఁ గుమలుమేరు సమీపమున విడిసి, యచ్చటఁ బ్రతాపుఁ డున్నాఁ డని విని యాతనిం జూచుటకై పరిమితపరివారముతో నశ్వారూఢుఁడై కుమలుమేరున కరిగెను.

మానసింహుని రాకకుఁ బ్రతాపుఁడు చాల వింతపడెను. అప్పు డాతని హృదయాకాశమున ననేక భావవిద్యుల్లతలు మెఱసిపోయెను. మానసింహుఁడు దగ్గఱ వాఁడ్డమెయి సంధి సేయ వచ్చె నని యాతనికిఁ బ్రప్రథమమునఁ దోఁచెను. ఇంక నేమేమో తోఁచెను. తుదకు మత నిబంధనము జ్ఞప్తికి వచ్చెను. అట్టి మతనిబంధనము సేయుటవలన నభిమానము గలిగియుండు ననియు, దానివిషయమై మాట్లాడుటకు వచ్చియుండు ననియు, నదియే నిజమగునెడల నృపునకు వానికిఁ గల సేవ్యసేవకరూప మగు స్నేహము గతార్థమైపోయి యుండు ననియు మంత్రిమండలి యందలి కొందఱు చెప్పిరి. ఎన్ని తలంపులు గలిగినను దొంటి సందేహము శిలాకృతి నట్లే యుండెను. తుద కంతయు నింటికి వచ్చినవారికి గౌరవము సేయుచుండుట మర్యాదగా దని నిశ్చయించుకొనిరి.

మానసింహుఁడు లోనికి వచ్చెను. కేళకాల పాత్రములను జక్కఁగ నెఱింగిన ప్రతాపుఁ డాతని కర్హములగు మర్యాదలు గావించెను. ఇరువురును జాల శాంతముగ మాట్లాడుకొనిరి. ఎట్లు సంఘటిల్లెనో చెప్పఁజాలము గాని మానసింహుఁడు ప్రతాపునింట విందుకుడుచుట తటస్థించెను.

అంతయు సిద్ధమయ్యెను. తళతళ మెఱసిపోవు వెండిపాత్రములయం దాహారపదార్థములు వడ్డింపఁబడియెను. తుద కొక విషమ సమస్య ప్రత్యక్షమయ్యెను. కాని పర్యవసానము శుభముగ ముగిసినది గాదు. మానసింహుని పక్షము వారికి మాత్రమే యాహారపదార్థములు వడ్డింపఁబడియెను. అదిచూచి వారు చాల సందేహించిరి. తురకలతో సంబంధమును జేసినవారి సహపంక్తిని మే మెట్లు భుజింతుమని ప్రతాపునిపక్షమునఁ బ్రత్యుత్తర మీయఁబడెను. దానివలన

వహ్నిలో నేయి పోసిన ట్లయ్యెను. మానసింహుని ముఖమఖండక్రోధాగ్ని జ్వాలలవలనఁ గమలిపోయెను. వెంటనే యాతఁడు మేఘగంభీరభాషణములతో "నన్ని ట్లగౌరవపఱిచినందులకు నీకుఁ దగిన ప్రాయశ్చిత్తము చేసెద నుండు" మని చెప్పి యూఁదవలె భోజనశాల వెలువడి వచ్చి యశ్వారోహణము గావించెను.

మానసింహుని చేష్టలకును, మాటలకును ప్రతాపునకు నవ్వు వచ్చెను. కులఘ్నునకే యంత యభిమాన మున్న సత్కులప్రసూతున కెంత యభిమాన ముండవలెను? మానసింహుని యుత్తరములకుఁ బ్రతాపుఁడు "నీవు యుద్ధమునకు వచ్చునప్పుడు నీ మేనల్లునిఁ గూడఁ దీసికొని రమ్మని సోపహాసముగఁ బ్రత్యుత్తర మిచ్చెను. మానసింహుఁడు మఱింత యవమానమునకుఁ బాల్పడెను. అతని వీరావేశమంతయు మీసములు మెలిపెట్టుచుండగ చల్లిపోయెను. "నీకు మానభంగము గావించి మానసింహుఁడను నా పేరు సార్థకపఱిచెద" నని చెప్పుచు నాతఁడు గుఱ్ఱము నడాయించెను.

ప్రతాపుఁడు తన మేలికి యాగు నక్బరునకుఁ బ్రక్కలోని బల్లెమే యైనను, నింతవఱకు మానసింహుఁ డాతని నంతగా లెక్కసేయలేదు. ప్రతాపుఁడు మతనిబంధనము గావించిన పిదప నాతని హృదయమునఁ గ్రోధాగ్ని రగుల్కొనియెను. ఇప్పు డది యొక్కమాఱుగ భగ్గున మండెను. ఆ జ్వాలాజ్వాల లాతని శాంతచిత్తమును భస్మము గావించివైచెను. అతని మాటలును, నిశ్వాసములును గూడ నా యగ్నికీలలవలన మాడిపోయిరో ప్రకాశము లగుచుండెను. లోకాశకలము చేయువ రైనకొలఁది నయసాధ్యమైన కాలక్షత్రి యొటు

విజృంభించునో యట్లే ఢిల్లీ సమీపించినకొలఁది హాయగ్నికి మంట రెచ్చు డయ్యెను.

యుక్తసమయమున మానసింహుఁడు కొలువుకూటమున నక్బరుసందర్శనము గావించి తాను తెకొనివచ్చిన విజయలక్ష్మి నక్బరు పదములకడ సమర్పించెను. అందుల కెంతయుఁ బ్రీతుఁడై యా యక బరు "మానసింహా! యోధాగ్రేసరా! నీ రాజభక్తికి మా కానందమైనది. అపజయ మెట్టిదో యెఱుంగని నీ ప్రచండ చంద్రహాస మద్వితీయముగ వెలుంగుఁ గాక. మేఘనాదానుకారి యగు నీ సింహనాదము వైరికాంతాగర్భనిర్భేదక మగుఁ గాత" యని పొగడిపొగడి వెలగల పసదనము లిచ్చి క్రమదీఱునట్లు జోకొట్టెను.

మానసింహుఁడు తలి గనిపెట్టి యక్బరు హృదయమునఁ గ్రోధాగ్ని రగుల్కొల్పెను. కాని యా యగ్ని యక్బరుచేఁ గత్తి దూయింపలేకపోయెను. సాధ్యమైనంతవఱకు స్వయముగ యుద్ధరంగమున కరుగకపోవుటయే యక్బరు రాజనీతిపరిజ్ఞానపుఁ బ్రథమ ప్రకాశము. అనుజీవులు మోసము చేసెదరేమో యని యాతని కనుమానములేదు. తన జోలపాట వారి యాత్మజ్ఞానమును దుప్పటి ముసుఁగు వెట్టి మఱల లేవకుండ జోకొట్టిన దని యాతని కెఱుకయే. ప్రతాపుని పై మానసింహునకే కత్తి దూయవలసివచ్చెను. ప్రతాపుని సలహా వ్యర్థము కాలేదు. మానసింహుఁడు తన మేనల్లుని వెంట నిడికొనియే బయలుదేఱి శంఖ మూఁదెను.

మానసింహుఁడు ప్రథమమునఁ గుమలుమేరుదుర్గమును ముట్టడించెను. అదిచూచి ప్రతాపుఁడు "మానహీనున కిప్పటి కభిమానము 'కల్గినది. ఎంత వింత!" యని నవ్వుకొనియెను; గాని వెంటనే "యిది

సదభిమానము గాదు. దురభిమానము. ఇదియే భారతీయులను బీల్చి పిప్పిచేయుచున్నది" యని వగచెను. ఈసందర్భమున నాతని చూడ్కులు తొలుదొలుత ఢిల్లీదెసకును, దరువాత భరతవర్షమునందంతటను బ్రసరించెను. తోడనే యాతని హృదయము చేయివెట్టి కలఁచినట్లు కలఁగిపోయెను. అప్పు డాతఁ డొక్క వేఁడినిట్టూర్పు విడిచి మంత్రిమండలిదెసకుఁ జూచెను.

ప్రతాపుని గభీరదృష్టి తమ దెసఁ బ్రసరించినంతనే మంత్రులందఱు నొక్కపెట్టునఁ "బరాభవాగ్ని యక్బరుమానసింహుల హృదయములయందుఁ దీవ్రముగ రగుల్కొనినది. దురభిమాని యగు మానసింహుఁడు మీ రనినట్లే మేనల్లునిఁ గూడఁ దీసికొనివచ్చినాఁడు. సంగతిసందర్భము లన్నియుఁ జూడఁగా నీ యుద్ధము ఘోరముగ జరుగక మానదనియు, దీర్ఘకాలము ప్రవర్తిల్లక తీఱదనియుఁ దోఁచుచున్నది. ఇఁక నాలసించుట నీతి గాదు. క్షణక్షణము ఢిల్లీనుండి క్రొత్తఫౌఁజు వచ్చెడి నని తోఁచుచున్నది. ఎప్పటిదండు నప్పుడే రూపుమాపనున్న శ్రమపడవలసివచ్చు"నని చెప్పిరి. వెంటనే తగునేర్పాటులన్నియు ముగిసెను. ప్రతాపుని సింహనాదము మానసింహుని శంఖారావమును సిగ్గుపఱిచెను.

ఉభయపక్షములవారికి నీ సంగ్రామదీక్ష నెలలతోఁ దీఱినది గాదు. ఈ మహాయుద్ధమున ననేకాంతర్యుద్ధములు జరిగినవి. అనేక పర్యాయములు మొగలుసైనికు లోడిరి. అనేకప్రయత్నములలోఁ బ్రతాపుఁ డోడెను. మానసింహునకును, యువరాజు సలీమునకును దల్లప్రాణము తోఁకకు వచ్చెను; గాని యంతమాత్రమునఁ బ్రతాపునకేమియు ఫలము గలిగినదిగాదు. అతని కింకను మంచిదినములు రాలేదు.

ఆతని నెత్తిపైఁ దాండవ మాడుచున్న దురదృష్టదేవత యింకను దొలఁగిపోలేదు. ఈశ్వరుని కింక నాతనిపై ననుగ్రహము కలుగలేదు.

ఈ యుద్ధము ప్రారంభ మగునప్పటికిఁ బ్రతాపుని చేతిక్రింద నిరువదివేల సైన్యముండెను. శ్రావణశుద్ధ సప్తమినాఁడు హల్దీఘాట్టను చోట జరిగిన సంకులసమరములో నసంఖ్యసైనికులు ననేక సేనానులును మడిసిరి. అనఁగాఁ బండ్రెండువేల భటులు వీరస్వర్గమును జూఱకొనిరి. తన యసామాన్యవీరకవిత్వముచే రాజపుత్రులకే గాక శత్రువులకుఁ గూడ నుద్రేకము గొలుపు ప్రతాపుని యాస్థానకవియు, భట్టకులతిలకుఁడు నగు భాముఁ డను నాతనిని దేవేంద్రుఁడు తన యాస్థానకవిగాఁ గొంపోయెను. కమలమేరుదుర్గము మొగలుల స్వాధీన మయ్యెను.

ప్రతాపునకుఁ గష్టములును, సైన్యవినాశమును, దారిద్ర్యమును హెచ్చిపోయెను. తినుటకుఁ గంచమును, నిద్రించుటకు మంచమును లేని యవస్థ వచ్చెను. స్త్రీలకును, శిశువులకును నివాసములు గలుగకుండ నిక్కడనుండి యక్కడకు, నక్కడనుండి యిక్కడకును బరువెత్తవలసివచ్చెను. ఎంతయైనను బ్రతాపునకు భయము గలుగలేదు. ఆతని మనస్సు వెనుదిరుగలేదు. "నా తల్లిదండ్రులు నాకుఁ బ్రతాపసింహుఁ డను నామము నే యభిప్రాయముతోఁ బెట్టిరో దివ్య మగు నా యభిప్రాయ మప్రతిహతమై వెలయుఁగాక. నేఁడు భయంకరాకారముతో వెలయించుచున్న కాలము రేపు కుసుమాకారముతో దాస్యము చేయక మానదు" దని ప్రతాపుఁడు ధైర్యము వహించి యుండెను. ఈ సందర్భమున శత్రువులతోఁ గలిసియున్న సాగరజీ బుద్ధి తెచ్చుకొని యన్న యగు ప్రతాపుని పాదసన్నిధికిఁ జేరికొనియెను.

ఇది యంతయుఁ జూచి ప్రతాపుని ధైర్యసాహసాదుల కాశ్చర్యపడి యక్బరు వాతని మంత్రులు, వాతనిని ధన్యుఁ డని మెచ్చుకొన సాగిరి. అందు నక్బరు ముఖ్యమంత్రియు, గుణగ్రాహియు, మహాకవియు నగు ఖానఖాన నను వాతఁడు, ప్రతాపుని యుత్కృష్టగుణముల కానందమును బట్టఁజాలక యీ క్రింది యుత్తరమును కవితాబద్ధము గావించి ప్రతాపున కనిపెను.

"మానవుని సంపత్తియు నధికారమును నశ్వరములు. ఇది సృష్టి క్రమము. కాని మానవుని సద్గుణములయొక్కయు, సత్కీర్తియొక్కయుఁ బ్రశంస లోకములోఁ జిరకాల ముండును. కావునఁ బుత్రా! నీవు ధన్యుఁడవు. ఏల యన? నీవు సంకటావస్థలో నుండియుఁ, బాదుషాకు శరణురాక నీ కీర్తియు, గౌరవమును రక్షించుకొనుటకు యోగ్యమైన ప్రయత్నములను జేయుచున్నావు. ఈ గుణములు భారతీయరాజులయెడల నసాధారణములు. కావున నీవు నీ స్వజాతియొక్క యభిమానమును వర్ణనీయముగ రక్షించుచున్నావు. నీవు రాజ్యవైభవమును సుఖప్రాప్తిని గడ్డిపరకలవలెఁ జూచి వందనీయమగు నీవంశముయొక్క కీర్తి నాచంద్రస్థాయిగఁ జేయుచున్నావు." *

ప్రబలు లగు శత్రుపక్షమువారే ప్రతాపు నిట్లు పొగడినప్పుడు మిత్రపక్షమువా రెంత మెచ్చుకొందురో వ్రాయ నక్కఱలేదు; గాని యీ పొగడ్తలవలనను నీ మెప్పులవలనను నేమి ప్రయోజనము? దైవ మాతనియెడ నింకను బ్రాతికూల్యము వహించియే యుండెను. ఏ పనిచేసినను గలిసిరా దయ్యెను. శత్రువుల యొత్తిడి వలన నూపిరి తిరుగకుండెను. అక్కతనఁ బ్రతాపుఁడు సైన్యాదికములను జేర్చు

* మహమ్మదీయకాలము. ౩౦౮ పుట.

కొనుటకుఁ గాని, మఱియేమిచేయుటకుఁ గాని తోఁపక విసిగిపోయి తుదకు "యుద్ధమునకుఁ గొంత వ్యవధి యీయవలసిన" దని యగ్బరునకు వర్తమాన మంపెను.

ఈ వార్త నగ్బరు, సభలో వినిపించెను. అందఱు నగ్బరుకత్తి కెందు నెదురు లేదని కొనియాడిరి. ఆ సభలోఁ బృథివీరాజను నొక రాజపుత్రుఁ డుండెను. అతఁడు బికానీరు రాజు సోదరుఁడు; మఱియు సేనాధిపతి. అక్బరు సభలో నాతఁ డొక సరదారుఁడై యుండెను. అతఁ డా వార్త విని చాల విచారించెను. అతఁ డక్బరునకు దాసుఁడైనను బ్రతాపుఁ డనినఁ జేయెత్తి మ్రొక్కును. అక్కాలమున నంతటి సభలో ధైర్యముతో లేచి యక్బరు నుద్దేశించి "ప్రతాపుఁడు మీకు శరణుజొచ్చుట యబద్ధము. ప్రతాపసింహుని శత్రు వెవఁడో మీ కీ వార్త తెలిపి యుండును. ప్రతాపుఁడు ఢిల్లీపట్టణము కట్టినను నిట్టిపని కంగీకరింపఁ డని నా నమ్మకము. కావున నేను నా విశ్వాసపాత్రుఁడైన సేవకు నంపి నిజమగు వర్తమానమును దెలిసికొనియెద" నని చెప్పెను. పిదప నాతఁడు కవితాబద్ధమైన యొక యుత్తరమును బ్రతాపున కంపెను.

"రాణా ప్రతాపసింగ్! భారతీయుల మగు మే మెల్లరమును మీవంటి పరాక్రమశాలు లగు భారతీయరాజపదధారుల నే నమ్మి యున్నాము. ఇతరరాజులవలన మా యాశలు నిరాశలు చేయఁబడినను బ్రతాపసింగు రాణాగారివలన నట్టి పని జరిగి యాతఁ డక్బరునకు శరణుచొచ్చుట యత్యంతదుఃఖాస్పదము. (మే మైతే దైవోపహతులమై మా పరాక్రమమును, మా స్త్రీల పాతివ్రత్యమును గోలుపోయితిమి. మా యభిమానమును మా స్త్రీల పాతివ్రత్యమును మే మక్బరున కమ్మితిమి. కాని నాతఁడు వాడుకొనియెను.) కాని యుదేసింగుపుత్రు

లైన మీరు మాత్రము రాజపుత్రుల లజ్జయు స్త్రీల పాతివ్రత్యమును మీ వంశములో నిదివఱకు రక్షించినారు. వానిని నట్లే యిఁకముందు గూడ రక్షింపుఁడీ. రాజా! ఏమి చెప్పుదును? "నౌరోజా ఉర్సు" తిరునాళ్లలో నే రాజపుత్రస్త్రీయొక్క మర్యాద దక్కినది? ఎవరి మర్యాదయుఁ దక్కలేదు. కావున సుప్రసిద్ధులును, మానధనులును, నగు శిశోదియాకులముయొక్క మర్యాద యీ "నౌరోజా ఉర్సు" లో నమ్ముడువడఁ గేవల దని నా ప్రార్థన. అంతియుఁ బోఁగొట్టుకొని దరిద్రుడ నైతి నని యనుకొనుచున్నారేమో; గాని యట్లను కొనవలదు. మీరు పోఁగొట్టుకొన్నాక నన్న దంతయు యశోభివృద్ధిచే మీ కున్నట్లే యెంచుఁడీ. నిరాశచే క్షత్రియకులోద్భవులనేకు లవమానజనితదుఃఖము ననుభవించిరి. కాని యిట్టి యవమానము, నపకీర్తియు, హమీరవంశజు లైన మీ పాలిట నిదివఱకుఁ బడ లేదు. లోక సంతతియు నాశచే మీ వైపు చూచుచున్నది. భారతీయుల గౌరవము వెలువడుటయు, భారతీయుల మర్యాదను గాపాడుటయు మీ వలననే జరుగు నని లోకులు నమ్మియున్నారు. మీ కులమునకును, రాజవంశమునకును, నేఁటివఱకుఁ గలుగని యపకీర్తి యెన్నటికినిఁ గలుగఁ గూడ దని మా కోరిక. ఆత్మగౌరవపూరిత మగు మీ యంతరాత్మయు, జయశాలి యగు మీ ఖడ్గమును మీకు ముఖ్యసహాయకర్తలు. వాని సహాయముగొని మీరు క్షత్రియుల పౌరుషమును రక్షింపవలయును. .... బాదుషాకు శరణనినందువలన లాభ మేమియు లేదు. మీ పౌరుషమునకును,యశస్సంపాదనమునకును నీశ్వరుఁడు తోడ్పడుఁ గాక" †

---

† మహమ్మదీయ కాలము 30౬ పుట.

ఈ యుత్తరమును జూడఁగనే ప్రతాపుని శోకాగ్ని మఱలఁ బ్రదీప్తం బయ్యెను. ఇంతవఱకును నిర్భయముగ నక్బరు నెదిరించి యిప్పు డిట్లు కోరుట చాలఁ దప్పుపని యనియు, నపకీర్తి యెట్టిదో యెఱుఁగని తన కీ గొప్ప కళంకము వచ్చెననియుఁ భావించి యాతఁడు వగచెను. తాను సంధి యీయవలసిన దని కోరి శరణుఁజొచ్చినట్లు తలంచెఁ గాఁబోలు నని యక్బరు మాశ్చర్యమునకు నవ్వుకొనెను. పృథివీరాజు జాబువలన లోకమును క్షత్రియబృందమును దన యెడలఁ జూపుచున్న గౌరవమును దెలిసికొని తన యాభిజాత్యమునకు గర్వపడెను. అక్బరు నాస్థానమునందలి క్షత్రియులలోఁ గొందఱు తన యెడల నింతటి పూజ్యభావమును గలిగియుండుట చాల మంచి దని తలంచెను. వెంటనే దిగ్గజము లులికిపడునట్లు సింహనాదముగావించి, దుర్గముపైఁ గట్టఁబడిన యక్బరు విజయప్రాసాదమును గూలఁ ద్రోసెను.

ఈ ప్రయత్నమువలనఁ గూడ నాతని కేమియుఁ బ్రయోజనము గలుగలేదు. విశేషించి ద్రవ్యనష్టమును, బలవినాశమును గూడ సంభవించెను. అన్నివిధముల నాతని ధైర్యకంచుకము సడలి పోయెను. ఇఁకఁ బోరుటవలన నెంతమాత్రమును ఫలము లేదని విరక్తి గలిగెను. ఇంతచేసినను జయము గలుగకపోవుటచేఁ దన యభాగ్యతను నిందించుకొనుచు ఖడ్గవ్యాపారముపై నసహ్యముగలుగ దేశత్యాగము గావించి సింధునదీతీరమునకుఁ బోవలె నని తలంచి బయలు దేఱెను.

• ప్రతాపుఁడు బయలుదేఱిన నాఁడే యారావళీపర్వతమును దాఁటిపోయెను. సాయంకాలమున భార్యాపుత్రులతోడను, బరిమిత పరివారముతోడను, నొక పర్వతపాదమున విడిసెను. అవి మేవాడు సీమాంత్యభూములు. నాఁటిరాత్రి భోజనానంతర మాతఁడు పటకుటీర

ప్రాంగణమున విశ్రమింపఁ బరుండెను. పుత్రులలో నొకరిద్దఱును సేవకులలోఁ గొందఱు నాతని చుట్టును జేరి కూర్చుండి యుండిరి. పటకుటీరాంతర్భాగమున, దీపపువెలుతురులోఁ గపోలన్యస్తహస్తయై దీనాననయై, నిట్టూర్పులు విడుచుచు రాణి యాతని కెదురుగ శయ్యపైఁ గూర్చుండి యుండెను.

అప్పుడు ప్రతాపుని హృదయాంతరాళమున రాశీకృతమై నిరాశారూపమున నున్న గాఢాంధకారమును భేదించుకొని యొక నవీన తేజ ముదయించెను. క్షణములో నా తేజము ప్రవృద్ధమై యంతరంగమును ప్రకాశవంతము గావించెను. తేజోమయంబైన యాతని హృదయమున వివిధభావసంఘట్టనము ప్రారంభ మయ్యెను. అంత యవశమైపోయిన మనస్సుతో నాతఁ డాకస్మికముగ లేచి కూర్చుండెను. అపుడు విచారముతో నధోముఖియై యున్న రాణి యాతని కంటఁ బడెను.

తోడనే మేవాడు రాజ్యలక్ష్మి యాతని స్మృతిపటమున నంకిత మయ్యెను. సిసోదియావంశమునఁ బ్రభవించి పూర్వుల శౌర్యసాహసముల కుదాహరణముగ నింతవఱకుఁ బ్రబలప్రతిస్పర్ధి నెదిరించి పోరి, నేఁ డాత్మగౌరవమును మంటఁగలిపి నిరాశవలనఁ దాను విదేశములకుఁ బోవుచుండుటఁ గాంచి యామెయుఁ దనరాణివలె దీనాననయై పరితపించుచున్నట్లును, మఱల నంతలో నాత్మీయాభిజాత్యమును స్మరించుకొని యారక్తనేత్రయై, యామె తన్నతి ఘోరముగ శపింప నుద్యుక్త యగుచున్నట్లును, దన తల్లియగు పీరాబాయి భయభ్రాంతయై కాళ్లు గడగడ వడఁక "తల్లీ! రక్షింపుము. నాబిడ్డని రక్షింపు" మని వేఁడుకొనుచు నతిరభసంబున వచ్చి యామె పాదములపై వ్రాలి "దేవీ! శాంతింపుము. నా బిడ్డవలన నపరాధ మైనది.

నిజముగ నది నా తప్పే యగును. వీరస్వర్గసుఖానుభవము వలనఁ బ్రమత్తనై నే నింత వఱకు సంకటావస్థలోఁ బడియున్న నా గారాబు కొమరుని హృదయక్షేత్రమును దొలఁగియుంటిని. ఓ మేవాడు రాజ్యలక్ష్మీ! క్షమింపుము. నీకును నాకును గూడ నా బిడ్డఁ డొక్కఁడే దిక్కయి యున్నాఁడు. సిసోదియావంశమును నిర్మూలము గావించితివేని నేనును, నా భార్యలును గతిలేనివార మైపోదుము. నీవు ధర్మభ్రష్ట వైపోదువు. తల్లీ! అచ్ఛమైన రాచకొలమును నిలుపుము. భారతధర్మమును గాపాడుము. నల్లనిచాపలనొలయఁ జేసి నాకుమారునకు బలము నొసంగుము. నిరాశవలన నష్టాంధకారకూపమునం బడి నిరుత్సాహమువలన నధఃపతితుఁడైపోయిన నా యనుంగుపట్టినిఁ బ్రేమతోఁ జేయూఁత నొసంగి యుద్ధరింపు" మని ప్రార్థించుచున్నట్లు, నందుల కంగీకరింపక "మానవతీ! నీవు తొలంగియుండుము. ఇపుడు నీ ప్రశక్తి లేదు. నీ యంశము ప్రతాపునియం దంకితము గాలేదు. నిష్కలంక మగు సిసోదియావంశము నీతోడనే యంతరించినది. నీ భార్యలతోఁ గూడ నీ వింటినుండి శౌర్యహీనుఁడు, ధర్మభ్రష్టుఁడు నగు ప్రతాపునిచే విడువఁబడు నివాపజలమున కాశ వదలుకొనుము. ఆ పౌరుషశూన్యుని రక్షింపఁ బ్రార్థింపకుము. నీ వా యధీశుని మీఁది మమతను విడువఁజాలవేని యక్షయం బగు వీరస్వర్గమునుండి నిర్భ్రష్ట వైపోదువు. ఓశూరనారీరత్నమా! నీవు తొలంగియుండు" మని రాజ్యలక్ష్మి తన తల్లిని నిరాకరించుచు శాపోదకములను గ్రహింపఁబోవుచున్నట్లు నాతనికిఁ దోఁచెను. విగాఢవీరులై వీరస్వర్గమున స్వచ్ఛందవిహారము గావించుచున్న తన భార్యలుం తన భీరుత్వము నారసి మొగమెత్తలేక వగచుచున్నట్లు గూడఁ దోఁచెను.

తోడనే వివిధభావోదయములవలనఁ గలఁగిపోయిన యాతని హృదయము బ్రద్దలై పోయెను. ఈ సంక్షోభమువలన నప్రయత్నముగఁ గన్నులు మూఁతవడెను. భయంకరకాళికామూర్తియై యున్న మేవాడురాజ్యలక్ష్మి యా కన్నులయందే ప్రవేశించెను. వెంటనే యాందోళనం బధిక మయ్యెను. ప్రాపంచికస్మృతి తప్పిపోయెను. అపుడు "రాజ్యలక్ష్మీ! శపింపుము. పాపాత్ముని, ధర్మభ్రష్టుని ఘోరముగ శపింపుము. పూర్వుల మార్గమునకుఁ దప్పినవానిని, సత్సాహప్రభుమంత్రిశక్తులచే వంచితుఁడైనవానిని, నీతిబాహ్యునిఁ గులకలంకునిఁ దల ప్రక్కలై పోవునట్లు శపింపుము. పుట్టగతులం లేకుండఁ బోవునట్లు శపింపుము. ఆలసింపకుము. శాపోదకములను ద్వరగ విడువు"మను మాట లప్రయత్నముగ నాతని రోష్ఠపుటము నుండి జారెను.

ఈ మాటలు విని చెంతనున్నవారు నిర్విణ్ణులైరి. రాణియు నాశ్చర్యచకితయై తటాలున వచ్చి బొమ్మవలె నట నిలుఁబడి పోయెను. ప్రతాపుని కనుదమ్ములింకను వికసింపలేదు. హృదయ మింకను దేఱికొనలేదు. రాజ్యలక్ష్మి యింకను శాంతింపలేదు. ఆమె విశాలనయనయుగ్మముపైఁ గ్రోధరసము పొంగి పొఱలిపోవుచునే యుండెను. అపుడు ప్రతాపుఁడు "మేవాడురాజ్యలక్ష్మీ! తన పూర్వుల పవిత్రరక్తధారలచేఁ దడిసిన జన్మభూమిని విడిచి వెళ్లుటకుఁ బ్రయాణమైన మానహీనునిఁ, దనపైఁ గల కార్యభారము నెఱుంగఁజాలని వివేకరహితుని, వైరివీరుని ప్రచండమండలాగ్రరోచిఃపుంజమ్ములవలన మిఱుమిట్లుగొని, దిగ్భ్రాంతుఁడై రణరంగము నుండి పలాయనము సేయు పిఱికిపందను శపింపుము. ఓ దేవీ! తడయకుము శాపోదకములను విడువు"మని మఱలఁ బల్కెను.

అప్పటికి రాజ్యలక్ష్మికోపము చల్లారెను. ఆమె వీరాబాయినిఁ బ్రేమతో లేవనెత్తి "సతీమణీ! ఊఁగడిల్లుము. నీ కుమారునకు బలము నొసంగుచున్నాను. అతనికి విజయము చేకూఱు"నని పలికినట్లును, వదినని తన తల్లి పరమానందభరితురాలై మఱల నంతలోఁ దాను గౌరవము వహించునో లేదో యని దీనముగఁ దనదెసఁ జూచినట్లు నాతనికిఁ దోఁచెను.

వెంటనే యాతని మనస్సు నిశ్చలం బయ్యెను. కనుదమ్ములు వికసించెను. నిస్తేజమైపోయిన యాతని ముఖముపై జీవకళ ప్రత్యక్షమయ్యెను. రక్తమంతయుఁ గవోష్ణ మయ్యెను. విరోధిపై మఱలఁ గ్రోధాగ్ని రగుల్కొనియెను. ప్రతాపుఁడు తనయెదుటఁ జిత్రప్రతిమవలె నిలిచియున్న రాణి నారసి దేవీ! యని పిలిచెను.

వెంటనే యామె చెంతకువచ్చి కూరుచుండి పతిహస్తములం బట్టుకొని మెల్లఁగ "నాథా!" యని పలుకరించి ముఖమువంకఁ జూచెను. అప్పుడు ప్రతాపుఁడు పుత్రులను, మొదటినుండియుఁ దన్నెడబాసియుండని సరదారులను గూడ సంబోధించి "వివేకభ్రష్టుఁడనై నేను మేవాడురాజ్యలక్ష్మియెడలఁ జాల నపరాధము చేసితిని. కాని తుద కామెకు నాపైఁ బరిపూర్ణానుగ్రహము కలిగినది. మనము మఱల స్వదేశోన్ముఖులమై పోదము. మేవాడుగద్దె మన కొఱకు నిరీక్షించుచున్నది. అక్బరున కపజయము నిశ్చయము. మానసింహున కవమానము తప్పదు. ఇదే మనము పోయి శత్రువుల నెదిరింతు"మని చెప్పెను.

ఆ మాట లేవియు వారి కర్థము కాలేదు. ప్రతాపుఁడు యావద్వృత్తాంతము నెఱిఁగించెను. అది విని యెల్లరును జమత్కృతులైరి. అందఱును నూతనోత్సాహభరితులై బయలుదేఱి స్వదేశమునకుఁ బోయి చేరికొనిరి.

ఏ క్షణమున వివిధభావోదయము వలనఁ బ్రతాపుని హృదయము కలఁగిపోయినదో యా క్షణమునందే యాతని యభ్యుదయము ప్రారంభ మయ్యెను. అప్పుడు ప్రతాపుని పూర్వ మంత్రి యగు భామాసా యను వాఁడు తన యజమానుని దురవస్థ యంతయు విని మిగుల వగచి తన చెంతనున్న యసంఖ్యధనమును దీసికొనివచ్చి యాతని కర్పించెను. ఆ ధనముతోఁ బ్రతాపుఁ డిరువదియైదువేల సైనికులను జేర్చికొని శత్రువు నెదిరించి పోరసాగెను.

అది మొదలు ప్రతాపుఁడు దయ యను మాటనే మఱచిపోయెను. "ఎట్లు గాపించినను బరవినాశమే రాజున కవశ్యాచరణీయ"మను నీతి నిప్పు డాతఁ డవలంబించెను. ప్రప్రథమమున వాతని కర్పూరు సరదారుఁ డగు శహాబాజను వానితో యుద్ధప్రసక్తి గలిగెను. అందుఁ బ్రతాపునకే విజయము లభించెను.

పిదపఁ బ్రతాపుఁడు కుమలు మేరుదుర్గమును ముట్టడించెను. అప్పటి కిల్లేదారుఁ డగు నబ్దుల్లా యను వాఁడు ప్రతాపుని ఘోరముగ నెదిరించెను. తుద కబ్దుల్లా యల్లా చరణసామీప్యమునకుఁ బోయెను. హతశేషులగు వాని సైనికులు పిక్కబలిమిం జూపించిరి. కోట ప్రతాపుని స్వాధీన మయ్యెను.

ఈ నూతనోత్సాహము వలనఁ బ్రతాపుఁ డొకటి తరువాత నొకటిచొప్పున నసతికాలమున ముప్పదిరెండు దుర్గములను గెలిచికొనియెను. అజమీరు, చితోడు, మండలగడము నను మూఁడు దుర్గములు తక్క మేవాడురాజ్య మంతయు స్వాధీన మయ్యెను. పిదపఁ బ్రతాపుఁడు తన కిన్ని కష్టములం గలిగించిన మానసింహుని, వాతని రాజధాని యగు జయపురమును దోపించి పరాభవించెను.

తుదకు దేవపురము గూడ స్వాధీన మయ్యెను. "ఇట్లు జయ శ్రీలచే వలగొనుచున్న ప్రతాపుఁడగ్బరు మంత్రి యగు ఖానఖానునిచే మెచ్చుకొనియాడఁబడెను."

కాని యీ విజయములవలనఁ బ్రతాపునకుఁ దృప్తి గలుగలేదు. మేవాడు రాజులకుఁ జిత్తోడుదుర్గ మనిన నెంతో ప్రీతి. ప్రథమము నుండియు వారి కదియే రాజధాని. వారి శౌర్యము, పౌరుషము నభిమానము, నాభిజాత్యమును, నదే మూర్తీభవించి యున్నవి. వీర స్వర్గమును జూఱగొన్న తెను పురుషులచెంతకుఁ బోవుటకు రమణీమణులు జోహారు సేయుటవలన నది పరమపవిత్రమై యున్నది. అందలి ప్రతిష్ఠలమును శిసోదియా వంశమువారి యశస్సును గీర్తించుచున్నది. అట్టి చిత్తూరుదుర్గమును గెలువనంత కాలము తన ప్రతాపము వన్నెకెక్కదని భావించి ప్రతాపుఁ డందులకుఁ దీవ్రప్రయత్నములు ప్రారంభించెను.

అంతయు సిద్ధ మయ్యెను. సిద్ధాంతులు జైత్రప్రస్థానమునకు శుభముహూర్తము నిశ్చయపఱచిరి. సరదారు లెల్లరును చిత్తూరుదుర్గము నందలి మహమ్మదీయులపై నెప్పు డుఱుకుదుమా యని త్వరపడుచుండిరి. రాణి కులదేవతలం బూజించుచు ముత్తైదువలకు సమస్త దానములు సేయుచుండెను. భట్రాజులు తమ యుద్గళకవితాలహరిం బ్రవహింపఁజేసి వీరభటుల నందుఁ దేలియాడించుచుండిరి. క్రొత్తగా సాంసారిక సౌఖ్యములను బ్రసన్నములు గావించుకొనిన ముద్దరాండ్ర హృదయములను దైన్యము నానందమును మిళితములై కలంచివేయుచుండెను. ప్రౌఢాంగనలు తమ ముద్దుబిడ్డలం గొనివచ్చి భర్తల కాళ్లకుఁ బెనఁగించుచుండిరి. మధ్యనాయికలును వారిభర్తలును సాభిప్రాయముగఁ జూచుకొనుచుండిరి. వృద్ధాంగనలు గద్గదకంఠలై యుండిరి.

ఇంతలో రాజపుత్రులయం దొక దుఃఖకరమైన వార్త వ్యాపించెను. ననలెత్తుచున్న యా వల్లికాలత తెగిపోయినది. ఆయానందవాహిని యాగిపోయెను. ఆ యుత్సాహతరంగిణి రుద్ధంబై పోయెను. ఆ వర్ధమానచంద్రునకు వినీలనిబిడమేఘమాలిక యడ్డు వచ్చెను. ఉన్నట్లుండఁగాఁ బ్రతాపున కుద్ధృతరోగము సంభవించెను. రోగనివారణముకొఱ కనేకవైద్యులు ప్రయత్నించిరి. అంతయు బూడిదలోఁ బోసిన పన్నీ రయ్యెను. తుదకు జైత్రప్రస్థానమునకు బదులుగాఁ బ్రతాపుని పరలోకయాత్ర నిశ్చితం బయ్యెను. అంతటను విచారతరంగిణి పొంగి పొరలి ప్రవహింపఁజొచ్చెను.

అథయిసింహాదికుమారులును, సేనాధీశులును, మంత్రిమండలి వారును, రాజబంధువులును, బ్రతాపుని చుట్టును మూఁగియుండిరి. రాణి పదములకడఁ గూర్చుండి యుండెను. అప్పుడు ప్రతాపుఁడు చాల వేదన ననుభవింపసాగెను.

అందఱును బాధానివారణకొఱ కౌషధపానము సేయవలసిన దని ప్రతాపునిఁ బ్రార్థించిరి; గాని యాతఁ డందుల కంగీకరింపక “యీ బాధ యౌషధసేవనలనఁ దీఱునది గాదు. ఖడ్గవ్యాపారమును జేయవలయును. చిత్తూరుదుర్గమును జయింపవలెను. దానిపై నెగురుచున్న చంద్రధ్వజమును గూల్పవలెను. ఆ దుర్గమును మేవాడు రాజ్యలక్ష్మికి విలాసభవనము సేయవలెను. ఇఁక నీ పని నావలనఁ గానేరదు. నా తరువాత నా యంతటి వారు మీ రున్నారు. మీ రేమి చేసెదరు? మీ కవశ్యకర్తవ్యమైనదానిని గుఱించి ప్రయత్నించెదరా? చేతగా దని యూరకుందురా? ఇప్పుడు చెప్పుఁడు. ఇఁకఁ బ్రాణము లెట్లును నిలువవు. చింతమాత్రము పోదు. చింతాక్రాంతునకు సద్గతి గలుగదు. నేను వీరస్వర్గమున కాశ వదలుకొనవలయునా!

కుంభీపాకనరకమునఁ బడి యాతన పడవలయునా? నా పూర్వుల గతికి నేను తప్పినవాఁడ నైపోదునా? నా తల్లి వీరమాత కాదను నపకీర్తికిఁ బాల్పడుదునా? అంతయు మీ చేతిలో నున్నది. మీరు చిత్తూరు జయించెదరేని నా వీరత్వము దేవతలచే నంగీకృతమగు" నని చెప్పి యూరకుండెను.

ఇది యెల్లరును వినిరి. వారి రక్తనాళము లుబ్బిపోయెను. ఏదో వాఁడిబాణము వచ్చి తటాలున నల్లకుండెకుఁ దాఁకిన ట్లయ్యెను. ఆ సమయమున నందఱు నభయసింహుని వైపుఁ జూచిరి. అతని ముఖము నవీనకాంతి వహించెను. అందఱిముఖములును ప్రఫుల్లము లయ్యెను. గాని కనీనికలు మెఱసిపోయెను. అప్పు డభయసింహుఁడు గొంతెత్తి "మీ కా విచారమక్కఱలేదు. చిత్తోడుదుర్గమును నేను జయించెద" నని ప్రతిజ్ఞ పట్టెను.

వెంటనే ప్రతాపుని దీవానముపై సానందలక్ష్మి తాండవ మాడెను. అచ్చటివా రెల్లరును బళీ బళీ! యని పొగడిరి. ప్రతాపుఁడు ఫల్గుని వీఁపుతట్టుచుఁ "పుత్రా! చిరాయుష్మంతుఁడ వగుము. శత్రుంజయుఁడవుగమ్ము. అని మొన దుర్గేంద్రాదులు నీకు బాసటలై నిలుతు"రని పలికి కన్నులు మూసెను. ఎల్లరును జిత్రప్రతిమ లైపోయిరి. ప్రతాపమార్తాండుఁ డస్తపర్వతము నధిరోహించెను.

నిర్వివాదము లగు కేవలగుణములతో నలంకరింపఁబడిన మహా వీరుని జీవితమునందలి ఘనతను వివరించి చెప్పవలసిన యావశ్యకము లేదు. భారతభూమి నలంకరించిన వీరాధివీరులలో నుత్తమస్థానమును గైకొన్న యోధశిఖామణులలోఁ బ్రతాపసింహుఁ డొకఁడని చెప్పుటలో నతిశయోక్తి యేమియు లేదు. యుద్ధమునకు వ్యవధి

యిష్టుని శత్రునిఁ గోరుటయు, శత్రువుల యెత్తిడి కోపలేక విజయమునెడల నాశ వదలుకొని విదేశములకుఁ బోవఁ బ్రయాణ మగుటయుఁ బ్రతాపునివంటి వీరునకుఁ దగనివియే యైనను నవి యెందును గుణసన్నిపాతమునఁ బడి మునిఁగిపోవు నవియే యని వాదించుట కవకాశమున్నది.

ప్రతాపుని జీవితమున ధ్రువతారాతుల్యముగఁ దళతళమని ప్రకాశించు గుణరత్నములలో మొదటిది యాత్మగౌరవము. రెండవది పురుషకారము. మూఁడవది ధైర్యము. నాల్గవది స్థైర్యము. ఎట్టి యంతరాయము సంభవించినను ప్రారంభించిన కార్యమున బ్రహ్మాస్త్రమువోలె నిగ్రహముగఁ బనిచేయువాఁడు గావుననే నిలుచుటకు నీడలేక యల్లాడిన ప్రతాపుఁ డగ్బరువంటి జిత్తులమారియగు వైరిని గడగడలాడింపఁ గలిగెను.

వైద్యరత్న, పండిత, డి. గోపాలాచార్యులు

ఏ, వి, యస్, ఏ యం, బి వారి

ప్రసిద్ధములగు ఆయుర్వేదౌషధములు

జీవామృతము

ఆరోగ్యమును ధైర్యమును కలుగ జేయును
మంచి మూలికలచేతను లోహము లచేతను తయారుచేయబడినది
రక్తమును వృద్ధిజేయును
మేహవాతనొప్పులను పోగొట్టును
అన్నివిధములగు బలహీనములను అణచును
పాండు రోగులకు మంచిది
గుండెదడను నివారణజేయును
గర్భకారకములను దురుమును
బాలులకు గర్భిణీలకు నుత్తమము
చనుబాలను వృద్ధిపరచును
మూర్ఛలకు మంచిది
మెదడుకు బలమును కలుగజేయును
విద్యార్థులకు ప్రాణమిత్రము
నరములకుశక్తిని హెచ్చించును

వెల బుడ్డి ౧-కి రు. ౩.

అమృతామలక తైలము

విద్యార్థులకును యోచనాపరుల కును మిక్కిలి యుపయోగకారి
నేత్రరోగులకును శిరోరోగుల కును మిగుల హితకరము
అన్నివిధ శిరోరోగములను పో గొట్టును
మెదడుకు బలముజేయును
కండ్లకు చలువ జేయును
తలచుండును బోనణచును
తలమంటలను మాన్పును
అధికనిద్రను తగ్గించును
నిద్రలేమిని పోగొట్టును
కణతనొప్పుల నిర్మూలము జేయును
వెంట్రుకలను పట్టుకుచ్చవలె పెంచును
దీనిగుణములు అనుభవజ్ఞులకు తెలి యును

వెల బుడ్డి ౧-కి అ. ౧౨.

ఆయుర్వేదాశ్రమం,

౪౪, ఆచారప్పన్ వీధి. జి, టి, మద్రాసు.

శ్రీమాన్, వైద్యరత్న

పండిత డి. గోపాలాచార్యులు,

ఆయుర్వేదమార్తాండ, భిషఙ్మణి, ఎం. వి. ఎస్., వారిచే

సంప్రదాయానుసారముగ

నాంధ్రభాషయందు వ్రాయబడి ముద్రితములై

క్రయమునకు సిద్ధముగనున్న

ఆయుర్వేద వైద్యగ్రంథములు.

మాధవనిదానము, ఆంధ్రవ్యాఖ్యానము	8-0-0	అగస్త్యవైద్యము	0-4-0
అర్కప్రకాశము	2-0-0	ఆయుర్వేదాంగశల్యతంత్రము	0-4-0
రసప్రదీపిక	1-8-0	వస్తికర్మము	0-4-0
ఆయుర్వేదపరిభాష	1-8-0	ఆయుర్వేదచరిత్రము	0-4-0
భేషజకల్పము	1-0-0	ప్రదర్శకాభిభాషణము	0-2-0
పథ్యాపథ్యము	1-[illegible]-0	ఋషికుల బ్రహ్మచర్యాశ్రమము-ఆయుర్వేదము	0-2-0
దక్షిణభారతము ఆయుర్వేద ప్రచారము తెనుగు వచనము	0-8-0	ఆంధ్రదేశము వైద్యసహాయము.	0-1-0
అధ్యక్షకాభిభాషణములు	0-6-0	లాహోరువైద్య మహాసమ్మేళనాభిభాషణము.	0-8-0
ఆయుర్వేదప్రశస్తి	0-6-0	విషూచి - కలరా.	0-8-0
గడచిన నూరువత్సరములలో జరిగిన వైద్యాభివృద్ధి	0-6-0		

పోస్టేజి వేరుగా నియ్యవలెను.

మ్యానేజర్:— ఆయుర్వేదాశ్రమం

58, ఆచారప్పన్ వీధి, జి. టి. మదరాసు.

ఆర్యపుస్తకాలయము - రాజమండ్రి

వీరపూజ (శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారిది)	2-వ కూర్పు	1- 0-0
శ్మశానవాటిక	,,	1- 0-0
మిథునానురాగము	,,	0-12-0
వారకాంత	(రెండవకూర్పు)	0- 8-0
రామదేవవిజయము	,,	0- 6-0
సాహసిక రాజపుత్రము	,,	0- 6-0
శృంఖల	,,	0- 6-0
విజయనగర రాజులకథలు	,,	0- 3-0
చిత్తూరు రాజులకథలు	,,	0- 4-0
ఢిల్లీ చక్రవర్తులకథలు	,,	0- 4-0
గోల్కొండనవాబులకథలు	,,	0- 2-0
భారతరమణీమణులు	,,	0-12-0
మహారాష్ట్రవిజయము	,,	4- 0-0
భేతాళునికథలు		0- 6-0
భోజునికథలు		0- 6-0
విక్రమార్కునికథలు		0- 6-0
దయ్యాలకథలు		0- 3-0
వరాహపురాణము (నందిమల్లయ్య, ఘంటసింగయ్య)		1- 0-0
వేణీసంహారము (వడ్డాది సుబ్బారాయుడుగారిది)		1- 0-0
రాణీసంయుక్త (వేలాల సుబ్బారావుగారిది)		0-12-0
మహాపురుషులజీవచరిత్ర	1-వ భాగము	0-12-0
(చిలకమర్తి	2-వ ,,	0-10-0
లక్ష్మీనరసింహముగారిది)	3-వ ,,	0-12-0

ఇంకను అనేక సంస్కృతాంధ్ర గ్రంథములును, మ్యాపులు, కాలేజీ, ఇంగ్లీషు పుస్తకములు దొరకును.

వ్యాధిబాధితులగు

ప్రియ సోదరుల కొరకు

వెల తగ్గించబడినది.

50 సంవత్సరములుగా లోకప్రసిద్ధి చెందిన యూనైటెన్ లేక క్రొత్త యౌవనమైన సంజీవి ఔషధము. ధాతుక్షయమునకు అమృతము వంటిది. యౌవనదశయొక్క దురభ్యాసమువలన కలిగిన బలహీనత్వమును నష్టముచేయును. అవయవ దారుఢ్యమును అధికపఱచును. పోయినటువంటి దేహపటుత్వమును నూతనముగా ఇప్పించును. గుణమివ్వకున్న 100 రూప్యములతో క్రయ మివ్వబడును. వృద్ధాప్యులకు యౌవనమును కలిగించును. ఒక్కొక్క మాత్రలో వెండి భస్మము చేరియుండును. 24 మాత్రలుగల డబ్బీ 1-కి పోస్టు ఖర్చులు సహా రు 1-3-0. ఒక్కొక్క మాత్ర ఒక పవరమునకు సమానము. దీపముండగనే ఇల్లు చక్కపెట్టుకొనుడు. లేనిచో చింతింపవలసియుండును. ఆర్యులారా! ఇప్పుడెచట జూచినను ప్రకటనలు ప్రబలముగ కానిపించుచున్నవి. కాని కొంతమంది కొన్ని వర్తకసంఘముల వారిచే మోసపోవుచున్నారు. ఏ తత్కారణమున ప్రకటనయున్న, కొంతమంది ఏవగించుకొనుటకు కారణమగుచున్నది. ప్రకటన లన్నిటిని బుట్టదాఖలు చేయుచున్నారు. దైవ మెన్నడును, 5 వ్రేళ్లను ఒకేరీతిగ సృష్టించి యుండలేదను విషయమును మీరందరు బాగుగ గుర్తింపవలసియున్నది. ఋజుమార్గమున పోవువారిని ప్రపంచమున నమ్మువార లెవ్వరును లేరు. వారి ప్రకటన పత్రికలు కూడ రసవాదులకును పొట్లమునకై విక్రయించబడుచున్నవి. ఆర్యులారా! ఒకపర్యాయము మీరు మాయూనైటెనును వినియోగించినచో మఱెన్నడు మీరు విడువబోరు. నిష్ప్రయోజన మగు మందులనుకొని నష్టపోకుడు.

యూనైటెన్ ఫ్యాక్టరి, చిత్తూరు.

ఒకసారి సిరాపోసిన సుమారు 50,000 పదములను వ్రాయునట్టియు,

5 సం॥ముల వరకు గ్యారంటి ఇవ్వబడునట్టి మేలైన

ఫౌంటెన్ పేనా ఉచితము.

5 అణాలు మాకుపంపి, 4 చీట్లను పుచ్చుకొని, వాటిని రూ 1-4-0 కు అమ్మి, మీరంపిన 5 అణాల నెత్తుకొని, మిగిలిన 15 అణాలను మాకు పంపి ఫౌంటెన్ పేనాను పుచ్చుకొనుడు. ఇదే ప్రకారము ఒక్కొక్కరికి 4 చీట్లు పంపబడును. మీరుచేసిన ప్రకారము వారును చేసినచో ఒక్కొక్కరికి పేనా యినాముగావచ్చును. మీరు తీసికొన్న ప్రయాసకుగాను 12 గురు 12 పేనాలను తెప్పించినచో, మీకొక 6 రూపాయల వెలగల మంచి గడియారము ఉచితముగా నిచ్చెదము. రైల్వే రెగులేటరు వెండి చేతిగడియారములు కూపన్లు కూడ మావద్ద సిద్ధముగా నున్నది. మంచితరుణమును పోగొట్టుకొనకుడు.

యూనైటెడ్ ఫ్యాక్టరి, చిత్తూరు.

ఇనాం! ఇనాం!! ఇనాం!!!

ఇంగ్లీషు లీవర్ గడియారము



ఈ చిన్నగడియారము మిగుల మేలైనది. చూచుటకు అందముగా నుండును. ఇండియా దేశమంతటను ప్రఖ్యాతి పొంది యున్నది. ఈ నెలలోగా తెప్పించుకొనువారికి మేలైన ఫౌంటెన్ పేనా బహుమాన మిచ్చెదము. త్వరపడుడు. గడియారము ఒకటికి బహుమానముతో రూ. 3-8-0. 4 సంవత్సరములు గ్యారంటీ. మేలైన ముంజేతి గడియారము తోలుపట్టితో సహా రు. 5-12-0. మేలైన ముంజేతి గన్ మెటల్ గడియారము 7-0-0.

W. R. Triumph & Co., 24, Bunder St, Madras

మన్మథమోహినిలేహ్యము

ఈ లేహ్యము వీర్యవృద్ధి, రక్తవృద్ధి గలిగించు అనేక మూలికలతోను, అంబరు, శిలాజిత్తు, సాలామిశ్రి, అక్రోటు, మొదలగు యూనాని మందులను చేర్చి శాస్త్రోక్తముగా తయారు చేయబడినది. ప్రతిదినము ప్రొద్దున సాయంత్రము 1 తులము సేవించిన, అజీర్ణమును హరింపజేసి, రక్తవృద్ధి, నరములపుష్టి, వీర్యపటుత్వము, బలము, జ్ఞాపకశక్తి మొదలైన వానిని వృద్ధిపరచి సంతోషమును గలుగజేయును. 25 తులాలు గల డబ్బి రు. 2-0-0.

రాజభృంగామలక తైలము

ఈ తైలము అనేకమూలికల యొక్క పుష్పరాజముల యొక్క సారములను, సరకులను చేర్చి శాస్త్రోక్తముగ తయారు చేయబడినది. ఈ తైలము పిల్లలు పెద్దలును తలంటుకొని స్నానముచేసిన తలను దేహమును వంటెను చల్లపరచి శరీరమునందు ఉష్ణము, శిరోవాతము, తల తిరుగుట, తలనొప్పి, పార్శ్వపు నొప్పి, మాడుపోటు మెదడుపోటు, కండ్లమంట, తలలో నాదములు నిద్ర చక్కగా పట్టకపోవుట, కంటిలో కారుట, పుసులు కట్టుట, శరీరతాపము మొదలయిన వ్యాధులను శీఘ్రముగ నివర్తిచేయుటయందు వజ్రాయుధము.

ఆర్. నరసింహారావు. రెడ్డి వీధి, విల్లివాకం పోస్టు,

మజరా— పెరంబూరు, మదరాసు.

VERY CHEAP! VERY CHEAP!!

G. W. M. REYNOLDS,

WORKS PRINTED IN BOLD TYPES.

		Rs.	As.	Ps.
The Mysteries of the Court of London in ...	17 Vols.	12	0	0
The Mysteries of London in	13 ,,	7	0	0
Agnes or Beauty and Pleasure in	9 ,,	6	0	0
Mary Price in	8 ,,	6	0	0
Secret Memoirs of a Clergyman's Daughter in	4 ,,	4	0	0
Broze Statue or Virginsn Kiss in	4 ,,	2	4	0
The Soldier's wife in ...	2 ,,	1	4	0
Seamstress or The White Slave of England		1	0	0
Canonbury House in ...	2 ,,	2	4	0
CORAL Island in ...	4 ,,	3	0	0
MYSTERIES of old London	3 ,,	2	4	0
May Middleton in ...	2 ,,	1	8	0
Pick Wick abroad ...	2 ,,	1	8	0
Mysteries of Paris by Eugine		1	0	0

Postage extra in each case.

Apply to --

Iyer & Rowjee.

Publishers, MADRAS.

తెలుగునాటకములు నవలలు మొదలగునవి.

బళ్లారి-ధ. కృష్ణమాచార్యుల వారివి

(1) చిత్రనళీయము, (2) ప్రహ్లాద, (3) ప్రమీల, (4) పాదుకా పట్టాభిషేకము, (5) సావిత్రి, (6) చంద్రహాస, (7) ముక్తావళి, (8) బృహన్నల, (9) వరూధిని, (10) సారంగధర.

వెల ప్రతి 1-కి రూ॥ 1-2-0.

బళ్లారి పండిత కె. సుబ్రహ్మణ్యశాస్త్రుల వారివి

(1) శ్రీ కృష్ణలీల, (2) లవ-కుశ, ప్రతి 1-కి 1-4-0.

బళ్లారి ధ. గోపాలాచార్యుల వారిది

రామదాసు వెల ప్రతి 1-కి రూ॥ 1-2-0.

బళ్లారి బి. మాధవరావు గారిది

నవనాగరిక యువతీ ప్రహసనము 0-8-0

నవలా గ్రంథమాల వారివి

1. విజ్జలదేవి	వెల	1-2-0	3. సాంఘిక దౌర్జన్యము	0-12-0
2. అస్తమయము		1-8-0	4. దిలారామ	0-12-0

బాలభారతీ గ్రంథమాల వారివి

1. సుశీల	(నవల)	0-12-0
2. పద్మావతి	,,	1-8-0
1. పరిషియాదేశపు కథలు		1-4-0
2. మర్మశాస్త్రము		1-0-0
3. హిప్నాటిసమ్ అండ్ మెస్మెరిసమ్		2-0-0
4. విచిత్రచరిత్ర		0-6-0
5. సమ్మోహనము అండ్ అదృష్టరాజము		1-8-0

ఇవిగాక మావద్ద ఇంకను అనేక సంస్కృతాంధ్ర గ్రంథములు దొరకును. కేటలాగు ఉచితము.

ఆంధ్రగ్రంథాలయము, పోష్టు బాక్సు నెం 73 వ, మదరాసు.

సావరన్ అండు కంపెనివారి దివ్యత్రిలింగములు

చక్రవర్తిమాత్రలు

ఈమాత్రలను వుపయోగించుటవల్ల శరీరమునకు మంచి పటుత్వము ఇచ్చి అన్నివిధములైన బలహీనములను పోగొట్టి సంతానవృద్ధి కలుగజేయుచున్నది. 30 మాత్రల సీసా రూ 1-0-0

తామరతైలము

ఈ తైలమును దురద, తీట, గజ్జి, కానరణములు ఇటువంటి అన్నివిధములైన చర్మవ్యాధులకు రెండు:రోజులు పైనరాచినయెడల మాయమైపోవును. బుడ్డి 1-కి అణాలు 0-12-0

జ్వరమాత్రలు

విషజ్వరము, పిత్తజ్వరము, కాసజ్వరము, సన్నిపాతజ్వరము, మలేరియా (Malaria) అను విషజ్వరములు రెండు:రోజులలో వైద్య సహాయము లేక తామే వైద్యము చేసుకొనవచ్చును.

మంచిశక్తిగల ఔషధము 32 మాత్రల సీసా 1-కి రూ 1-0-0

సావరన్ అండు కంపెని

కచ్చాలేశ్వర అగ్రహారం

మదరాసు.

శ్రీ విజ్ఞానవినోదిని.

ఇందు రెండుమాసముల కొకటి చొప్పున, వినోదకరమైనవి, చారిత్రకమైనవి, నిరూపకమగునవి, నవలలు నాటకములు, దేశీయ చరిత్రలు, మహాపురుషుల చరిత్రలు ప్రచురింపబడి చందాదారుల పద్ధతిని పంపబడుచుండును. చందాదారులు అన్ని గ్రంథములు కొనుచుండవలయును. వీరికి తక్కువ క్రయమునకు గ్రంథములు పంపుచుందుము. ఇతరులకు 100 పేజీలు 0-6-0; చందాదారులకు యుద్ధము ముగిసి కాగితము చౌకయగునంతవరకు 100 పేజీలు 0-5-0 చొప్పున ఆపైని 0-4-0 వంతునను క్రయము కట్టబడును. ఆంధ్రభాషాభిమానులందరు చేయూత నొసంగెదరని నమ్ముచున్నాము.

ప్రకటింపబడినవి.

వనజాక్షీ చరిత్రనవల	చందాదార్లకు	0-8-0	ఇతరులకు	0-12-0
వ్యాసమంజరి వ్యాసములు	,,	0-8-0	,,	0-8-0
బొబ్బిలి చరిత్రనవల	,,	1-0-0	,,	1-4-0

ముందు రాబోయెడి నవలలు.

తార, భయంకరమతము, రమామణి.

విలాసము:— విజ్ఞానవినోదినీ కార్యాలయము,

25 నమ్మాళ్వారువీధి,

మద్రాసు.

BOLD TYPE EDITIONS.

BY G. W. M. REYNOLDS.

			Rs.	As.	Ps.
Mysteries of London ...	13	Vols.	8	0	0
Beauty and Pleasure ...	9	,,	6	0	0
Bronze Statue ...	4	,,	3	0	0
Loves of the Harem ...	4	,,	3	0	0
Rye House Plot ...	4	,,	3	0	0
Coral Island ...	4	,,	3	0	0
Canonbury House ...	3	,,	2	4	0
Pickwick Abroad ...	3	,,	2	4	0
Empress Eugene's Boudoir	3	,,	2	4	0
Faust ...	2	,,	1	8	0
Soldier's wife ...	2	,,	1	4	0
May Stuart ...	2	,,	1	4	0
Mary Middleton ...	2	,,	1	8	0
Seamstress ...	2	,,	1	[illegible]	0
Mysteries of Paris by ungene Sue ...	1	,,	1	8	0

Chanders & Co.,

52, Linga Chetty Street,

G. T. MADRAS.,

తామ్రమైనం డిపోవారి

ప్రసిద్ధ ఔషధములు.

ధాతువృద్ధి సంజీవి, బడలిక, ఆయాసము, శుక్లనష్టము, నిద్ర రాకుండుట మొదలగు వ్యాధులను ఖండించి ప్రతిరోజూ కాలమానము సరిజేసి అద్భుత దారుఢ్యము కలిగించును. శీఘ్రస్ఖలితము బాపును. 20 రోజులకు 40 మాత్రలు 2-0-0 తామ్రమైనము. ఇది ప్రసిద్ధి జెందిన రాజ ఔషధము. దీనిని కొని యాడనివారు లేరు. మేహా రణములు, దద్దుర, దురదలు, బలహీనముం పోగొట్టును. వీర్యవృద్ధి నిచ్చుటలో పాటిలేని మందు. దురభ్యాసముచే చేసిన బలమును (వీర్యమును) సరిపరచి, తిరుగా యౌవనవంతుని జేయును. అన్ని చర్మరోగములకు, అజీర్తికి, ఇంత మేలైన మందు, మీరు చూడనే లేదు. 1 రకం 50 మాత్రలు 5-0-0 2-వ రకం 50 మాత్రలు 2-0-0.

సెగరోగ నాశని భస్మం.

ఇది తెలుపు, యెరుపు, పచ్చ మొదలగు ఏ సెగ జాతిలోనైనను నాశం వెంటవచ్చు దుర్నీరును 3 రోజులలో వాపివేసి 1 వారంలోనే ఇతర బాధలు పోగొట్టును. 1 వారం భస్మం 2-0-0. యింకను అనేక మేహ రోగ ఔషధములు కలవు. కేటలాగుకు వ్రాసిన ఎడల పంపబడును. మా బలవర్ధక ఔషధములు సాటి లేనివని పరీక్షించిన యెడల మీరే చెప్పగలరు.

తామ్రమైనం డిపో,

డాక్టరు యస్. వి. యన్. రావు అండు సన్సు

పోస్టుబాక్సు, నెం. 61 మద్రాసు

అమృతాంజనము

జగత్ప్రసిద్ధిజెందిన దివ్యాంజనము

వనమూలికలచే హిందూదేశమందు తయారుచేయబడు మంచి మందు. తలనొప్పుల మాన్పును, పార్శ్వపు నొప్పుల బారదోలును, వాయువుపోట్లు బాపును, బెణుకుల ఛేదించును, వాపుల రూపు మాపును, దగ్గును తగ్గించును, గురదను తొలగించును. చక్కని డబ్బీతో పవః సీసా 1-కి రూ. 0-8-0. ప్రతియింట నుండదగినది.

దంతచూర్ణము

ఒకసారి వాడి పరీక్షించి చూచుట యుక్తము. పండ్లపోటుకు తీపులకు మంచిపొడుము. పండ్లకు బలము నిచ్చును. ప్రతివారము వేలకువేలు డబ్బాలు విక్రయము. డబ్బీ 1-కి 0-2-0.

మోహినీతైలము

స్త్రీపురుషులు వాడుటకు యోగ్యమైనది. మెదడుకు చలువ జేయును. కండ్లకు చలువజేయును. వెంట్రుకలు పెరుగును. మనోహరముగా నుండును. సువాసన గలిగియుండును. సుఖనిద్ర. విశ్రాంతి నిచ్చును. 5 తులములుగల నూనె సీసా 1-కి రూ. 0-12-0.

తామరతైలము

తామర ఒకవిధమైన పురుగువలన చర్మము మీద గాని, వెంట్రుకలలోగాని, గోళ్లలోగాని, పుట్టవచ్చును. పురుగులలోని భేదమునుబట్టి తామరలోను రెండు మూడు భేదములు గలవు. తామర, తీట, గజ్జికి మంచితైలము. డబ్బీ 1-కి 0-6-0.

అమృతాంజనం డిపో

6 తంబుశెట్టివీథి, మదరాసు — 109 ఫ్రేరిరోడ్డు, బొంబయి

సంపాదకులు వ్యవస్థాపకులు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు మల్లికిన త్రిరెడ్డిగారు

కలాభివర్ధని

ఈ గ్రంథనిలయమునుండి సంవత్సరమునకు నాల్గింటికిఁ దక్కువగాకుండ జక్కని కాలికోబైండు చేయఁబడిన నవలలు ప్రకటింపఁబడును. మా గ్రంథములన్నియు నద్భుతకథాకల్పనా విలసితములై, మనోహరవర్ణనాబంధురములై, సముదారభావపూరితములై మనోజ్ఞపదలలితమగు నిర్దుష్టభాషలో వ్రాయఁబడి తళతళలాడు వెండిరేకులవంటి కాగితములమీఁద మిలమిలలాడు ముత్యములఁబోలు నక్షరములతో ముద్దులు మూటగట్టునట్లు ముద్రింపఁబడును. గ్రంథములన్నియుఁ జందాదారులకు తపాలాకూలిగాక నూఱుపుటలకు ౦-౮-౦ చొప్పున వెల యేర్పఱుపఁబడును. చందాదారులు ౦-౮-౦ ప్రవేశకట్న మీయవలెను. చందాదారుల సంఖ్య వృద్ధియై మాకుఁ బ్రోత్సాహము కలిగిన కొలఁదిని ప్రతి పుస్తకమునందును జాలపటములు చేర్పఁబడును.

కలాభివర్ధనీ గ్రంథనిలయము

రాయవరము - గోదావరిజిల్లా

మలయచందనము

పథ్యము లేదు
పిచికారీతో
పని లేదు

సుకుమారము
సుమసుగంధము
రాజౌషధము

సెగరోగమునకు కుఠారము

ఎట్టిస్థితిలో నున్నను మూడు విధముల సెగరో-
గములను నిర్మూలించును. మూడు పూటలలో గుణము
ఇచ్చును. రాజాధిరాజుల కొరకు కనిపెట్టబడినది; గా-
సనే (ఇది) సుద్యమైనది. వెలడబ్బి పోస్టేజి గాక 2-0-(

ఋతుశోధక

కాంతలపాలిటి చింతామణి

ఇది ఋతుశూలలను బాపును: బలమైన సంతా-
నము ఒసంగును. దీనిని సేవించి అనేకులు ఇప్పుడు
సుఖించుచున్నారు. సీసాలలో నిగ్గినది. వెల 2-0-(

మావద్ద అనేక యోగ్యతాపత్రములు ఉన్నవి.

గంధర్వఫార్మసీ రాజమండ్రి